


సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 14 వెల: ₹ 5.50

సంపుటి: 16 సంచిక: 74

సోమవారం 5-6-2023

SIMULTANEOUSLY PRINTED AT KARIMNAGAR | HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



అర్జున్‌కు మూడో స్థానం

దుబాయ్ ఓపెన్ చెస్ టోర్నీలో రాణించిన తెలంగాణ గ్రాండ్‌మాస్టర్

-12లో



'స్కోర్' కొట్టు... లోన్ పట్టు

క్రెడిట్ స్కోరు మెరుగ్గా ఉంటే చౌకగానే రుణాలు

-13లో



మ్యాథ్స్ కఠినం, ఫిజిక్స్ మధ్యస్థం

ఐఐటీల్లో ప్రవేశానికి నిర్వహించిన జేఈఈ అడ్వాన్స్‌డ్ ఎంట్రన్స్ ప్రశ్నపత్రం కాస్త కఠినంగానే వచ్చినట్లు విద్యార్థులు పేర్కొన్నారు.

వివరాలు 14లో ▸

ఐదేళ్లలో రూ.14,130 కోట్లు

థర్మల్, హైడల్ విద్యుత్ కేంద్రాలపై తెలంగాణ జెన్‌కో రానున్న ఐదేళ్లలో రూ.14,130.37 కోట్ల పెట్టుబడి పెట్టనుంది.

వివరాలు 3లో ▸



జొకోవిచ్ రికార్డు

ఫ్రెంచ్ ఓపెన్ గ్రాండ్‌స్లామ్ టోర్నీలో 17వ సారి క్వార్టర్ ఫైనల్ చేరిన సెర్బియా టెన్నిస్ స్టార్. నాదల్ పేరిట ఉన్న రికార్డు బద్దలు.

వివరాలు 12లో ▸



పర్యావరణంలో 'ఫస్ట్'

అటవీ విస్తీర్ణం, పచ్చదనం పెంపుతోపాటు మున్సిపల్ వ్యర్థాల నిర్వహణలో తెలంగాణ రాష్ట్రం దేశంలోనే అగ్రస్థానంలో నిలిచింది.

వివరాలు 2లో ▸

న్యూస్‌రీల్

టీడీపీతో పొత్తు ఊహాజనితమే



తెలంగాణలో టీడీపీతో బీజేపీ పొత్తు ఉంటుందంటూ వస్తున్నవి ఊహాగానాలేనని, వాటిని పట్టించుకోవాల్సిన అవసరం లేదని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ స్పష్టం చేశారు. వివిధ జిల్లాల నేతలతో టెలికాన్ఫరెన్స్‌లో సంజయ్ మాట్లాడుతూ అమిత్ షా, జేపీ నడ్డాలను చంద్రబాబు కలిస్తే తప్పేముందని ప్రశ్నించారు.

- వివరాలు 2లో ▶

ఖమ్మంలో మెడికో ఆత్మహత్య



- హాస్టల్ గదిలో ఒంటిపై పెట్రోల్ పోసుకుని అంటించుకుని బలవన్మరణం
- 80 శాతం కాలిన గాయాలతో అక్కడికక్కడే మృతి
- స్థానిక వైద్య కళాశాలలో బీడీఎస్ 4వ ఏడాది చదువుతున్న మానస
- మహబూబాబాద్ జిల్లా కేసముద్రం ఆమె స్వస్థలం
- మానసిక ఒత్తిడి, కుటుంబ పరిస్థితుల కారణంగా ఆత్మహత్యకు పాల్పడి ఉండొచ్చుననే అనుమానాలు

5 లో

ధరణిని వద్దన్న కాంగ్రెస్..

బంగాళాఖాతంలోకే!



ఆదివారం నిర్మల్ బహిరంగ సభలో ప్రసంగిస్తున్న సీఎం కేసీఆర్

నిర్మల్ సభలో ముఖ్యమంత్రి కేసీఆర్ ఫైర్

- 50 ఏళ్లు పాలించిన దుర్మార్గులు చేసిందేమిటి?
- ఎవరి భూమి ఎవరి చేతిలో ఉందో తెలిసేది కాదు
- తెల్లారేసరికే పహాణీలు మారిపోయేవి
- ధరణితో ఆ బాధ తీరింది.. రైతుబంధు, బీమా వస్తోంది
- కాంగ్రెస్ గెలిస్తే రైతుబంధు, దళితబంధు ఆగిపోతాయని వ్యాఖ్య
- నిర్మల్ సమీకృత కలెక్టరేట్‌ను ప్రారంభించిన ముఖ్యమంత్రి
- బాసర సరస్వతి ఆలయ అభివృద్ధి పనులకు త్వరలో పునాదిరాయి వేస్తానని వెల్లడి
- జిల్లాకు ఇంజనీరింగ్ కాలేజీతోపాటు పలు వరాలు

నిర్మల్: రైతులకు ఎంతో మేలు చేస్తున్న ధరణి పోర్టల్‌ను తీసి బంగాళాఖాతంలో విసిరేస్తామని కాంగ్రెస్ నేతలు అంటున్నారని.. ధరణిని తీసేస్తామంటున్న కాంగ్రెస్ దుర్మార్గులనే బంగాళాఖాతంలోకి విసిరేయాలని ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు మండిపడ్డారు. ధరణితోనే రైతుల ఖాతాల్లో రైతు బంధు, రైతు బీమా సొమ్ములు పడుతున్న విషయం వారికి తెలియదా అని ప్రశ్నించారు. కాంగ్రెస్ హయాంలోనే వీఆర్వోల దోపిడీ, పహాణీలు, భూమి రికార్డులు మార్చేయడం వంటి ఎన్నో అక్రమాలు జరిగాయని.. వాటికి చెక్ పెట్టేందుకే ధరణిని తెచ్చామని చెప్పారు. అలాంటి కాంగ్రెస్ మళ్లీ వస్తే రైతు బంధు, దళిత బంధు పథకాలు ఆగిపోతాయని పేర్కొన్నారు. ఆదివారం నిర్మల్ జిల్లా కేంద్రంలో రూ.56 కోట్లతో నిర్మించిన సమీకృత కలెక్టరేట్ సముదాయంతోపాటు బీఆర్‌ఎస్ భవన్, మైనార్టీ రెసిడెన్షియల్ స్కూల్ ప్రారంభం, పలు ఇతర అభివృద్ధి కార్యక్రమాల్లో సీఎం కేసీఆర్ పాల్గొన్నారు. అనంతరం స్థానిక క్రషర్ గ్రౌండ్‌లో మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి ఆధ్వర్యంలో

మిగతా 2వ పేజీలో ▶

ధరణి పోవాలంటే కాంగ్రెస్ రావాలి



- ఈ పోర్టల్ రైతులను ఇబ్బందులకు గురిచేస్తోంది
- అందుకే ఇందిరమ్మ రాజ్యం తెచ్చుకుందాం
- మేమొస్తే కేసీఆర్ లాక్కున్న భూములను తిరిగి ఇప్పిస్తాం
- అచ్చంపేట కార్నర్ మీటింగ్‌లో భట్టి

2 లో

ఆదివారం బాలాసోర్‌లో మృతుల ఫొటోల్లో తమ వారి కోసం వెతుకుతున్న బంధువులు





తన భర్త ఆచూకీ కోసం ఆధార్ కార్డు పట్టుకొని విలపిస్తున్న మహిళ

రైళ్ల ప్రమాదంపై

సీబీఐ

విచారణ జరిపించాలని రైల్వే శాఖ నిర్ణయం

- విద్రోహ కోణం ఉండొచ్చని అనుమానం
- కారణాన్ని, కారకులను గుర్తించాం: రైల్వే మంత్రి
- మృతుల సంఖ్య 275గా నిర్ధారణ
- గుర్తించాల్సిన మృతదేహాలు 187!
- వాటిని భద్రపరచడమే పెద్ద సవాలు
- కేంద్రంపై మండిపడ్డ విపక్షాలు
- అశ్వినీ వైష్ణవ్ రాజీనామాకు డిమాండ్

- వివరాలు 6లో ▶

సిగ్నల్ రాంగ్ రూట్

రైల్వే ట్రాక్‌ల నిర్వహణ..

లోపాలమయం

కాగ్ అక్షింతలు వేసినా రైల్వేశాఖ పట్టించుకోని వైనం

- వివరాలు 6లో ▶

రేపటి నుంచి అధిక ఉష్ణోగ్రతలు



రాష్ట్రంలో మంగళవారం నుంచి వారం రోజులపాటు అధిక ఉష్ణోగ్రతలు నమోదవుతాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. తెలంగాణ అంతటా పగటి ఉష్ణోగ్రతలు 42 డిగ్రీల నుంచి 44 డిగ్రీల సెల్సియస్ వరకు స్థిరంగా నమోదయ్యే అవకాశం ఉందని పేర్కొంది.

- వివరాలు 10లో

బీజేపీని తుడిచేస్తాం

తెలంగాణలో అసెంబ్లీ ఎన్నికల తర్వాత ఆ పార్టీ కనిపించదు

- అన్ని ఎన్నికల్లోనూ కర్ణాటక ఫలితాలే పునరావృతం అవుతాయి.. ప్రజలు విద్వేష సిద్ధాంతాలను ఓడించేందుకు సిద్ధంగా ఉన్నారు
- న్యూయార్క్‌లోని కార్యక్రమంలో రాహుల్ గాంధీ



న్యూయార్క్‌లో జరిగిన కార్యక్రమంలో కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీతో రేవంత్

న్యూయార్క్: కర్ణాటక ఎన్నికల్లో వచ్చిన ఫలితాలే త్వరలో ఎన్నికలు జరగబోయే రాష్ట్రాల్లోనూ పునరావృతం అవుతాయని కాంగ్రెస్ నాయకుడు రాహుల్ గాంధీ ధీమా వ్యక్తం చేశారు. తెలంగాణతో పాటు ఇతర రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీని తుడిచి పెట్టేస్తామన్నారు. కాంగ్రెస్ పార్టీయే కాకుండా యావత్ భారత్ ప్రజలు విద్వేషపూరిత సిద్ధాంతాలను ఓడించడానికి సిద్ధమయ్యారని చెప్పారు. అమెరికా పర్యటనలో ఉన్న రాహుల్ గాంధీ న్యూయార్క్‌లో శనివారం ఇండియన్ ఓవర్‌సీస్ కాంగ్రెస్–యూఎస్‌ఏ ఏర్పాటు చేసిన ఒక కార్యక్రమంలో మాట్లాడారు. ''కర్ణాటకలో మేము బీజేపీని ఓడించలేదు. తుడిచిపెట్టేశాము. ఆ పార్టీని నిర్మూలించాం. బీజేపీ గెలుపు కోసం చేయని ప్రయత్నం లేదు. మీడియా అంతా వారి వైపే ఉంది. మా దగ్గర కంటే 10 రెట్లు ధనబలం వారికి ఉంది. వారి చేతిలో అధికారం ఉంది. అన్నీ బీజేపీకే ఉన్నా

మిగతా 2వ పేజీలో ▶

'తుడిచివేత' వెనుక మర్మమేంటో..?

- రాహుల్ వ్యాఖ్యలపై రాష్ట్ర రాజకీయ వర్గాల్లో చర్చ
- కాంగ్రెస్ కేడర్‌లో నూతనోత్సాహం నింపేందుకా?

- వివరాలు 2లో

గాలివాన బీభత్సం

- సంగారెడ్డి, వికారాబాద్, ఉమ్మడి నిజామాబాద్ జిల్లాల్లో భారీ వర్షాలు
- నాగల్‌గిద్దలో 6.7 సెం.మీ.ల వర్షం
- ఈదురుగాలులకు ఎగిరిన పైకప్పులు, నేలకొరిగిన విద్యుత్ స్తంభాలు
- సాలీడులో పిడుగుపాటుకు 26 మేకలు మృతి

5 లో



సంగారెడ్డిలో కురుస్తున్న భారీ వర్షం

అరుదైన శిలాఫలకం.. అంతులేని నిర్లక్ష్యం!

రెండు దశాబ్దాల క్రితం ఫణిగిరిలో వెలుగు చూసిన సున్నపురాతి బౌద్ధ శిలాఫలకం



- 2 వేల ఏళ్లనాటిదిగా గుర్తింపు.. 2003లో జరిగిన చోరీలో ధ్వంసం
- తాత్కాలికంగా అతికించిన అధికారులు.. దాన్ని భద్రమైన చోట ఉంచాలని కోర్టు ఆదేశం
- ఇప్పుడా శిలాఫలకం ప్రదర్శన కోసం న్యూయార్క్‌కు తరలింపు
- ఈ తీరుతో శిల్పానికి ప్రమాదం అంటూ కేంద్రానికి ఫిర్యాదులు

5 లో



మధ్యవర్తిత్వంతో కోర్టులపై భారం తగ్గింపు

ఈఎండబ్ల్యూ కార్యక్రమంలో గవర్నర్ తమిళిసై

- విపరీత ఒత్తిడి ఏ వ్యవస్థకూ మంచిది కాదు
- మధ్యవర్తిత్వం పటిష్టం కావాలి: హైకోర్టు సీజే జస్టిస్ భూయాన్

ఆదివారం హైదరాబాద్‌లో ఈఎండబ్ల్యూ కార్యక్రమంలో జ్యోతి ప్రజ్వలన చేస్తున్న గవర్నర్ తమిళిసై. చిత్రంలో హైకోర్టు సీజే జస్టిస్ ఉజ్జల్ భూయాన్ తదితరులు

10 లో

ఇదండీ సంగతి



65 దాటితే రిటైరే..!

అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్లకు కేంద్ర నిబంధనల అమలుపై సర్కారు దృష్టి

- పదవీ విరమణ ప్రయోజనాలపై కసరత్తు
- రూ.లక్ష లేదా 2 లక్షల ఆర్థిక సాయం, ఆసరా పెన్షన్ మంజూరుకు ప్రతిపాదనలు
- కారుణ్య నియామకం కింద కుటుంబీకులకు అవకాశం ఇచ్చే యోచన
- ఒకట్రెండు రోజుల్లో మార్గదర్శకాలు విడుదల



సాక్షి, హైదరాబాద్: అంగన్‌వాడీల్లో పనిచేస్తున్న టీచర్లు, హెల్పర్ల పదవీ విరమణ అంశాన్ని కొలిక్కి తెచ్చేందుకు రాష్ట్ర మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ కసరత్తు ముమ్మరం చేసింది. 65 సంవత్సరాల వయో పరిమితిని తప్పకుండా అమలు చేయాలని కేంద్ర ప్రభుత్వం తేల్చిచెప్పడంతో ఈ దిశగా చర్యలు వేగవంతం చేసింది. కేంద్ర ప్రభుత్వ నిబంధనల ప్రకారం 65 సంవత్సరాలు దాటిన వారు తప్పకుండా పదవీ విరమణ పొందాల్సి ఉంటుంది. కానీ రాష్ట్రంలో దీన్ని కఠినంగా అమలు చేయకపోవడంతో చాలామంది వయసు మీరినప్పటికీ విధుల్లో పాల్గొంటున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న సిబ్బందిలో రెండున్నర వేల మందికి పైగా వయసు మీరిన వారున్నట్లు అధికారుల ప్రాథమిక గణాంకాలు చెబుతున్నాయి. కాగా కేంద్రం ఒత్తిడితో పాటు వీరు అనారోగ్య సమస్యలు, ఇతరత్రా కారణాలతో సరిగా విధులు నిర్వర్తించలేకపోతున్నట్లు భావిస్తున్న రాష్ట్ర ప్రభుత్వం వీరి పదవీ విరమణపై దృష్టి పెట్టింది. ఇందుకోసం ప్రత్యేక ప్యాకేజీ ప్రకటించాలని నిర్ణయించింది. ఈ నేపథ్యంలో రెండు రకాల ప్యాకేజీలతో ప్రతిపాదనలను తయారు చేసిన అధికారులు వీటిని ఆర్థిక శాఖకు సమర్పించినట్లు తెలిసింది.

రెండున్నర వేల మందికి పైగా..

రాష్ట్రవ్యాప్తంగా 149 ఐసీడీఎస్ ప్రాజెక్టులున్నాయి. వీటి పరిధిలో 35,700 అంగన్‌వాడీ కేంద్రాలుండగా... ఇందులో 31,711 ప్రధాన

మిగతా 10వ పేజీలో ▶

మావోయిస్టు అగ్రనేత

కటకం కన్నుమూత

- గుండెపోటుతో మే 31న మృతి
- మావోయిస్టు పార్టీ ప్రకటన
- ఆగస్టు 3 వరకు స్మారక సభలు నిర్వహించాలని పిలుపు
- రాడికల్ విద్యార్థి సంఘం నుంచి కేంద్ర కమిటీ వరకు సుదర్శన్ ప్రస్థానం



సాక్షి, హైదరాబాద్/ బెల్లంపల్లి/ చర్ల: మావోయిస్టు పార్టీ అగ్రనేత, పార్టీ పొలిట్‌బ్యూరో సభ్యుడు కటకం సుదర్శన్ (69) అలియాస్ ఆనంద్ కన్నుమూశారు. ఐదు దశాబ్దాలుగా మావోయిస్టు ఉద్యమంలో కీలకంగా పనిచేసిన ఆయన కొంతకాలం నుంచి దీర్ఘకాలిక శ్వాసకోశ వ్యాధి, మధుమేహం, అధిక రక్తపోటుతో బాధపడుతున్నారు. ఈ క్రమంలో దండకారణ్యం గెరిల్లా జోన్‌లో మే 31న మధ్యాహ్నం గుండెపోటుతో తుదిశ్వాస విడిచారని మావోయిస్టు పార్టీ ప్రకటించింది. దీనిపై మావోయిస్టు కేంద్ర కమిటీ మీడియా ప్రతినిధి అభయ్, మావోయిస్టు పార్టీ తెలంగాణ రాష్ట్ర కమిటీ అధికార ప్రతినిధి జగన్ వేర్వేరుగా ప్రకటనలు జారీ చేశారు. వందలాది మంది పార్టీ, ప్రజా విముక్తి గెరిల్లా సైన్యం (పీఎల్‌జీఏ) కార్యకర్తలు, నాయకులు, కమాండర్ల సమక్షంలో విప్లవ సాంప్రదాయాలతో సుదర్శన్ అంత్యక్రియలు నిర్వహించినట్టు తెలిపారు. సుదర్శన్ భార్య, కుటుంబ సభ్యులు, స్నేహితులకు మావోయిస్టు పార్టీ తరఫున

మిగతా 5వ పేజీలో ▶

క్లుప్తంగా...

భారత్ వైపు ప్రపంచం చూస్తోంది

కేంద్ర సహాయ మంత్రి వర్మ



హనుమకొండ: ప్రధాని మోదీ సారథ్యంలో దేశం అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించిందని, ప్రపంచం భారత్ వైపు చూస్తోందని కేంద్ర సహకార, ఈశాన్య రాష్ట్రాల అభివృద్ధి శాఖ సహాయ మంత్రి బి.ఎల్.వర్మ అన్నారు. కేంద్రంలో బీజేపీ తొమ్మిదేళ్ల పాలన సందర్భంగా చేపట్టిన మహాజన సంపర్క్ అభియాన్, ప్రవాస యోజన కార్యక్రమాల్లో భాగంగా ఆయన ఆదివారం వరంగల్, మహబూబాబాద్ పార్లమెంట్ నియోజకవర్గాల్లో పర్యటించారు. ములుగు జిల్లా రామప్పను సందర్శించిన అనంతరం భూపాలపల్లి జిల్లాలో పార్టీ కార్యకర్తల సమావేశంలో పాల్గొన్నారు. వరంగల్ జిల్లా గీసుకొండ, సంగెం మండలం కాకతీయ మెగా టెక్స్‌టైల్‌పార్కును సందర్శించారు. అంతకుముందు హనుమకొండలో విలేకరులతో వర్మ మాట్లాడుతూ.. బ్రిజ్‌భూషణ్ లైంగిక వేధింపుల కేసులో చట్టం తన పని తాను చేసుకుపోతుందని స్పష్టం చేశారు.

సీఎం ఆదేశిస్తే డోర్నకల్ నుంచి పోటీ చేస్తా..

మంత్రి సత్యవతి రాథోడ్



దంతాలపల్లి: సీఎం కేసీఆర్ ఆదేశిస్తే వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో డోర్నకల్ అసెంబ్లీ నుంచి ఎమ్మెల్యేగా పోటీ చేసేందుకు సిద్ధంగా ఉన్నట్లు మంత్రి సత్యవతి రాథోడ్ అన్నా రు. ఆదివారం మహబూబాబాద్ జిల్లా దంతాలపల్లిలో ఆమె విలేకరులతో మాట్లాడుతూ..సామాన్య మహిళనైన నాకు ఎమ్మెల్సీగా అవకాశం ఇచ్చి గిరిజన, మహిళలకు, రాష్ట్ర అభివృద్ధికి కృషి చేయమని ఆదేశించారని తెలిపారు. మానుకోట ప్రజానీకం అభివృద్ధికి కేసీఆర్ సహకారంతో వైద్య విద్యాలయం, ఇంజనీరింగ్ కళాశాల తీసుకువచ్చినట్లు పేర్కొన్నారు. 'డోర్నకల్ నియోజకవర్గంలో మీకంటూ ఒక వర్గం ఉన్నది..పార్టీ చేపట్టే వివిధ కార్యక్రమాలకు మీ వారు ఎవరూ హాజరు కావట్లేదని'విలేకరులు అడిగిన ప్రశ్నకు ఆమె సమాధానం దాటవేస్తూ..ఇది సందర్భం కాదంటూనే.. మాకంటూ వర్గమేమీ లేదని, మేమంతా ముఖ్యమంత్రి గొడుగు కింద పనిచేస్తాం ..ఎలాంటి అనుమానాలు అక్కరలేదన్నారు.

రైతులను నిండా ముంచి.. రైతు దినోత్సవమా!

ట్విట్టర్ వేదికగా షర్మిల ఫైర్



సాక్షి, హైదరాబాద్: రైతులను నిండా ముంచిన కేసీఆర్ ఓట్ల కోసం 'రైతు దినోత్సవం' జరుపుతున్నారంటూ వైఎస్సార్ తెలంగాణ పార్టీ అధినేత్రి వైఎస్ షర్మిల ఆగ్రహం వ్యక్తం చేశారు. 'రైతు దినోత్సవం'కంటే 'రైతు దగా దినోత్సవం'అంటేనే బాగుంటుందని ట్విట్టర్ వేదికగా ఆమె విమర్శించారు. తొమ్మిదేండ్లలో 9వేల మంది రైతులను పొట్టన పెట్టుకున్నారని, అసలు ఏం సాధించారని ఈ రైతు దినోత్సవాలని షర్మిల నిలదీశారు. ఎకరాకు ముష్టి రూ.5వేల రైతుబంధు ఇచ్చి.. వందల ఎకరాలున్న భూస్వాములకు రూ.కోట్లు చెల్లిస్తున్నారని ఆరోపించారు. వడ్లను కొనకుండా ముప్పుతిప్పలు పెట్టి, కల్లాల్లోనే రైతుల గుండెలు ఆగేలా చేశారని విమర్శించారు. వ్యవసాయం అంటే మహానేత వైఎస్సార్ కాలంలో పండుగని, కానీ కేసీఆర్ కాలంలో దండగలా మారిందని వ్యాఖ్యానించారు. పంట నష్టపోయిన 15 లక్షల ఎకరాలకు వారం రోజుల్లో పరిహారం ఇవ్వాలని, మిగిలిపోయిన 30 లక్షల టన్నుల ధాన్యాన్ని కొనాలని డిమాండ్ చేశారు.

ఉద్యమ ఆకాంక్షలు టీజేఎస్‌తోనే సాధ్యం

టీజేఎస్ రాష్ట్ర అధ్యక్షుడు కోదండరామ్



సూర్యాపేట: తెలంగాణ ఉద్యమ ఆకాంక్షలను నెరవేర్చడం తెలంగాణ జనసమితి (టీజేఎస్) పార్టీతోనే సాధ్యమని ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు, ప్రొఫెసర్ కోదండరామ్ అన్నారు. ఆదివారం సూర్యాపేట జిల్లాకేంద్రంలో నిర్వహించిన టీజేఎస్ 3వ రాష్ట్ర ప్లీనరీకి హాజరై విలేకరులతో మాట్లాడారు. తమ ఆర్థిక, రాజకీయ స్వలాభాల కోసమే తెలంగాణలో ముఖ్యమంత్రి కేసీఆర్ విధ్వంసం సృష్టిస్తున్నారని తెలిపారు. కేసీఆర్ ప్రభుత్వం ఉద్యమ ఆకాంక్షలను నెరవేర్చకుండానే సొంత ఎజెండాను అమలు పరుస్తోందన్నారు. తెలంగాణ పదాన్ని వదిలి రాష్ట్ర ప్రజల ఆకాంక్షలను మరిచి బీఆర్ఎస్ పేరుతో దేశ రాజకీయాల్లోకి వెళ్లడం సరికాదన్నారు. అకాల వర్షంతో రైతులు ఇబ్బందులు పడుతుంటే ఆదుకునే ప్రయ త్నం చేయకపోవడం సిగ్గుచేటన్నారు. తెలంగాణ జన సమితి అస్తిత్వాన్ని కాపాడుకుంటామని ఈ సందర్భంగా చెప్పారు. ఆయన వెంట పార్టీ రాష్ట్ర నాయకులు టీఎల్ విశ్వేశ్వర్‌రావు, కుంట్ల ధర్మార్జున్ తదితరులు ఉన్నారు. కాగా, టీజేఎస్ రాష్ట్ర అధ్యక్షుడి ఎంపిక కోసం జరిగిన ఎన్నికల్లో కోదండరామ్ ఒక్కరే నామినేషన్ వేయడంతో తిరిగి ఆయనే పార్టీ అధ్యక్షుడిగా ఎన్నికైనట్లు ప్లీనరీలో ప్రకటించారు.

పర్యావరణంలో తెలంగాణ 'ఫస్ట్'!



- అటవీ విస్తీర్ణం పెరుగుదల, మున్సిపల్ వ్యర్థాల శుద్ధి సూచికల్లో తెలంగాణకు అగ్రస్థానం
- వినియోగంలో లేని జల వనరుల శాతం, కాలుష్య నదీ తీరాల మార్పిడిలో మాత్రం వెనుకబాటు
- అన్ని అంశాలను పరిగణనలోకి తీసుకుంటే రాష్ట్రానికే టాప్ స్కోర్
- సెంటర్ ఫర్ సైన్స్ ఎన్విరాన్‌మెంట్' నివేదికలో వెల్లడి

సాక్షి, హైదరాబాద్: పర్యావరణ పరిరక్షణకు సంబంధించి తెలంగాణ రాష్ట్రం దేశంలోనే టాప్‌లో నిలిచింది. అటవీ విస్తీర్ణం, పచ్చదనం పెంపు (చేంజ్ ఇన్ ఫారెస్ట్ కవర్)తోపాటు మున్సిపల్ వ్యర్థాల నిర్వహణలో అగ్రస్థానంలో నిలవగా.. వినియోగంలో లేని జలవనరుల శాతం, భూగర్భ జలాలు, నదుల కాలుష్యం వంటి అంశాల్లో వెనుకబడింది. అయితే అన్ని అంశాలను కలిపిచూస్తే ఓవరాల్‌గా దేశంలోని 29 రాష్ట్రాల్లో తెలంగాణ రాష్ట్రమే టాప్ స్కోర్ సాధించింది. తాజాగా 'సెంటర్ ఫర్ సైన్స్ ఎన్విరాన్‌మెంట్'విడుదల చేసిన 'స్టేట్ ఆఫ్ ఇండియాస్ ఎన్విరాన్‌మెంట్ 2023- ఇన్ ఫిగర్స్'నివేదికలో ఈ వివరాలు వెల్లడయ్యాయి. రాష్ట్రాల్లో వ్యవసాయం, పశు సంపద, వైల్డ్‌లైఫ్-బయోడైవర్సిటీ, వాతావరణ మార్పులు, వాయు కాలుష్యం, నీరు-నదులు, విద్యుత్, ఆరోగ్యం అంశాల ఆధారంగా.. పర్యావరణం, వ్యవసాయం, ప్రజారోగ్యం, ప్రజా మౌలిక సదుపాయాలు, మానవాభివృద్ధి, మున్సిపల్ ఘన వ్యర్థాలు, ప్లాస్టిక్, హానికర వ్యర్థాలు, ఇతర వ్యర్థాల నిర్వహణలో పాయింట్లను కేటాయించారు.

ఏయే అంశాలకు గరిష్టంగా ఎన్ని పాయింట్లు ఇచ్చారు?

- 2019తో పోల్చితే అటవీ విస్తీర్ణం పెంపునకు 3 పాయింట్లు.
- మున్సిపల్ ఘనవ్యర్థాల నిర్వహణ (2020-21లో)కు 1.5 పాయింట్లు
- 2020 జూన్ 30నాటికి మురుగునీటి శుద్ధి చర్యలకు 1.5 పాయింట్లు
- 2019-20తో పోల్చితే 2020-21 నాటికి పునరుత్పాదక విద్యుత్ పెంపునకు 1 పాయింట్
- 2018తో పోల్చితే 2022 నాటికి కాలుష్యం బారినపడ్డ నదుల ప్రక్షాళన చర్యలకు 1 పాయింట్
- 2022లో భూగర్భజలాల వెలికితీత అంశానికి 1 పాయింట్
- 2022లో వినియోగంలో లేని నీటి వనరుల శాతానికి 1 పాయింట్

(ఇందులో అటవీ విస్తీర్ణం పెంపు, మున్సిపల్ ఘన వ్యర్థాల నిర్వహణకు సంబంధించి తెలంగాణకు ఎక్కువ పాయింట్లు వచ్చాయి. దీనితో ఎక్కువ పాయింట్లతో దేశంలోనే టాప్‌లో నిలిచింది.)

పర్యావరణహిత రాష్ట్రం కోసమే: కేటీఆర్

పర్యావరణహితంలో దేశంలో అగ్రస్థానంలోనే తెలంగాణ నిలవడం పట్ల మంత్రి కేటీఆర్ హర్షం వ్యక్తం చేశారు. సీఎస్ఈ విడుదల చేసిన నివేదికలో రాష్ట్రం అగ్రస్థానంలో నిలవడాన్ని ప్రస్తావిస్తూ ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. 'ఇది తెలంగాణ ప్రభుత్వ సమగ్ర, సమతుల్య పర్యావరణ విధానాలకు, పర్యావరణం పట్ల సీఎం కేసీఆర్ నిబద్ధతకు దక్కిన గుర్తింపు. భవిష్యత్తుతరాలకు పర్యావరణహిత రాష్ట్రాన్ని అందించాలన్న లక్ష్యం కోసమే ప్రభుత్వం అనేక కార్యక్రమాలు చేపట్టింది. ప్రభుత్వ పచ్చదనం, పర్యావరణ కార్యక్రమాలలో భాగస్వాములైన రాష్ట్ర ప్రజలకు అభినందనలు' అని తెలిపారు.

ఎక్కువ పాయింట్లు తెలంగాణకే..

- వివిధ అంశాలకు సంబంధించి రాష్ట్రాలకు మొత్తంగా 10 పాయింట్లు కేటాయించగా.. తెలంగాణ 7.213 పాయింట్లు సాధించి అగ్రస్థానంలో నిలిచింది. తర్వాతి స్థానాల్లో గుజరాత్ (6.593 పాయింట్లు), గోవా (6.394), మహారాష్ట్ర (5.764), హరియాణా (5.578 పాయింట్లు) నిలిచాయి.
- రాజస్తాన్ అతి తక్కువగా 2.757 పాయింట్లతో అట్టడుగున 29వ స్థానంలో నిలవగా.. నాగాలాండ్ 3.4 పాయింట్లతో 28వ, బిహార్ 3.496 పాయింట్లతో 27వ, పశ్చిమ బెంగాల్ 3.704 పాయింట్లతో 26వ స్థానాల్లో నిలిచాయి.
- తక్కువ పాయింట్లతో అట్టడుగున నిలిచిన పది రాష్ట్రాల్లో ఆరు ఈశాన్య రాష్ట్రాలే కావడం గమనార్హం.

ధరణి వద్దన్న కాంగ్రెస్.. బంగాళాఖాతంలోకే!



కొత్త కలెక్టరేట్ ప్రారంభోత్సవం సందర్భంగా కలెక్టర్ వరుణ్‌రెడ్డిని అభినందిస్తున్న కేసీఆర్. చిత్రంలో సీఎస్ శాంతికుమారి, మంత్రి వేముల



నిర్మల్ బహిరంగ సభకు హాజరైన టీఆర్ఎస్ శ్రేణులు, ప్రజలు

▶ మొదటి పేజీ తరువాయి

జరిగిన బహిరంగసభలో మాట్లాడారు. సభ ప్రారంభమయ్యే సమయంలో కాసేపు వర్షం కురిసింది. అయినా ప్రజలు వేచి ఉన్నారు. కేసీఆర్ కూడా తన ప్రసంగాన్ని త్వరగా ముగించారు.

అబ్‌కీ బార్ కిసాన్ సర్కార్

దేశంలో రైతులకు మేలు చేస్తున్న ఏకైక రాష్ట్ర ప్రభుత్వం మనదేనని, దేశమంతా తెలంగాణ వైపే చూస్తోందని సీఎం కేసీఆర్ పేర్కొన్నారు. అబ్‌కీ బార్ కిసాన్ సర్కార్ పక్కా అన్నారు. ''మహారాష్ట్రకు వెళ్లినప్పుడు అక్కడి రైతులు రైతుబంధు డబ్బులను ఖాతాల్లో జమ చేస్తారా? రైతు బీమా పైసలు నేరుగా నామినీ ఖాతాలో వేస్తారా? అని ఆశ్చర్యపోతున్నారు. కేసీఆర్.. మాకు మీరు కావాలె. అబ్ కీ బార్ కిసాన్ సర్కార్ అని అక్కడా బ్రహ్మాండంగా స్వాగతం పలుకుతున్నారు..''అని కేసీఆర్ చెప్పారు.

దోపిడీని ఆపేందుకే ధరణి

ధరణి పోర్టల్‌ను వ్యతిరేకిస్తున్న కాంగ్రెస్ నేతలపై సీఎం కేసీఆర్ నిప్పులు చెరిగారు. ''రైతులకు మేలు చేస్తున్న ధరణి పోర్టల్‌ను తీసి బంగాళాఖాతంలో విసిరేస్తామంటారా? ధరణితోనే రైతులకు రైతుబంధు, రైతుబీమా డబ్బులు ఖాతాలలో పడుతున్న విషయం వాళ్లకు తెలుసా? ఇప్పుడు ధరణి వద్దంటున్న దుర్మార్గులు 50ఏళ్లపాటు పాలించారు. రెవెన్యూ శాఖలో భయంకరమైన దోపిడీ జరిగేది. కాంగ్రెస్ హయాంలోనే వీఆర్వోల దోపిడీ, పహాణీలు మార్చేయడం, భూమి రికార్డులు మార్చేయడం చూశాం. ఎవరి భూమి ఎవరి చేతుల్లో ఉండేదో తెలిసేది కాదు. నిన్న ఉన్న భూమి తెల్లారేసరికి పహాణీలు మారిపోయేవి. ధరణితో ఆ సమస్యలన్నీ తీరాయి. ఇలాంటి ధరణి ఉండొద్దా? ధరణి పోర్టల్‌ను తీసివేస్తామంటున్న కాంగ్రెస్ దుర్మార్గులనే బంగాళాఖాతంలో విసిరేయాలి..''అని కేసీఆర్ మండిపడ్డారు. కాంగ్రెస్ హయాంలో దోపిడీతో బాధలు పడ్డామని.. మళ్లీ కాంగ్రెస్ వస్తే రైతు బంధుకు రాం రాం, దళితబంధుకు జైభీం అంటూ ముగింపు పలుకుతారని కేసీఆర్ పేర్కొన్నారు.

వేల కోట్లతో ఉచిత విద్యుత్ ఇస్తున్నాం..

రాష్ట్రంలో పేదల కోసం ఎన్నో సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నామని.. డబుల్ బెడ్రూం ఇళ్లు నిర్మించి ఇస్తున్నామని చెప్పారు. రాష్ట్రంలో ఒకప్పుడు కరెంట్ ఎప్పుడు వస్తుందో, ఎప్పుడు పోతుందో తెలిసేది కాదని.. ఇప్పుడు తెలంగాణలో 24 గంటలపాటు నాణ్యమైన విద్యుత్ అందిస్తున్నామని చెప్పారు. రూ.12 వేల కోట్లు ఖర్చుపెట్టి ఉచిత విద్యుత్ అందిస్తున్నామని.. రైతులకు ఎన్ని మీటర్లు పెట్టావని అడిగేవారే లేరని పేర్కొన్నారు.

ఉద్యోగుల కృషితో అద్భుత ఫలితాలు

కొత్త కలెక్టరేట్‌ను ప్రారంభించిన తర్వాత జిల్లా అధికారులతో సీఎం కేసీఆర్ మాట్లాడారు. తెలంగాణ వచ్చాక సమష్టిగా కృషి చేసి అద్భుత ఫలితాలు సాధించగలిగామన్నారు. ఆసిఫాబాద్ లాంటి అటవీ ప్రాంతంలో కూడా మెడికల్ కాలేజీ వచ్చిందని.. ముఖ్రా(కే) గ్రామం జాతీయస్థాయిలో ఎన్నో అవార్డులు తీసుకొని మనకు గౌరవం తెచ్చిపెట్టిందని చెప్పారు. ఇందుకు అధికారుల కృషే కారణమని అభినందించారు. దళిత, గిరిజన, వెనుకబడిన తరగతుల్లో నిరుపేదలు ఉన్నారని, వారికోసం చేయాల్సింది చాలా ఉందని పేర్కొన్నారు. ఎన్నికల తర్వాత ఫుడ్ ప్రాసెసింగ్ సెంటర్లు ఏర్పాటు చేస్తామని, రాబోయే రోజుల్లో పోడు భూముల పంపిణీని బ్రహ్మాండంగా నిర్వహించాలని సూచించారు. ఈ కార్యక్రమాల్లో మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి, ఎంపీ జోగినపల్లి సంతోష్‌కుమార్, ఎమ్మెల్యేలు బాల్క సుమన్, జోగు రామన్న, రాథోడ్ బాపురావు, విఠల్‌రెడ్డి, రేఖానాయక్, దుర్గం చిన్నయ్య, దివాకర్‌రావు, ఆత్రం సక్కు, ఎమ్మెల్సీ దండే విఠల్, ఐడీసీ చైర్మన్ వేణుగోపాలచారి తదితరులు పాల్గొన్నారు.

నిర్మల్ జిల్లాకు సీఎం వరాలు

తన పర్యటన సందర్భంగా నిర్మల్ జిల్లాకు కేసీఆర్ వరాలు ప్రకటించారు. జిల్లాలోని 396 గ్రామ పంచాయతీలకు రూ.10లక్షల చొప్పున, 19 మండల కేంద్రాలకు రూ.20 లక్షల చొప్పున.. నిర్మల్, ఖానాపూర్, భైంసా మున్సిపాలిటీలకు రూ.25 కోట్ల చొప్పున నిధులు మంజూరు చేస్తున్నట్టు చెప్పారు. మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి కోరిక మేరకు ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాకు ప్రభుత్వ ఇంజనీరింగ్ కాలేజీని మంజూరు చేస్తున్నామని.. జేఎన్‌టీయూ ఆధ్వర్యంలో దానిని ప్రారంభిస్తామని తెలిపారు. ఇటీవలి పదో తరగతి ఫలితాల్లో నిర్మల్ జిల్లా నంబర్ వన్‌గా నిలవడంపై టీచర్లు, విద్యార్థులను అభినందించారు. బాసర సరస్వతి అమ్మవారి ఆలయాన్ని పెద్ద ఎత్తున అభివృద్ధి చేస్తామని.. దీనికి పునాదిరాయి వేసేందుకు త్వరలోనే బాసరకు వస్తానని కేసీఆర్ తెలిపారు.

మండలం సార్.. చూసిన.. చూసిన..

బోథ్: ఆదిలాబాద్ జిల్లా బోథ్ మండలం సొనాలను మండలంగా ఏర్పాటు చేయాలంటూ సొనాల, చుట్టుపక్కల గ్రామాల ప్రజలు నిర్మల్ సభలో ప్లకార్డులు ప్రదర్శించారు. ఈ మేరకు గట్టిగా నినాదాలు చేశారు. సీఎం కేసీఆర్ దానిపై స్పందిస్తూ.. 'చూసిన.. చూసిన..' అని సమాధానమిచ్చారు. దీంతో తమ విజ్ఞప్తి సీఎం దృష్టికి వెళ్లిందని సొనాల గ్రామస్తులు ఆనందం వ్యక్తం చేశారు.

ధరణి పోవాలంటే కాంగ్రెస్ రావాలి

- పీపుల్స్‌మార్చ్ పాదయాత్రలో భట్టి విక్రమార్క
- అధికారంలోకి వస్తే రూ.2 లక్షల రైతు రుణమాఫీ చేస్తామని హామీ
- ధరణి తీసుకొచ్చి పేదల భూముల్ని లాక్కున్నారు: మల్లు రవి



రైతులతో ముచ్చటిస్తున్న భట్టి విక్రమార్క

అచ్చంపేట: రైతులను అనేక ఇబ్బందులకు గురిచేస్తోన్న ధరణి పోర్టల్ పోవాలంటే రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావాలని సీఎల్పీ నేత భట్టి విక్రమార్క అన్నారు. రాష్ట్ర సంపదను ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు కుటుంబం, మంత్రులు, ఎమ్మెల్యేలు దోచుకోవడం వల్లే తెలంగాణ లక్ష్యాలు నెరవేరడం లేదని ఆయన ఆరోపించారు. భట్టి చేపట్టిన పీపుల్స్ మార్చ్ పాదయాత్ర నాగర్‌కర్నూల్ జిల్లా అచ్చంపేటలో ఆదివారం కొనసాగింది. ఈ సందర్భంగా రంగాపూర్‌లో కాంగ్రెస్ పార్టీ జెండాను ఆవిష్కరించి కార్నర్ మీటింగ్‌లో మాట్లాడారు. తెలంగాణ లక్ష్యాలు నెరవేర్చడంలో విఫలమైన ఈ ప్రభుత్వం ఇక చాలని.. ఇక ఇందిరమ్మ రాజ్యం తెచ్చుకుందామని ప్రజలకు పిలుపునిచ్చారు. ఉత్తర తెలంగాణ నుంచి మొదలుకొని అచ్చంపేట వరకు సబ్బండ వర్గాల ప్రజలు ప్రభుత్వంపై వ్యతిరేకతతో ఉన్నారని చెప్పారు. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే ఇల్లు, స్థలం లేని పేదలను గుర్తించి ఇంటి స్థలంతోపాటు ఇల్లు కట్టుకోవడానికి రూ.5 లక్షల ఆర్థిక సాయం, ఏకకాలంలో రూ.2 లక్షల రుణమాఫీ చేస్తామని హామీనిచ్చారు. ఆరోగ్యశ్రీ కార్డు ద్వారా రూ.5 లక్షల ఖర్చుతో వైద్యసేవలు అందిస్తామని, రూ.500కే గ్యాస్ సిలిండర్లు పంపిణీ చేస్తామని, ప్రభుత్వం లాక్కున్న భూములను తిరిగి ఇప్పిస్తామని, మన కొలువులు మనకు రావాలన్నా..బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని గద్దె దించాలని పిలుపునిచ్చారు.

మార్పును కోరుకుంటున్నారు: మల్లు రవి

ధరణి పోర్టల్ తీసుకువచ్చి బీఆర్ఎస్ ప్రభుత్వం పేదలకు పంచిన భూములను వెనక్కి తీసుకుందని, ఇందిరమ్మ ఇళ్లు రద్దు చేసి డబుల్ బెడ్‌రూమ్ ఇల్లు నిర్మించకుండా ప్రజలను దగా చేస్తున్నారని టీపీసీసీ సీనియర్ ఉపాధ్యక్షులు మల్లు రవి విమర్శించారు. కుల, మత, ప్రాంతాలకతీతంగా బీఆర్ఎస్ ప్రభుత్వ బాధితులు ఏకమై రాష్ట్రంలో మార్పు కోరుకుంటున్నారని, వెయ్యి మంది కేసీఆర్‌లు, లక్ష మంది కేటీఆర్‌లు వచ్చి అడ్డుపడినా ప్రభుత్వం మార్పు అనేది అనివార్యంగా జరుగుతుందని ధీమా వ్యక్తం చేశారు. పీపుల్స్ మార్చ్ పాదయాత్ర సందర్భంగా అచ్చంపేట మండలం రంగాపూర్ గ్రామంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. అధికారంలోకి వచ్చి పదేళ్లు గడుస్తున్నా ఉమామహేశ్వర లిఫ్ట్ ఇరిగేషన్‌కు భూ సేకరణ చేయకుండా ప్రాజెక్టు నిర్మాణం చేస్తామని చెప్పడం సిగ్గు చేటన్నారు. వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి 100 సీట్లలో గెలిపించడానికి సిద్ధమయ్యారన్నారు. తెలంగాణలో పోలీసు రాజ్యం నడుస్తున్నదని ఆగ్రహం వ్యక్తం చేశారు.

'తుడిచివేత' వెనుక మర్మమేంటో..?

- రాహుల్ వ్యాఖ్యలపై రాష్ట్ర రాజకీయ వర్గాల్లో చర్చ
- తెలంగాణలో బీజేపీని తుడిచివేస్తామన్న రాహుల్
- కాంగ్రెస్ కేడర్‌లో నూతనోత్సాహం నింపేందుకా?



సాక్షి, హైదరాబాద్: ఇండియన్ ఓవర్సీస్ కాంగ్రెస్ (ఐవోసీ) సమావేశం వేదికగా అమెరికాలో కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ తెలంగాణ రాజకీయాలపై చేసిన వ్యాఖ్యలు చర్చనీయాంశమవుతున్నాయి. కర్ణాటక తరహాలోనే తెలంగాణలోనూ బీజేపీని తుడిచి పారేస్తామని, ఎన్నికల తర్వాత తెలంగాణలో బీజేపీని గుర్తుపట్టడం కూడా కష్టమనే రీతిలో ఆయన చేసిన వ్యాఖ్యల వెనుక ఉన్న బలమేంటన్నది ఇప్పుడు హాట్‌టాపిక్‌గా మారింది. రాష్ట్రంలో అధికారంలో ఉన్న బీఆర్ఎస్‌కు తామే ప్రత్యామ్నాయమని, కచ్చితంగా అధికారంలోకి వస్తామనే ధీమాతో ఉన్న కమలనాథులను తుడిచి పారేస్తామంటూ రాహుల్‌గాంధీ మాట్లాడడం వెనుక మర్మమేంటనే దానిపై తెలంగాణ రాజకీయ వర్గాల్లో ఆసక్తికర చర్చ జరుగుతోంది. తెలంగాణ లో కాంగ్రెస్‌కు రాజకీయంగా కొంత సానుకూల వాతావరణం ఏర్పడుతుందనే అంచనాల నేపథ్యంలో పార్టీ కేడర్‌లో మరింత ఉత్సాహం నింపేందుకే రాహుల్‌గాంధీ ఈ వ్యాఖ్యలు చేశారా? లేక దీనివెనుక బలమైన కారణాలేమైనా ఉన్నాయా అన్నది కాంగ్రెస్ పార్టీ వర్గాల్లోనూ చర్చకు దారి తీస్తోంది. కాంగ్రెస్‌లోకి త్వరలోనే భారీగా వలసలు ఉంటాయనే ప్రచారం, తెలంగాణ ఎన్నికలపై కాంగ్రెస్ హైకమాండ్ ప్రత్యేక ఫోకస్ పెడుతున్నదనే దిశలో జరుగుతున్న పరిణామాలు, ఎప్పటికప్పుడు పార్టీ పక్షాన చేస్తున్న సర్వేలు లాంటి అంశాల ప్రాతిపదికగానే రాహుల్ కీలక వ్యాఖ్యలు చేశారనే అభిప్రాయం వ్యక్తం అవుతోంది. అయితే ప్రత్యామ్నాయం తామేనని చెప్పుకునే స్థాయికి వచ్చిన బీజేపీని ఓడించగలరేమో కానీ, తుడిచి పారేసే స్థాయిలో కాంగ్రెస్ పార్టీ పుంజుకుంటుందా అన్నదానిపై రాజకీయ వర్గాల్లో సందేహాలు వ్యక్తమవుతున్నాయి.

ఆ రెండు పార్టీల నుంచి 20 మంది!

కాంగ్రెస్‌తో పాటు బీఆర్ఎస్ నుంచి బీజేపీలోకి వెళ్లి అసంతృప్తిగా ఉన్న నేతలు, బీఆర్ఎస్ నుంచి బయటకు వచ్చిన నేతలు, బీఆర్ఎస్‌లో కొనసాగుతున్న నేతలు కలిపి మొత్తం 20 మంది వరకు కాంగ్రెస్ హైకమాండ్‌తో టచ్‌లోకి వెళ్లారని తెలుస్తోంది. కర్ణాటక ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ తెర వెనుక ఉండి ఈ చర్చల పరంపరను నడిపిస్తున్నారని, ఎట్టి పరిస్థితుల్లోనూ కర్ణాటక తరహాలోనే తెలంగాణలోనూ పార్టీని అధికారంలోకి తెస్తానని శివకుమార్ కాంగ్రెస్ హైకమాండ్‌కు మాట ఇచ్చారనే చర్చ కూడా జరుగుతోంది. ఈ నేపథ్యంలోనే ఆ 20 మంది సమయం చూసుకుని తమ పార్టీలోకి వస్తారని, పార్టీలోకి వలసల కారణంగా జిల్లాల వారీగా బీజేపీ చాలా నష్టపోతుందని కాంగ్రెస్ నేతలు చెబుతున్నారు. కొన్ని జిల్లాల్లో ఆ పార్టీ ఉనికి కూడా ప్రశ్నార్థకమవుతుందని అంటున్నారు. ఇవన్నీ దృష్టిలో ఉంచుకుని రాహుల్ బీజేపీని తుడిచి పారేస్తామనే స్థాయిలో వ్యాఖ్యలు చేసి ఉంటారని అంటున్నారనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

బీజేపీని తుడిచేస్తాం

▶ మొదటి పేజీ తరువాయి

వారిని తుడిచిపెట్టేశాం.'' అని రాహుల్ చెప్పారు. కర్ణాటక తర్వాత తెలంగాణలో బీజేపీని మట్టికరిపిస్తామన్నారు. తెలంగాణలో అసెంబ్లీ ఎన్నికల తర్వాత బీజేపీ ఇక అక్కడ కనిపించదని జోస్యం చెప్పారు. తెలంగాణతో పాటు రాజస్థాన్, మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్ ఎన్నికల్లో కూడా కర్ణాటక ఫలితాలే వస్తాయన్నారు. సమాజంలో బీజేపీ వ్యాప్తి చేస్తున్న విద్వేష వాతావరణం మధ్య ముందుకు వెళ్లలేమని భారత్ ప్రజలకు బాగా అర్థమైందని చెప్పారు. వివిధ రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల తర్వాత వచ్చే ఏడాది జరిగే లోక్‌సభ ఎన్నికల్లోనూ బీజేపీని ఓడిస్తామని రాహుల్ ధీమాగా చెప్పారు. ఈ సారి సార్వత్రిక ఎన్నికలు సిద్ధాంతాల మధ్య పోరాటంగా రాహుల్ అభివర్ణించారు. విద్వేషానికి, ప్రేమకి మధ్య జరిగే పోరాటంలో బీజేపీ ఓడిపోవడం తథ్యమన్నారు.

రాజకీయాల కంటే ఇంకా పెద్ద విషయాలుంటాయ్: జై శంకర్

అమెరికా పర్యటనలో రాహుల్ గాంధీ చేస్తున్న రాజకీయ వ్యాఖ్యలపై విదేశాంగ శాఖ మంత్రి జైశంకర్ విరుచుకుపడ్డారు. విదేశాల్లో రాజకీయాల కంటే మాట్లాడాల్సిన పెద్ద అంశాలెన్నో ఉంటాయన్నారు. దక్షిణాఫ్రికా పర్యటనలో ఉన్న ఆయన కేప్‌టౌన్‌లో జరిగిన ఓ కార్యక్రమంలో మాట్లాడుతూ విదేశీ గడ్డపై రాజకీయాల కంటే పెద్ద అంశాలపై మాట్లాడాలని, ఇది ప్రతీ ఒక్కరూ గుర్తుంచుకోవాలని చెప్పారు.

టీడీపీతో బీజేపీ పొత్తు ఊహాజనితమే

- ఆ వార్తలను పట్టించుకోవాల్సిన అవసరం లేదు
- అమిత్ షా, నడ్డాలతో చంద్రబాబు భేటీ అయితే తప్పేంటి?
- జిల్లాల నేతలతో టెలికాన్ఫరెన్స్‌లో బండి సంజయ్



సాక్షి, హైదరాబాద్: తెలంగాణలో టీడీపీతో బీజేపీ పొత్తు ఉంటుందంటూ వస్తున్నవి ఊహాగానాలేనని, వాటిని పట్టించుకోవాల్సిన అవసరం లేదని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ స్పష్టం చేశారు. ఆదివారం వివిధ జిల్లాల నేతలతో టెలికాన్ఫరెన్స్‌లో సంజయ్ మాట్లాడుతూ కేంద్ర హోంమంత్రి అమిత్ షా, పార్టీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డాలను టీడీపీ అధినేత చంద్రబాబు కలిస్తే తప్పేముందని ప్రశ్నించారు. గతంలో మమతా బెనర్జీ, స్టాలిన్, నితీశ్ కుమార్ వంటి ప్రతిపక్ష నేతలను కూడా ప్రధాని మోదీ, అమిత్ షా కలిసిన విషయాన్ని గుర్తుచేశారు. దేశాభివృద్ధే బీజేపీ లక్ష్యమని స్పష్టం చేశారు. కేసీఆర్ మాదిరిగా ప్రజలను, ప్రతిపక్ష పార్టీలను కలవకుండా ప్రగతి భవన్‌కే పరిమితమై తెలంగాణ ప్రయోజనాలను తాకట్టు పెట్టే నైజం బీజేపీది కాదు. తెలంగాణలో బీజేపీ గ్రాఫ్ పెరుగుతోందని, పార్టీని దెబ్బతీసేందుకు బీఆర్ఎస్, కాంగ్రెస్ సహా మరికొన్ని శక్తులు ప్రయత్నిస్తున్నాయని ఆయన ఆరోపించారు.

కేంద్ర ప్రభుత్వ ఫలాలను ప్రజల వద్దకు తీసుకెళ్లండి

మోదీ సర్కార్ తొమ్మిదేళ్ల పాలన పూర్తి చేసుకున్న నేపథ్యంలో నెలాఖరు వరకు నిర్వహించే 'మహాజన్ సంపర్క్ అభియాన్'ను విజయవంతం చేయాలని పార్టీ నేతలకు సూచించారు. గడప గడపకూ బీజేపీ పేరుతో కేంద్ర ప్రభుత్వ ఫలాలను ప్రజల వద్దకు తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. అందుకోసం కార్యక్రమాలను ఉధృతం చేయాలన్నారు. రాబోయే ఎన్నికల్లో బీఆర్ఎస్, కాంగ్రెస్, ఎంఐఎం, కమ్యూనిస్టు పార్టీలన్నీ కలిసే పోటీ చేయబోతున్నాయని సంజయ్ చెప్పారు. అయితే తెలంగాణ ప్రజలు బీఆర్ఎస్ పాలనపట్ల విసిగిపోయారని, బీజేపీ వైపు మొగ్గుచూపుతున్నారని పేర్కొన్నారు. ఎప్పుడు ఎన్నికలు జరిగినా కేసీఆర్ ప్రభుత్వాన్ని గద్దె దించడం ఖాయమని సంజయ్ ధీమా వ్యక్తం చేశారు.

అసమ్మతి నేతల 'అల్టిమేటం'

'బండి'దారి తప్పుతోంది

- అధ్యక్షుని ఏకపక్ష వైఖరి, ఇన్‌చార్జుల నిర్లక్ష్య ధోరణి పార్టీకి నష్టమనే వాదనలు
- నెలాఖరులోగా మార్పు రాకపోతే తాడోపేడో తేల్చుకోవాల్సిందేనని బీజేపీ అసమ్మతి నేతల నిర్ణయం
- మాజీ ఎమ్మెల్యే గుజ్జుల నేతృత్వంలో భేటీ
- బండి సంజయ్‌ను ఢిల్లీ పిలిపించిన అధిష్టానం?



సాక్షి, హైదరాబాద్: తెలంగాణ బీజేపీ అసమ్మతి నేతలు అల్టిమేటం వరకు వెళ్లారు. ప్రాంతీయ పార్టీని సమర్థంగా ఎదుర్కొనే దిశలో రాష్ట్రంలో పార్టీ కార్యక్రమాలు జరగడం లేదని ఎన్నిసార్లు అధిష్టానం పెద్దలకు చెప్పినప్పటికీ పట్టించుకోవడం లేదని, నెలాఖరు వరకు వేచి ఉండాలని, అప్పటికి కూడా పార్టీ వైఖరిలో మార్పు రాకపోతే తాడోపేడో తేల్చుకోవాలని వారు నిర్ణయించినట్టు సమాచారం. మాజీ ఎమ్మెల్యే గుజ్జుల రామకృష్ణారెడ్డి నేతృత్వంలో పార్టీ నేతలు చింతా సాంబమూర్తి, సుగుణాకర్ రావు, వెంకటరమణి, డా. మల్లారెడ్డి, పాపారావు తదితరులు ఆదివారం సాయంత్రం ఎమ్మెల్యే క్వార్టర్లలో భేటీ అయినట్టు తెలిసింది. పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ వైఖరి, రాష్ట్ర ఇంచార్జుల వ్యవహారశైలిపైనే ప్రధానంగా ఈ సమావేశంలో చర్చించారని చెబుతున్నారు. సంజయ్ ఏకపక్ష ధోరణితో వెళ్తున్న ఒంటెత్తు పోకడల కారణంగా పార్టీ నష్టపోతోందని, ఈ విషయాన్ని ఎన్నిసార్లు పార్టీ ఇన్‌చార్జుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదని, బయటి నుంచి వచ్చిన ఇన్‌చార్జులు పార్టీలో సమన్వయంతో పాటు పాత, కొత్త నేతల మధ్య సర్దుబాటుకు ప్రయత్నించకపోగా, పెత్తనం చేస్తున్నారనే అభిప్రాయం వ్యక్తమైందని తెలుస్తోంది. తన సొంత ప్రచారం, ఆధిపత్యం కోసమే బండి సంజయ్ పాకులాడుతున్నారు తప్ప పార్టీలోని సీనియర్లకు గౌరవం, కార్యక్రమాల నిర్వహణలో ప్రాధాన్యం ఇవ్వడం లేదని, జిల్లాలకు వచ్చినప్పుడు కూడా తగిన విధంగా వ్యవహరించడం లేదని ఇప్పటికే ఢిల్లీ పెద్దల దృష్టికి పలుమార్లు తీసుకువెళ్లినట్టు తెలుస్తోంది. ఈ నేపథ్యంలో నెలాఖరు వరకు పార్టీలో మార్పు వస్తుందనే ఆశతో ఎదురుచూడాలని నిర్ణయించినట్టు చెబుతున్నారు.

ఢిల్లీకి సంజయ్

కాగా, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ ఆదివారం ఢిల్లీ వెళ్లారు. పార్టీ అధిష్టానం కబురు వచ్చినందునే ఆయన ఢిల్లీ వెళ్లారని బీజేపీ వర్గాలు చెబుతున్నాయి. ప్రస్తుతం రాష్ట్ర బీజేపీలో నెలకొన్న పరిణామాల నేపథ్యంలో ఏం జరుగుతుందనే ఉత్కంఠ కూడా బీజేపీ వర్గాల్లో వ్యక్తమవుతోంది.






ఆకాశంలో అద్భుతం

- దుర్గంచెరువు వద్ద డ్రోన్ షో అదుర్స్
- పదేళ్ల ప్రగతిపై చిత్రాల ప్రదర్శన

తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన దశాబ్ద కాలంలో చేపట్టిన ప్రగతిపై ఆకాశంలో డ్రోన్లతో ప్రదర్శన కనువిందు చేసింది. మాదాపూర్‌లోని దుర్గంచెరువు వద్ద సైబరాబాద్ పోలీసుల ఆధ్వర్యంలో ఆదివారం రాత్రి ఈ కార్యక్రమం నిర్వహించారు. పదిహేను నిమిషాల పాటు డ్రోన్లతో దుర్గంచెరువుపై ఆకాశంలో ఈ ప్రదర్శన సాగింది. 2014-2023 వరకు తెలంగాణ రాష్ట్రంలో జరిగిన అభివృద్ధిని వివరించారు. అమరదీపం, భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహం, సీఎం కేసీఆర్ చిత్రాలతో కూడిన ప్రదర్శన విశేషంగా ఆకట్టుకుంది. దీంతోపాటు దేశంలోనే శాంతి భద్రతలను కాపాడడంలో తెలంగాణ రాష్ట్ర పోలీసుల ప్రతిభను కూడా ప్రదర్శించారు. ఇటీవల ప్రారంభించిన సచివాలయం, యాదాద్రి ఆలయ అభివృద్ధి పనులు, కాళేశ్వరం ప్రాజెక్టు, దేశంలోనే అతిపెద్ద ఇంక్యుబేషన్ సెంటర్ టీ హబ్, మిషన్ భగీరథ ద్వారా ఇంటింటికీ నల్లా, రాష్ట్రంలో ప్రత్యేకతను చాటుకున్న పోలీస్ కమాండ్ కంట్రోల్ టవర్స్, మహిళల భద్రత కోసం ఏర్పాటు చేసిన షీటీమ్స్ ప్రగతిని డ్రోన్ల ద్వారా చిత్రాలతో కూడిన ప్రదర్శన కూడా విశేషంగా అలరించింది. ప్రదర్శన ముగిసే వరకు సైబరాబాద్ పోలీసులు ట్రాఫిక్‌ను మళ్లించారు. అందరూ ఆసక్తిగా ఈ దృశ్యాన్ని తమ సెల్‌ఫోన్లలో బంధించారు. ప్రదర్శనను మంత్రులు మల్లారెడ్డి, మహమూద్ అలీ, సీఎం కేసీఆర్ మనవడు, మంత్రి కేటీఆర్ కుమారుడు హిమాన్షు, చేవెళ్ల పార్లమెంటు సభ్యుడు డాక్టర్ రంజిత్ రెడ్డి, ఎమ్మెల్యేలు ఆరెకపూడి గాంధీ, వివేకానంద, ఎమ్మెల్సీ నవీన్‌రావులు, సైబరాబాద్ పోలీసు అధికారులు, సిబ్బంది ఆసక్తిగా తిలకించారు.

– గచ్చిబౌలి (హైదరాబాద్)



క్లుప్తంగా...

రేపు టాయ్స్‌పార్కుకు భూమిపూజ



చౌటుప్పల్: తెలంగాణ రాష్ట్రానికే తలమానికంగా ఉన్న యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ మండలం దండుమల్కాపురం గ్రామంలోని గ్రీన్ ఇండస్ట్రియల్ పార్కులో మరో ప్రతిష్టాత్మకమైన ప్రాజెక్టు అందుబాటులోకి రానుంది. ఇండస్ట్రియల్ పార్కులో రూ.156కోట్ల పెట్టుబడితో టాయ్స్ పార్కు ఏర్పాటు చేయనున్నారు. దీన్ని ఈనెల 6న పరిశ్రమల మంత్రి కేటీఆర్ భూమి పూజ చేయనున్నారు. 12 మంది యూనిట్ దారులకు పట్టా, నిర్మాణ అనుమతి పత్రాలను అందించనున్నారు. ఈ పార్కు ఏర్పాటు ద్వారా ప్రత్యక్షంగా 10 వేలు, పరోక్షంగా 30 వేల మందికి ఉపాధి లభించనుంది. సైన్స్ అండ్ టెక్నాలజీ, ఉడెన్, సాఫ్ట్, ఎలక్ట్రానిక్, రోబోటిక్, ప్లాస్టిక్, నిర్మల్ బొమ్మలు, కొండపల్లి బొమ్మలు, టెడ్డీ బియర్స్, మట్టిబొమ్మలు ఇక్కడ తయారు కానున్నాయి.

నేడు టీఎస్ ఐసెట్ ప్రిలిమినరీ కీ విడుదల

- 6 నుంచి 8 వరకు అభ్యంతరాల స్వీకరణ
- 20న టీఎస్ఐసెట్ ఫైనల్ కీ, ఫలితాలు

కేయూ క్యాంపస్: రాష్ట్రంలో ఎంబీఏ, ఎంసీఏ కోర్సుల్లో 2023-24 విద్యాసంవత్సరం ప్రవేశాలకు ఈనెల 26, 27 తేదీల్లో నిర్వహించిన టీఎస్ఐసెట్ పరీక్ష ప్రిలిమినరీ కీని జూన్ 5న విడుదల చేస్తారని టీఎస్ఐసెట్ కన్వీనర్, కాకతీయ యూనివర్సిటీ కామర్స్ అండ్ బిజినెస్ మేనేజ్‌మెంట్ కళాశాల ప్రొఫెసర్ పి.వరలక్ష్మి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యార్థులు ప్రశ్నపత్రంతోపాటు ప్రిలిమినరీ కీని సంబంధిత వెబ్‌సైట్ హెచ్‌టీటీపీఎస్//ఐసెట్.టీఎస్‌సీహెచ్ఈ.ఏసీ.ఇన్‌లో చూసుకోవచ్చని పేర్కొన్నారు. అభ్యంతరాలుంటే ఈనెల 6 నుంచి 8వ తేదీ సాయంత్రం 5 గంటల వరకు కన్వీనర్.ఐసెట్ ఎట్‌ది రేట్ టీఎస్‌సీహెచ్ఈ.ఏసీ.ఇన్‌కు మెయిల్ చేయాలని సూచించారు. ఈనెల 20న ఫైనల్ కీ తోపాటు టీఎస్ఐసెట్ ఫలితాలను విడుదల చేస్తామని వెల్లడించారు.

అన్ని వర్గాల సంక్షేమమే ధ్యేయం: తలసాని



జైన్ భవన నిర్మాణానికి భూమి పూజ నిర్వహిస్తున్న మంత్రి తలసాని తదితరులు

ఉప్పల్ (హైదరాబాద్): తెలంగాణ ప్రభుత్వం అన్ని వర్గాల ప్రజల అభివృద్ధి, సంక్షేమానికి కృషి చేస్తోందని పశు సంవర్ధక, మత్స్య, పాడి పరిశ్రమల మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ చెప్పారు. ఉప్పల్ భగాయత్‌లో జైన్ భవన్ కోసం కేటాయించిన రెండు ఎకరాల స్థలంలో భవన నిర్మాణ పనులకు మంత్రి తలసాని, ఎమ్మెల్యేలు సుధీర్‌రెడ్డి, బేతి సుభాష్ రెడ్డిలతో కలిసి భూమి పూజ నిర్వహించి శంకుస్థాపన చేశారు. అనంతరం రూ.10 లక్షల ఆర్థిక సహాయాన్ని ప్రకటించారు. తెలంగాణ ప్రభుత్వం రూ.100 కోట్ల విలువైన 2ఎకరాల స్థలాన్ని జైన్ భవనానికి కేటాయించిందని తలసాని స్పష్టం చేశారు.

బీసీలకు 52% టికెట్లు ఇవ్వాలి: జాజుల



భువనగిరిటౌన్: వచ్చే ఎన్నికల్లో ఏ రాజకీయ పార్టీ అయినా బీసీలకు జనాభా దామాషా ప్రకారం 52% టికెట్లు ఇవ్వాల్సిందేనని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్ డిమాండ్ చేశారు. ఆదివారం యాదాద్రి భువనగిరి జిల్లా భువనగిరిలో విలేకరులతో ఆయన మాట్లాడుతూ...రాష్ట్రంలోని అన్ని రాజకీయ పార్టీలు ముఖ్యమంత్రిగా బీసీ అభ్యర్థిని ప్రకటించాలని డిమాండ్ చేశారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అధికారంలోకి వచ్చి తొమ్మిదేళ్లు దాటినా బీసీల సమస్యలు, సంక్షేమ పథకాల గురించి ఆలోచించకపోవడం బాధాకరమన్నారు. మీడియా సమావేశంలో నరసింహస్వామి, అశోక్, లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

వచ్చే ఐదేళ్లలో రూ.14,130 కోట్లు!

ఖర్చు చేయనున్న తెలంగాణ జెన్‌కో

- 2024-29 పంచవర్ష ప్రణాళిక విడుదల
- యాదాద్రి ప్లాంట్‌పై రూ.9,571 కోట్లు
- భద్రాద్రిపై రూ.641 కోట్ల వ్యయం
- అన్ని థర్మల్ విద్యుత్ కేంద్రాలకు ఎఫ్‌జీడీల ఏర్పాటు



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలోని థర్మల్, హైడల్ విద్యుత్ కేంద్రాలపై తెలంగాణ విద్యుదుత్పత్తి సంస్థ (జెన్‌కో) రానున్న ఐదేళ్లలో రూ.14,130.37 కోట్లు ఖర్చు చేయనుంది. నిర్మాణంలోని కొత్త థర్మల్ విద్యుత్ కేంద్రాల పూర్తికి, ఇప్పటికే వినియోగంలో ఉన్న థర్మల్, హైడల్ విద్యుత్ కేంద్రాల నిర్వహణ, మరమ్మతులకు ఈ మేరకు వ్యయం చేయనుంది. రాష్ట్ర విద్యుత్ నియంత్రణ మండలి (ఈఆర్సీ)కి తాజాగా సమర్పించిన 2024-29 పంచవర్ష పెట్టుబడి ప్రణాళికలో ఈ విషయాన్ని జెన్‌కో వెల్లడించింది. వచ్చే ఐదేళ్లలో మొత్తం 2,83,836.08 మిలియన్ యూనిట్ల (ఎంయూ) థర్మల్ విద్యుత్, 16,112.84 ఎంయూల జల విద్యుత్‌ను ఉత్పత్తి చేయనున్నట్లు అంచనా వేసింది. జెన్‌కో ప్రతిపాదనలపై ఈ నెల 15 వరకు సలహాలు, సూచనలను ఈఆర్సీ ఆహ్వానించింది. జూలై 5న ఉదయం 11 గంటలకు రెడ్‌హిల్స్‌లోని తమ కార్యాలయంలో బహిరంగ విచారణ నిర్వహించనున్నట్టు ప్రకటించింది. అనంతరం జెన్‌కో సమర్పించిన పెట్టుబడి వ్యయ ప్రణాళికలకు ఆమోదం తెలిపే అంశంపై నిర్ణయం తీసుకోనుంది.

ఎఫ్‌జీడీలు తప్పనిసరి

థర్మల్ విద్యుత్ కేంద్రాల నుంచి వెలువడే సల్ఫర్ డై ఆక్సైడ్, నైట్రోజన్ ఆక్సైడ్, మెర్క్యూరీ వంటి విష వాయువుల కట్టడికి ఫ్లూ-గ్యాస్ డిసల్ఫ్యూరిజేషన్ (ఎఫ్‌జీడీ) ప్లాంట్లను తప్పనిసరిగా నిర్మించాలని 2015లో కేంద్ర పర్యావరణ మంత్రిత్వ శాఖ మార్గదర్శకాలు జారీ చేసింది. ఈ నేపథ్యంలో కేటీపీఎస్ 5, 6వ దశల యూనిట్లకు రూ.1,231.04 కోట్లు, కేటీపీపీ 1, 2 దశల యూనిట్లకు రూ.1,325.75 కోట్ల అంచనాలతో ఎఫ్‌జీడీ ప్లాంట్లను నిర్మించనున్నట్టు జెన్‌కో తెలిపింది. కొత్తగా నిర్మించిన కేటీపీఎస్ 7వ దశ, భద్రాద్రి థర్మల్ కేంద్రాలతో పాటు నిర్మాణంలోని యాదాద్రి థర్మల్ విద్యుత్ కేంద్రాలకు ఎఫ్‌జీడీల ప్లాంట్లను ఏర్పాటు చేసే పనులను ఇప్పటికే బీహెచ్ఈఎల్‌కు అప్పగించారు.

మణుగూరు, పాల్వంచల్లో భారీ టౌన్‌షిప్‌లు

మణుగూరు, పాల్వంచ పట్టణాల్లో తమ సిబ్బంది అవసరాలకు ఈపీసీ విధానంలో సమీకృత టౌన్‌షిప్‌లను జెన్‌కో నిర్మించనుంది. మణుగూరులోని భద్రాద్రి థర్మల్ విద్యుత్ కేంద్రం వద్ద రూ.635.63 కోట్లతో ఇంటిగ్రేటెడ్ టౌన్‌షిప్ నిర్మించనుంది. అందులో బహుళ అంతస్తుల నివాస క్వార్టర్లు, ఆస్పత్రి భవనం, పాఠశాల భవనం, క్లబ్ హౌస్, అతిథి గృహం, ఇండోర్ స్టేడియం, ఆడిటోరియం, స్టోర్స్ కాంప్లెక్స్, సెక్యూరిటీ ఆఫీస్ బిల్డింగ్, స్టోరేజీ షెడ్, రోడ్లు, డ్రైన్లు, ప్రహరీ గోడల వంటి నిర్మాణాలు ఉండనున్నాయి. కొత్తగూడెం పాల్వంచలోని కేటీపీఎస్ 7వ దశ థర్మల్ విద్యుత్ కేంద్రం వద్ద రూ.524 కోట్లతో బహుళ అంతస్తుల రెసిడెన్షియల్ క్వార్టర్లను జెన్‌కో నిర్మించనుంది.

2024-29 మధ్యకాలంలో థర్మల్ విద్యుత్ కేంద్రాలపై జెన్‌కో పెట్టనున్న పెట్టుబడి వ్యయం, వీటి ద్వారా ఐదేళ్లలో జరగనున్న మొత్తం విద్యుదుత్పత్తిని ఈ కింది పట్టికలో చూడవచ్చు..

విద్యుత్ కేంద్రం	సామర్థ్యం (మెగావాట్లలో)	పెట్టుబడి వ్యయం (రూ.కోట్లలో)	విద్యుదుత్పత్తి (ఎంయూల్లో)
యాదాద్రి థర్మల్ విద్యుత్ కేంద్రం	4,000	9571.66	1,37,953.49
భద్రాద్రి థర్మల్ విద్యుత్ కేంద్రం	1,080	641.18	40,245.6
కేటీపీపీ తొలి దశ	500	673.57	17,569.2
కేటీపీపీ రెండో దశ	600	795.42	21,072.24
కేటీపీఎస్ 5వ దశ	500	696.82	17,564.7
కేటీపీఎస్ 6వ దశ	500	652.02	17,555.58
కేటీపీఎస్ 7వ దశ	800	722.76	2,9812.8
రామగుండం బీ(ఆర్టీఎస్-బీ)	62.5	52.63	2,062.48

లింగాయత్‌లను ఓబీసీల్లో చేర్చేందుకు కృషి

కేంద్రమంత్రులు కిషన్‌రెడ్డి, భగవంతరావు



కార్యక్రమంలో మాట్లాడుతున్న మాణిక్‌రావు ఠాక్రే

గన్‌ఫౌండ్రీ: వీరశైవ లింగాయత్‌లను ఓబీసీ జాబితాలో చేర్చే విషయాన్ని ప్రధాని మోదీ దృష్టికి తీసుకువెళ్తామని కేంద్ర మంత్రులు జి.కిషన్‌రెడ్డి, భగవంతరావు కూబలు తెలిపారు. నాంపల్లి ఎగ్జిబిషన్ మైదానంలో రాష్ట్ర వీరశైవ లింగాయత్ లింగ బలిజ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం లింగాయత్ మహార్యాలీని నిర్వహించారు. దీనికి హాజరైన మంత్రులు మాట్లాడుతూ... లింగాయత్‌లందరూ ఐక్యంగా ఉండాలని అప్పుడే సమస్యల పరిష్కారం సాధ్యమవుతుందన్నారు. కాంగ్రెస్ పార్టీ తెలంగాణ రాష్ట్ర ఇన్‌చార్జ్ మాణిక్‌రావ్ ఠాక్రే మాట్లాడుతూ... కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన వెంటనే లింగాయత్‌ల సమస్యలను పరిష్కరిస్తామని హామీనిచ్చారు. రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య మాట్లాడుతూ లింగాయత్‌లను ఓబీసీ జాబితాలో చేర్చేంత వరకు పోరాటం చేస్తామన్నారు. సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఈశ్వరప్ప, మాజీ ఎంపీ సురేష్ షెట్కర్, సంగీత నాటక అకాడమీ మాజీ చైర్మన్ బి.శివకుమార్, వీరశైవ లింగాయత్ గౌరవ అధ్యక్షులు పటోళ్ల సంగమేశ్వర్, శంకరప్ప పటేల్ తదితరులు పాల్గొన్నారు.

జనగామ డీసీహెచ్ఎస్ డాక్టర్ సుగుణాకర్‌రాజుపై ఎన్ఎంసీ వేటు

- మెడికల్ కౌన్సిల్ రిజిస్టర్ నుంచి పేరు తొలగింపు
- ఆరు నెలలపాటు మెడికల్ ప్రాక్టీస్ చేయకూడదని ఉత్తర్వులు



సుగుణాకర్ రాజు

సాక్షి, హైదరాబాద్: ఓ పోలీసు కేసు కోసం ఒక మహిళకు తప్పుడు ధ్రువీకరణ పత్రం ఇచ్చిన వ్యవహారంలో సదరు బాధితుడి ఫిర్యాదు మేరకు జాతీయ వైద్య కమిషన్ (ఎన్ఎంసీ) పరిధిలోని ఎథిక్స్ అండ్ మెడికల్ రిజిస్ట్రేషన్ బోర్డు (ఈఎంఆర్‌డీ) చేపట్టిన చర్యల్లో భాగంగా డాక్టర్ సుగుణాకర్ రాజుపై వేటు పడింది. వైద్య విధాన పరిషత్ పరిధిలోని జనగామ డిస్ట్రిక్ట్ కో ఆర్డినేటర్ ఆఫ్ హాస్పిటల్ సర్వీసెస్ (డీసీహెచ్ఎస్) డాక్టర్ సుగుణాకర్ రాజు పేరును ఇండియన్ మెడికల్ రిజిస్టర్ నుంచి అదేవిధంగా తెలంగాణ మెడికల్ కౌన్సిల్ నుంచి కూడా పేరును తొలగించాలని నిర్ణయించింది. ఆరు నెలలపాటు ఈ నిర్ణయం అమలవుతుంది. తాజా నిర్ణయంతో సుగుణాకర్ ఆరు నెలల వరకు ఎలాంటి మెడికల్ ప్రాక్టీస్ చేయకూడదు. ఆయన జిల్లాలో వైద్య విధాన పరిషత్ ఆసుపత్రులకు అధికారిగా ఉన్నందున ఈ నిర్ణయంతో ఆ పోస్టు నుంచి కూడా తొలగించే అవకాశం ఉన్నట్లు చెబుతున్నారు.

ఇదీ జరిగింది...

చెన్నై ఓఎన్‌జీసీ శాస్త్రవేత్తగా పనిచేసే పాండుగుల దామోదర్ జనగామ డీఎస్పీగా పనిచేసిన నాగరాజు కుమార్తెను వివాహం చేసుకున్నారు. అయితే భార్యాభర్తల మధ్య వచ్చిన గొడవలతో తన భర్త కడుపులో తన్నడంతో గర్భస్రావం అయినట్టు ఆమె వరంగల్ మహిళా పోలీస్ స్టేషన్‌లో కేసు పెట్టింది. దీనిని నిర్ధారిస్తూ జనగామకు చెందిన డాక్టర్ సుగుణాకర్ మెడికల్ రిపోర్ట్ ఇవ్వడంతో దామోదర్ ఉద్యోగం పోయి జైలు పాలయ్యారు. కాగా, దామోదర్ తండ్రి ఆ మానసిక క్షోభతో చనిపోయారు. సుగుణాకర్ తప్పుడు రిపోర్ట్ ఇవ్వడం వల్లే తమ కుటుంబం ఆగమయిందని, ఆయనపై చర్యలు తీసుకోవాలని వైద్య విధాన పరిషత్ అధికారులు, ఆంధ్ర, తెలంగాణ మెడికల్ కౌన్సిల్ అధికారులకు దామోదర్ ఫిర్యాదు చేశారు. ఈ కేసును విచారించిన ఎన్ఎంసీ వాస్తవాలను నిర్ధారించుకుని సుగుణాకర్‌పై వేటు వేసింది.

వైద్యంలో రాజకీయాలొద్దు

- వైద్య మౌలిక సదుపాయాలకు రూ. 64,000 కోట్లు ఖర్చు చేస్తున్నాం
- మీడియాతో కేంద్ర ఆరోగ్య మంత్రి మన్‌సుఖ్ మాండవీయ



సాక్షి, హైదరాబాద్: పేదలకు మెరుగైన వైద్యం అందించడంకోసం రాజకీయాలకతీతంగా అన్ని పార్టీలు ముందుకు రావాలని కేంద్ర ఆరోగ్య శాఖ మంత్రి మన్‌సుఖ్ మాండవీయ కోరారు. రాష్ట్రాల్లో ఏ పార్టీ అధికారంలో ఉన్నా, వివక్ష చూపకుండా వైద్య మౌలిక సదుపాయాల కల్పన కోసం కేంద్రం రూ. 64 వేల కోట్ల నిధులు ఖర్చు చేస్తున్నట్టు ఆయన తెలిపారు. దేశంలోని 750 జిల్లాల్లో ప్రత్యేక లేబొరెటరీలను ఏర్పాటు చేస్తున్నట్లు వెల్లడించారు. జీ20 సదస్సులో పాల్గొనడానికి వచ్చిన ఆయన మీడియా ప్రతినిధులతో ఇష్టాగోష్టిగా మాట్లాడారు. ''కోవిడ్ ఎన్నో విషయాలను నేర్పింది. అన్ని జిల్లా కేంద్రాల్లో వెంటిలేటర్, ల్యాబొరేటరీల తోపాటు కనీసం వంద పడకల ఆస్పత్రి నిర్మాణం లక్ష్యంగా ముందుకు సాగుతున్నాం. వైద్యం మా పరిధిలోనిది కాకపోయినా కేంద్రం 60 శాతం నిధులను రాష్ట్రాలకు సమకూరుస్తోంది. పేదలకు మెరుగైన వైద్య సేవలు అందించడానికి రాష్ట్ర ప్రభుత్వాలు కృషి చేయాలి. రెండు దశల్లో మొత్తం 157 వైద్య కళాశాలలు మంజూరు చేశాం. ఇందులో 98 వైద్య కళాశాలలు, ఆసుపత్రులు నిర్మాణం పూర్తయి వాడుకలోకి వచ్చాయి. మూడో దశ కళాశాలల నిర్మాణానికి ప్రధాని సుముఖత వ్యక్తం చేశారు''అని మంత్రి తెలిపారు. తెలంగాణకు ఒక్క వైద్య కళాశాలా మంజూరు చేయలేదన్న విమర్శలను విలేకరులు ప్రస్తావించగా.. ''రాజస్తాన్ ప్రభుత్వం ముందస్తుగా దరఖాస్తు చేసుకుంది. ఫస్ట్ కం ఫస్ట్ ప్రాతిపదికన ఆ రాష్ట్రంలోని అన్ని జిల్లాలకు వైద్య కళాశాల మంజూరయ్యాయి. వైద్య సదుపాయాలను మెరుగుపరచడానికి రాష్ట్ర ప్రభుత్వాలు సవివర నివేదికలను సమర్పిస్తే.. వాటికనుగుణంగా, జనాభా ప్రాతిపదికన నిధులు మంజూరు చేస్తున్నాం''అని మాండవీయ వెల్లడించారు. కేంద్రం ఏర్పాటు చేసిన హెల్త్ అండ్ వెల్నెస్ సెంటర్ల పేర్లను రాష్ట్ర ప్రభుత్వాలు మార్చడంపై మంత్రి అసంతృప్తి వ్యక్తం చేశారు. ఇలా చేస్తే కేంద్రం నిధులు నిలిపివేయాల్సి వస్తుందని హెచ్చరించారు. ఫ్యాకల్టీపై ప్రత్యేక దృష్టి పెట్టామని, రెండు, మూడేళ్లలో సమస్య తీరుతుందన్నారు. వృత్తి నిపుణుల కోసం అధిక ప్రాధాన్యత ఇస్తూ సీట్ల సంఖ్యను పెంచుతున్నామని మంత్రి వివరించారు.

ఉర్దూ వర్సిటీలో ప్రవేశ పరీక్షల షెడ్యూల్ విడుదల

ఈ నెల 20, 21, 22 తేదీల్లో నిర్వహణ

రాయదుర్గం: మౌలానా ఆజాద్ జాతీయ ఉర్దూ విశ్వవిద్యాలయంలో ప్రవేశ ఆధారిత కోర్సుల్లో ప్రవేశానికి నిర్వహించే ప్రవేశ పరీక్షల షెడ్యూల్‌ను విడుదల చేశారు. ఈ ప్రవేశ ఆధారిత రెగ్యులర్ కోర్సుల కోసం ప్రవేశ పరీక్షలను జూన్ 20, 21, 22 తేదీల్లో మూడు రోజులపాటు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. దరఖాస్తు ఫారాలను ఆన్‌లైన్‌లో సమర్పించడానికి గడువు జూన్ 6వ తేదీగా ప్రకటించారు. ఆన్‌లైన్ దరఖాస్తుతోపాటు ఈ-ప్రాస్పెక్టస్ విశ్వవిద్యాలయం వెబ్‌సైట్ manuu.edu.inలో అందుబాటులో ఉన్నాయని అధికారులు పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు 6207728673, 9866802414, 6302738370 ఫోన్ నంబర్లలో సంప్రదించాలని సూచించారు. విశ్వవిద్యాలయంలో మెరిట్ ఆధారిత పోస్టు గ్రాడ్యుయేట్, పోస్టుగ్రాడ్యుయేట్ డిప్లొమో, సర్టిఫికెట్ కోర్సులలో ప్రవేశాలను జూలై 24 నుంచి ప్రారంభించాలని నిర్ణయించారు.

16 లక్షల పోస్టులు భర్తీ చేయండి: ఆర్.కృష్ణయ్య



సాక్షి, హైదరాబాద్: కేంద్రంలోని 72 ప్రభుత్వ శాఖలు, 245 ప్రభుత్వ రంగ సంస్థల్లో ఖాళీగా ఉన్న 16 లక్షల ఉద్యోగాలను వెంటనే భర్తీ చేయాలని వైఎస్సార్‌సీపీ ఎంపీ (రాజ్యసభ), జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆదివారం ప్రధాని మోదీకి ఆయన లేఖ రాశారు. రైల్వేలో 2.37లక్షలు, రక్షణ శాఖలో 2.27లక్షలు, హోంశాఖలో 1.28లక్షలకు పైగా ఖాళీలున్నాయని, పోస్టల్ శాఖలో 90 వేలకు పైగా, రెవెన్యూ శాఖలో 76వేలకు పైగా ఖాళీలున్నాయని, సైన్స్ అండ్ టెక్నాలజీ, గనులు, జలవనరులు, ఆరోగ్య తదితర శాఖల్లో కలిపి 9 లక్షలకు పైగా ఖాళీలున్నాయని, ఇదే విషయాన్ని పార్లమెంటులో తాను అడిగిన ప్రశ్నకు లిఖితపూర్వక సమాధానం ఇచ్చారని ఆ లేఖలో వెల్లడించారు. వీటితో పాటు మరో 6లక్షలకు పైగా ఖాళీలున్నాయని తెలిపారు.



ఆరోగ్యాధారిత వ్యవస్థలు బలోపేతం కావాలి

కేంద్ర ఆరోగ్య శాఖ సహాయ మంత్రి డాక్టర్ భారతి ప్రవీణ్ పవార్



ప్రసంగిస్తున్న ఆరోగ్యశాఖ సహాయ మంత్రి భారతి ప్రవీణ్ పవార్. చిత్రంలో కిషన్‌రెడ్డి తదితరులు

సాక్షి, హైదరాబాద్: 'రానున్న ఆరోగ్య విపత్తులను ఎదుర్కొనేందుకు అంతర్జాతీయంగా ఆరోగ్యాధారిత వ్యవస్థలను ఏకీకృతం, బలోపేతం చేయడం తక్షణ అవసరం' అని కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ సహాయ మంత్రి డాక్టర్ భారతి ప్రవీణ్ పవార్ అభిప్రాయపడ్డారు. జీ20 ఇండియా ప్రెసిడెన్సీ ఆధ్వర్యంలో నగరంలోని ఓ హోటల్‌లో జరిగిన 3వ హెల్త్ వర్కింగ్ గ్రూప్ సమావేశంలో ఆమె ముఖ్య అతిథిగా ప్రసంగించారు. ప్రాథమిక ఆరోగ్యాన్ని మూలస్తంభంగా ఉంచి, బలమైన ఆరోగ్య వ్యవస్థలను రూపొందించడంపై మనం దృష్టి పెట్టాల్సి ఉందన్నారు. అంతర్జాతీయంగా అనుసంధానించిన నెట్‌వర్క్, ఎకో సిస్టమ్‌ను సృష్టించే దిశగా కొనసాగుతున్న ప్రయత్నాలను బలోపేతం చేయాలని ఆమె ఈ సందర్భంగా జీ 20 దేశాలను కోరారు. దానికి ఇది అనువైన సమయంగా పేర్కొన్నారు. డిజిటల్ హెల్త్ పై అంతర్జాతీయ కార్యక్రమ ఏర్పాటుకు భారత్ చేసిన ప్రతిపాదనను ఆమె ఈ సందర్భంగా ప్రతినిధుల దృష్టికి తెచ్చారు. ఇది దేశాల మధ్య డిజిటల్ వైరుధ్యాలను తగ్గించడానికి సాంకేతికత ఫలాలు ప్రపంచంలోని ప్రతి వ్యక్తికీ అందుబాటులో ఉండేలా చూసేందుకు వీలు కలిగిస్తుందని ఆమె అభిప్రాయపడ్డారు.

ప్రపంచపు ఫార్మసీ భారత్: కిషన్‌రెడ్డి

కేంద్ర పర్యాటక శాఖ మంత్రి జి.కిషన్‌రెడ్డి మాట్లాడుతూ ఆరోగ్యం, వెల్‌నెస్‌ల కోసం అత్యధికులు ఎంచుకుంటున్న 10 అగ్రగామి దేశాల్లో భారత్ ఒకటిగా ఉందన్నారు. ప్రపంచపు ఫార్మసీగా మన దేశాన్ని అభివర్ణించిన ఆయన...మొత్తం ప్రపంచంలోని వ్యాక్సిన్లలో 33శాతం హైదరాబాద్‌లోని ఒక్క జీనోమ్ వ్యాలీ ద్వారానే ఉత్పత్తి అవుతోందని చెప్పారు. వచ్చే 2030కల్లా అందరికీ ఆరోగ్యం అనే లక్ష్యాన్ని చేరుకునే విషయంలో మన దేశం కృత నిశ్చయంతో ఉందన్నారు.

స్థిరమైన ఆరోగ్య వ్యవస్థ ద్వారానే బలమైన ఆర్థిక వ్యవస్థ: కేంద్రమంత్రి బాఘెల్

కేంద్ర మంత్రి ప్రొఫెసర్ ఎస్పీ సింగ్ బాఘెల్ మాట్లాడుతూ స్థిరమైన ఆరోగ్య వ్యవస్థ ద్వారా మాత్రమే స్థిరమైన ఆర్థిక వ్యవస్థను నిర్మించగలమని వ్యాఖ్యానించారు. ఇదే విషయాన్ని ఇటీవలి కోవిడ్ 19 మహమ్మారి నేర్పిందని గుర్తు చేశారు. అందరికీ అత్యుత్తమ ఆరోగ్య సౌకర్యాలు, వ్యాక్సిన్‌లు, థెరప్యూటిక్స్, డయాగ్నస్టిక్‌లను జీ20 వేదిక ద్వారా అందించడం భారత్ లక్ష్యంగా పేర్కొన్నారు. కార్యక్రమంలో కేంద్ర ఆరోగ్య కార్యదర్శి రాజేష్ భూషణ్, నీతి అయోగ్ సభ్యులు డా.వి.కె.పాల్, ఐసీఎంఆర్ డీజీ, డిపార్ట్‌మెంట్ ఆఫ్ హెల్త్ రీసెర్చ్ సెక్రటరీ డాక్టర్ రాజీవ్ బహ్ల్, విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ అదనపు కార్యదర్శి అభయ్ ఠాకూర్, ఆరోగ్య కుటుంబ సంక్షేమ మంత్రిత్వ శాఖ అదనపు కార్యదర్శి లవ్ అగర్వాల్, ఆరోగ్య మంత్రిత్వ శాఖ అదనపు కార్యదర్శి హెకాలీ జిమోమి, జీ20 దేశాల ప్రతినిధులు, వైద్యరంగ ప్రముఖులు పాల్గొన్నారు.



మంచివాళ్లకు ఎలా బాధ్యతగా ప్రవర్తించాలో చెప్పడానికి చట్టాలు అక్కర్లేదు. అదే సమయంలో చెడ్డవాళ్లు ఆ చట్టాల్లోని లొసుగులను దొరికించుకుంటారు.
– ప్లేటో

సాక్షి
సోమవారం, 5 జూన్ 2023

రైలు పుస్తకం

ఈ దేశానికి స్వాతంత్ర్యం రైలు వల్లే వచ్చిందంటే ఉలిక్కిపడవలసిన అవసరం లేదు. జూన్ 7, 1893 రాత్రి– సౌత్ ఆఫ్రికా డర్బన్ నుంచి ప్రెటోరియాకు గాంధీ ప్రయాణిస్తున్నప్పుడు, ఆయన దగ్గర మొదటి తరగతి టికెట్ ఉన్నా, అది 'వైట్స్ ఓన్లీ క్యారేజ్' కావడాన పీటర్‌మారిట్జ్‌బర్గ్ అనే చిన్న స్టేషన్‌లో కిందకు ఈడ్చేశారు. వివక్షతో కూడిన ఆధిపత్యం ఎంతటి క్రూరమైనదో గాంధీకి అవగాహన వచ్చిన సందర్భం అది. భారతదేశం వచ్చాక ఇక్కడ బ్రిటిష్‌వారి పాలనలో అంతకన్నా ఘోరమైన వివక్షను, ఆధిపత్యాన్ని దేశ జనులు అనుభవిస్తున్నారని ఆయనకు తెలియచేసింది రైలే. 'మూడవ తరగతి పెట్టెల్లో విస్తృతంగా తిరిగాక ఈ దేశమంటే ఏమిటో అర్థమైంది' అని ఆయన చెప్పుకున్నాడు. తర్వాత స్వాతంత్ర్య సంకల్పం తీసుకున్నాడు. నిజానికి గాంధీ రైలు ప్రయాణాలే జనం చెప్పుకుంటారుగాని నెహ్రూ కూడా 'నేను ఈ దేశాన్ని రైలులో తిరగడం ద్వారానే ఆకళింపు చేసుకున్నాను' అని 'డిస్కవరీ ఆఫ్ ఇండియా'లో రాసుకున్నాడు.

'గవర్నర్ జనరల్ ఆఫ్ ఇండియా'గా వాసికెక్కిన లార్డ్ డల్హౌసీ బ్రిటిష్ రాజ్యం, పాలన బలపడాలంటే భారతదేశంలో రైళ్ల వ్యవస్థ సమర్థంగా విస్తరించాలని భావించాడు. అయితే డల్హౌసీ ఒకటి తలిస్తే దేశ జనులు మరొకటి తలిచారు. ఏనాడు కనని, వినని ప్రాంతాలను రైలు ద్వారా సగటు భారతీయుడు తెలుసుకున్నాడు. బహు జాతులతో, సంస్కృతులతో సంపర్కంలోకి వచ్చాడు. అలా మనదంతా ఒక జాతి, 'భారత జాతి' అనే భావన పాదుకొనడానికి, అందరూ ఏకమై బ్రిటిష్ వారిపై పోరాడటానికి మొదటి భూమికను ఏర్పరించింది ఈ దేశంలో రైలే.

'భారతీయులు తమ పల్లెటూళ్లను రైల్వేస్టేషన్ లోకి తీసుకొస్తారు. పల్లెల్లో వాళ్ల ఇళ్లల్లోకి రానీయకపోవచ్చు. కాని పల్లె స్వభావం మొత్తం స్టేషన్‌లో ప్రదర్శనకు పెడతారు' అని అమెరికన్ ట్రావెల్ రైటర్ పాల్ థెరూ 'ది గ్రేట్ రైల్వే బజార్' (1975) పుస్తకంలో రాశాడు. నిజమే. గడ్డి మోపులు, ధాన్యం బస్తాలు, కోళ్ల గంపలు, కుండలు, గిన్నెలు, కట్టెలు, పాల క్యాన్లు, సైకిళ్లు, పనిముట్లు, అరుపులు, కేకలు, అక్కరలు, మక్కువలు... వారు స్టేషన్‌కు తేనిది ఏమిటి? బండి ఎక్కించనిది ఏమిటి? 'భారతదేశంలో రైలు కంపార్ట్‌మెంట్ అంటే ఇల్లే. అందులో ప్రతి ఒక్క ఇంటి సభ్యుణ్ణి చూడొచ్చు. రైలులో వారు అక్క, తమ్ముడు, అమ్మ, నాన్నలుగానే ఎక్కువగా ప్రయాణిస్తారు. ప్రయాణికులుగా తక్కువగా మారుతారు' అని మరొక పాశ్చాత్య రచయిత రాశాడు.

దొరలు ఎక్కే ఈ పొగబండి జన సామాన్యానికి అందుబాటులోకి వచ్చాక కథ, కవిత, నవల, సినిమా, నాటకాల్లో దీని ప్రస్తావన లేకుండా సృజన సాగలేదు. భారతీయ రైళ్లను, వాటి కిటికీల గుండా కనిపించే దేశాన్ని మొదట రడ్‌యార్డ్ కిప్లింగ్ 'కిమ్' (1901) నవలలో రాశాడు. అయితే రైలును ఒక చారిత్రక సాక్ష్యంగా కుష్వంత్ సింగ్ మలిచాడు. మనో మజ్రా అనే చిన్న సరిహద్దు గ్రామంలో జనం ఒక ట్రైన్ ఆ ఊరి మీదుగా వెళితే నిద్ర లేస్తారు. మరో ట్రైను కూత వినిపిస్తే మధ్యాహ్నం కునుకు సమయం అని గ్రహిస్తారు. ఇంకో ట్రైన్ శబ్దం వచ్చాక రాత్రయ్యింది పడుకోవాలి అని పక్కల మీదకు చేరుతారు. 1947లోని ఒక వేసవి రోజు వరకూ వారి దినచర్య అలాగే ఉండేది. కాని ఆ రోజున వచ్చిన ఒక రైలు వారి జీవితాలను సమూలంగా మార్చేసింది. ఆ ఊరి వాళ్లు ఆ రైలు రాకతో హిందువులుగా, ముస్లింలుగా, సిక్కులుగా విడిపోయారు. ఆ తర్వాత? 'ట్రైన్ టు పాకిస్తాన్' నవల చదవాలి.

రైలు ప్రయాణాన్ని నేపథ్యంగా తీసుకుని 'గాలి వాన' అనే గొప్ప కథ రాశారు పాలగుమ్మి పద్మరాజు. మనుషుల ప్రాథమిక సంవేదనల ముందు వారు నిర్మించుకున్న అహాలు, జ్ఞానాలు, ఆస్తులు, అంతస్థులు, విలువలు గాలికి లేచిన గడ్డిపోచల్లా కొట్టుకుని పోతాయి అని చెప్పిన కథ ఇది. చాసో 'ఏలూరెళ్లాలి' కథ రైలు పెట్టెలోనే మనుగడ రహస్యాన్ని విప్పుతుంది. రైలు చుట్టూ ఎన్నో ప్రహసనాలు, పరిహాసాలు. తిలక్ రాసిన 'కవుల రైలు'లో కవులందరూ ఎక్కి కిక్కిరిసిపోతారు. పాపం ప్లాట్‌ఫారమ్ మీద ఒక యువతి మిగిలిపోతుంది. 'నీ పేరేమిటమ్మా' అంటాడు స్టేషన్ మాస్టరు. యువతి జవాబు– 'కవిత'!

'షోలే అంత పెద్ద హిట్ ఎందుకయ్యింది' అని ఎవరో అడిగితే 'రైలు వల్ల' అని సమాధానం ఇచ్చాడు అమితాబ్. 'షోలే' సినిమా రైలుతో మొదలయ్యి రైలుతో ముగుస్తుంది. అందులోని ట్రైన్ రాబరీ వంటిది ఇప్పటికీ మళ్లీ సాధ్యపడలేదు. 'సగటు ప్రేక్షకుడికి రైలు కనపడగానే కనెక్ట్ అయిపోతాడు' అని అమితాబ్ ఉద్దేశం. 'ఆరాధన'లో రైలు కిటికీ పక్కన పుస్తకం చదువుకుంటున్న షర్మిలా టాగోర్‌ను, రోడ్డు మీద జీప్‌లో పాడుకుంటూ వస్తున్న రాజేష్ ఖన్నాను మర్చిపోయామా మనం? 'దిల్‌వాలే దుల్హనియా లేజాయేంగే' క్లయిమాక్స్– కదిలిపోతున్న రైలులోని హీరోను అందుకోవడానికి హీరోయిన్ పరుగులు– సూపర్‌హిట్ ఫార్ములా!

అందుకే రైలు ఈ దేశ ప్రజల జీవనంలో అవిభాజ్యం. అంతేనా? రైలు ఈ దేశంలో ఎన్నో బరువుల, బాధ్యతల, మమతల, కలతల, కలల వాహిక. గమ్యంపై ప్రయాణికుడు పెట్టుకునే నమ్మకం. 'చేరి ఫోన్ చేస్తారు' అని కుటుంబం పెట్టుకునే భరోసా. బెర్త్‌పై నిశ్చింతగా ముసుగు తన్నే నిద్ర. దానికి దెబ్బ తగిలితే భారతీయుడు విలవిల్లాడతాడు.

'నువ్వు ఎక్కవలసిన రైలు జీవితకాలం లేటు' అన్నాడు ఆరుద్ర. మృత్యుశకటం లాంటి రైలు కంటే ఎప్పటికీ రాని రైలు మేలైనది అనిపిస్తే ఆ నేరం ఎవరిది?

విలువల్లోనూ పట్టువిడుపులు!

కామెంట్



కరణ్ థాపర్

వాజ్‌పేయిని 'భావోద్వేగాల ఒంటరితనంలో నిరాశ్రయుడైన పురుష బాలకుడి'గా అర్థం చేసుకున్నారు అభిషేక్ చౌధరి. అటల్ సంక్లిష్టమైన వ్యక్తిగత జీవితానికి అది తగిన వివరణ కాగలదా? వాజ్‌పేయిని 'విలువల్లోనూ పట్టువిడుపులు పాటించే మనిషి' అంటారాయన. 2002లో గోవాలో జరిగిన పార్టీ జాతీయ కార్యవర్గ సమావేశంలో కేంద్ర కేబినెట్ సహచరుల అభీష్టానుసారం ఆనాటి గుజరాత్ ముఖ్యమంత్రి చేత రాజీనామా చేయించలేక పోవడానికి ఈ పట్టువిడుపుల స్వభావం నుంచే మనం సమాధానాన్ని రాబట్టుకోవాలా? 'మహాత్ముడి మరణాన్ని అటల్ అస్సలేమాత్రం మానవాళికి సంభవించిన తీవ్రమైన నష్టంగా పరిగణించనే లేదు' అని చౌధరి రాశారు. అయితే యౌవనానంతర దశలో పరిణతి కలిగిన నాయకుడిగా తన పూర్వపు ధోరణికి భిన్నంగా అటల్ బిహారీ వాజ్‌పేయి మారిపోయారు.

అటల్ బిహారీ వాజ్‌పేయి గురించి మనకు తెలుసనే అనుకుంటాం. నిజంగానే మనకు తెలుసా? ఎందరికో ఆయన ఆరాధ్యులు. చాలామందికి ఆయనొక మంచి ప్రధాని కూడా. ఇక ఆయన వాగ్ధాటికైతే మంత్రముగ్ధులు కానివాళ్లెవరు! అయినప్పటికీ, ఆయనేమిటో పూర్తిగా మనకు తెలుసా? వాజ్‌పేయి ఛాయ వెనుక ఉన్న వాజ్‌పేయి గురించి మనకు తెలుసా?

ఇటీవల విడుదలైన వాజ్‌పేయి జీవిత చరిత్రలో మనకు తెలియని, మనం ఊహించని ఎన్నో అంశాలు ఉన్నాయి. అవి మాత్రమే కాదు, ఆయన గురించి కచ్చితమైనవిగా మనం ఇప్పటివరకూ భావిస్తూ వస్తున్న కొన్ని కథనాలకు రుజువులు లేవని ఆ పుస్తకం ద్వారా తెలుస్తుంది. సంప్రదాయబద్ధం కాని వాజ్‌పేయి వ్యక్తిగత జీవితాన్ని కూడా పుస్తకం స్పృశించింది. ఆయనను బాగా ఎరిగిన వాళ్లు సైతం వాజ్‌పేయిలోని ఈ అసంప్రదాయపరత్వాన్ని ఎక్కడా బయట పెట్టలేదు. తాజాగా అభిషేక్ చౌధరి రాసిన 'వాజ్‌పేయి: ది అసెంట్ ఆఫ్ ది హిందూ రైట్ 1924-1977' అనే పుస్తకంలోని విశేషాలు ఇవన్నీ. రెండు సంపుటాల ప్రయత్నంలోని మొదటి భాగం ఇది. రెండో భాగం డిసెంబరులో రానుంది.


వాజ్‌పేయి ఆహార ప్రియులనీ, విలాసజీవుడనీ మనం విన్నాం. 'భంగ్ ఆయనకు ప్రీతికరమైనది. తగు మోతాదుల్లో సేవించేవారు'. 'చైనా వంటల్ని అదే తన జీవితేచ్ఛ అన్నట్లుగా ఆరగించేవారు'. న్యూయార్క్‌లో ఉన్నప్పుడు రాత్రి క్లబ్బులు ఆయన్ని రంజింపజేశాయి. ఆ అనధికార సందర్శనలలో ఒకటీ అరా పెగ్గులు మనసారా గ్రోలేవారు.

చౌధరి అనడం అటల్ తన యౌవనంలో ముస్లిం వ్యతిరేకి అని. 'జీవిక కోసం భారతదేశాన్ని ఎంపిక చేసుకున్న ముస్లింలను దేశ ద్రోహులుగానే చూడాలని అటల్ వాదించేవారు' అని రాశారు. అటల్ 'రాష్ట్రధర్మ' పత్రికకు రాసిన ఒక వ్యాసంలో ముస్లింలను 'ఫిఫ్త్ కాలమిస్ట్‌లు' (ఆశ్రయమిచ్చిన దేశంలో ఉంటూనే ఆ దేశానికి వ్యతిరేకంగా పోరాడేవారు) అని పేర్కొన్నారు. యౌవనానంతర దశలో మాత్రం తన పూర్వపు ధోరణికి పూర్తి భిన్నంగా ఆయన మారిపోయారు. అది నిజం. ఆ మార్పు ఎంత గొప్పదో చెప్పే వెల్లడింపులు కొన్ని ఈ పుస్తకంలో ఉన్నాయి.

మహాత్మా గాంధీ పట్ల వాజ్‌పేయి వైఖరిని గురించి చెబుతూ, 'మహాత్ముడి మరణాన్ని అటల్ అస్సలు ఏమాత్రం మానవాళికి



సంభవించిన తీవ్రమైన నష్టంగా పరిగణించనే లేదు. అటల్ రాసిన అనేక వ్యాసాలు దేశ విభజనకు కారకుడిగా మహాత్ముడినే బాధ్యుడిని చేశాయి. నీతి కాని రీతిలో ముస్లింలను గాంధీజీ సంతృప్తిపరిచే ప్రయత్నం చేయడం అన్నది ఆయన్ని హత్య చేసేంతగా పర్యవసాన పరిణామాలను విషతుల్యం చేసిందని అటల్ విమర్శించారు' అని అభిషేక్ రాశారు. ఇదేమైనా నిందను సంకేతిస్తోందా? కావచ్చు.



వాజ్‌పేయి గురించి బాగా ప్రచారంలో ఉన్న కొన్ని కథనాల్లో అసలు నిజమే లేదనీ, అవి కేవలం అపోహలేననీ ఈ పుస్తకం తేల్చేస్తుంది. 1971 భారత్–పాక్ యుద్ధంలో పాకిస్తాన్ ఓడిపోయిన డిసెంబర్ 16వ తేదీ నాడు ఇందిరాగాంధీని దుర్గాశక్తిగా అటల్ కీర్తించారని ఒక కథనం. అయితే అది నిజం కాదని, 'ఆ సాయంత్రం అటల్ పార్లమెంటులోనే లేరు. అప్పుడు ఆయన ఏదైనా ప్రయాణంలో గానీ, లేదా స్వల్ప అస్వస్థతతో గానీ ఉండి ఉండాలి' అని అభిషేక్ రాశారు.

అలాగే, అటల్ గురించి నెహ్రూ గొప్పగా భావించేవారనీ, ఆయనను భావి భారత ప్రధానిగా గుర్తించేవారనీ ఒక ప్రచారం ఉంది. అది అబద్ధం కాదు. అయితే మునుపు మనకు తెలియని విషయం ఒకటి కూడా ఈ పుస్తకంలో ఉంది. తొలినాళ్లలో అటల్‌పై నెహ్రూ అభిప్రాయం ఇంకోలా ఉండేదని! మొదట్లో ఆయన వాజ్‌పేయిని 'అత్యంత అభ్యంతరకరమైన వ్యక్తి'గా భావించారు. 'జమ్మూలో మితిమీరిన తెంపరితనాన్ని ప్రేరేపిస్తున్నాడు', 'అతడిని జమ్మూలోకి అడుగుపెట్టనివ్వకండి' అని నెహ్రూ తన క్యాబినెట్ కార్యదర్శి విష్ణు సహాయ్‌ని కోరినట్లు ఈ పుస్తకం చెబుతోంది.

స్వాతంత్ర్యోద్యమంలో వాజ్‌పేయి పాత్ర లేదన్న కాంగ్రెస్ వాదనను కూడా రచయిత కొట్టిపారేశారు. 'గ్వాలియర్‌లో జరిగిన క్విట్ ఇండియా నిరసనల్లో వాజ్‌పేయి పాల్గొన్నారన్నది నిజం'. మరీ ముఖ్యంగా, బ్రిటిష్ వారికి అటల్ సమాచారం చేరవేస్తుండేవాడు అని 'బ్లిట్జ్' పత్రిక కలిగించిన ప్రేరేపణ పచ్చి అబద్ధం.'

మిమ్మల్ని ఆశ్చర్యపరచగల మరికొన్ని ముఖ్యమైన వివరాలు కూడా ఈ పుస్తకంలో ఉన్నాయి. బాల్యంలో వాజ్‌పేయి పేద విద్యార్థి. స్కూల్లో చాలా అరుదుగా మాత్రమే ఆయనలోని ప్రతిభ బయటపడేది. 'పాంచజన్య' పత్రిక మాత్రం ఆయన్ని ఆకాశానికెత్తింది. అటల్ ఎప్పుడూ తరగతిలో రెండో స్థానంలో నిలవలేదని రాసింది. ఆయనకు ఎల్ఎల్‌బి డిగ్రీ ఉందన్న మాటలో కూడా నిజం లేదు. నిజానికి, 'అటల్ లా డిగ్రీ చదువును మధ్యలోనే వదిలేశారు.'

శ్రోతల్ని కట్టిపడేసే వక్తగా ప్రసిద్ధి చెందిన మనిషి, తన తొట్టతొలి స్కూల్ డిబేట్‌లో ఘోరంగా ఓడిపోయాడని తెలుసుకోవడం నన్ను ఆహ్లాదపరిచింది. 'అతడి కాళ్లు చల్లబడ్డాయి. తడబడటం మొదలుపెట్టాడు. ప్రసంగ పాఠం మర్చిపోయాడు. అదొక అవమానకరమైన అనుభవం. సాటి విద్యార్థుల ఆనాటి వెక్కిరింతల్ని జీవితాంతం ఆయన గుర్తుచేసుకుంటూనే ఉన్నారు'.

వాజ్‌పేయిని 'భావోద్వేగాల ఒంటరితనంలో నిరాశ్రయుడైన పురుష బాలకుడి'గా అర్థం చేసుకున్నారు పుస్తక రచయిత. అటల్ సంక్లిష్టమైన వ్యక్తిగత జీవితానికి అది తగిన వివరణ కాగలదా? వాజ్‌పేయిని 'విలువల్లోనూ పట్టువిడుపులు పాటించే మనిషి' అంటారాయన. 2002లో గోవాలో జరిగిన పార్టీ జాతీయ కార్యవర్గ సమావేశంలో కేంద్ర కేబినెట్ సహచరుల అభీష్టానుసారం ఆనాటి గుజరాత్ ముఖ్యమంత్రి చేత రాజీనామా చేయించలేకపోవడానికి ఈ పట్టువిడుపుల స్వభావం నుంచే మనం సమాధానాన్ని రాబట్టుకోవాలా?

రెండవ సంపుటి కూడా మొదటి సంపుటం మాదిరిగానే అనేక విశేషాలతో కూడి ఉన్నట్లయితే 1977–2004 మధ్య వాజ్‌పేయి గురించిన సత్యాలను తెలుసుకోడానికి నేను ఎక్కువ కాలం వేచి ఉండలేను. అది ఉత్తమ భాగం అవుతుంది.

వ్యాసకర్త సీనియర్ జర్నలిస్ట్

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!



సోషల్ మీడియా

ఎన్నడూ చూడనిది...



నేను 'రైలు ప్రమాదం' జరిగిన ప్రాంతానికి చెందినవాడిని. ఎన్నో మృత శరీరాలను చూశాను. నిజంగా బాధాకరం. భారతదేశం ఎప్పుడూ ఇలాంటి ప్రమాదం చూడలేదు.

– బసంత సాహు, విద్యార్థి

బలమివ్వు దేవా!



హౌరా నుంచి చెన్నై వెళ్తున్న కోరమాండల్ ఎక్స్‌ప్రెస్ ప్రయాణికుడిగా గాయాలు లేకుండా బయటపడ్డందుకు కృతజ్ఞుడిని. పెంచి చెప్పడం కాదుగానీ నేనే 200–250 చావులకు సాక్షిగా ఉన్నాను. కుటుంబాలు నలిగిపోయి, కాళ్లూ చేతులు లేకుండాపోయి, ట్రెయిన్ ట్రాకుల్లో రక్తం మడుగులు కట్టి... నేను ఎప్పటికీ మరిచిపోలేని దృశ్యం. దేవుడా! ఆ కుటుంబాలను కాపాడు.

– అనుభవ్ దాస్, ప్రయాణికుడు

అదే తర్కంతో...



ఆల్ ఇండియా ముస్లిం లీగ్ ఒక లౌకిక వాద పార్టీ అని తెలుసుకున్న తర్వాత, సౌదీ అరేబియా తనను తాను శాకాహార దేశంగా ప్రకటించుకుంది.

– ఇంతియాజ్ మహమూద్, థింకర్

ఎవరు బాధ్యులు?



ఇండియాలో ప్రతిదానికీ రెండు మంత్రిత్వ శాఖలు ఉంటాయి. ఒకటి ప్రారంభోత్సవాల కోసం, ఇంకొకటి నిందలు మోయడం కోసం!

– సోనమ్ మహాజన్, వ్యాఖ్యాత

షో అవసరమా?



ప్రమాద ఘటనా స్థలాలను దర్శించడానికి వీవీఐపీలు వెళ్లినప్పుడు జరిగే అత్యంత చెడు ఏమిటంటే – అది సహాయ కార్యక్రమాలకు అంతరాయం కలిగిస్తుంది. ఈ ఆధునిక కాలంలో వాళ్లు ఎక్కడ ఉన్నా సమాచారాన్ని వెన్వెంటనే తెలుసుకోగలరు. అలాంటప్పుడు వెళ్లి ఒత్తిడి పెంచడం ఎందుకు?

– సుహేల్ సేఠ్, నటుడు

ప్రాణాలు చవక



మూడు రైళ్లు. ఇప్పటికీ మింగుడు పడటం లేదు. మూడు! ఈ దేశంలో మనిషి ప్రాణాలకంటే చవకైనది ఇంకేమీ లేదు. ఆ కుటుంబాల శోకం లెక్కించలేనిది.

– శివ్ ఆరూర్, జర్నలిస్ట్

ఇప్పుడు జరగవనా?



'లొబాటమీ' కనిపెట్టిన వైద్యుడికి నోబెల్ బహుమతి వచ్చింది. వైద్య చరిత్ర అంతా ఇట్లాంటి భారీ తప్పులతో కూడుకొని ఉన్నదే. అయినా మనం అంతా మారిపోయిందని భావిస్తాం లేదా నటిస్తాం. (స్కిజోఫ్రెనియా లాంటి మానసిక అనారోగ్యాలకు ఒకప్పుడు మెదడుకు శస్త్రచికిత్స చేసేవారు: లొబాటమీ అలాంటి ఒక ప్రక్రియ.)

– ఆరన్ ఖేరియాటీ, ఫెలో

సీమను అద్దంలో చూపిన కథకుడు

సందర్భం



దాసు కృష్ణమూర్తి

నిత్య కలహాలు, కరువుతో పీడించబడుతున్న రాయలసీమ గురించిన అత్యంత సాధికారిక పరిశీలకుడు, వ్యాఖ్యాత అయిన కేతు విశ్వనాథరెడ్డి ఇక లేరు. 82 ఏళ్ల వయసులో మే 21న ఆయన కన్నుమూశారు. హైదరాబాద్‌లో ఆయన నివసిస్తున్నప్పుడు, తన కుమార్తె కుటుంబంతో గడిపేందుకు తరచుగా అమెరికాకు వచ్చినప్పుడు ఆయనను చాలాసార్లు కలిశాను.

దిద్దిన జవాబు పత్రాల కట్టను అందజేయడానికి 'ఇందిరాగాంధీ నేషనల్ ఓపెన్ యూనివర్సిటీ' హైదరాబాద్ ఆఫీసులో ఆయన్ని నేను మొదటిసారిగా కలిశాను. 'ఇది హైదరాబాద్ ఆఫీస్ పని కాదు' అని నాతో చెపుతున్న కింది స్థాయి ఉద్యోగి వైపు ఆయన మెల్లగా చూశారు. '1947 సంతోషాబాద్ ప్యాసింజర్ అండ్ అదర్ స్టోరీస్' అనే మా మొట్టమొదటి సంకలనంలో 'ది నర్స్' అనే ఆయన కథను ప్రచురించే అదృష్టం నాకు లభించింది. జానకి ఉన్న చోట లేబర్ రూమ్ పరిస్థితిని వివరిస్తూ కథలో వాతావరణాన్ని పరిచయం చేయాలన్న నా సూచనను ఆయన వెంటనే అంగీకరించినప్పుడు నేను ఆశ్చర్యపోయాను. నర్సు ఉన్న చోటికి చేరుకోవడానికి పాత పల్లె ఓబన్న సైకిల్ తొక్కడం కూడా! 'ది హిందూ' (ఫిబ్రవరి 7, 2012) నా వ్యాసాన్ని ప్రచురించింది, అందులో నేను ఆయన్ని సీమకు చెందిన రసవాది (ఆల్కెమిస్ట్) అని పేర్కొన్నాను. నిజానికి ఆయన ఏం రాసినా తెలుగువారందరూ... వారు ప్రపంచంలో ఎక్కడ నివసిస్తున్నా (ప్రవాస భారతీయులతో సహా) ఎంతో ఆసక్తిగా చదువుతారు.

ఆయన పాత్రలు నేలతల్లి బిడ్డలు. హద్దూ అదుపూలేని భూబకాసురులు, ప్రపంచీకరణ బేహారులు చూపించే కొత్త కొత్త మార్గాల్లో పయనించి, అమాయకంగా ధనపిశాచి వలలో చిక్కి మనస్సాక్షిని కోల్పోయేంత పతాక స్థాయికి చేరే అమాయకులు వారు. నేను రెడ్డిగారిని చివరిసారిగా హైదరాబాద్‌లోని ఆయన ఇంటిలో కలిశాను. నేను ఇంట్లో రెండు మెట్లు ఎక్కి ఆయన ఉన్న చక్కగా గాలి వీస్తూ ఉన్న విశాలమైన చోటుకు చేరుకోవడం చూసి నేనేదో కష్టపడ్డాననుకుని బాధపడ్డారు.

ఒక అమెరికన్ విద్యావేత్త సంకలనం చేసిన ప్రామాణిక ఇంగ్లీష్–తెలుగు నిఘంటువును ఆయనకు ఇచ్చాను. నేను వెళ్లిపోతున్నప్పుడు, ఆయన భార్య నాకు సీమ మిఠాయిల ప్యాకెట్ ఇచ్చింది. వార్తాపత్రిక అందించే పరిమిత స్థలంలో, రెడ్డిగారి విస్తారమైన రచనలను లోతుగా పరిశోధించడం అసాధ్యం. కాబట్టి, ఆయన్ని జీవితంలో నడిపించిన, కామూసియన్ నిరాశా ఛాయలను పారదోలిన... ఆయన తత్వాన్ని సేకరించడం మాత్రమే సాధ్యపడుతుంది. ఆయన రాసిన అనేక నవలలు, చిన్న కథల సంకలనాలు జీవితపు రంగులను ప్రకాశింపచేస్తాయి. రాయలసీమ, ముఖ్యంగా దాని లోతట్టు ప్రాంతాలే ఆయన క్యాన్వాస్. తాను చనిపోయే ముందు సీమ సమస్యలను, దాని ప్రజలను వెలుగులోకి తీసుకురావడానికి కొత్త తరం యువ రచయితలను ప్రవేశపెట్టారు. ఆయనకు వచ్చిన అనేక అవార్డులలో, కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు, భారతీయ భాషా పరిషత్ అవార్డు, తెలుగు విశ్వవిద్యాలయం అవార్డు వంటివి ఉన్నాయి.

వ్యాసకర్త ప్రముఖ ప్రాతికేయుడు – సాహితీవేత్త, అమెరికా

ఆయనో సజీవ విశ్వవిద్యాలయం

ప్రముఖ సాహితీవేత్త కేతు విశ్వనాథ రెడ్డి మృతి సాహితీ లోకానికి తీరని లోటు. ఆయన కడప జిల్లాలోని గ్రామ నామవాచకాల నేపథ్యాన్ని విశ్లేషించడం ద్వారా ఆంధ్రుల సామాజిక, సాంస్కృతిక చరిత్ర రచనకు నూతనమైన మలుపు తీసుకువచ్చారు. సురవరం ప్రతాపరెడ్డి, రాచమల్లు రామచంద్రారెడ్డి, కేవీ రమణారెడ్డి, కేతు విశ్వనాథ రెడ్డి వంటి వారు తెలుగు సాహిత్య రంగంలో కులాతీత భావ చైతన్యాన్ని కలిగించారు. కేతు చాలా సౌమ్యులు. పరిశోధనా దక్షులు. కులేతర, మతేతర భావజాల సంపూర్ణులు. ఇటీవల కడప నుండి నాతో ఫోన్లో మాట్లాడారు. 'మీ రచనలు, కవితలు, పోరాటాలు ఎప్పుడూ నన్ను ఉత్తేజపరుస్తుంటాయి. మీరు ఈ తరానికి స్ఫూర్తి' అని అన్నారు. నాకు ఎంతో సంతోషం వేసింది. సామాజిక శాస్త్రవేత్తలను ప్రోత్సహించడంలో ఆయనకు ఏ విధమైన శషభిషలూ లేవు.



కేతు విశ్వనాథరెడ్డి (1939–2023)

ఆయన కొడవటిగంటి కుటుంబరావు రచనలను సంపుటాలుగా వెలువరించడం ద్వారా ఒక పెద్ద సాహితీ నిధిని తెలుగువారికి అందించినట్లు అయ్యింది. కేతు కథల్లో రాయలసీమ అస్తిత్వం ఉంటుంది. ఒక రెడ్డి కులంలో పుట్టి, రెడ్డి ఫ్యాక్షనిజం నేపథ్యాన్ని చెప్పగలిగిన ధైర్యం గలవారు ఆయన. వారి కథల్లో రెడ్డి, భూస్వామ్య ఆధిపత్యాన్ని దళిత పాత్రలు నిలేస్తాయి. అది ఆయన కుల, వర్గ ఆధిపత్య దోపిడీ వ్యతిరేక భావనకు నిదర్శనం. 'వైఎస్సార్ లైఫ్ టైమ్ ఎచీవ్‌మెంట్ అవార్డు'ను ఆయనతో పాటూ నేనూ తీసుకోవడం నాకు ఒక మధురానుభూతి. కేతు కేవలం సాహితీవేత్తే కాదు. సమాజం పట్ల బాధ్యత కల పౌరుడు. గతితార్కిక చారిత్రక భౌతికవాద దృక్పథం గల అభ్యుదయ రచయిత. 'అరసం' అధ్యక్షులుగానూ పనిచేశారు.

భూస్వామ్య కులాలవారు దళితుల్ని అమానుషంగా వేధించారని ఆయన స్పష్టంగా చెప్పారు. దళితులు కూలీలుగానే బతకాలనీ, వాళ్ళ పిల్లలు చదువుకోకూడదనే దుష్టనీతి కొందరు భూస్వామ్య కులాల వారికి ఉందని గమనించారు. భూస్వామ్య కులాలు భూములు ఆక్రమించడంలో సాయుధులయ్యారనీ, ఫ్యాక్షనిజాన్ని ఆశ్రయించారనీ, ఆస్తి కోసం, అధికారం కోసం అడ్డువచ్చిన వారిని ఎవరినైనా నిర్దాక్షిణ్యంగా హతమార్చడానికి కూడా వెనకాడలేదనీ తన నవలల్లో, కథల్లో దృశ్యీకృతంగా చెప్పారు.

రాయలసీమ జిల్లాలో పాత రాతియుగం (పాలియోలిథిక్ ఏజ్), కొత్త రాతి యుగం (నియోలిథిక్ ఏజ్)ల నుంచీ ఉత్పత్తి శక్తులుగా దళితులే ఉన్నారు. భూస్వామ్య కులాల వారు అక్కడకు వివిధ కాలాలలో వలస వచ్చినవారే. వీరు భూ పాలెగాళ్లు. వీరిది సామంత గుణం. దళితులది ఇండిపెండెంట్ నేచర్. వారు స్థానికులు. వారు ఉత్పత్తి పరికరాల్ని ఉత్పత్తికే వాడతారు గాని హత్యలకు వాడరు. ఈ విషయాలను అనేక చారిత్రక కథనాలు తెలియజేస్తాయి. ఈ చారిత్రక నేపథ్యం రాయలసీమ రాజకీయ, సాంస్కృతిక పరిస్థితులను అర్థం చేసుకోవడానికి ఉపయోగపడుతుంది. ఈ అవగాహన ఉన్నవారు కాబట్టే కేతు రాయలసీమ జీవనాన్ని అద్భుతంగా చిత్రించగలిగారు.

కేతుది కరుణ హృదయం. ఆయన కన్నీటిని అక్షరాల్లో పొదుగుతారు. 'ఏకో రసః కరుణ ఏవ' అన్నారు. దుఃఖాన్ని చెప్పని వాడు కథకుడు కాదు. కవి కాదు. కళాకారుడు కాదు. కడప రచయితల్లో శాంతి నారాయణ కుల అణచివేతను దృశ్యీకరింపజేసిన గొప్ప బహుజన నవలాకారుడు. ఆయన కేతు విశ్వనాథ రెడ్డికి సహచరుడు. ఆయనతోపాటు చాలామంది కేతు విశ్వనాథ రెడ్డిని పెద్దదిక్కుగా భావిస్తారు.

ఈ యుగ సాహితీ నిర్మాతల్లో కేతు ఒకరు. ఆయన పుస్తకాలన్నీ సంకలనాలుగా ముద్రించి సమాజానికి అందించడం ద్వారా సాంస్కృతిక విప్లవాన్ని కొనసాగించాలి. ఆయన సాహితీ విమర్శలో డైలెక్టికల్ నేచర్ ఉంటుంది. ఆయన కథల్లో, నవలల్లో, విశ్లేషణలో హెగెల్ డైలెక్టిక్స్‌ను చూడవచ్చు. హెగెల్ గతితర్కాన్ని ప్యూర్బా భౌతిక వాదంతో కార్ల్ మార్క్స్ సమన్వయీకరించారు. కార్న్ ఫోర్త్ గతితార్కిక భౌతికవాదాన్ని సామాజిక దృక్కోణం నుంచి విశ్లేషించారు. మావో డైలెక్టికల్ మెటీరియలిజాన్ని ఆధారం చేసుకుని 'వైరుధ్యాలు' అనే గ్రంథం రాశారు. భారతదేశంలో తాత్విక భావజాల రంగంలో సామాజిక తత్వ సమన్వయం లోపించింది. కేతు విశ్వనాథ రెడ్డి రచనలలో మనకు ఈ సామాజిక అన్వయం కనిపిస్తుంది. నిజానికి ఒకనాడు రాయలసీమ మొత్తంగా బౌద్ధ సంస్కృతి ఉంది. ఆ తర్వాత వీరశైవ, వీర వైష్ణవ ఉద్యమాలతో అది సన్నగిల్లింది. ఆ తర్వాత వచ్చిన కమ్యూనిస్టు ఉద్యమంలో కూడా ఇక్కడ సామాజిక భావజాల అన్వయం ఉంది. భూస్వామ్య పెత్తందారీ కుటుంబాల నుంచి వచ్చిన వాళ్లే ఇక్కడ ఎక్కువమంది తిరుగుబాటుదారు లయ్యారు. తరిమెల నాగిరెడ్డి, చంద్ర పుల్లారెడ్డి, పుచ్చలపల్లి సుందరయ్య – వీరందరూ భూస్వామ్య కుల పెత్తందారీ సమాజం నుంచి వచ్చినవారే. అయితే వీళ్లు ఆ సమాజంతోనూ, కుటుంబాలతోనూ పోరాడారు. ఈ మొత్తం పోరాట ప్రభావం ఆ తర్వాత వచ్చిన రచయితల మీద ఉంది.

సందర్భం



డాక్టర్ కత్తి పద్మారావు

కేతు ఒక విశ్వవిద్యాలయం. విశ్వజనీయమైన భావన సృష్టికర్త. ఆయన పేరును రాయలసీమలోని ఏదో ఒక విశ్వవిద్యాలయానికి పెట్టడం సముచితం. నిజానికి రాజమండ్రిని నన్నయ కంటే కుసుమ ధర్మన్న ఎక్కువ ప్రభావితం చేశారు. శ్రీకాకుళాన్ని ఇతర రచయితల కంటే వంగపండు ప్రసాదరావు ఎక్కువ ప్రభావితం చేశారు. తెలంగాణను గూడ అంజయ్య ప్రభావితం చేసినంతగా మరెవరూ ప్రభావితం చేయలేదు. తమిళనాడులో, బెంగాల్లో ఇటువంటి వారి పేర్లతో విశ్వవిద్యాలయాలు ఉన్నాయి. అయితే తెలుగు అకాడెమీకి బ్రాంచ్‌గా 'రాయలసీమ భాషా సాంస్కృతిక అకాడెమీ'ని కూడా పెట్టాల్సిన అవసరం ఉంది. ఎందుకంటే కేతు ఊర్ల పేరు మీద చేసిన విశ్లేషణలో భాషా శాస్త్ర, మానవ పరిణామశాస్త్ర, పురాతత్వశాస్త్ర చారిత్రక మూలాలు ఉన్నాయి. దానికి కొనసాగింపు పరిశోధన జరగలేదు. అందుకు ఇటువంటి అకాడెమీ పెట్టాల్సి ఉంది.

అలాగే కేతు విశ్వనాథ రెడ్డి పేరు రాయలసీమ జిల్లాల్లో ఒక జిల్లాకు పెట్టవలసిన చారిత్రక అవసరం ఉంది. చరిత్రను సృష్టించిన వాడు ఆకాశ నక్షత్రాల్లో పొదగబడిన కీర్తిమంతుడు. వారి మార్గంలో నడుద్దాం.

వ్యాసకర్త సామాజిక ఉద్యమకర్త, సాహితీ విమర్శకులు
మొబైల్: 98497 41695

గ్రహం అనుగ్రహం

శ్రీ శోభకృత్ నామ సంవత్సరం, ఉత్తరాయణం, గ్రీష్మ ఋతువు, జ్యేష్ఠ మాసం, **తిథి:** బ.పాడ్యమి ఉ.7.36 వరకు, తదుపరి విదియ, **నక్షత్రం:** మూల రా.3.32 వరకు, తదుపరి పూర్వాషాఢ, **వర్జ్యం:** ప.12.17 నుండి 1.49 వరకు, తిరిగి రా.1.58 నుండి 3.32 వరకు, **దుర్ముహూర్తం:** ప.12.26 నుండి 1.20 వరకు, తిరిగి ప.3.05 నుండి 3.56 వరకు, **అమృతఘడియలు:** రా.9.15 నుండి 10.45 వరకు; **రాహుకాలం:** ఉ.7.30 నుండి 9.00 వరకు, **యమగండం:** ఉ.10.30 నుండి 12.00 వరకు, **సూర్యోదయం:** 5.28, **సూర్యాస్తమయం:** 6.27.

క్లుప్తంగా...

గాలివాన బీభత్సం

సంగారెడ్డి, వికారాబాద్, ఉమ్మడి నిజామాబాద్ జిల్లాల్లో భారీ వర్షాలు



పరిగిలో..

సాక్షి ప్రతినిధి, సంగారెడ్డి, కుల్కచర్ల, సుభాష్ నగర్/మాచారెడ్డి/దోమకొండ: ఈదురుగాలులతో ఆదివారం రాష్ట్రంలోని పలు జిల్లాల్లో భారీవర్షం బీభత్సం సృష్టించింది. రాష్ట్రంలోనే అత్యధికంగా సంగారెడ్డి జిల్లా నాగల్‌గిద్దలో 6.7 సెం.మీల వర్షం కురిసింది. సంగారెడ్డి జిల్లా కేంద్రంలో కూడా 4.7 సెం.మీల వర్షపాతం నమోదయ్యింది. నారాయణఖేడ్, కంగ్టి, సదాశివపేట్, నాగల్‌గిద్ద, మనూర్ మండలాల్లో భారీవర్షాలకు వాగులు పొంగిపొర్లాయి. కంగ్టి మండలంలో బోర్గి గ్రామంలో ఇంటి పైకప్పు రేకులు ఎగిరిపోయాయి. హైమాస్ట్ లైట్ల స్తంభాలు, విద్యుత్ స్తంభాలు నేలకొరగడంతో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. సంగారెడ్డి ఐబీ చౌరస్తాతో పాటు, పలు ప్రాంతాల్లో ఫ్లెక్సీలు కింద పడిపోయాయి. వికారాబాద్ జిల్లా కుల్కచర్ల మండల పరిధిలోని సాల్వీడు గ్రామంలో ఒకే చోట నిలిచిన మేకల మందపై భారీ పిడుగు పడటంతో 26 మేకలు అక్కడికక్కడే మృత్యువాత పడ్డాయి. ఉమ్మడి నిజామాబాద్ జిల్లా దోమకొండ, సంఘమేశ్వర్, న్యాల్‌కల్ తదితర గ్రామాల్లోని కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం రాశులు, బస్తాలు అకాల వర్షానికి తడిసిపోయాయి. దోమకొండలోని రాజీవ్‌నగర్, మాచారెడ్డి మండలం గజ్యానాయక్ తండాలో చెట్లు, విద్యుత్ స్తంభాలు విరిగి పడ్డాయి.

వడదెబ్బతో విద్యార్థి మృతి



విక్రమ్(ఫైల్)

పాలకుర్తి టౌన్: బడిబాటలో పాల్గొన్న విద్యార్థి వడదెబ్బతో మృతి చెందిన ఘటన జనగామ జిల్లా పాలకుర్తిలో జరిగింది. మండల కేంద్రానికి చెందిన గాదెపాక శోభన్, రేణుకల కుమారుడు విక్రమ్ (12) జిల్లా కేంద్రంలోని సాంఘిక సంక్షేమ బాలుర గురుకుల పాఠశాలలో 5వ తరగతి చదువుతున్నాడు. పాలకుర్తి మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాలలో నాలుగో తరగతి వరకు చదివాడు. పరిచయం ఉండడంతో ఆ పాఠశాల ఉపాధ్యాయులు, ప్రజాప్రతినిధులు, పంచాయతీ కార్యదర్శి శనివారం 'బడిబాట' కార్యక్రమానికి విక్రమ్‌ను వెంట తీసుకెళ్లారు. బ్యానర్ పట్టుకొని కొద్దిసేపు పలు వీధుల్లో ప్రచారం చేశారు. తర్వాత ఇంటి వద్ద ఆడుకుంటుండగా వాంతులు అయ్యాయి. అదేరోజు రాత్రి స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి వైద్యం చేయించారు. మెరుగైన వైద్యానికి వరంగల్ ఎంజీఎంకి తరలించి చికిత్స అందిస్తుండగా తెల్లవారుజామున విక్రమ్ మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.



రైతులు పంట సాగును ముందుకు జరపాలి

తండ్రి, తనయుడితో కలిసి నారుమడిలోకి దిగి విత్తనాలు జల్లిన మంత్రి

నాగారం: రైతులు ప్రకృతి వైపరీత్యాలతో నష్టపోకుండా ఉండేందుకు పంట సాగును ముందుకు జరపాలని రాష్ట్ర విద్యుత్‌శాఖ మంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి సూచించారు. ఏరువాక పౌర్ణమిని పురస్కరించుకొని ఆదివారం సూర్యాపేట జిల్లా నాగారం మండల కేంద్రంలోని తన సొంత వ్యవసాయ క్షేత్రంలో ఎంపీ బడుగుల లింగయ్యయాదవ్, ఎమ్మెల్యే గ్యాదరి కిషోర్‌కుమార్, జిల్లా కలెక్టర్ వెంకట్రావ్‌తో కలిసి ఆయన వ్యవసాయ పనులను ప్రారంభించారు. తన తండ్రి రామచంద్రారెడ్డి, తనయుడు వేమన్‌రెడ్డిలతో కలిసి వానాకాలం పంటల సాగుకు వరి విత్తనాలు వెదజల్లడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రోహిణి కార్తె పూర్తయ్యేనాటికి నాట్లు వేసుకుంటే యాసంగిలో రెండో పంటకు ప్రకృతి వైపరీత్యాల తాకిడి ఉండదన్నారు. ఇదేమీ కొత్త పద్ధతి కాదని గతంలో ఉన్నదేనని పేర్కొన్నారు. రైతులు నవంబర్ చివరి నాటికి రెండో పంట నాట్లు పూర్తి చేసుకునేలా అవగాహన కల్పించాలని అధికారులకు ఆయన సూచించారు. కోదాడ, హుజూర్‌నగర్, మిర్యాలగూడ, నాగార్జునసాగర్ నియోజకవర్గాలతో పాటు నిజామాబాద్ జిల్లా జక్కల్‌లోనూ ఇదే పద్ధతిన పంటసాగు చేస్తున్నారని తెలిపారు. సాగును ముందుకు జరపడం ద్వారా పంట దిగుబడి పెరగడంతో పాటు రెండో పంటపై వైపరీత్యాల ప్రభావం ఉండదన్నారు. రైతులు వెదజల్లే పద్ధతిలో వరిసాగు చేసి అధిక దిగుబడులు పొందాలని మంత్రి సూచించారు.

మటన్ పెట్టకుండా సాంబారు పోశాడని..

పెళ్లి విందులో కొట్లాట

శివ్వంపేట(నర్సాపూర్): పెళ్లి విందులో తలెత్తిన ఘర్షణలో ఇద్దరికి గాయాలయ్యాయి. నర్సాపూర్ మండల పరిధిలోని చండి గ్రామంలో జరిగిన ఈ ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. నర్సాపూర్ మండల పరిధిలోని చండి గ్రామానికి చెందిన అమ్మాయిని అదేమండలం నత్నాయిపల్లికి చెందిన అబ్బాయితో శనివారం చండి గ్రామంలో పెళ్లి జరిగింది. పెళ్లి అనంతరం భోజనం వడ్డిస్తున్న క్రమంలో అబ్బాయి తరఫు వ్యక్తికి మటన్ ముక్కలు వేయకుండా సాంబార్ పోశాడని గొడవకు దిగారు. మటన్ వడ్డిస్తున్న వ్యక్తితో పాటు మరో వ్యక్తిపై అబ్బాయి తరఫు వారు దాడి చేయగా.. ఇద్దరికి గాయాలయ్యాయి. పోలీసులు ఇరువర్గాలను చెదరగొట్టి గాయపడిన వారిని ఆస్పత్రికి తరలించి నలుగురిపై కేసు నమోదు చేశారు.

లండన్‌లోని బ్రిటిష్ మ్యూజియంలో ఉన్న 120 అమరావతి సున్నపు రాయి శిల్పాలకు అసాధారణ పర్యవేక్షణ ఉంటుంది. సందర్శకుల సంఖ్య ఎక్కువగా ఉండి.. ఉష్ణోగ్రతలు పెరిగితే తాత్కాలికంగా ఆ గ్యాలరీని మూసి, ఉష్ణోగ్రతలు తగ్గాకే సందర్శకులను అనుమతిస్తున్నారు. పురాతన శిల్పాలకు నష్టం జరగకుండా తీసుకుంటున్న శ్రద్ధకు ఇది నిదర్శనం

మరి తెలంగాణ వారసత్వ శాఖ అధీనంలోని మ్యూజియంలలో పరిస్థితి? రక్షించే శ్రద్ధ సంగతేమోగానీ, అలవిగాని నిర్లక్ష్యంతో శిల్ప సంపదకు మరింత నష్టం కలిగేలా వ్యవహరిస్తున్నారు. తాజాగా ఓ అరుదైన శిల్పం విషయంలో అధికారుల తీరును ఎత్తిచూపుతోంది. సురక్షితంగా, భద్రమైన చోటులో ఉంచాలని స్వయంగా కోర్టు ఆదేశించినా.. ఆ శిల్పాన్ని వేల మైళ్ల దూరానికి తరలిస్తుండటంపై విమర్శలు వస్తున్నాయి.

సాక్షి, హైదరాబాద్

అరుదైన శిలా ఫలకం.. అంతులేని నిర్లక్ష్యం!

రెండు దశాబ్దాల క్రితం ఫణిగిరిలో వెలుగుచూసిన సున్నపురాతి బౌద్ధ శిలా ఫలకం



దొంగల నుంచి స్వాధీనం చేసుకున్నప్పుడు తాత్కాలికంగా అతికించిన బుద్ధ ఫలకం

- 2 వేల ఏళ్లనాటిదిగా గుర్తింపు.. 2003లో జరిగిన చోరీలో కొంత ధ్వంసం
- తాత్కాలికంగా అతికించిన అధికారులు.. దాన్ని భద్రమైన చోట ఉంచాలని కోర్టు ఆదేశం
- ఇప్పుడా శిలా ఫలకం ప్రదర్శన కోసం న్యూయార్క్‌కు తరలింపు
- ఈ తీరుతో శిల్పాలకు ప్రమాదమంటూ కేంద్రానికి ఫిర్యాదులు



నాలుగేళ్ల క్రితం ముంబైలో ప్రత్యేక పద్ధతిలో అతికించి పగులు కనపడకుండా చేసిన దృశ్యం

.. సూర్యాపేట జిల్లా ఫణిగిరి గుట్టపై 2003లో జరిపిన తవ్వకాల్లో క్రీస్తుశకం 1– 3 శతాబ్దాల మధ్య కాలానికి చెందిన 3 అడుగుల సున్నపు రాయి ఫలకం వెలుగు చూసింది. సిద్ధార్థుడు బుద్ధుడిగా మారే క్రమంలో జరిగిన పరిణామాల చిత్రాలను మూడు వరుసల్లో దానిపై చెక్కారు. అరుదైన ఇలాంటి ఫలకాలకు అంతర్జాతీయ విపణిలో విపరీతమైన డిమాండ్ ఉంది. తవ్వకాలు జరిపిన కొత్తలో ఈ శిలా ఫలకాన్ని ప్రభుత్వ ఆధీనంలోని ఓ గదిలో భద్రపర్చగా.. 2003 సెప్టెంబర్‌లో దొంగలు దాన్ని ఎత్తుకుపోయారు. పోలీసు బృందాలు జల్లెడ పట్టి సమీపంలోని ఓ ఊరిలో దానిని స్వాధీనం చేసుకున్నారు. కానీ శిలా ఫలకం అప్పటికే రెండు ముక్కలు కావడంతో.. తాత్కాలికంగా అతికించారు. అయితే ఈ ఫలకాన్ని సురక్షిత ప్రాంతంలో ఉంచాలంటూ కోర్టు ఆదేశించడంతో.. హైదరాబాద్ స్టేట్ మ్యూజియంలో సిమెంట్ బేస్ సాయంతో కదలకుండా ఏర్పాటు చేశారు. అయితే నాలుగేళ్ల క్రితం ఈ శిల్పాన్ని విమానంలో ముంబై మ్యూజియానికి తీసుకెళ్లి, తీసుకొచ్చారు. ఆ సమయంలో పగులు విచ్చుకోవటంతో ఆధునిక పరిజ్ఞానాన్ని వినియోగించి అతికించారు.

ఈసారి అమెరికాకు తరలించి..

అమెరికాలో న్యూయార్క్‌లోని మెట్రోపాలిటన్ మ్యూజియంలో బుద్ధుడి జీవిత పరిణామ క్రమానికి సంబంధించిన భారతీయ శిల్పాలతో అంతర్జాతీయ ప్రదర్శన ఏర్పాటు చేశారు. దానికి మన దేశం నుంచి 94 శిల్పాలను ఎంపిక చేయగా.. అందులో తెలంగాణ నుంచి 9 ఉన్నాయి. వీటిలో కరీంనగర్ మ్యూజియంలో ఉన్న నాగ ముచిలింద శిల్పం పగుళ్లతో ఉండటంతో.. దాన్ని వదిలేసి మిగతా 8 శిల్పాలను ఇటీవల విమానంలో తరలించారు. ఇలా తరలించిన వాటిలో ఫణిగిరి సున్నపురాయి ఫలకం కూడా ఉంది. అరుదైన ఈ శిలా ఫలకాన్ని అంత దూరం ఎలా తరలిస్తారని ఇటీవల కొందరు కేంద్ర పురావస్తు శాఖకు ఫిర్యాదు చేశారు.

ఇంతకుముందు రెండు శిల్పాలు ధ్వంసం

దాదాపు 20 ఏళ్ల క్రితం స్టేట్ మ్యూజియం నుంచి బాదామి చాళుక్యుల కాలం నాటి ఎర్ర ఇసుకరాతితో చేసిన దుర్గాదేవి ప్రతిమను విదేశాలకు పంపగా.. రవాణాలో విగ్రహం ముక్కు భాగం దెబ్బతిన్నది. బెర్లిన్‌లో జరిగిన తేజస్ ఎగ్జిబిషన్‌కు తీసుకెళ్లిన ఓ నాగ శిల్పం వెనక భాగంలో దెబ్బతిన్నది. ఇలా అరుదైన శిల్పాలు దెబ్బతిన్న ఘటనలున్నా.. ఇప్పటికే దెబ్బతిని, తిరిగి అతికించిన శిలా ఫలకాన్ని విదేశాలకు తరలించడం అడ్డగోలు చర్య అని ఓ విశ్రాంత ఉన్నతాధికారి ఆగ్రహం వ్యక్తం చేశారు.

చెరగని స్ఫూర్తి బావుటా.. రావి

జయంతి వేడుకల్లో సీపీఐ అగ్రనేత సురవరం



రావికి నివాళులర్పిస్తున్న సురవరం, కందిమళ్ల ప్రతాప్‌రెడ్డి, ప్రతిభారెడ్డి తదితరులు

సాక్షి, హైదరాబాద్: దోపిడీ, పీడనల్లేని సమసమాజం ఏర్పాటుకు సమరశీల పోరాటాలు నిర్వహించి తెలంగాణ బావుటాను భారతదేశ వ్యాప్తంగా రెపరెపలాడించిన తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట సారథి రావి నారాయణరెడ్డి అని సీపీఐ అగ్రనేత సురవరం సుధాకర్‌రెడ్డి అన్నారు. రావి నారాయణరెడ్డి జయంతి వేడుకలను ఆదివారం ఘనంగా నిర్వహించి.. రావి స్వగ్రామమైన బొల్లేపల్లి ప్రభుత్వ పాఠశాల టాప్ ర్యాంకర్లకు మెరిట్ అవార్డులను అందజేశారు. బంజారాహిల్స్‌లోని రావి నారాయణరెడ్డి ఆడిటోరియంలో జరిగిన ఈ కార్యక్రమంలో తొలుత రావి విగ్రహానికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా టెన్త్‌లో ఉత్తమ ర్యాంకులు సాధించిన పి.నిరుపమ్ సాయి, ఆకుల హన్సిక, గాయత్రిలకు అవార్డులు అందజేశారు.

రైతన్న ప్రతి అడుగులో.. రాష్ట్ర సర్కారు

సమాచార పౌర సంబంధాల శాఖ ప్రకటన



సాక్షి, హైదరాబాద్: తెలంగాణలో సమగ్ర వ్యవసాయ అభివృద్ధికి ప్రభుత్వం అహర్నిశలు కృషి చేస్తోందని, వ్యవసాయానికి నాణ్యమైన ఉచిత విద్యుత్‌ను 24 గంటల పాటు అందించడంతో రాష్ట్రం సస్యశ్యామలంగా మారిందని ప్రభుత్వం తెలిపింది. రైతు ఆర్థిక వెసులుబాటుకు, పంట అభివృద్ధికి పెట్టుబడి సాయాన్ని ప్రభుత్వం అందిస్తున్నట్టు తెలిపింది. నూతన వ్యవసాయ పద్ధతులు, సంస్కరణలతో వ్యవసాయంలో అధిక దిగుబడికి చర్యలు చేపట్టినట్టు సమాచార పౌర సంబంధాల శాఖ ఆదివారం ఒక ప్రకటన విడుదల చేసింది. 'ఏడువేల ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో ఇప్పటివరకు 6.76 కోట్ల కోట్ల లక్షల టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేసింది. రాష్ట్రంలో 2013–14లో కోటి ఎకరాల్లో పంటలు సాగైతే, 2022–23 నాటికి సాగు విస్తీర్ణం 2.20 కోట్ల ఎకరాలకు పెరిగింది. ధాన్యం ఉత్పత్తిలో ఒకప్పుడు 15వ స్థానంలో ఉన్న తెలంగాణ నేడు దేశంలో మొదటి స్థానానికి పోటీ పడుతోంది. 2014–15లో వరి పంట 34.97 లక్షల ఎకరాల్లో మాత్రమే సాగుకాగా, 2022–23 నాటికి 1.21 కోట్ల ఎకరాలకు, 2014–15లో పత్తి పంట 41.83 లక్షల ఎకరాల్లో సాగుకాగా, 2022–23లో 50 లక్షల ఎకరాలకు పెరిగింది' అని వెల్లడించింది.

ఖమ్మంలో మెడికో ఆత్మహత్య

హాస్టల్ గదిలో ఒంటిపై పెట్రోల్ పోసుకుని అంటించుకుని బలవన్మరణం

- 80 శాతం కాలిన గాయాలతో అక్కడికక్కడే మృతి
- స్థానిక వైద్య కళాశాలలో బీడీఎస్ నాలుగో సంవత్సరం చదువుతున్న మానస
- మహబూబాబాద్ జిల్లా కేసముద్రం ఆమె స్వస్థలం
- మానసిక ఒత్తిడి, కుటుంబ పరిస్థితుల కారణంగా ఆత్మహత్యకు పాల్పడి ఉండొచ్చుననే అనుమానాలు



బంక్‌లో పెట్రోల్ కొనుగోలు చేస్తున్న మానస

ఖమ్మం అర్బన్: ఖమ్మంలోని మమత మెడికల్ కళాశాలలో బీడీఎస్ నాలుగో సంవత్సరం చదువుతున్న సముద్రాల మానస (22) ఆదివారం ఆత్మహత్యకు పాల్పడింది. కళాశాల సమీపంలోని ప్రైవేట్ హాస్టల్‌లో ఉంటున్న ఆమె నాలుగో అంతస్తులోని గదిలో సాయంత్రం 5 గంటల సమయంలో ఒంటిపై పెట్రోల్‌ను పోసుకొని నిప్పంటించుకుంది. మంటల్లో ఉన్న మానసను పక్క గదుల్లోని విద్యార్థినులు గుర్తించి హాస్టల్ నిర్వాహకులకు తెలియజేయడంతో వారు పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు వచ్చేసరికి 80 శాతం కాలిన గాయాలతో మానస ప్రాణాలు కోల్పోయి కన్పించింది. దీంతో ఆమె మృతదేహాన్ని ఖమ్మం ప్రభుత్వ ప్రధాన ఆస్పత్రి మార్చురీకి తరలించారు.

పెట్రోల్ కొనుక్కుని..

మహబూబాబాద్ జిల్లా కేసముద్రానికి చెందిన మానస కుటుంబం వరంగల్‌లోని పోచమ్మ మైదాన్‌లో నివాసం ఉంటోంది. కాగా ఇరవై రోజుల క్రితం వరకు కళాశాల సమీపంలోని వసతి గృహంలో ఉన్న ఆమె ఇటీవలే కళాశాల గేటు పక్కనే ఉన్న వసతి గృహంలోకి మారింది. ఆదివారం సాయంత్రం 4.30 గంటల సమయంలో సమీపంలోని ఓ పెట్రోల్ బంక్‌కు వెళ్లిన ఆమె సీసాలో పెట్రోల్ పోయించుకుని వచ్చింది. ఆ కాసేపటికే గదిలోంచి మంటలు వస్తుండగా పక్క గదుల్లోని విద్యార్థులు గమనించారు.

మానసిక ఒత్తిళ్లు.. కుటుంబ పరిస్థితులే కారణమా?

మానస బలవన్మరణంపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ప్రస్తుతం బీడీఎస్ నాలుగో సంవత్సరంలో ఉన్న ఆమెకు అంతకు ముందు సంవత్సరాలకు సంబంధించి కొన్ని బ్యాక్‌లాగ్‌లున్నట్లు సమాచారం. అలాగే ఆమె కుటుంబ పరిస్థితులు కూడా కారణమై ఉండొచ్చునని ఆమె స్నేహితులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. హాస్టల్ గది తలుపులకు లోపల గడి పెట్టుకొని ఆమె నిప్పంటించుకోగా.. ఒక్కసారిగా మంటలు ఎగసిపడడంతో మిగతా గదుల్లోని విద్యార్థినులు ఆందోళనకు గురయ్యారు. ఈ విషయం తెలియగానే ఖమ్మం సమీప ప్రాంత విద్యార్థినులను వారి కుటుంబ సభ్యులు ఇళ్లకు తీసుకెళ్లారు.

పోలీసుల వైఖరిపై విమర్శలు

మెడికో ఆత్మహత్యపై లోతైన విచారణ చేపట్టాల్సిన పోలీసులు అదేమీ పట్టించుకోకుండా ఆగమేఘాలపై మృతదేహాన్ని మార్చురీకి తరలించి చేతులు దులిపేసుకోవడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. హాస్టల్ నిర్వాహకులు, సహచర విద్యార్థుల నుంచి వివరాలేమీ సేకరించకుండా హడావుడిగా వెళ్లిపోవడం చర్చనీయాంశమయ్యింది. తెలంగాణ ఆవిర్భావ వేడుకల్లో భాగంగా పోలీసు పరేడ్ గ్రౌండ్‌లో జరిగిన బడా ఖానా(సాంస్కృతిక కార్యక్రమాలు) కార్యక్రమంలో పాల్గొనేందుకే వారు హడావుడిగా వెళ్లిపోయినట్లు తెలిసింది. వారు మీడియాకు ఎలాంటి సమాచారం ఇవ్వకపోవడంతో మానస మృతికి దారితీసిన కారణాలపై కనీస స్పష్టత కొరవడింది. మరోవైపు ఘటన జరిగిన ప్రాంతానికి మీడియాను అనుమతించొద్దని పోలీసులు చెప్పారంటూ ఘటనా స్థలాన్ని పరిశీలించేందుకు వెళ్లిన విలేకరులను హాస్టల్ నిర్వాహకులు గేటు బయటే ఆపేశారు. వారు కూడా ఎలాంటి వివరాలూ వెల్లడించలేదు. ఖమ్మం అర్బన్ సీఐ శ్రీహరిని వివరణ కోరగా.. తమ ఎస్సైలు ఘటనాస్థలానికి చేరుకొని మృతదేహాన్ని మార్చురీకి తరలించారని తెలిపారు. మానస కుటుంబ సభ్యులు వస్తే తప్ప ఘటనకు సంబంధించి పూర్తి వివరాలు తెలిసే అవకాశం లేదని చెప్పారు. హాస్టల్ నిర్వాహకులే కుటుంబసభ్యులకు సమాచారం ఇచ్చారని తెలిపారు. అయితే ఆదివారం రాత్రి పొద్దుపోయే వరకు వారు ఖమ్మం చేరుకోలేదు.

అమరుల కుటుంబాలకు గుర్తింపేది

భువనగిరిలో శ్రీకాంతాచారి తల్లి శంకరమ్మ



కలెక్టర్ పమేలా సత్పతికి వినతి పత్రం అందజేస్తున్న శంకరమ్మ

సాక్షి, యాదాద్రి: రాష్ట్ర ప్రభుత్వం దశాబ్ది ఉత్సవాలను నిర్వహిస్తోంది కానీ.. తెలంగాణ అమరుల కుటుంబాలకు న్యాయం చేయడం లేదని తెలంగాణ అమరుడు శ్రీకాంతాచారి తల్లి శంకరమ్మ ఆవేదన వ్యక్తం చేశారు. సురక్ష దినోత్సవంలో భాగంగా కలెక్టరేట్‌కు వచ్చిన ఆమె అమర వీరుల కుటుంబసభ్యులతో కలిసి కలెక్టర్ పమేలా సత్పతికి వినతి పత్రం అందజేశారు. అనంతరం ఆమె విలేకరులతో మాట్లాడుతూ.. తాను చనిపోయిన పర్వాలేదు.. కేసీఆర్‌ను కాపాడాలని నినాదాలు చేసి ప్రాణాలర్పించిన శ్రీకాంతాచారి కుటుంబంగా తమకు గుర్తింపు ఇవ్వాలని కోరారు. వివిధ కులాలకు హైదరాబాద్‌లో స్థలాలు ఇస్తున్నట్లుగానే తెలంగాణ అమవీరుల కుటుంబాలకూ హైదరాబాద్‌లో ఇంటి స్థలం, పింఛను ఇచ్చి అమరవీరుల కాలనీ అని పేరు పెట్టాలని డిమాండ్ చేశారు.

నగల షాపు పక్కనే గది అద్దెకు తీసుకుని..

- గోడకు రంధ్రం చేసి లోనికి ప్రవేశించిన దుండగులు
- సుమారు రూ.87 లక్షల విలువైన ఆభరణాలు చోరీ



బంగారు దుకాణంలో చోరీ కోసం గోడకు చేసిన రంధ్రం

సుజాతనగర్: జ్యూయిలరీ షాపు పక్కనే ఉన్న రూంలోకి అద్దెకి దిగి.. రాత్రి పూట షాపు, గదికి మధ్య ఉన్న గోడకు రంధ్రం చేసి లోనికి ప్రవేశించి బడా చోరీకి పాల్పడ్డ ఉదంతమిది. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా సుజాతనగర్‌లో ఆదివారం వెలుగు చూసిన ఈ ఘటన వివరాలిలా.. కొత్తగూడెంకు చెందిన అలువాల శంకర్ సుజాతనగర్‌లోని రవి కాంప్లెక్స్‌లో తొమ్మిదేళ్లుగా బంగారు నగల దుకాణం నిర్వహిస్తున్నాడు. సదరు దుకాణం ప్రక్కన ఓ గది ఖాళీగా ఉండడంతో ఇద్దరు వ్యక్తులకు గత నెల 26న కాంప్లెక్స్ యజమాని అద్దెకు ఇచ్చారు. ఈక్రమంలో గత నెల 31న శంకర్ వ్యక్తిగత పనులపై హైదరాబాద్‌కి వెళ్లాడు. దీంతో ఇదే అదనుగా భావించిన ఆ ఇద్దరు దుండగులు షాపు, గదికి మధ్య ఉన్న గోడకు రంధ్రం చేసి లోనికి ప్రవేశించారు. లోపల ఉన్న సీసీ కెమెరాల వైర్లు తొలగించి గ్యాస్ కట్టర్ సాయంతో లాకర్‌ను కట్ చేశారు. దాంట్లో ఉన్న 42 కిలోల వెండి, 1,242 గ్రాముల బంగారం.. మొత్తంగా రూ.87లక్షల విలువైన ఆభరణాలను ఎత్తుకెళ్లారు. ఆదివారం ఉదయం వచ్చిన దుకాణ యజమాని శంకర్ చోరీ జరిగినట్లు నిర్ధారించుకుని పోలీసులకు సమాచారం ఇచ్చారు. చుంచుపల్లి సీఐ రమాకాంత్, క్లూస్ టీం బృందం చేరుకుని పరిశీలించగా మరో సీసీ కెమెరా ఉన్న విషయాన్ని గుర్తించారు. ఈ పుటేజీని పరిశీలించగా 1వ తేదీ రాత్రి 11 గంటల సమయంలో చోరీ చేసి కారులో పారిపోయినట్లు తేలింది. నగదు దుకాణంలో చోరీ కోసమే దుండగులు గది అద్దెకు తీసుకున్నారని, కేసు దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

మావోయిస్టు ఉద్యమానికి 'సుస్తీ'!

సాక్షి, హైదరాబాద్: మావోయిస్టు పార్టీని కీలక నేతల అనారోగ్యం దెబ్బతీస్తోంది. ఒక్కొక్కరుగా కీలక నేతలు అనారోగ్యంతో కన్నుమూస్తుండటంతో ఉద్యమంపై ప్రభావం పడుతోంది. మూడేళ్ల కింద ముసురుకున్న కరోనా మహమ్మారి దెబ్బతో అడవుల్లోని ఎంతో మంది మావోయిస్టు కీలక నాయకులు, కేడర్ విలవిల్లాడారు. ఆ తర్వాతి నుంచి ఆరోగ్యపరమైన అంశాల్లో మావోయిస్టులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటూనే ఉన్నారు. 2021లో కరోనా కారణంగా మావోయిస్టు కేంద్ర కమిటీ సభ్యుడు యాప నారాయణ అలియాస్ హరిభూషణ్‌తో పాటు మరో కీలక నేత, ఇంద్రావతి ఏరియా కమిటీ సభ్యురాలు సిద్ధబోయిన సారక్క అలియాస్ భారతక్క మృతి చెందారు. అదే ఏడాది అక్టోబర్‌లో మావోయిస్టు అగ్రనేత, కేంద్ర కమిటీ సభ్యుడు అక్కిరాజు హరగోపాల్ అలియాస్ ఆర్కే అనారోగ్యంతో దక్షిణ బస్తర్ అటవీ ప్రాంతంలో మరణించారు. ఏటూరునాగారం–మహదేవ్‌పూర్ ఏరియా కమిటీ సభ్యుడు భిక్షపతి అలియాస్ విజేందర్ కూడా మృతి చెందారు. అంతకు ముందు అగ్రనేత కత్తి మోహన్ అలియాస్ ప్రకాశ్ సైతం అనారోగ్యంతోనే కన్నుమూశారు. కరోనాతోపాటు వయోభారం, బీపీ, షుగర్, ఇతర సీజనల్ వ్యాధులు వంటివి మావోయిస్టు నాయకులు, కేడర్‌ను కోలుకోలేని దెబ్బతీశాయి. అనారోగ్యం పాలైన వారికి మందుల సరఫరా కూడా ఇబ్బందిగా మారింది. మావోయిస్టు కీలక నేతలు గణపతి, గాజర్లరవి వంటి వారు కూడా వయోభారం, తీవ్ర అనారోగ్యాలతో బాధపడుతున్నట్టు సమాచారం.

మావోయిస్టు అగ్రనేత కటకం కన్నుమూత

▶ మొదటి పేజీ తరువాయి

ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నట్టు పేర్కొన్నారు. సుదర్శన్ మృతికి సంతాపంగా సోమవారం నుంచి ఆగస్టు 3 వరకు దేశవ్యాప్తంగా స్మారక సభలు నిర్వహించాలని పిలుపునిచ్చారు.

ర్యాడికల్ విద్యార్థి సంఘంతో మొదలై..

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా బెల్లంపల్లి పట్టణం కన్నాల బస్తీకి చెందిన పేద కార్మిక కుటుంబంలో పుట్టిన కటకం సుదర్శన్.. 1974లో మైనింగ్ డిప్లొమా చదువుతున్న సమయంలో విప్లవ పోరాటంలో అడుగు పెట్టారు. 1975లో ర్యాడికల్ విద్యార్థి సంఘం ఏర్పాటులో క్రియాశీల పాత్ర పోషించారు. తర్వాత బెల్లంపల్లి పార్టీ సెల్ సభ్యుడిగా, సింగరేణి కార్మిక ఉద్యమం, ర్యాడికల్ విద్యార్థి యువజన ఉద్యమాల్లో కీలక పాత్ర పోషించారు. నక్సల్బరీ, శ్రీకాకుళం సంఘర్షణ విముక్తి, పోరాటాల ప్రేరణతో అప్పటి పీపుల్స్‌వార్ పార్టీలో చేరారు. 1978లో లక్సెట్టిపేట, జన్నారం ప్రాంతాల్లో పార్టీ ఆర్గనైజర్‌గా బాధ్యతలు చేపట్టి రైతాంగాన్ని విప్లవోద్యమంలో సమీకరించారు. 1980లో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా కమిటీ సభ్యుడిగా దండకారణ్య ప్రాంతంలోకి విప్లవోద్యమాన్ని విస్తరించడంలో కీలకంగా పనిచేశారు. 1987లో దండకారణ్య కమిటీ సభ్యుడిగా, తర్వాత ఆదిలాబాద్ జిల్లా కార్యదర్శిగా బాధ్యతలు చేపట్టారు. ఇంద్రవెల్లి ఆదివాసీ రైతాంగ ఉద్యమానికి ప్రత్యక్షంగా నాయకత్వం వహించారు. 1995లో ఉత్తర తెలంగాణ స్పెషల్ జోనల్ కమిటీ కార్యదర్శిగా బాధ్యతలు చేపట్టారు. 2001లో భారత కమ్యూనిస్టు పార్టీ (పీపుల్స్ వార్) 9వ కాంగ్రెస్‌లో కేంద్ర కమిటీ సభ్యుడిగా ఎన్నికై పొలిట్‌బ్యూరో సభ్యుడిగా బాధ్యతలు చేపట్టారు.

ఐదు దశాబ్దాల ప్రస్థానం..

2004లో పీపుల్స్‌వార్, మావోయిస్టు కమ్యూనిస్టు పార్టీ ఆఫ్ ఇండియా(ఎంసీసీఐ) కలిసి భారత కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు)గా ఆవిర్భవించాయి. ఈ క్రమంలో 2007లో మరోమారు కేంద్ర కమిటీకి ఎన్నికై పొలిట్ బ్యూరో సభ్యుడిగా, సెంట్రల్ రీజనల్ బ్యూరో కార్యదర్శిగా పనిచేశారు. మొత్తంగా 2001 నుంచి 2017 వరకు సెంట్రల్ రీజనల్ బ్యూరో (సీఆర్‌బీ) కార్యదర్శిగా కొనసాగిన ఆయన.. తర్వాత అనారోగ్య కారణాలతో ఆ బాధ్యతల నుంచి వైదొలగి పొలిట్‌బ్యూరో సభ్యుడిగా కొనసాగారు. ఐదు దశాబ్దాల సుదీర్ఘ విప్లవోద్యమ ప్రస్థానంలో సుదర్శన్ కీలక బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహించారు. మావోయిస్టు పార్టీ ఆధ్వర్యంలో ప్రచురితమైన పలు విప్లవ పత్రికలకు సంపాదకుడిగా కూడా వ్యవహరించారు.

జీవిత భాగస్వామి ఎన్‌కౌంటర్‌లో మృతి

విప్లవోద్యమంలో చేరిన తర్వాత సుదర్శన్ సహచర విప్లవకారిణి కోలం లలితాబాయి అలియాస్ లలితక్కను విప్లవ సిద్ధాంతం ప్రకారం వివాహం చేసుకున్నారు. లలితక్క పార్టీలో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా కమిటీ కార్యదర్శి స్థాయికి ఎదిగారు. 2003లో కుమురం భీం జిల్లా బెజ్జూర్ మండలం అగర్‌గూడ అటవీ ప్రాంతంలో జరిగిన పోలీసుల ఎదురుకాల్పుల్లో ఆమె మృతి చెందారు. తర్వాత సుదర్శన్ మరో సహచర విప్లవకారిణి పద్మను ద్వితీయ వివాహం చేసుకున్నట్టు ప్రచారంలో ఉంది.

ప్రభుత్వాల ఫాసిస్టు విధానాల వల్లే సుదర్శన్ మరణం: మావోయిస్టులు

విప్లవోద్యమ నాయకులకు, కార్యకర్తలకు మందులు, వైద్య చికిత్స అందకుండా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేస్తున్న ఫాసిస్టు దాడి ఫలితంగానే సుదర్శన్ మరణించారని మావోయిస్టు కేంద్ర కమిటీ మీడియా ప్రతినిధి అభయ్ ఒక ప్రకటనలో ఆరోపించారు. తీవ్ర అనారోగ్యంతో వైద్యం కోసం మావోయిస్టు, పీఎల్‌ఏ కార్యకర్తలు, నాయకులు పట్టణాలకు వెళ్తే.. పట్టుకుని హత్యలు చేయడం, లొంగిపోతేనే మెరుగైన వైద్యం అందిస్తామని ప్రకటించడం క్రూరమైన చర్య అని పేర్కొన్నారు.

క్లుప్తంగా

నైరుతి రుతుపవనాలు మరింత ఆలస్యం

మూడు నాలుగు రోజుల్లో కేరళకు!

న్యూఢిల్లీ: కేరళ తీరాన్ని ఇప్పటికే తాకాల్సిన నైరుతి రుతుపవనాల రాక ఇంకాస్త ఆలస్యం కానుంది. మరో మూడు, నాలుగు రోజులు పడుతుందని భారత వాతావరణ శాఖ అంచనా వేస్తోంది. సాధారణంగా ఏటా నైరుతి రుతుపవనాలు జూన్ 1న కేరళ తీరాన్ని తాకి దేశమంతటా విస్తరించడంతో వానలు కురుస్తాయి. ఒక్కో ఏడాది వాటి రాక వారం దాకా ఆలస్యమవుతుంది. గత అంచనాల మేరకు జూన్ 4 కల్లా రుతుపవనాలు కేరళకు రావాల్సింది. ''వాటి రాకకు అన్నీ అనుకూలమైన పరిస్థితులే ఉన్నాయి. పశ్చిమం నుంచి వస్తున్న గాలులు దక్షిణ అరేబియా సముద్రం మీదుగా బలంగానే వీస్తున్నాయి. ఆదివారం నాటికి సముద్ర మట్టానికి 2.1. కిలోమీటర్ల పైకి వీస్తున్నాయి. ఆగ్నేయ అరేబియా సముద్రంపై ఆకాశం దట్టంగా మేఘావృతమై ఉంది. పరిస్థితులన్నీ అనుకూలంగా ఉండడం వల్ల మరో మూడు నాలుగు రోజుల్లో రుతుపవనాలు కేరళ తీరాన్ని తాకే అవకాశాలున్నాయి. ఎప్పటికప్పుడు వాతావరణ పరిస్థితుల్ని పర్యవేక్షిస్తున్నాం'' అని ఐఎండీ ప్రకటనలో వివరించింది.

టీవీ, రేడియోల్లోనూ వాతావరణ హెచ్చరికలు

న్యూఢిల్లీ: తీవ్ర వాతావరణ హెచ్చరికలను ఇకపై టీవీలు, రేడియోల్లోనూ ప్రసారం చేసేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయి. భారీ వర్షాలు, తుపాన్లు, వడగాలుల గురించి మొబైల్ ఫోన్లకు మెసేజీలు పంపే ప్రక్రియను ఇప్పటికే జాతీయ విపత్తు నిర్వహణ సంస్థ (ఎన్‌డీఎంఏ) ప్రారంభించింది. రెండో దశలో టీవీ, రేడియో తదితర మాధ్యమాల ద్వారా కూడా హెచ్చరికల మెసేజీలను పంపే ప్రక్రియ ఈ ఏడాది చివర్లో మొదలవుతుందని ఎన్‌డీఎంఏ అధికారి ఒకరు చెప్పారు.

విపక్షాల భేటీ వాయిదా!

న్యూఢిల్లీ: బీజేపీ వ్యతిరేక పార్టీలను ఉమ్మడి వేదికపైకి తీసుకొచ్చేందుకు ఉద్దేశించిన కీలక సమావేశం వాయిదా పడే అవకాశం ఉన్నట్లు తెలిసింది. పాట్నాలో ఈ నెల 12వ తేదీన ఈ భేటీ నిర్వహించాలని తొలుత నిర్ణయించారు. కాంగ్రెస్ సీనియర్ నేత రాహుల్ గాంధీ ప్రస్తుతం అందుబాటులో లేరు. ఆయన అమెరికా పర్యటనలో ఉన్నారు. దాంతో సమావేశాన్ని వాయిదా వేయాలని జేడీ(యూ) నేతలు నిర్ణయించుకున్నారు. 2024 లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీని ఓడించడమే లక్ష్యంగా విపక్ష కూటమి ఏర్పాటుకు బిహార్ సీఎం నితీశ్‌కుమార్ యత్నిస్తుండటం తెలిసిందే.

బాలాసోర్ తాత్కాలిక మార్చురీలో తమ వారి మృతదేహాల కోసం వెతుకుతున్న ఓ వ్యక్తి



మృతదేహాలను భద్రపరచడం సవాల్

ఒడిశాలో నిండిపోయిన మార్చురీలు

బాలాసోర్: ఒడిశాలోని మూడు రైళ్ల ప్రమాదంలో ఎవరూ గుర్తు పట్టని మృతదేహాల సంఖ్య అధికంగా ఉండడంతో అధికారులు అతి పెద్ద సమస్య ఎదుర్కొంటున్నారు. మార్చురీలలో చోటులేకపోవడంతో మృతదేహాలను ఎక్కడ ఉంచాలో తెలీక తలలు పట్టుకుంటున్నారు. ప్రమాద స్థలికి చుట్టుపక్కల ఆస్పత్రుల మార్చురీలు నిండిపోవడంతో పాఠశాలల్లోనూ మృతదేహాలను ఉంచారు. రైలు ప్రమాదంలో కుటుంబాలకు కుటుంబాలే దుర్మరణం పాలవడంతో వారిని గుర్తించడానికి ఎవరూ రాని దుస్థితి ఏర్పడింది. దీంతో భువనేశ్వర్‌కి 187 మృతదేహాలను తరలించారు. ఒకేసారి వందల కొద్దీ మృతదేహాలు రావడంతో భువనేశ్వర్‌లో ఉంచడం కూడా సమస్యగానే మారింది. భువనేశ్వర్ ఎయిమ్స్‌లో 110 మృతదేహాలను ఉంచారు. మిగిలినవి ప్రైవేటు ఆస్పత్రులకు పంపారు. ''బంధువులు తీసుకువెళ్లే దాకా మృతదేహాలను భద్రపరచడం కత్తి మీద సామే. ఎయిమ్స్‌లో 40కి మించి ఉంచే సదుపాయాలు లేవు'' అని ఎయిమ్స్‌కు చెందిన అధికారి ఒకరు చెప్పారు వేరే చోట భద్రపరచాలన్నా శవపేటికలు, రసాయనాలు, ఐస్ వంటివి ఏర్పాటు చేయడం కూడా కష్టమవుతోందని ఆ అధికారి చెప్పారు.

మార్చురీ బయట ఆటోలో రోదిస్తున్న మృతుల బంధువులు



ఒడిశా రైళ్ల ప్రమాదంపై... సీబీఐ విచారణ

కారణాన్ని, కారకులను గుర్తించాం
- రైల్వే మంత్రి వైష్ణవ్ ప్రకటన
- విద్రోహ కోణంపై అనుమానం

బాలాసోర్/న్యూఢిల్లీ: దేశాన్ని కుదిపేసిన ఒడిశా రైళ్ల ప్రమాదంపై సీబీఐ విచారణ జరిపించాలని రైల్వే శాఖ నిర్ణయించింది. ప్రమాదానికి మూలకారణాన్ని, ఈ 'నేరపూరిత' చర్యకు ప్రధాన కారకులను ఇప్పటికే గుర్తించినట్టు ఆదివారం రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్ ప్రకటించిన కాసేపటికే ఈ మేరకు ప్రకటన వెలువడింది. అంతేగాక, ''ప్రమాదం వెనక విద్రోహ కోణాన్నీ తోసిపుచ్చలేం. రైళ్ల ఉనికిని ఎప్పటికప్పుడు ట్రాక్ చేస్తూ వాటి గమనాన్ని నిర్దేశించే అతి కీలకమైన ఇంటర్‌లాకింగ్ వ్యవస్థను ట్యాంపర్ చేసి ఉండే అవకాశాన్ని కూడా కొట్టిపారేయలేం'' అని రైల్వే వర్గాలు చెప్పుకొచ్చాయి. రైలును ట్రాక్‌ను మళ్లించే ఎలక్ట్రిక్ పాయింట్, ఎలక్ట్రానిక్ ఇంటర్ లాకింగ్ సంబంధిత సమస్యే ప్రమాదానికి కారణమని ప్రమాద స్థలి వద్దే ఉండి సహాయక చర్యలను పర్యవేక్షిస్తున్న వైష్ణవ్ భువనేశ్వర్‌లో మీడియాకు చెప్పారు. ''పూర్తి వివరాల్లోకి నేనిప్పుడే వెళ్లదలచుకోలేదు. అయితే పాయింట్ యంత్రం సెట్టింగ్‌ను మార్చారు. ఇదెందుకు, ఎలా జరిగిందన్నది విచారణ నివేదికలో వెల్లడవుతుంది'' అని వివరించారు. మూడు రైళ్ల ప్రమాదంపై సమగ్ర దర్యాప్తు చేయాల్సిందిగా సీబీఐకి సిఫార్సు చేసినట్టు వెల్లడించారు. విపక్షాలు మాత్రం ఈ విషయంలో కేంద్రంపై దుమ్మెత్తిపోశాయి. ప్రమాదానికి పూర్తి బాధ్యత వహిస్తూ రైల్వే మంత్రి తక్షణం రాజీనామా చేయాల్సిందేనని తృణమూల్ కాంగ్రెస్, ఆర్జేడీ, సీపీఐ సహా పలు ఇతర విపక్షాలు రైల్వే మంత్రి రాజీనామాకు డిమాండ్ చేశాయి. మంత్రుల స్థాయి నుంచి కింది దాకా బాధ్యులందరినీ గుర్తించి కఠినాతి కఠినంగా శిక్షించి తీరాల్సిందేనని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, పార్టీ నేతలు రాహుల్‌గాంధీ, ప్రియాంక గాంధీ డిమాండ్ చేశారు. మోదీ సర్కారు మీడియా పిచ్చి, పీఆర్ గిమ్మిక్కులు ప్రభుత్వ వ్యవస్థను చేతగానిదిగా మార్చేశాయమంటూ ఖర్గే తూర్పారబట్టారు. యూపీఏ హయాంలో రైల్వే మంత్రుల పనితీరు ఎంత ఘోరంగా ఉండేదో కాంగ్రెస్ ఆత్మ పరిశీలన చేసుకోవాలంటూ బీజేపీ ఎదురుదాడికి దిగింది. మహా విపత్తును కూడా రాజకీయం చేయడం దారుణమని మండిపడింది. ప్రమాదంలో మరణించిన వారి తుది సంఖ్యను 288 నుంచి 275గా రైల్వే శాఖ ఆదివారం సవరించింది.



ప్రమాదస్థలి వద్ద యుద్ధప్రాతిపదికన కొనసాగుతున్న ట్రాక్‌ల పునరుద్ధరణ పనులు

విద్రోహ కోణంపై రైల్వే ఏం చెప్పిందంటే...

పాయింట్ మెషీన్, ఇంటర్ లాకింగ్ వ్యవస్థ పూర్తిగా సురక్షితమని రైల్వే వర్గాలు వివరించాయి. ''అదెంత సురక్షితమంటే ఒకవేళ అది పూర్తిగా విఫలమైనా సిగ్నళ్లన్నీ వెంటనే రెడ్‌కు మారి రైళ్ల రాకపోకలన్నీ తక్షణం నిలిచిపోతాయి. అయినా సిగ్నలింగ్ సమస్యే ప్రమాదానికి కారణమైంది గనుక బయటి శక్తుల ప్రమేయాన్ని తోసిపుచ్చలేం. కేబుళ్లను చూసుకోకుండా ఎవరైనా తవ్వేయడంతో తెగిపోయి ఉండొచ్చు'' అని రైల్వే బోర్డు సభ్యురాలు జయా వర్మ సిన్హా వివరించారు. ప్రమాదానికి మితిమీరిన వేగం, డ్రైవర్ల తప్పిదం కారణం కావని రైల్వే వర్గాలు స్పష్టం చేశాయి. లోపలి, లేదా బయటివ్యక్తులు విద్రోహానికి పాల్పడే అవకాశాన్నీ తోసిపుచ్చలేమని రైల్వే అధికారి ఒకరన్నారు.

టికెట్ లేని వారికీ పరిహారం

షాలిమార్ నుంచి చెన్నై వెళ్తున్న కోరమండల్ శుక్రవారం రాత్రి ఒడిశాలోని బహనగా బజార్ స్టేషన్ సమీపంలో లూప్‌లైన్లోకి దూసుకెళ్లి ఆగున్న గూడ్సును ఢీకొని పట్టాలు తప్పడం, పక్క ట్రాక్‌పై పడ్డ బోగీలను ఢీకొని బెంగళూరు-హౌరా ఎక్స్‌ప్రెస్ కూడా పట్టాలు తప్పడం తెలిసిందే. ఈ ఘోర ప్రమాదంలో గాయపడ్డ 1,175 మందిలో వందలాది మంది ఇంకా పలు ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్నారు. రెండు రైళ్లలో చాలావరకు వలస కార్మికులే ఉన్నారు. ఈ నేపథ్యంలో సుప్రీంకోర్టు గత ఆదేశాలను దృష్టిలో ఉంచుకుని టికెట్ లేని ప్రయాణికులకు కూడా పరిహారం అందించనున్నట్టు రైల్వే శాఖ ప్రకటించింది. మరోవైపు సహాయ చర్యలతో పాటు ట్రాక్‌ల పునరుద్ధరణ పనులు కూడా యుద్ధ ప్రాతిపదికన సాగుతున్నాయి. తూర్పు, దక్షిణ భారతాలను కలిపే ఈ కీలక రైల్వే లైన్లో పూర్తిగా దెబ్బ తిన్న ట్రాకుల్లో ఇప్పటిదాకా రెండింటిని పునరుద్ధరించారు.

ప్రమాదంపై సుప్రీంలో పిల్

సాక్షి, న్యూఢిల్లీ: ఒడిశాలో రైలు ప్రమాదంపై సుప్రీంకోర్టు రిటైర్డ్ న్యాయమూర్తి సారథ్యంలో విచారణకు కేంద్రాన్ని ఆదేశించాలంటూ సర్వోన్నత న్యాయస్థానంలో పిల్ దాఖలైంది. రైల్వే వ్యవస్థలో ప్రమాద, భద్రత పరామితులను కమిటీ విశ్లేషించి, వాటి బలోపేతానికి సలహాలు, సూచనలిచ్చేలా చర్యలు తీసుకోవాలని పిటిషనర్ విశాల్ తివారీ కోరారు. కవచ్ వ్యవస్థను వెంటనే అమలు చేసేలా మార్గదర్శకాలివ్వాలన్నారు.

సిగ్నల్ రాంగ్ రూట్

- మూడు నెలల ముందు సంపర్క్ క్రాంతికి తప్పిన ప్రమాదం
- సిగ్నల్ వ్యవస్థలో లోపాలు అరికట్టాలంటూ అప్పట్లోనే హెచ్చరికలు

భువనేశ్వర్: ఒడిశాలోని మూడు రైళ్లు ఢీకొని 275 మంది ప్రాణాలు బలైపోయిన తర్వాత మన దేశంలో రైల్వే సిగ్నల్ వ్యవస్థలో ఉన్న లోటుపాట్లు ఒక్కొక్కటిగా బయటకి వస్తున్నాయి. మూడు నెలల ముందే సిగ్నల్ వ్యవస్థలో తీవ్రమైన లోపాలు ఉన్నాయంటూ సౌత్ వెస్ట్రన్ రైల్వే జోన్ చీఫ్ ఆపరేటింగ్ మేనేజర్ రాసిన లేఖ ఒకటి మీడియాకి చిక్కింది. సిగ్నల్ వ్యవస్థలో లోపాలు వెంటనే సవరించకపోతే భారీ ప్రమాదాలు చోటు చేసుకోవడం ఖాయమంటూ ఆ చీఫ్ మేనేజర్ రైల్వే శాఖ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళుతూ ఫిబ్రవరి 9న లేఖ రాశారు. ఫిబ్రవరి 8వ తేదీన బెంగుళూరు నుంచి న్యూఢిల్లీకి వెళ్లే సంపర్క్ క్రాంతి ఎక్స్‌ప్రెస్ భారీ ప్రమాదానికి గురై ఉండాల్సిందని డ్రైవర్ అప్రమత్తతతో వ్యవహరించడం వల్ల ముప్పు తప్పిందని ఆయన ఆ లేఖలో పేర్కొన్నారు. సంపర్క్ క్రాంతి ఎక్స్‌ప్రెస్ ప్రయాణిస్తున్న సమయంలో మెయిన్ లైన్ ద్వారా వెళ్లవచ్చునని డ్రైవర్‌కి గ్రీన్ సిగ్నల్ వచ్చింది. అలా సిగ్నల్ వచ్చినప్పుడు పట్టాల దగ్గర ఉండే పాయింట్ మారాలి. రైలుని ఒక ట్రాక్ నుంచి మరో ట్రాక్‌కి మళ్లించడాన్ని పాయింట్ అంటారు. అయితే సిగ్నల్, పాయింట్ పరస్పర విరుద్ధంగా ఉన్నాయి. దీనిని గమనించిన డ్రైవర్ సరైన సమయంలో రైలుని ఆపేశారు. దీంతో పెను ప్రమాదం తప్పింది. ఇంటర్‌లాకింగ్ వ్యవస్థని సరిగా వినియోగించుకోలేకపోవడం వల్ల ముంచుకొచ్చిన ప్రమాదం ఇదని ఆయన ఆ లేఖలో వివరించారు. సిగ్నలింగ్ సాంకేతిక వ్యవస్థపై సమగ్రమైన విచారణ జరపడమే కాకుండా, స్టేషన్ మాస్టర్లు, ట్రాఫిక్ ఆఫీసర్లు, ట్రావెలింగ్ ఇన్‌స్పెక్టర్లపై దీనిపై అవగాహన పెంచే ప్రయత్నాలు చేయాలన్నారు. సిగ్నల్ వ్యవస్థని నిరంతరం పర్యవేక్షిస్తూ వెనువెంటనే లోపాలు సరిదిద్దుకోకపోతే ఘోరమైన ప్రమాదాలు చూస్తామని సౌత్ వెస్ట్రన్ రైల్వే చీఫ్ ఆపరేటింగ్ మేనేజర్ మూడు నెలల కిందటే హెచ్చరికలు జారీ చేశారు.



బిహార్‌లో కూలిన తీగల వంతెన

నిర్మాణంలో ఉండగానే ఈదురుగాలులకు పగుళ్లు

వంతెన కూలిపోతున్న దృశ్యాలు



పట్నా: రూ.1,700 కోట్ల వ్యయంతో నిర్మిస్తున్న భారీ తీగల వంతెన కూలిపోయింది. బిహార్ రాష్ట్రం భాగల్పూర్ జిల్లాలో ఆదివారం ఈ సంఘటన జరిగింది. నిర్మాణంలో ఈ వారధి తొలుత రెండు ముక్కలుగా విడిపోయింది. ఒకదాని తర్వాత ఒకటి నేలకూలాయి. ఈ ఘటనలో ఎవరికీ ఎలాంటి ప్రమాదం వాటిల్లలేదు. బ్రిడ్జి కూలిపోతున్న దృశ్యాలు సోషల్ మీడియాలో ప్రత్యక్షమయ్యాయి. గంగా నదిపై ఖగారియా.. అగువానీ, సుల్తాన్‌గంజ్ మధ్య ఈ బ్రిడ్జి నిర్మాణం ప్రారంభించారు. రెండేళ్ల క్రితం కొంత భాగం కూలిపోవడంతో పునర్నిర్మించారు. రెండు నెలల క్రితం బలమైన ఈదురు గాలుల ధాటికి పగుళ్లు వచ్చాయి. ఆదివారం నేల కూలింది. దాదాపు ఐదు స్తంభాలు కూలిపోయినట్లు అధికారులు వెల్లడించారు. ఈ ఘటనపై సమగ్ర దర్యాప్తు జరపాలని బిహార్ ముఖ్యమంత్రి నితీశ్ కుమార్ ఆదేశాలు జారీ చేశారు. నిర్మాణంలో ఉన్న వంతెన కూలిన ఘటనపై ప్రతిపక్ష బీజేపీ నేత విజయ్‌కుమార్ సిన్హా స్పందించారు. రాష్ట్రంలో ప్రతి పనిలోనూ కమిషన్లు తీసుకోవడం ఒక సంప్రదాయంగా మారిపోయిందని నితీశ్ కుమార్ ప్రభుత్వంపై మండిపడ్డారు. రాష్ట్రంలో పరిపాలన ఆగిపోయిందని, అరాచకం, అవినీతి పెచ్చరిల్లిపోతున్నాయని ఆరోపించారు. ఇక్కడ వ్యవస్థలు భ్రష్టుపట్టిపోతుంటే సీఎం నితీశ్ విపక్షాల ఐక్యత గురించి మాట్లాడుతున్నారని ఎద్దేవా చేశారు.

తీవ్రంగా చలించిపోయా: బైడెన్



వాషింగ్టన్: ఒడిశాలోని బాలాసోర్‌లో రైలు ప్రమాద ఘటనపై అమెరికా అధ్యక్షుడు బైడెన్ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. భారత్‌లో సుమారు 300 మందిని బలి తీసుకున్న రైలు ప్రమాద విషాద వార్త విని తీవ్రంగా చలించిపోయానని బైడెన్ పేర్కొన్నారు. 'భారత్‌లో చోటుచేసుకున్న అత్యంత తీవ్రమైన రైలు ప్రమాద విషాద వార్త విని నేను, నా భార్య జిల్ బైడెన్ తీవ్ర దిగ్భ్రాంతి చెందాము. ఈ ఘటనలో ఆత్మీయులను కోల్పోయిన వారికి, క్షతగాత్రుల గురించి ప్రార్థిస్తున్నాం. భారత్, అమెరికాను ఇరు దేశాల కుటుంబ, సాంస్కృతిక మూలాల్లో ఉన్న విలువలే ఏకం చేస్తున్నాయి. బాధితుల కోసం యావత్తు అమెరికా సంతాపం వ్యక్తం చేస్తోంది'అని బైడెన్ ఒక ప్రకటనలో తెలిపారు. బాలాసోర్ ఘటనపై ఇప్పటికే యూకే ప్రధాని రిషి సునాక్, రష్యా అధ్యక్షుడు పుతిన్, జపాన్ ప్రధాని కిషిదా తదితరులు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు.

క్షతగాత్రులను తరలిస్తున్న బస్సుకు ప్రమాదం

మేదినీపూర్: ఒడిశా రాష్ట్రం బాలాసోర్ రైలు ప్రమాద ఘటనలో గాయపడిన వారిని తీసుకెళ్తున్న బస్సు పశ్చిమబెంగాల్‌లోని మేదినీపూర్‌లో ప్రమాదానికి గురైంది. శనివారం రాత్రి 7 గంటల సమయంలో బస్సు, పికప్ వ్యాన్ ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ ఘటనతో జాతీయ రహదారిపై ట్రాఫిక్ నిలిచిపోయింది. బస్సులోని వారిలో ఎక్కువమంది గాయాలపాలయ్యారు. క్షతగాత్రులను వివిధ ఆస్పత్రులకు తరలించారు.

రైల్వే ట్రాక్‌ల నిర్వహణ... లోపాలమయం

- ఇంజనీరింగ్ విభాగం తప్పిదాలతోనే ప్రమాదాలు
- కాగ్ అక్షింతలు వేసినా రైల్వే శాఖ పట్టించుకోని వైనం

సాక్షి, అమరావతి: రైల్వేలో భద్రతా లోపాలపై గత ఏడాది కంట్రోలర్ అండ్ ఆడిటన్ జనరల్ (కాగ్) కూడా తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. 2017 నుంచి 2021 మధ్య కాలంలో జరిగిన రైలు ప్రమాదాలు ప్రతీ నాలుగింటిలో మూడు పట్టాలు తప్పిన ఘటనలే జరిగాయని తెలిపింది. ట్రాక్స్ నిర్వహణలో లోపాలే కారణంగానే ప్రమాదాలు జరుగుతున్నాయని వెల్లడించింది. 2022 డిసెంబర్‌లో పార్లమెంటులో ప్రవేశపెట్టిన ఈ నివేదికలో ఏదైనా రైలు ప్రమాదం జరిగిన తర్వాత పూర్తి స్థాయిలో నివేదికలు రావడం లేదని, ఆ ప్రమాదం లోపాలను మళ్లీ సవరించుకోవడం లేదని కాగ్ నిందించింది.

- 422 రైళ్లు పట్టాలు తప్పితే అందులో 171 ప్రమాదాలు ట్రాక్స్ నిర్వహణలో లోపాల కారణంగా జరిగితే, మరో 156 ఒక ఒక లైన్‌లోకి బదులుగా మరో లైన్‌లోకి వెళ్లడం వల్ల జరిగాయి.
- 63శాతం దుర్ఘటనల్లో విచారణ నివేదికలను నిర్ణీత కాల పరిమితిలోగా విచారణ నివేదికను సమర్పించ లేదు. 49శాతం ఘటనల్లో విచారణ నివేదికను ఉన్నతాధికారులు నిర్ణీత కాలపరిమితిలోగా ఆమోదించలేదు.
- రైల్వేను నిధులు కొరత వేధిస్తోంది. అత్యధిక ప్రాధాన్యతతో చేపట్టాల్సిన పనులకు కూడా నిధులు కేటాయింపులో కేంద్ర ప్రభుత్వం కోత విధిస్తోంది. 2017-18లో కేటాయించిన పనుల్లో 81.55 శాతం పనులే పూర్తిచేయగా 2019-20లో కేవలం 73.76శాతం పనులే చేయగలిగింది
- రైల్వే ట్రాకుల పునరుద్ధరణ పనుల కోసం 2018-19లో రూ.9,607.65కోట్లు కేటాయించగా 2019-20లో అంతకంటే తక్కువగా రూ.7,417కోట్లే కేటాయించింది.

ట్రాక్స్ నిర్వహణ వ్యవస్థ వైఫల్యాలు ప్రతీసారి ప్రమాదం జరిగినప్పుడు కొట్టొచ్చినట్టుగా కనిపిస్తూనే ఉన్నాయి. ఆన్‌లైన్ ద్వారా ట్రాక్స్ నిర్వహణ కార్యకలాపాలను పర్యవేక్షించే ఈ వ్యవస్థ సరిగా పనిచేయకపోవడంతో క్షేత్రస్థాయిలో ఏం జరుగుతోందో అధికారులకి తెలీడం లేదు. రైల్వే భద్రతపై కాగ్ అక్షింతలు వేసినా అధికారుల అలసత్వమే ఒడిశా రైలు ప్రమాదానికి కారణమని విశ్లేషణలు వినిపిస్తున్నాయి.

ఒడిశా రైలు దుర్ఘటనకు ప్రధాన కారణం ఏమిటన్న దానిపై చర్చ మొదలైంది. ఒకే ట్రాక్‌పై ప్రయాణించే రైళ్లు ఒకదానికొకటి ఢీకొట్టకుండా కవచ్ అనే ఆధునిక వ్యవస్థ ఉన్నప్పటికీ భారీ ప్రమాదం జరగడం చర్చనీయాంశంగా మారింది. అయితే, ఒడిశా ప్రమాద ఘటనకు కవచ్ వ్యవస్థతో సంబంధం లేదని రైల్వేశాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ స్వయంగా ప్రకటించారు. ఎలక్ట్రానిక్ ఇంటర్‌లాకింగ్(ఈఐ) వ్యవస్థలో చోటుచేసుకున్న మార్పుల వల్లే ఈ ఘోరం జరిగిందని తెలిపారు. బాధ్యులను గుర్తించామని చెప్పారు. దర్యాప్తు కొనసాగుతోందని, రైలు సేఫ్టీ కమిషనర్ త్వరలో నివేదిక అందజేస్తారని వెల్లడించారు. సిగ్నలింగ్‌లో లోపాల కారణంగానే రైలు ప్రమాదం జరిగినట్లు రైల్వే బోర్డు ప్రాథమికంగా అంచనా వేసింది. ఈ నేపథ్యంలో అసలు ఇంటర్‌లాకింగ్ సిస్టమ్ అంటే ఏమిటన్న దానిపై ఆసక్తి నెలకొంది. ఈ వ్యవస్థ ఎలా పని చేస్తుంది? దాని వల్ల రైళ్లు ఎంత భద్రం? అనేది తెలుసుకుందాం..

ఎలక్ట్రానిక్ ఇంటర్‌లాకింగ్ సిస్టం భద్రతకు భరోసా




రైళ్ల భద్రతే లక్ష్యంగా...

ఇంటర్‌లాకింగ్ వ్యవస్థ రైళ్ల భద్రతే లక్ష్యంగా పని చేస్తుంది. రైళ్ల రాకపోకలు, సిగ్నల్స్, ట్రాక్స్‌ను నియంత్రించడానికి ఈ వ్యవస్థను ప్రవేశపెట్టారు. ఒకప్పుడు మనుషులు చేసిన పనిని ఇప్పుడు కంప్యూటర్ల సాయంతో నిర్వర్తిస్తున్నారు. భారతీయ రైల్వే నెట్‌వర్క్‌లో 45 శాతానికి పైగా స్టేషన్లు ఎలక్ట్రానిక్ ఇంటర్‌లాకింగ్ వ్యవస్థతో అనుసంధానమయ్యాయి. రైల్వేల ఆధునికీకరణలో భాగంగా ఎలక్ట్రానిక్ ఇంటర్‌లాకింగ్ వ్యవస్థను కేంద్ర ప్రభుత్వం యుద్ధ ప్రాతిపదికన ఏర్పాటు చేస్తోంది. 2022-23లో కొత్తగా 347 స్టేషన్లలో ఈ సిస్టమ్ ఏర్పాటు చేశారు. దేశంలో బ్రాడ్‌గేజ్(బీజీ) మార్గాల్లో 6,506 రైల్వే స్టేషన్లు ఉండగా, వీటిలో 6,396 స్టేషన్లలో ఎలక్ట్రానిక్ ఇంటర్‌లాకింగ్ వ్యవస్థ ఏర్పాటయ్యింది. ఒడిశాలో ప్రమాదం జరిగిన బహనాగ బజార్ రైల్వేస్టేషన్‌లోనూ ఈ వ్యవస్థ ఉంది.

ఇది అందుబాటులోకి వచ్చిన తర్వాత బాగా తగ్గిన రైలు ప్రమాదాలు

- రైళ్లకు ట్రాక్‌లను కేటాయించడంలో కీలకం
- ఒడిశా ప్రమాదానికి ఇతర పరిస్థితులు, మానవ తప్పిదాలే కారణమంటున్న నిపుణులు

ఏమిటీ లాకింగ్ సిస్టమ్?



→ రైల్వే సిగ్నలింగ్ వ్యవస్థలో ఇదొక అంతర్భాగం. నిర్దేశిత మార్గాల్లో రైళ్లు క్షేమంగా రాకపోకలు సాగించేలా ఎలక్ట్రానిక్ ఇంటర్‌లాకింగ్ సిస్టమ్ ద్వారా నియంత్రిస్తారు.

→ గతంలో మెకానికల్, ఎలక్ట్రో-మెకానికల్ ఇంటర్‌లాకింగ్ వ్యవస్థలు ఉండేవి. వాటి ఆధునిక రూపమే ఎలక్ట్రానిక్ ఇంటర్‌లాకింగ్ సిస్టమ్.

→ సంప్రదాయ ప్యానెల్ ఇంటర్‌లాకింగ్, ఎలక్ట్రో-మెకానికల్ ఇంటర్‌లాకింగ్‌తో పోలిస్తే ఈ అధునాతన వ్యవస్థతో ఎన్నో ప్రయోజనాలు ఉన్నాయి.

→ సాఫ్ట్‌వేర్ ఆధారంగా పనిచేస్తుంది. సిగ్నలింగ్ వ్యవస్థలో ఎలాంటి మార్పులు చేర్పులైనా సులభంగా చేసుకోవచ్చు.

→ ఇది ప్రాసెసర్ ఆధారిత వ్యవస్థ అని నిపుణులు చెబుతున్నారు. విస్తృతమైన ప్రయోగ పరీక్షల తర్వాతే దీన్ని తీసుకొచ్చారు.

→ ట్రైన్ డిటెక్షన్ సిస్టమ్, సిగ్నళ్లు, పాయింట్లు, ట్రాక్ సర్క్యూట్లు వంటి వాటితో అనుసంధానమై పనిచేస్తుంది. ఇందుకోసం కంప్యూటర్లు, ప్రోగ్రామ్‌బుల్ లాజిక్ కంట్రోలర్లు, కమ్యూనికేషన్ నెట్‌వర్క్, సెన్సార్లు, ఫీడ్ బ్యాకింగ్ పరికరాలు ఉపయోగిస్తారు.

→ రైళ్ల కదలికలను ఎప్పటికప్పుడు గుర్తిస్తూ ప్రమాదాల జరగకుండా నియంత్రించడానికి వీలుంటుంది.

→ ఒకే ప్రాంతంలో ఒకే పట్టాల(ట్రాక్)పై ఏకకాలంలో రెండు రైళ్లు ఉండకుండా చూస్తుంది. రైళ్లకు ట్రాక్‌లను కేటాయించే వ్యవస్థ ఇది.

→ ఒక మార్గంలో ప్రయాణం పూర్తి సురక్షితం అని తేలేదాకా రైలుకు సిగ్నల్ ఇవ్వకుండా ఆపేస్తుంది. ఈ వ్యవస్థ అందుబాటులోకి వచ్చాక రైలు ప్రమాదాలు, పరస్పరం ఢీకొనడం వంటివి చాలావరకు తగ్గిపోయాయి

వైఫల్యాలు ఎందుకు?

ఎలక్ట్రానిక్ ఇంటర్‌లాకింగ్ సిస్టమ్ సమర్థంగా పనిచేయడమే కాదు, మొరాయించిన సందర్భాలు కూడా ఉన్నాయి.

ఈ వ్యవస్థలో ఏదైనా లోపం తలెత్తితే సిగ్నల్ వెంటనే ఎరుపు రంగులోకి మారిపోతుంది. తద్వారా రైలు నడిపించే లోకో పైలట్‌కు తక్షణమే సంకేతం అందుతుంది.

ఒకవేళ ఎలక్ట్రానిక్ ఇంటర్‌లాకింగ్ సిస్టమ్ వైఫల్యం చెందితే అందుకు బహిర్గత పరిస్థితులు, మానవ చర్యలే చాలావరకు కారణమవుతాయని నిపుణులు పేర్కొంటున్నారు.

ఒడిశా ఘటనలో ఎలక్ట్రానిక్ ఇంటర్‌లాకింగ్ సిస్టమ్‌లో నార్మల్ లైన్‌పై పాయింట్ సెట్ చేయాల్సి ఉండగా, లూప్‌లైన్‌పై చేశారని, మానవ ప్రమేయం లేకుండా ఇది జరిగేది కాదని సిగ్నలింగ్ నిపుణుడొకరు చెప్పారు.

రైలు ప్రమాదం జరిగిన ప్రాంతంలోనే నిర్మాణ పనులు కొనసాగుతున్నాయి. తవ్వకాలు కూడా జరిగినట్లు తెలుస్తోంది. దానివల్ల అక్కడ సిగ్నలింగ్‌కు సంబంధించిన వైర్లు దెబ్బతినడం లేదా షార్ట్ సర్క్యూట్ జరగడం, ఫలితంగా రైలుకు సరైన సంకేతం ఇవ్వడంలో ఎలక్ట్రానిక్ ఇంటర్‌లాకింగ్ సిస్టమ్ వైఫల్యం చెంది ఉండొచ్చన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

- సాక్షి, నేషనల్ డెస్క్

పొడవాటి నాలుకతో జోయి గిన్నిస్ రికార్డు



అమెరికాలోని లూసియానాకు చెందిన ఈ కుక్క పేరు జోయి. దీని నాలుక పొడవు 12.7 సెంటీమీటర్లు. అత్యంత పొడవైన నాలుకతో జీవించి ఉన్న కుక్కగా ఇది గిన్నిస్ రికార్డుల్లోకెక్కింది.



అంజన్న సన్నిధిలో రద్దీ

కొండగట్టు: కొండగట్టు అంజన్న సన్నిధిలో ఆదివారం రద్దీ నెలకొంది. వివిధ ప్రాంతాలకు చెందిన దాదాపు 10వేల మంది స్వామివారిని దర్శించుకున్నారు.



వేములవాడలో భక్తులు

వేములవాడ: వేములవాడ రాజన్న సన్నిధిలో ఆదివారం భక్తుల రద్దీ నెలకొంది. వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చి మొక్కులు చెల్లించుకున్నారు.

గరిష్టం/కనిష్టం
39.0/28.0

వాతావరణం

ఆకాశం మేఘావృతమవుతుంది. జిల్లాలో వర్షం కురిసే అవకాశం ఉంది. గాలిలో తేమ అధికంగా ఉంటుంది. వడగాలులు వీస్తాయి.

న్యూస్‌రీల్

మహిళలతో రేషన్ దుకాణాల నిర్వహణ



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ శ్యాంప్రసాద్

కరీంనగర్ అర్బన్: రేషన్ డీలర్లు సమ్మె చేస్తున్నందున మహిళా సంఘాల ద్వారా రేషన్ పంపిణీ చేసేలా చర్యలు తీసుకోవాలని అదనపు కలెక్టర్ జీవీ.శ్యాంప్రసాద్ లాల్ అధికారులను ఆదేశించారు. ఆదివారం కలెక్టరేట్‌లోని ఆడిటోరియంలో రేషన్ సరుకుల పంపిణీపై సమీక్షించారు. రేషన్ డీలర్లు సమ్మె చేస్తున్నందున వారి బయోమెట్రిక్, ఇపాస్, వెయింగ్ మిషన్లు స్వాధీనం చేసుకుని మహిళా సంఘాలతో రేషన్ షాపులను నిర్వహించేలా చూడాలని అన్నారు. ఈ కార్యక్రమంలో కరీంనగర్, హుజూరాబాద్ ఆర్డీవోలు ఆనంద్ కుమార్, హరిసింగ్, డీఆర్డీవో శ్రీలత, మున్సిపల్ కమిషనర్ సేవా ఇస్లావత్, పౌర సరఫరాలశాఖ అధికారి సురేశ్‌రెడ్డి, తహసీల్దార్లు, మెప్మా సిబ్బంది పాల్గొన్నారు.

సీఎం కేసీఆర్‌తోనే గ్రామాల అభివృద్ధి



శంకుస్థాపన పూజలు చేస్తున్న కౌశిక్‌రెడ్డి

వీణవంక: సీఎం కేసీఆర్‌తోనే గ్రామాల అభివృద్ధి జరిగిందని ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ పాడి కౌశిక్‌రెడ్డి అన్నారు. వీణవంక నుంచి నర్సింగపూర్ వరకు ఫోర్‌లేన్ రోడ్డు నిర్మాణానికి రూ.29.80కోట్లు మంజూరు కాగా ఆదివారం రోడ్డు పనులకు శంకుస్థాపన చేశారు. కౌశిక్‌రెడ్డి మాట్లాడుతూ.. వీణవంక గ్రామాన్ని అన్నివిధాలా అభివృద్ధి చేస్తామని హామీ ఇచ్చారు. అనంతరం మండలంలోని పలు గ్రామాల్లో లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ ముసిపట్ల రేణుక, వైస్ ఎంపీపీ రాయిశెట్టి లత, బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకులు మాడ సాధవరెడ్డి, గంగాడి తిరుపతిరెడ్డి, సిద్దపల్లి మహిపాల్‌రెడ్డి, సర్పంచ్ నీల కుమార్ పాల్గొన్నారు.

ధాన్యం డబ్బులు జమ చేయాలి

చొప్పదండి: రైతులు ధాన్యం అమ్ముకొని రోజులు గడుస్తున్నా రైతుల అకౌంట్లలో డబ్బులు వేయడం లేదని ఆల్ ఇండియా రెడ్డి సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు బీరెడ్డి కరుణాకర్ రెడ్డి విమర్శించారు. ఆదివారం చొప్పదండిలో మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ధాన్యం డబ్బులను రైతులకు 48 గంటల్లో జమ చేస్తానని చెప్పిందని, ఇరువై రోజులు గడిచినా జమ కావడం లేదని ఆరోపించారు. వడగండ్ల వానతో నష్టపోయిన పంటలకు ఎకరానికి రూ.30వేల చొప్పున అందించాలని సూచించారు. 60ఏళ్లు నిండిన రైతులకు రూ.5వేల పింఛన్ అమలు చేయాలని, రైతుబీమా పరిమితిని 65ఏళ్లకు పెంచాలని ఈ సందర్భంగా కోరారు.

నేడు మందకృష్ణ మాదిగ పర్యటన

కరీంనగర్: ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ సోమవారం జిల్లాలో పర్యటించనున్నట్లు ఎంఎస్‌పీ ఉమ్మడి కరీంనగర్ జిల్లా ఇన్‌చార్జి ఇంజం వెంకటస్వామి ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 11 గంటలకు వీహెచ్‌పీఎస్ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట జరిగే ధర్నాలో పాల్గొని వారికి సంఘీభావం తెలుపుతారని పేర్కొన్నారు. మధ్యాహ్నం మూడు గంటలకు రెవెన్యూ గార్డెన్‌లో ఎంఎస్‌పీ, ఎమ్మార్పీఎస్ అనుబంధ సంఘాల ఉమ్మడి జిల్లా సమావేశంలో పాల్గొని భవిష్యత్తు కార్యాచరణ ప్రసంగిస్తారని తెలిపారు. రాత్రి 8 గంటలకు జిల్లా ముఖ్యుల సమావేశం ఉంటుందని ఈ సందర్భంగా పేర్కొన్నారు.

'బడిబాట'ను విజయవంతం చేయాలి

కరీంనగర్: రాష్ట్ర ప్రభుత్వం ఈనెల మూడో తేదీ నుంచి చేపట్టిన బడిబాట కార్యక్రమాన్ని జిల్లావ్యాప్తంగా ఉపాధ్యాయులు విజయవంతం చేయాలని పీఆర్‌టీయూ తెలంగాణ జిల్లా అధ్యక్షుడు గోనె శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి పల్లెపాటి వేణుగోపాల్‌రావు ఒక ప్రకటనలో విజ్ఞప్తి చేశారు. బడిబాటలో ఉపాధ్యాయులు సర్పంచ్, వార్డుసభ్యులు, ప్రజాప్రతినిధుల, స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ సభ్యుల సహకారంతో విస్తృత ప్రచారం నిర్వహించాలని కోరారు. ఆంగ్ల మాధ్యమంలో నాణ్యమైన విద్యాబోధన, ఉచిత పాఠ్యపుస్తకాలు, యూనిఫామ్, మధ్యాహ్న భోజనం, క్రమశిక్షణ తదితర విషయాల గురించి పిల్లల తల్లిదండ్రులకు సమగ్రంగా వివరించాలని సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలల్లో స్కావెంజర్లను నియమించాలని, ఉపాధ్యాయుల కొరత ఉన్నచోట విద్యావలంటీర్లను వెంటనే నియమించాలని ఈ సందర్భంగా కోరారు.

ప్రైవేటుపైనే మక్కువ

- జిల్లా ఆసుపత్రిలో అందుబాటులో ఉండని సీనియర్ వైద్యులు
- జూనియర్లతోనే నడుస్తున్న ఓపీ సర్వీసులు
- ఇబ్బంది పడుతున్న రోగులు

'నగరంలోని గాంధీరోడ్‌కు చెందిన మల్లమ్మ మోకాలునొప్పితో బాధపడుతూ వైద్యం కోసం జిల్లా ఆసుపత్రికి వచ్చింది. ఓపీ చిట్టీ రాయించుకొని ఎముకల వైద్యుడికి చూపించుకుందామని ఓపీ గదికి వెళ్లింది. అయితే ఎముకల వైద్యుడి స్థానంలో ముగ్గురు జూనియర్ వైద్యులు ఉన్నారు. చేసేది లేక వారికే చూపించుకొని మందులు తీసుకొని తిరుగు ప్రయాణమైంది.' ఇది ఒక్క ఎముకల వైద్యుడి సమస్యే కాదు. ఆస్పత్రిలో ఓపీ చూడాల్సిన అన్ని విభాగాల సీనియర్ వైద్యులు ఓపీల్లో కూర్చోకుండానే కాలం వెల్లదీయడం సర్వసాధారణంగా మారింది'.



కరీంనగర్‌టౌన్: జిల్లా ప్రభుత్వ ఆసుపత్రి, పీహెచ్‌సీలు, ఏరియా ఆసుపత్రుల్లో సరిపడా వైద్యులు ఉన్నా నిరుపేదలకు వైద్యం అందని ద్రాక్షలా మారింది. ప్రభుత్వాసుపత్రుల్లో పనిచేసే ప్రతీ వైద్యుడికి ఒక ప్రైవేటు క్లినిక్ లేదా కార్పొరేట్ స్థాయి ఆసుపత్రిలో ఉద్యోగం ఉండడంతో వారు ప్రైవేటుపైనే మక్కువ చూపుతున్నారు. ప్రభుత్వాసుపత్రిలో వేతనం పొందుతూ ధనార్జనే ధ్యేయంగా ప్రైవేటులో పని చేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. సీనియర్ వైద్యులు ఒక్కరు కూడా ఓపీ సేవలు అందించడం లేదు. హౌజ్‌సర్జన్‌లు, హోమియో, ఆయుర్వేద శిక్షణ వైద్యులతోనే ఓపీ సేవలు అందిస్తున్నారు. రోగం ఒకటైతే మందు మరొకటి అన్నట్లు జూనియర్లు, హోమియో, ఆయుర్వేద వైద్యుల చికిత్సతో రోగులకు ఇబ్బందులు తప్పడం లేదు. ప్రభుత్వ ఆసుపత్రిలో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు సేవలు అందించాల్సిన వైద్యులు 11 గంటలకు వచ్చి మధ్యాహ్నం 12 గంటల తర్వాతే వెళ్లి పోతుండడంతో నిరుపేద రోగుల నాడీ పట్టేవారే కరువయ్యారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం వైద్యుల సర్వీసు రూల్స్‌లో మార్పులకు శ్రీకారం చుట్టినా పరిస్థితిలో మాత్రం మార్పు రావడం లేదు.

ఎక్కువ సమయం ప్రైవేటులోనే..

జిల్లా ఆసుపత్రిలో పనిచేసే వైద్యుల్లో మెజారిటీ డాక్టర్లు ప్రైవేటు వైద్యం చేస్తుంటారు. కొంత మందికి సొంత ఆసుపత్రులు ఉండగా, మరికొంత మంది ఇతర ఆసుపత్రుల్లో పనిచేస్తూ ప్రభుత్వ వైద్యాన్ని విస్మరిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ప్రభుత్వ ఆసుపత్రిలో విధుల్లో ఉండాల్సిన సమయంలో ప్రైవేటు సేవల్లో తరిస్తున్నారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. వైద్యులకు సీనియారిటీ పెరిగిన కొద్దీ విధులకు డుమ్మాలు కొట్టడం ఎక్కువవుతుందనే ప్రచారం జరుగుతోంది. ఒక్క సీనియర్ వైద్యుడు కూడా సమయానికి విధులకు వచ్చిన దాఖలాలు లేవంటే అతిశయోక్తి కాదు. ప్రైవేటులో పనిలేకుంటేనే టైంపాస్‌కు ప్రభుత్వ ఆసుపత్రికి వస్తున్నారని ఆసుపత్రి సిబ్బందే బహిరంగంగా చర్చించుకుంటున్నారు.

కాల్‌డ్యూటీస్ పాటించని వైద్యులు

వైద్యులు విధులకు సమయానుకూలంగా హాజరుకాకపోయినా.. అత్యవసర సమయంలో కూడా ఆసుపత్రికి రాలేని పరిస్థితి ఉంది. డాక్టర్లు ఉన్నా వైద్యం అందకపోవడంతో ప్రమాదాల్లో గాయపడిన రోగులు ప్రైవేటు ఆసుపత్రులకు పరుగులు పెడుతున్నారు. బయోమెట్రిక్ విధానం అమలులో లేకపోవడంతో వైద్యులు ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారు. ప్రభుత్వ వేతనం పొందుతున్నా, ప్రైవేటులో అడ్డగోలు సంపాదన ఉండడంతో విధులకు డుమ్మా కొడుతూ ప్రైవేటు వైపే మొగ్గు చూపుతున్నారు. ప్రభుత్వ నిబంధనలు పకడ్బందీగా అమలైతేనే ప్రభుత్వ వైద్యుల్లో మార్పురానుందని, పేదలకు మెరుగైన వైద్యం లభిస్తుందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

మహాత్మా.. మన్నించు!

- గాంధీ విగ్రహాల గోల్‌మాల్
- ఒకటి ప్రతిష్టాపన.. మరొకటి మూలకు
- రూ.లక్షల ప్రజాసొమ్ము వృథా



వాటర్ ట్యాంక్ కింద పడేసిన విగ్రహం

కరీంనగర్ కార్పొరేషన్: నగరపాలకసంస్థలో విగ్రహాల గోల్‌మాల్ వెలుగులోకి వచ్చింది. మహాత్మాగాంధీ విగ్రహ ఏర్పాటులో కాంట్రాక్టర్ ఇష్టారాజ్యంగా వ్యవహరించడం, అధికారులు అందుకు వంతపాడుతున్న వైనమిది. ఒక విగ్రహ ఏర్పాటుకు రెండు కొనుగోలు చేయడం అందులో ఒకటి ఆర్భాటంగా ప్రతిష్ఠించగా, మరొకటి మూలనపెట్టిన వ్యవహారం ప్రస్తుతం చర్చనీయాంశంగా మారింది. నగరంలో రూ.కోట్లతో చేపడుతున్న అభివృద్ధి పనులతో పాత కూడళ్లస్థానంలో ఆకర్షణీయ జంక్షన్లు దర్శనమిస్తున్నాయి. దీంతో పాటు అక్కడ అప్పటికే ఉన్న మహనీయుల విగ్రహాలను కూడా కొత్తవి ఏర్పాటు చేస్తున్నారు. కార్ఖానగడ్డలోని మహాత్మాగాంధీ చౌక్‌ను కూడా ఇటీవల ఆధునీకరించారు. కూడలిలో ఉన్న పాతగాంధీ విగ్రహాన్ని తొలగించి, కొత్త భారీ విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. ఇందుకోసం ఎల్‌ఆర్‌ఎస్ నిధులు రూ.41లక్షలతో టెండర్ పిలిచారు. సుమారు రూ.32.77లక్షలకు ఓ కాంట్రాక్టర్ ఈ పని దక్కించుకున్నాడు. గాంధీ కూర్చొని ఉన్న భంగిమలో విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని నిర్ణయించగా, కాంట్రాక్టర్ విగ్రహాన్ని కొనుగోలు చేశారు. కాని ఆ విగ్రహం చిన్నగా ఉండడంతో అధికారులు హైలెవెల్ జోన్ వాటర్ ట్యాంక్ ప్రాంగణంలో మూలకు పెట్టారు. మరోసారి గాంధీ విగ్రహాన్ని కొనుగోలు చేసేందుకు రూ.27.50 లక్షలతో టెండర్ పిలవగా, సుమారు రూ.23.39 లక్షలతో అదే కాంట్రాక్టర్ టెండర్ దక్కించుకున్నాడు. రెండోసారి కొనుగోలు చేసిన గాంధీ విగ్రహాన్ని కూడలిలో ప్రతిష్ఠించారు. దాదాపు రెండు నెలల క్రితం ఈ కూడలిని ఆర్భాటంగా ప్రారంభించారు. ఇదిలాఉంటే లక్షల రూపాయలతో అవసరం లేకున్నా రెండు విగ్రహాలను కొనుగోలు చేయడం, అందులో ఒకటి వృథాగా మూలన పెట్టడం ప్రస్తుతం విమర్శలకు దారితీస్తోంది. టెండర్లు, పనుల్లో నగరపాలక సంస్థ అధికారులు వ్యవహరిస్తున్న తీరు వివాదాస్పదంగా మారుతోంది.



కిసాన్‌నగర్‌లో ఏర్పాటు చేసిన గాంధీ విగ్రహం

చెరువుల పండుగను విజయవంతం చేయాలి

- కలెక్టర్ ఆర్వీ.కర్ణన్



సైకిల్ పంపిణీ చేస్తున్న కలెక్టర్ కర్ణన్

కరీంనగర్: తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా 8న జిల్లాలో నిర్వహించనున్న చెరువుల పండుగను విజయవంతం చేయాలని కలెక్టర్ ఆర్వీ.కర్ణన్ సూచించారు. ఆదివారం కలెక్టరేట్ ఆడిటోరియంలో రెవెన్యూ, ఇరిగేషన్, పంచాయతీరాజ్, డీఆర్‌డీఏ అధికారులతో సమీక్షించారు. కార్యక్రమాన్ని పండుగ వాతావరణంలో నిర్వహించాలని, మహిళలు అధికసంఖ్యలో పాల్గొనేలా చూడాలని, ప్రత్యేక అధికారులు, ఏఈలు, పంచాయతీ కార్యదర్శులు క్షేత్రస్థాయిలో పరిశీలించాలని సూచించారు. తహసీల్దార్, ఎస్‌హెచ్‌వోలు సోమవారం మండలస్థాయి సమావేశం నిర్వహించి కార్యచరణ రూపొందించుకోవాలని అన్నారు. చెరువుల వద్ద తెలంగాణకు సంబంధించిన పాటలు, మైక్‌లను ఏర్పాటు చేయాలని, గ్రామదేవతలకు పూజలు నిర్వహించాలని, బోనాలు, చెరువుకట్టలపై రంగవల్లులను ఏర్పాటు చేయాలని సూచించారు. గజఈతగాళ్లను, వలంటీర్లను అందుబాటులో ఉంచుకోవాలని అన్నారు. భోజనాలు, తాగునీటి సౌకర్యం కల్పించాలని తెలిపారు. సీపీ సుబ్బారాయుడు, అదనపు కలెక్టర్లు జీవీ.శ్యాం ప్రసాద్‌లాల్, గరిమా అగర్వాల్, కరీంనగర్, హుజూరాబాద్ ఆర్డీవోలు ఆనంద్‌కుమార్, హరిసింగ్, మున్సిపల్ కమిషనర్ సేవాఇస్లావత్, చీఫ్ ఇంజినీర్ అమరేందర్, ఎస్‌ఈ శివప్రసాద్, డీఆర్డీవో శ్రీలత, డీపీవో వీరబుచ్చయ్య పాల్గొన్నారు.

సైకిల్‌తో ఆరోగ్యం, పర్యావరణానికి మేలు

కరీంనగర్ అర్బన్: మానసికంగా, శారీరకంగా ఆరోగ్యంగా ఉండేందుకు ప్రతి ఒక్కరు సైకిల్ తొక్కాలని కలెక్టర్ ఆర్వీ.కర్ణన్ అన్నారు. ఆదివారం ప్రపంచ సైకిల్ దినోత్సవం సందర్భంగా కరీంనగర్ సైకిల్ క్లబ్ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఆవరణలో సైకిళ్ల పంపిణీ చేశారు. సైకిల్ తొక్కడం వల్ల శరీరంలో రోగనిరోధక శక్తి పెరుగుతుందని, గుండెజబ్బులు, పక్షవాతం, అధిక రక్తపోటు తగ్గుతాయని తెలిపారు. దారిద్ర్యరేఖకు దిగువనున్న ఐదుగురు పేదవిద్యార్థులకు సైకిళ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కరీంనగర్ సైకిల్ క్లబ్ సభ్యులు ఘన్‌శ్యాం ఓజా, మేకల జయరాం, తదితరులు పాల్గొన్నారు.

బల్దియాకు పర్యావరణ అవార్డు

- ఐదు నగరాల్లో కరీంనగర్ ఫస్ట్
- నేడు హైదరాబాద్‌లో స్వీకరణ

కరీంనగర్ కార్పొరేషన్: కరీంనగర్ నగరపాలకసంస్థ పర్యావరణ అవార్డుకు ఎంపికైంది. మేరీ లైఫ్ మేరా స్వచ్ఛ్ షెహర్‌లో ట్రిపుల్‌ఆర్ కొనసాగిస్తున్న నేపథ్యంలో పట్టణ అభివృద్ధి మంత్రిత్వశాఖ అభినందనల మేరకు రాష్ట్రస్థాయిలో ఈ అవార్డును ప్రకటించారు. సోమవారం హైదరాబాద్‌లో జరిగే కార్యక్రమంలో రాష్ట్ర మున్సిపల్‌శాఖ మంత్రి కేటీఆర్ చేతులమీదుగా నగరపాలకసంస్థ కమిషనర్ సేవా ఇస్లావత్ అవార్డు అందుకోనున్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా ప్రభుత్వం ప్రవేశపెట్టిన మేరీ లైఫ్ మేరా స్వచ్ఛ్ షెహర్ కార్యక్రమంలో భాగంగా నగరపాలక సంస్థలో 60 డివిజన్లలో 60 ఆర్‌ఆర్‌ఆర్ సెంటర్లు ఏర్పాటు చేశారు. సాలిడ్ వేస్ట్, ప్లాస్టిక్ వేస్ట్ మేనేజ్ మెంట్ ప్రక్రియను విజయవంతంగా కొనసాగిస్తున్నందున పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్ సిఫారసు మేరకు మినిస్ట్రీ ఆఫ్ అర్బన్ డెవలప్‌మెంట్ శాఖ అభినందించింది. లక్ష పైబడిన జనాభా ప్రాతిపదిక ఐదు నగరాలు ఈ అవార్డుకు ఎంపిక కాగా కరీంనగర్ నగరపాలక సంస్థ కు మొదటి స్థానం దక్కింది. నగరపాలక సంస్థ అవార్డుకు సహకరించిన ప్రజలకు, పాలకవర్గ సభ్యులకు, అధికారులకు, సిబ్బందికి మేయర్ యాదగిరి సునీల్‌రావు ధన్యవాదాలు తెలిపారు. భవిష్యత్తులో నగరంలో డంప్‌యార్డ్ లేకుండా రెడ్యూజ్, రీయూజ్, రీసైకిల్ విధానాన్ని నిరంతరంగా కొనసాగిస్తామని ప్రకటించారు. నగరపాలకసంస్థకు మరో అవార్డు రావడం సంతోషంగా ఉందని, ప్రజల సహకారంతో మరిన్ని అవార్డులు సాధిస్తామని పేర్కొన్నారు.

మోడల్ స్కూల్‌లో గెస్ట్‌ఫ్యాకల్టీ పోస్టులకు ఆహ్వానం

చొప్పదండి: చొప్పదండి మండల పరిధిలోని రుక్మాపూర్ శివారులో ఉన్న మోడల్ స్కూల్‌లో ఆరు గెస్టు ఫ్యాకల్టీ పోస్టులు ఖాళీ ఉన్నాయని, ఆసక్తి గల అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ కోల రమేశ్ కోరారు. పీజీటీ విభాగంలో ఆంగ్లం, జువాలజీ, తెలుగు, టీజీటీ విభాగంలో సోషల్, హిందీ, తెలుగు పోస్టులు భర్తీ చేస్తామని, దరఖాస్తులను విద్యాలయంలో ఈ నెల 5 నుంచి 7 వరకు స్వీకరిస్తామని, ఈ నెల 10న ఉదయం డెమో క్లాసులు ఉంటాయని తెలిపారు. మూడు నుంచి అయిదు సంవత్సరాల అనుభవం ఉన్న టీచర్లు దరఖాస్తు చేసుకోవాలని ఈ సందర్భంగా కోరారు.

నేడు విద్యుత్ ప్రగతి విజయోత్సవ వేడుకలు

కరీంనగర్: తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా సోమవారం విద్యుత్ ప్రగతి విజయోత్సవ వేడుకలు నిర్వహిస్తున్నట్లు ఎస్‌ఈ వి.గంగాధర్ ఒక ప్రకటనలో తెలిపారు. కరీంనగర్ రూరల్, కొత్తపల్లి, కరీంనగర్ కార్పొరేషన్, కొత్తపల్లి మున్సిపాలిటీ విద్యుత్తు వినియోగదారులు ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు రేకుర్తిలోని శుభం గార్డెన్‌లో జరిగే వేడుకల్లో పాల్గొనాలని పేర్కొన్నారు. రాష్ట్ర బీసీ సంక్షేమశాఖ మంత్రి గంగుల కమలాకర్, కలెక్టర్ ఆర్వీ కర్ణన్, ప్రజాప్రతినిధులు హాజరు అవుతారని తెలిపారు. మధ్యాహ్నం 2గంటలకు భోజన సౌకర్యం కలదని పేర్కొన్నారు.



ర్యాలీని ప్రారంభిస్తున్న మంత్రి గంగుల కమలాకర్, తదితరులు



నగరంలో ఆకట్టుకున్న పోలీసు వాహనాల భారీ ర్యాలీ

నాడు కల్లోల జిల్లా.. నేడు శాంతికి చిహ్నం

- కమిషనరేట్ పోలీసుల కృషితోనే ఇది సాధ్యం
- రాష్ట్ర బీసీ సంక్షేమ, పౌరసరఫరాల శాఖ మంత్రి గంగుల కమలాకర్
- పోలీసుశాఖ ఆధ్వర్యంలో ఘనంగా సురక్ష దినోత్సవం



స్కేటింగ్ చేస్తూ స్వాగతం పలుకుతున్న చిన్నారులు

కరీంనగర్‌క్రైం: నాడు కల్లోల జిల్లాగా పేరొందిన కరీంనగర్.. నేడు శాంతికి చిహ్నంగా మారిందని, పోలీసుల నిరంతర కృషితోనే ఇది సాధ్యమైందని బీసీ సంక్షేమ, పౌరసరఫరాలశాఖ మంత్రి గంగుల కమలాకర్ అన్నారు. తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా కమిషనరేట్ పోలీసులు ఆదివారం నిర్వహించిన 'సురక్ష దినోత్సవం' కార్యక్రమానికి మంత్రి గంగుల కమలాకర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. మంత్రి మాట్లాడుతూ.. పోలీసులు రేయింబవళ్లు సేవలందించడం వల్లే లక్షల కుటుంబాలు ప్రశాంతంగా జీవిస్తున్నాయని అన్నారు. లేక్ పోలీస్ ఏర్పాటుతో మానేరుడ్యాం పరిసరాల్లో అసాంఘిక కార్యకలాపాలు తగ్గాయని తెలిపారు. సీపీ ఎల్.సుబ్బారాయుడు మాట్లాడుతూ.. రాష్ట్రం ఏర్పాటు తర్వాత పోలీస్‌శాఖ సాంకేతికంగా ఊహించని రీతిలో అభివృద్ధి చెందిందని, ఫలితంగా పలు నేరాలు త్వరితగతిన ఛేదించబడుతున్నాయని అన్నారు. అనంతరం సమర్థవంతమైన సేవలు అందించిన 250మంది పోలీసు సిబ్బందికి ప్రశంసాపత్రాలు అందించారు. అంతకుముందు పోలీసు పరేడ్ మైదానం నుంచి 70కి పైగా పోలీసువాహనాలతో నగరంలో భారీ ర్యాలీ నిర్వహించారు. వీరికి జాతీయజెండాలతో స్కేటింగ్ చేస్తూ చిన్నారులు ఇందిరాచౌక్ వద్ద స్వాగతం పలికారు. ఇందిరాచౌక్ వద్ద బాంబ్ డిస్పోజబుల్ స్క్వాడ్, డాగ్‌స్క్వాడ్, అగ్నిమాపకశాఖ ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి.చొప్పదండి ఎమ్మెల్యే సుంకె రవిశంకర్, మేయర్ వై.సునీల్‌రావు, సుడా చైర్మన్ జీవీ.రామకృష్ణారావు, కలెక్టర్ ఆర్వీ.కర్ణన్, అదనపు కలెక్టర్ గరిమా అగర్వాల్, శిక్షణ కలెక్టర్ లెనిన్ వాత్సల్ టోప్పో, జిల్లా అగ్నిమాపకశాఖ అధికారి వెంకన్న, అడిషనల్ డీసీపీలు ఎస్.శ్రీనివాస్, ఎం.భీంరావ్, శిక్షణ ఐపీఎస్ అధికారి మహేశ్ బాబాసాహెబ్, ఏసీపీలు తుల శ్రీనివాసరావు, టి.కరుణాకర్‌రావు, వెంకటరెడ్డి, విజయసారథి, సత్యనారాయణ, విజయ్‌కుమార్, కాశయ్య, గంగాధర్, సి.ప్రతాప్, ఎస్‌బీఐ జి.వెంకటేశ్వర్లు, కరీంనగర్ డెయిరీ చైర్మన్ చల్మెడ రాజేశ్వరరావు, సీఐలు, ఎస్సైలు పాల్గొన్నారు. అదే విధంగా రాత్రి వీ కన్వెన్షన్‌లో బడాఖానా నిర్వహించారు. ఈ సందర్భంగా పోలీసులు వివిధ సాంస్కృతిక కార్యక్రమాలతో ఆకట్టుకున్నారు. అడిషనల్ డీసీపీ శ్రీనివాస్, జిల్లా అగ్నిమాపక అధికారి వెంకన్న ప్రదర్శనలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.

ప్రయివేటు స్కూళ్లపై చర్యలు తీసుకోవాలి



మాట్లాడుతున్న బీమాసాహెబ్

కరీంనగర్: జిల్లాలో అనుమతి లేకుండా నడుపుతున్న, అధిక ఫీజులు వసూలు చేస్తున్న ప్రైవేట్ పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని తెలంగాణ గిరిజన సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు బీమా సాహెబ్ ప్రభుత్వాన్ని కోరారు. ఆదివారం సంఘ కార్యాలయంలో మాట్లాడుతూ.. ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థలు ఇష్టానుసారంగా ఫీజుల దోపిడీ చేస్తున్నాయని అన్నారు. ట్యూషన్ ఫీజుల పేరిట వేలాది రూపాయలు దండుకుంటున్నారని తెలిపారు. ప్రభుత్వాధికారులు స్పందించి ఫీజులు నియంత్రించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. లేకపోతే జిల్లాలో విద్యార్థి సంఘాలను కలుపుకొని పెద్దఎత్తున ఆందోళన నిర్వహిస్తామని హెచ్చరించారు. గిరిజన సంఘం జిల్లా అధ్యక్షుడు బోడ మోహన్ నాయక్, నగర అధ్యక్ష, కార్యదర్శులు ప్రకాశ్‌నాయక్, రవీందర్, లక్పతి, శ్రీనివాస్, తిరుపతి, రమేశ్ పాల్గొన్నారు.

గొప్ప నాయకుడు రావి నారాయణరెడ్డి



రావి నారాయణరెడ్డి చిత్రపటానికి పూలమాల వేస్తున్న చాడ వెంకటరెడ్డి, సీపీఐ నేతలు

- సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకటరెడ్డి

కరీంనగర్: వందల ఎకరాల సొంత వ్యవసాయభూమిని పేదలకు పంపిణీ చేసిన గొప్ప మహానాయకుడు మాజీ పార్లమెంట్ సభ్యుడు, తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట యోధుడు రావి నారాయణరెడ్డి అని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు, మాజీ ఎమ్మెల్యే చాడ వెంకటరెడ్డి అన్నారు. రావి నారాయణరెడ్డి 115వ జయంతి సందర్భంగా ఆదివారం సీపీఐ జిల్లా కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళి అర్పించారు. చాడ వెంకటరెడ్డి మాట్లాడుతూ రావి నారాయణరెడ్డి సోషలిస్టుగా తన ప్రస్థానం మొదలుపెట్టి దేశ స్వాతంత్ర్య ఉద్యమంలో గాంధీ, నెహ్రూతో కలిసి పనిచేశారని అన్నారు. పెత్తందారీ వ్యవస్థకు వ్యతిరేకంగా 1939లో కమ్యూనిస్టు పార్టీలో చేరారని, 1947లో తెలంగాణ సాయుధ రైతాంగపోరాటానికి పిలుపునిచ్చారని గుర్తుచేశారు. ప్రజల కోసం పనిచేసిన గొప్ప నాయకుడు రావి నారాయణరెడ్డి అని ఆయన ఆశయాలను ముందుకు తీసుకెళ్లేలా నేటితరం కమ్యూనిస్టు శ్రేణులు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు అందె స్వామి, నగర కార్యదర్శి కసిరెడ్డి సురేందర్‌రెడ్డి, జిల్లా కార్యవర్గ సభ్యురాలు గూడెం లక్ష్మి, ఏఐఎస్‌ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కసిరెడ్డి మణికంఠరెడ్డి, సీపీఐ కౌన్సిల్ సభ్యుడు నాగెల్లి లక్ష్మారెడ్డి, బోయిని తిరుపతి, పైడిపెల్లి రాజు, కిన్నెర మల్లవ్వ, పంజాల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

రెడ్ల ఆత్మీయ సమ్మేళనానికి రండి


పోస్టర్‌ ఆవిష్కరిస్తున్న నాయకులు

గంగాధర(చొప్పదండి): రెడ్డి సంఘాల ఐక్య వేదిక ఆధ్వర్యంలో ఈ నెల 6న కరీంనగర్‌ జిల్లా కేంద్రంలో నిర్వహించే రెడ్ల ఆత్మీయ సమ్మేళనానికి తరలిరావాలని వేదిక జిల్లా అధ్యక్షుడు వంచ సుదర్శన్‌రెడ్డి పిలుపునిచ్చారు. గంగాధర మండలంలోని గట్టుభూత్కూర్‌ గ్రామంలో ఆదివారం హలో రెడ్డి.. చలో కరీంనగర్‌ పోస్టర్‌ ఆవిష్కరించారు. 2018 ఎన్నికల మేనిఫెస్టోలో ప్రకటించిన రెడ్డి కార్పొరేషన్‌ వెంటనే ఏర్పాటు చేయాలని డిమాండ్‌ చేశారు. ఆత్మీయ సమ్మేళనానికి రెడ్డి కుల బాంధవులు అధిక సంఖ్యలో హాజరు కావాలని కోరారు. కార్యక్రమంలో రెడ్డి సంఘం నాయకులు ద్యావ భాస్కర్‌రెడ్డి, కంకణాల మల్లారెడ్డి, పటేల్‌ జితేందర్‌రెడ్డి, కరుణాకర్‌రెడ్డి, బొమ్మాడి చంద్రారెడ్డి, కంకణాల కిషన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఈదురుగాలులకు విరిగిపడిన వృక్షం


చెట్టును తొలగిస్తున్న సర్పంచు, స్థానికులు

కరీంనగర్‌రూరల్‌: కరీంనగర్‌ మండలంలోని నగునూరు శివారులో ఆదివారం సాయంత్రం ఈదురుగాలులకు ఓ వృక్షం విరిగి, రోడ్డుపై పడింది. దీంతో కరీంనగర్‌–రాయపట్నం రహదారిపై ఇరువైపులా అధిక సంఖ్యలో వాహనాలు నిలిచిపోవడంతో రాకపోకలు స్తంభించాయి. స్థానికులు ఆర్‌అండ్‌బీ అధికారులకు సమాచారం ఇచ్చినప్పటికీ చెట్టును తొలగించేందుకు ఎలాంటి చర్యలు చేపట్టలేదు. చివరకు సర్పంచు ఉప్పుల శ్రీధర్‌ ఆధ్వర్యంలో బ్లూకోల్ట్స్‌ పోలీసులు జేసీబీతోపాటు బ్లేడ్‌ ట్రాక్టర్‌తో చెట్టును తొలగించారు. అనంతరం వాహనాల రాకపోకలను పునరుద్ధరించారు. దాదాపు గంటపాటు వాహనాలు నిలిచిపోవడంతో ప్రయాణికులు, వాహనదారులు వర్షంలో ఇబ్బంది పడ్డారు.

పాల వ్యాన్‌ ఢీకొని యువకుడికి తీవ్ర గాయాలు



శంకరపట్నం(మానకొండూర్‌): కేశవపట్నం పోలీస్‌స్టేషన్‌ సమీపంలో పాల వ్యాన్‌ ఢీకొని, ఓ యువకుడు తీవ్రంగా గాయపడ్డాడు. వివరాల్లోకి వెళ్తే.. శంకరపట్నం మండలంలోని కేశవపట్నం గ్రామానికి చెందిన జనగాం మనోజ్‌ శనివారం అర్ధరాత్రి బైక్‌పై వస్తుండగా హుజూరాబాద్‌ వైపు వెళ్తున్న పాల వ్యాన్‌ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో అతని తలకు తీవ్ర గాయాలు కాగా ఈఎంటీ సతీశ్‌రెడ్డి ప్రథమ చికిత్స అందించి, కరీంనగర్‌ ఆస్పత్రికి తరలించారు.

ఈదులగట్టెపల్లిలో ఒకరికి..

మానకొండూర్‌: మండలంలోని ఈదులగట్టెపల్లి శివారు కరీంనగర్‌–వరంగల్‌ ప్రధాన రహదారిపై గుర్తు తెలియని కారు ఢీకొట్టడంతో ఇదే గ్రామానికి చెందిన గోపాల నర్సయ్యకు గాయాలయ్యాయి. వివరాల్లోకి వెళ్తే.. నర్సయ్య ఆదివారం రాత్రి తన వ్యవసాయ భూమి వద్దకు ద్విచక్రవాహనంపై వెళ్తున్నాడు. రోడ్డు దాటుతున్న క్రమంలో కరీంనగర్‌ వైపు వెళ్తున్న ఓ గుర్తు తెలియని కారు వేగంగా వచ్చి, ఢీకొట్టింది. ఈ ఘటనలో నర్సయ్య తీవ్రంగా గాయపడ్డాడు. క్షతగాత్రుడిని బాధిత కుటుంబసభ్యులు అంబులెన్స్‌లో కరీంనగర్‌ ఆస్పత్రికి తరలించారు.

బియ్యం పంపిణీకి ససేమిరా

- డిమాండ్లు నెరవేరిస్తేనే ఇస్తామంటున్న రేషన్‌ డీలర్లు
- ఇంకా దుకాణాలకు చేరని బియ్యం
- అయోమయంలో వినియోగదారులు
- జిల్లాలో 566 మంది డీలర్లు


తెరుచుకోని రేషన్‌ దుకాణం

కరీంనగర్‌ అర్బన్‌: రేషన్‌కార్డు వినియోగదారులు అయోమయంలో ఉన్నారు. అధికార యంత్రాంగం సోమవారం నుంచి రేషన్‌ బియ్యం పంపిణీ చేయాలని ఆదేశించగా డీలర్లు ససేమిరా అంటున్నారు. తమ న్యాయమైన డిమాండ్లను నెరవేరిస్తేనే బియ్యం ఇస్తామని స్పష్టం చేస్తుండగా వినియోగదారులకు రేషన్‌ అందుతుందా లేదా అన్నది అనుమానమే. గత నెల 25 నుంచి నిరవధిక బంద్‌ పాటించిన డీలర్లు ఆదివారం నుంచి సమ్మెకు దిగారు. తమ సమస్యల పరిష్కారం విషయంలో ప్రభుత్వ ఉదాసీన వైఖరిని నిరసిస్తూ సమ్మె చేపట్టాలని నిర్ణయించారు. ఈ మేరకు గత నెల 19న అదనపు కలెక్టర్‌కు నోటీసు అందజేశారు. రాష్ట్ర వ్యాప్త ఆందోళనలో భాగంగా ఈ నెల 5 నుంచి ఆందోళన చేయనున్నారు.

రూ.500 కూడా మిగలడం లేదని ఆవేదన

కరీంనగర్‌ జిల్లాలో 566 మంది రేషన్‌ డీలర్లుండగా గతంలో 9 రకాల సరుకులు పంపిణీ చేసేవారు. ప్రస్తుతం కేవలం బియ్యం మాత్రమే ఇస్తున్నారు. డీలర్లకు క్వింటాల్‌కు రూ.70 కమీషన్‌ చెల్లిస్తుండగా అందులో హమాలీ, ఇంటి అద్దె, గుమాస్తా చార్జీ, కరెంట్‌ బిల్లు ఇతరత్రా పోనూ నెలకు రూ.500 కూడా మిగలడం లేదని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

కమీషన్‌ తక్కువ.. ఖర్చు ఎక్కువ

ఈ–పాస్‌తో ఎక్కడైనా రేషన్‌ బియ్యం తీసుకునే సౌలభ్యం ఉండటంతో చాలామంది డీలర్లకు వచ్చే కమీషన్‌ ఖర్చులకు సరిపోని పరిస్థితి. ఒక దుకాణానికి 100 క్వింటాళ్ల బియ్యం వస్తే వచ్చే కమీషన్‌ రూ.7 వేలు, ఇందులో అద్దె రూ.4 వేలు, హమాలీకి రూ.1,000, గుమాస్తాకు రూ.4 వేలు, కరెంట్‌ బిల్లు, ఇతరత్రా ఖర్చులు అదనం. ఈ లెక్కన వచ్చే కమీషన్‌ ఖర్చులకు సరిపోకపోగా ఇక కుటుంబాన్ని ఎలా పోషించాలని డీలర్లు వాపోతున్నారు.

బియ్యం దించుకోలే..

గత నెలలో రేషన్‌ డీలర్లు సమ్మె నోటీసు అందజేయగా బీసీ సంక్షేమ, పౌరసరఫరాల శాఖల మంత్రి గంగుల కమలాకర్‌ వారితో చర్చించారు. ఈ నెల 1లోగా సీఎం కేసీఆర్‌ను కలిపిస్తామని, సమస్యలు పరిష్కారమవుతాయని హామీ ఇవ్వడంతో తాత్కాలికంగా సమ్మె విరమించారు. రోజులు గడుస్తున్నా స్పందన లేకపోవడంతో సమ్మెనే శరణ్యమని డీలర్లు భావిస్తున్నారు. ఈ క్రమంలో అలాట్‌మెంట్‌, మూవ్‌మెంట్‌ ప్రక్రియ ఇప్పటికే ముగియాల్సి ఉండగా ఇంకా రేషన్‌ దుకాణాలకు బియ్యం చేరలేదని సమాచారం. డీలర్లు బియ్యం దించుకోకపోవడంతో పంపిణీపై స్తబ్ధత నెలకొంది.

ఆర్థికంగా ఇబ్బంది పడుతున్నం



కొన్నేళ్లుగా సమస్యలపై ఆందోళనలు చేస్తున్నాం. వచ్చే కమీషన్‌ సరిపోక ఆర్థికంగా ఇబ్బంది పడుతున్నం. సమ్మె చేస్తామని నోటీసు ఇచ్చినా ఉపశమన మాటలే తప్ప ఆచరణలో శూన్యం. బియ్యంతోపాటు ఇతర సరుకుల పంపిణీ చేయాలి.

– రొడ్డ శ్రీనివాస్‌, రేషన్‌ డీలర్ల సంఘం జిల్లా అధ్యక్షుడు

ప్రధాన డిమాండ్లు ఇవే.

- పట్టణాల్లోని డీలర్లకు రూ.65 వేలు, గ్రామీణ ప్రాంత డీలర్లకు రూ.45 వేల వేతనం ఇవ్వాలి.
- బియ్యం దిగుమతి, హమాలీ చార్జీలు ప్రభుత్వమే భరించాలి.
- విద్యావంతులను శాఖాపరమైన సేవల్లో నియమించాలి.
- ప్రతీ డీలర్‌కు హెల్త్‌ కార్డు ఇవ్వాలి.
- బియ్యంతోపాటు ఇతరత్రా సరుకులు పంపిణీ చేయాలి.
- షాపులను మినీ సూపర్‌ మార్కెట్లుగా మార్చాలి.
- రూ.10 లక్షల బీమా అమలుతోపాటు కారుణ్య నియామకాలకు వయసు 50 ఏళ్లకు పెంచాలి.

ప్రతిరోజూ మార్షల్‌ ఆర్ట్స్‌ శిక్షణకు కృషి


కరాటే పోటీలను ప్రారంభించిన హరిశంకర్‌

కరీంనగర్‌ స్పోర్ట్స్‌: రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో నెల రోజులపాటు విద్యార్థినులకు ఇస్తున్న మార్షల్‌ ఆర్ట్స్‌ శిక్షణను మంత్రి గంగుల కమలాకర్‌ సహకారంతో ప్రతిరోజూ నిర్వహించేందుకు కృషి చేస్తానని బేస్‌బాల్‌ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు, బీఆర్‌ఎస్‌ పట్టణ అధ్యక్షుడు చల్ల హరిశంకర్‌ హామీ ఇచ్చారు. కరీంనగర్‌లోని కొండ సత్యలక్ష్మి కన్వెన్షన్‌ హాలులో ఆదివారం తెలంగాణ ఓపెన్‌ కరాటే చాంపియన్‌షిప్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం క్రీడలకు పెద్దపీట వేస్తోందన్నారు. గ్రామాలతోపాటు పట్టణాల్లో క్రీడా ప్రాంగణాలను ఏర్పాటు చేసిందని తెలిపారు. గ్రామీణ యువకుల్లో క్రీడా నైపుణ్యాన్ని వెలికితీసేందుకు సీఎం కప్‌–2023 పోటీలు నిర్వహించిందని పేర్కొన్నారు. మరో అతిథి ఫార్వర్డ్‌ బ్లాక్‌ పార్టీ సెంట్రల్‌ కమిటీ సభ్యుడు జోజిరెడ్డి మాట్లాడుతూ.. ప్రతిఒక్కరూ మార్షల్‌ ఆర్ట్స్‌ నేర్చుకోవాలన్నారు. గోజుర్యూ కరాటే డో అసోసియేషన్‌ రాష్ట్ర చీఫ్‌ ఇన్‌స్ట్రక్టర్‌ సురభి వేణుగోపాల్‌ మాట్లాడుతూ.. ఈ చాంపియన్‌షిప్‌కు 13 జిల్లాల నుంచి 850 మంది క్రీడాకారులు హాజరయ్యారని, కటా, కుమిటీతోపాటు పలు విభాగాల్లో పోటీలు నిర్వహించినట్లు తెలిపారు. గోజుర్యూ కరాటే డో అసోసియేషన్‌ రాష్ట్ర సెక్రటరీ సురభి అన్వేష్‌, పలు జిల్లాలకు చెందిన కరాటే సంఘాల ప్రతినిధులు, సీనియర్‌ క్రీడాకారులు, కోచ్‌లు, ఆఫీషియల్స్‌ పాల్గొన్నారు.

స్కాలర్‌షిప్‌ గడువు.. మూడోసారి పొడిగింపు

- ఫ్రెష్‌, రెనివల్‌ విద్యార్థులకు ఈ నెల 15 వరకు అవకాశం
- దరఖాస్తు చేయడంలో నిర్లక్ష్యం వద్దని అధికారుల సూచన


ఎస్సీ సంక్షేమ శాఖ కార్యాలయం

కరీంనగర్‌: బడుగు, బలహీన వర్గాల విద్యార్థుల కోసం ప్రభుత్వం స్కాలర్‌షిప్‌, ఫీజు రీయింబర్స్‌మెంట్‌ మంజూరు చేస్తోంది. కరీంనగర్‌ జిల్లాలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ సంక్షేమ శాఖల ద్వారా కళాశాలల విద్యార్థులకు గడువు ఇచ్చినా గతేడాది దరఖాస్తులు అంతంత మాత్రమే వచ్చాయి. 2022–23 విద్యాసంవత్సరానికి గాను ముచ్చటగా మూడోసారి గడువు ఈ నెల 15వ తేదీ వరకు పొడిగించింది. వివిధ అభివృద్ధి శాఖల పరిధిలో రెనివల్‌ కోసం 8,515 మంది విద్యార్థులకు గాను 7,674 మంది రిజిస్ట్రేషన్‌ చేసుకున్నారు. ఫ్రెషర్స్‌ 5,095 మంది మాత్రమే చేసుకోవడం గమనార్హం. పెంచిన గడువులోపైనా అవాంతరాలు తొలగించి, పూర్తిస్థాయిలో దరఖాస్తులు అందేలా చూడాల్సిన బాధ్యత ఆయా కళాశాలల ప్రిన్సిపాళ్లు, అధికారులపై ఉంది.

ఆశించిన మేర రాని స్పందన..

ఇంటర్మీడియట్‌, ఆపై తరగతులు, వృత్తివిద్య కోర్సులు అభ్యసించే విద్యార్థులు ఉపకార వేతనాలు, బోధనా రుసుముల మంజూరు కోసం గతేడాది అక్టోబర్‌ 24లోపు దరఖాస్తు చేసుకోవాలని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ సంక్షేమ శాఖలు ప్రకటించాయి. అయినప్పటికీ విద్యార్థుల నుంచి ఆశించిన మేర స్పందన రాలేదు. ఈ–పాస్‌ సైట్‌లో రిజిస్ట్రేషన్ల సంఖ్య తక్కువగా ఉంటోంది. దీంతో ప్రభుత్వం దరఖాస్తు గడువును 2023 జనవరి చివరి వరకు పొడిగించింది. అయినా కళాశాలల నుంచి వచ్చిన అభ్యర్థన మేరకు ప్రభుత్వం మరోసారి ఈ నెల 15వ తేదీ వరకు గడువు పొడిగిస్తూ నిర్ణయం తీసుకుంది.

సాంకేతిక సమస్యలు..

2022–23 విద్యాసంవత్సరంలో ఈ–స్‌ వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసే విద్యార్థులకు కొన్ని సాంకేతిక సమస్యలు ఎదురవుతున్నాయి. ఆధార్‌కార్డులో ఉన్న పేరులో చిన్న చిన్న అక్షర దోషాలు ఉండటంతో సైట్‌ స్వీకరించడం లేదు. విద్యార్హతల సర్టిఫికెట్ల విషయంలోనూ ఆన్‌లైన్‌లో ఇక్కట్ల కారణంగా దరఖాస్తు చేసుకునేందుకు విద్యార్థులు ఆసక్తి చూపించడం లేదన్న ఆరోపణలున్నాయి. వీటితోపాటు కొత్తగా దరఖాస్తు చేసుకునేవారు పూర్తిస్థాయిలో బ్యాంకు ఖాతాలు కలిగి ఉండకపోవడం, పదోతరగతి మెమోలు ఆన్‌లైన్‌ చేయకపోవడం, కళాశాలల యాజమాన్యాల నిర్లక్ష్యం, దరఖాస్తు గడువు పొడిగిస్తారనే ఉదాసీన వైఖరి తోడవుతున్నాయి. మరోవైపు ఆయా సంక్షేమ శాఖలు కూడా విద్యార్థులను చైతన్యం చేయడంలో కొంత విఫలమయ్యాయని విద్యార్థి సంఘాలు అంటున్నాయి.

సద్వినియోగం చేసుకోవాలి



స్కాలర్‌షిప్‌, ఫీజు రీయింబర్స్‌మెంట్‌ కోసం దరఖాస్తు గడువును ప్రభుత్వం ఈ నెల 15 వరకు పొడిగించింది. ఈ అవకాశాన్ని విద్యార్థులు ఉపయోగించుకోవాలి. దరఖాస్తుల సంఖ్యను పెంచేందుకు ఇప్పటికే కళాశాలల యాజమాన్యాలు, ప్రిన్సిపాళ్లకు లేఖలు రాశాం. సమావేశాలు నిర్వహించి, చెప్పాం. విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, కళాశాల యాజమాన్యాలు దరఖాస్తులు సమర్పించే విషయంలో అలసత్వం చేయరాదు.

– నేతానియల్‌, జిల్లా ఎస్సీ సంక్షేమ శాఖ అభివృద్ధి అధికారి

‘అందరినీ ఆకట్టుకునేది కవిత్వం’

- అదనపు కలెక్టర్‌ జీవీ శ్యాంప్రసాద్‌లాల్‌
- నేనున్నానని పుస్తకావిష్కరణ



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న అదనపు కలెక్టర్‌ శ్యాంప్రసాద్‌లాల్‌

కరీంనగర్‌కల్చరల్‌: మనిషికి మనిషే తోడు.. సమాజానికి నేనున్నానని భరోసానిచ్చే మనస్తత్వం కవులకు ఉంటుందని, కవిత్వం అందరినీ ఆకట్టుకుంటుందని అదనపు కలెక్టర్‌ శ్యాంప్రసాద్‌లాల్‌ అన్నారు. నగునూరి రాజన్న రచించిన నేనున్నానని అనే పుస్తకాన్ని ఆదివారం వాగేశ్వరి డిగ్రీ కళాశాలలో ఉదయ సాహితీ ఆధ్వర్యంలో ఆవిష్కరించి, మాట్లాడారు. కవిత్వంతో ముందుకు వచ్చినవారు సమాజంలో కలకాలం నిలబడతారన్నారు. విశిష్ట అతిథి తెలంగాణ రచయితల సంఘం జంట నగరాల శాఖ అధ్యక్షుడు కందుకూరి శ్రీరాములు మాట్లాడుతూ.. సమాజహితం చేకూర్చేది కవిత్వమని, అలాంటి కవిత్వాన్ని సమాజానికి అందించిన నగునూరి రాజన్న అభినందనీయులని అన్నారు. తెలంగాణ రచయితల సంఘం వరంగల్‌ శాఖ అధ్యక్షుడు పొట్లపల్లి శ్రీనివాసరావు మాట్లాడుతూ.. సమాజాన్ని మార్చగలిగేది కవిత్వమని, అలాంటి సందేశాత్మక కవితలతో కూడుకున్న నేనున్నానని పుస్తకం వైవిధ్యమైన కవితలతో నిండి ఉందని పేర్కొన్నారు. ఉదయ సాహితీ అధ్యక్షుడు వైరాగ్యం ప్రభాకర్‌ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో కవులు దాస్యం లక్ష్మయ్య, కలువకుంట రామకృష్ణ, సంపత్‌ కుమార్‌ శ్రీవత్స, బొమ్మకంటి కిషన్‌, గంగుల శ్రీకర్‌ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ, బీఆర్‌ఎస్‌లకు గుణపాఠం చెప్పాలి

- హామీలు అమలు చేయకుండా ఆస్తులు పెంచుకున్నారు
- వైఎస్సార్‌టీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి డాక్టర్‌ కె.నగేశ్‌


ప్రచారం చేస్తున్న నగేశ్‌, నాయకులు

కరీంనగర్‌: బీజేపీ, బీఆర్‌ఎస్‌ పార్టీలు దొందూదొందేనని, ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు పర్చకుండా కార్పొరేట్‌ శక్తులకు ప్రజాధనాన్ని దోచిపెడుతున్నాయని వైఎస్సార్‌టీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి డాక్టర్‌ కె.నగేశ్‌ ఆరోపించారు. రానున్న ఎన్నికల్లో ఆ రెండు పార్టీలకు గుణపాఠం చెప్పాలని పిలుపునిచ్చారు. ఆదివారం కరీంనగర్‌ జిల్లా కేంద్రంలోని మంచిర్యాల చౌరస్తా, అంబేద్కర్‌ నగర్‌, సుభాష్‌నగర్‌, కిసాన్‌నగర్‌ ప్రాంతాల్లో బీజేపీ, బీఆర్‌ఎస్‌ పార్టీలు అనుసరిస్తున్న వైఖరిని ఎండగడుతూ ముద్రించిన కరపత్రాలను ఇంటింటా పంపిణీ చేశారు. ఉమ్మడి ఏపీ మాజీ సీఎం దివంగత వైఎస్సార్‌ కన్న కలలను నిజం చేయడం వైఎస్సార్‌టీపీ అధినేత షర్మిలమ్మకే సాధ్యమన్నారు. విద్య, వైద్యం, సంక్షేమాన్ని అన్ని వర్గాల ప్రజలకు అందిస్తూ సమన్యాయం చేసిన రాజన్న రాజ్యాన్ని ఆమె తీసుకువస్తారని చెప్పారు. పదేళ్లలో బీజేపీ, బీఆర్‌ఎస్‌ నాయకుల ఆస్తులు నాలుగింతలు పెరిగాయే తప్ప ప్రజలకు చేసిందేమీలేదని మండిపడ్డారు. వైఎస్సార్‌టీపీ పక్షాన కరీంనగర్‌లో రానున్న ఎన్నికల్లో పోటీ చేసేందుకు సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు. పార్టీ నాయకులు, అనుబంధ విభాగాల అధ్యక్ష, కార్యదర్శులు పాల్గొన్నారు.

కంటి ఆస్పత్రి, శాంతి నివాసాలకు ఐఎస్‌వో సర్టిఫికెట్‌


సర్టిఫికెట్‌ అందిస్తున్న ఐఎస్‌వో ప్రతినిధి శివయ్య

కరీంనగర్‌ టౌన్‌: లయన్స్‌ క్లబ్‌ ఆఫ్‌ కరీంనగర్‌ డాక్టర్‌ భాస్కర్‌ మాడేకర్‌ కంటి ఆస్పత్రిని ఐఎస్‌వో సర్టిఫికెట్‌ వరించింది. ఆదివారం కరీంనగర్‌లోని క్లబ్‌ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఐఎస్‌వో ప్రతినిధి శివయ్య సర్టిఫికెట్‌ ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆస్పత్రిలో జరిగిన పలు అభివృద్ధి కార్యక్రమాలు, నూతనంగా ఏర్పాటు చేసిన పరికరాలు ప్రజల రోగ నిర్ధారణ, ట్రీట్‌మెంట్‌కు ఎంతగానో ఉపయోగపడతాయని అభినందించారు. అలాగే లయన్స్‌ క్లబ్‌ నిర్వహిస్తున్న శాంతి నివాసం (హిందూ దహన సంస్కార వాటిక)లో వైకుంఠ రథం, మృతదేహాల దహనం కోసం నిర్మించిన ప్లాట్‌ఫామ్స్‌, స్త్రీలకు, పురుషులకు స్నాన గదులు తదితర సౌకర్యాలపై సంతృప్తి వ్యక్తం చేశారు. పై రెండు ప్రాజెక్టులు పాటిస్తున్న పలు ప్రమాణాల ఆధారంగా ఐఎస్‌వో 9001:2015 సర్టిఫికెట్లను కంటి ఆస్పత్రి చైర్మన్‌ కొండ వేణుమూర్తి, శాంతి నివాసం చైర్మన్‌ బొద్ల కృష్ణ అందుకున్నారు. కార్యక్రమంలో చిదుర సురేష్‌, సింగంరాజు పాల్గొన్నారు.

‘బీఆర్‌ఎస్‌ నాయకులు కబ్జా చేశారంటారా?’

- బండి సంజయ్‌ తొత్తుల్లారా ఖబడ్దార్‌
- బీఆర్‌ఎస్‌ జిల్లా అధ్యక్షుడు జీవీ రామకృష్ణారావు


మాట్లాడుతున్న జీవీ రామకృష్ణారావు

మానకొండూర్‌: బీఆర్‌ఎస్‌ నాయకులు భూమి కబ్జా చేశారని ఆరోపిస్తారా అంటూ ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు జీవీ రామకృష్ణారావు మండిపడ్డారు. మానకొండూర్‌లో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కరీంనగర్‌కు చెందిన మర్రి సతీశ్‌ కుటుంబసభ్యులు తమకు 1274 సర్వే నంబర్‌లో మానకొండూర్‌ చెరువులో 9.39 గుంటల భూమి ఉందని, తప్పుడు పత్రాలు చూపించారన్నారు. వాళ్లే కబ్జా చేస్తూ.. బీఆర్‌ఎస్‌ నాయకులు చేస్తున్నారని ఆరోపించడాన్ని ఖండించారు. ఈ భూమి శిఖం భూమి అని కలెక్టర్‌ హైకోర్టుకు ఆధారాలు సమర్పించారని తెలిపారు. తర్వాత కోర్టు కేసును క్లోజ్‌ చేసిందన్నారు. కానీ కబ్జాలో ఉన్నామని, పంట పండించుకుంటున్నామని కోర్టునే తప్పుదోవ పట్టించి, ఆర్డర్‌ తీసుకువస్తే గ్రామస్తులు నిలదీశారని చెప్పారు. దీంతో వారు తోక ముడిచారని పేర్కొన్నారు. ఇలాంటి వారిపై ఎఫ్‌ఐఆర్‌ నమోదు చేయాలని కలెక్టర్‌ను కోరినట్లు తెలిపారు. ఐదు వందల ఏళ్లుగా 1274 సర్వే నంబర్‌లో ఉన్నది శిఖం భూమి అని, పట్టా లేదని, ఒకవేళ ఎఫ్‌టీఎల్‌లో పట్టా ఉన్నప్పటికీ ఆధారాలు లేవన్నారు. దీన్ని కబ్జా చేసేందుకు ఎంపీ బండి సంజయ్‌ బీజేపీ నాయకులను పంపిస్తున్నారని ఆరోపించారు. బండి సంజయ్‌ తొత్తుల్లారా ఖబడ్దార్‌.. రానున్న రోజుల్లో తీవ్ర పరిణామాలు ఉంటాయని హెచ్చరించారు. జెడ్పీటీసీ సభ్యుడు తాళ్లపల్లి శేఖర్‌గౌడ్‌, సర్పంచు రొడ్డ పృథ్వీరాజ్‌, శాతరాజ యాదగిరి, పిట్టల మధు తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా జేఈఈ అడ్వాన్స్‌డ్‌ పరీక్ష



పరీక్ష కేంద్రంలోకి వెళ్తున్న విద్యార్థులు

తిమ్మాపూర్‌(మానకొండూర్‌): ఐఐటీ ప్రవేశాల కోసం నిర్వహించే జేఈఈ అడ్వాన్స్‌డ్‌ ఆదివారం ప్రశాంతంగా జరిగినట్లు సంబంధిత అధికారులు తెలిపారు. కరీంనగర్‌ జిల్లాలో 7 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. ఉదయం 9 గంటల నుంచి 12 గంటల వరకు, మధ్యాహ్నం 2.30 గంటల నుంచి సాయంత్రం 5.30 గంటలకు పరీక్ష నిర్వహించినట్లు చెప్పారు. రెండు గంటల ముందే పరీక్ష కేంద్రంలోకి విద్యార్థులను అనుమతించారు. వాగేశ్వరి అయాన్‌ సెంటర్‌లో 702 మంది విద్యార్థులకు గాను 681 మంది హాజరయ్యారు. వాగేశ్వరిలో ఉదయం, మధ్యాహ్నం 100 మంది విద్యార్థులకు గాను 96 మంది వచ్చారు. జ్యోతిష్మతిలో 70 మందికి గాను ఉదయం 68 మంది, మధ్యాహ్నం 67 మంది హాజరయ్యారు. శ్రీ చైతన్య–1లో 140 మందికి గాను 136 మంది, శ్రీ చైతన్య–2లో 90 మందికిగాను 86 మంది హాజరయ్యారు. కరీంనగర్‌ ఆల్ఫోర్స్‌లో 80 మందికిగాను 76 మంది, వివేకానందలో 90 మందికిగాను 80 మంది, హుజూరాబాద్‌ కిట్స్‌ కళాశాలలో 100 మందికి గాను 96 మంది వచ్చారు. పరీక్షా కేంద్రాల వద్ద ఎల్‌ఎండీ పోలీసులు బందోబస్తు చేపట్టారు. ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా చర్యలు తీసుకున్నారు.

రోడ్డు ప్రమాదంలో స్నేహితుల దుర్మరణం

- అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొన్న బైక్‌
- లక్ష్మీపూర్‌, ఒబులాపూర్‌లలో విషాదం


కృపానంద్‌ (ఫైల్‌)


గంగాధర్‌ (ఫైల్‌)

జగిత్యాలక్రైం: నలుగురు స్నేహితులు సరదాగా కలిశారు.. మాటల్లో దిగారు.. ఆదివారం వేకువజామున రెండు బైక్‌లపై ఇళ్లకు బయలుదేరారు. ఈక్రమంలో ఓ ద్విచక్రవాహనం అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొనడంతో ఇద్దరు అక్కడికక్కడే మృతిచెందారు. పోలీసుల కథనం ప్రకారం.. జగిత్యాల రూరల్‌ మండలం లక్ష్మీపూర్‌ గ్రామానికి చెందిన మహంకాళి నర్సయ్య– కళావతి కుమారుడు కృపానంద్‌(22), మల్యాల మండలం ఒబులాపూర్‌ గ్రామానికి చెందిన బడుగు మొండయ్య– సుజాత కొడుకు గంగాధర్‌(19) స్నేహితులు. వీరితో పాటు మరో ఇద్దరు స్నేహితులు శనివారం రాత్రి జగిత్యాలలో కలుసుకున్నారు. లింగంపేట శివారుకు వెళ్లారు. ఆదివారం ఉదయం 3గంటల సమయంలో ఇళ్లకు బయలుదేరారు. కృపానంద్‌, గంగాధర్‌ ద్విచక్ర వాహనంపై వెళ్తూ కొత్తబస్టాండు ఔట్‌ గేట్‌ వద్ద బైక్‌ అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొనడంతో ఇద్దరి తలలకు బలమైన గాయాలై ప్రమాదస్థలంలోనే మృతిచెందారు. పట్టణ ఎస్సై వేణురావు ఘటన స్థలానికి చేరుకుని మృతదేహాలను ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతుడు గంగాధర్‌ తండ్రి మొండయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పట్టణ సీఐ రాంచందర్‌రావు తెలిపారు.

రెండు గ్రామాల్లో విషాదం

నిత్యం కలిసిమెలిసి ఉండే ఇద్దరు స్నేహితులు రోడ్డు ప్రమాదంలో మృతిచెందడంతో లక్ష్మీపూర్‌, ఒబులాపూర్‌ గ్రామాల్లో విషాదం నెలకొంది. వారి కుటుంబ సభ్యులు, బంధువులు కన్నీరుమున్నీరయ్యారు. ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి, ఎమ్మెల్యే సంజయ్‌కుమార్‌ జగిత్యాల ప్రభుత్వ ఆస్పత్రికి వెళ్లి బాధిత కుటుంబాలను పరామర్శించారు.

ట్రాక్టర్‌ ఢీకొని యువకుడి మృతి


రాజ్‌కుమార్‌ (ఫైల్‌)

కరీంనగర్‌ క్రైం: కరీంనగర్‌లోని జ్యోతినగర్‌ ప్రాంతంలో ట్రాక్టర్‌ ఢీకొని ఓ యువకుడు మృతిచెందాడు. టూటౌన్‌ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కరీంనగర్‌ రూరల్‌ మండలంలోని దుర్శేడ్‌కు చెందిన గాజుల రాజ్‌కుమార్‌(28) వ్యవసాయం చేస్తుంటాడు. శనివారం రాత్రి చింతకుంటలోని ఐకేపీ సెంటర్‌లో ఉన్న తన తమ్ముడు చంద్రశేఖర్‌కు టిఫిన్‌ బాక్స్‌ ఇవ్వడానికి బైక్‌పై బయలుదేరాడు. కోర్టు నుంచి చింతకుంట వెళ్లే మార్గంలో వెనక నుంచి వేగంగా వస్తున్న ట్రాక్టర్‌ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో రాజ్‌కుమార్‌ తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు వెంటనే 108 వాహనానికి సమాచారం అందించడంతో సిబ్బంది వచ్చి, ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతిచెందాడు. మృతుడి సోదరుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు పేర్కొన్నారు.

క్లుప్తంగా

పాట ఆవిష్కరణ



కరీంనగర్‌కల్చరల్: శ్రీనారసింహ చిత్రాలయ బ్యానర్‌పై వెంకట్ కాచర్ల దర్శకత్వంలో నరేశ్ వర్మ నిర్మిస్తున్న బైరాన్‌పల్లి చిత్రంలోని ఓ సాంగ్‌ను మంత్రి గంగుల కమలాకర్ ఆదివారం కేసీఆర్ గెస్ట్‌లో విడుదల చేశారు. ఈ సందర్భంగా మంత్రి గంగుల కమలాకర్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత సినిమా ఇండస్ట్రీలో తెలంగాణ కళాకారులు తమ సత్తా చాటుతున్నారన్నారు. తెలంగాణలో అద్భుతమైన ప్రతిభ గల కళాకారులు ఉన్నారని, వారందరినీ రాష్ట్ర ప్రభుత్వం ప్రోత్సహిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో నిర్మాత నరేశ్‌వర్మ, దర్శకుడు వెంకట్, సీనియర్ జర్నలిస్టు, దర్శకుడు రమేశ్, చిత్ర యూనిట్ సభ్యులు పూర్ణచంద్ర బైరి, ప్రభావతి, సాయికీర్తన, ఆసంపల్లి శ్రీనివాస్, రాజేశ్ తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన సమ్మర్ క్యాంపు



విద్యానగర్(కరీంనగర్): కరీంనగర్‌లోని బ్లూమెన్ డ్యాన్స్ స్టూడియోలో నిర్వహించిన సమ్మర్ క్యాంపు ఆదివారం ముగిసింది. ముగింపు కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నగర అధ్యక్షుడు చల్లా హరిశంకర్ ముఖ్యఅతిథిగా పాల్గొని శిక్షణ పొందిన చిన్నారులకు సర్టిఫికెట్లు ప్రదానం చేసారు. డాన్స్ మాస్టర్ రామకృష్ణ, చిన్నారుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

సన్మానం



శ్రీనివాస్‌రెడ్డిని సన్మానిస్తున్న స్వచ్ఛంద సంస్థల బాధ్యులు

విద్యానగర్(కరీంనగర్): టీఎన్జీవోస్ జిల్లా అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నికైన దారం శ్రీనివాస్‌రెడ్డిని ఆదివారం పలు స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు సన్మానించి జ్ఞాపికలు అందజేశారు. శ్రీనివాస్‌రెడ్డిని సన్మానించిన వారిలో జాతీయ యువజన అవార్డు గ్రహీత, శ్రీకరం ఫౌండేషన్ చైర్మన్ ఏ. కిరణ్‌కుమార్, పెద్ది స్వచ్ఛంద సంస్థ వైస్ చైర్మన్ పెద్ది వేణుగోపాల్, రైసింగ్‌సన్ యూత్ క్లబ్ అధ్యక్షుడు గజ్జల అశోక్ ఉన్నారు. ఈ సందర్భంగా శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ ఉద్యోగ సంఘాలు, యువజన స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు సమాజ అభివృద్ధి, సంక్షేమం కోసం వారధిగా నిలవాలని అన్నారు. స్వచ్ఛంద సంస్థలు చేపట్టే సేవా కార్యక్రమల్లో ఉద్యోగ వర్గాల సహకారం ఎప్పుడు ఉంటుందని తెలిపారు.

కవి వీత్రీజ మరణం సాహితీ లోకానికి తీరని లోటు

కరీంనగర్‌కల్చరల్: జనగామ జిల్లా తరిగొప్పుల గ్రామానికి చెందిన కవి జంగ వీరయ్య (వీత్రీజ) మరణం సాహితీ లోకానికి తీరని లోటని పలువురు కవులు ఒక ప్రకటనలో సంతాపం వ్యక్తం చేశారు. ఫొటోగ్రఫీ వృత్తిగా ..కవిత్వం ప్రవత్తిగా చేసుకొని ఎన్నో సామాజిక రచనలు చేశారని పేర్కొన్నారు. పేదరికపు చీకట్లను చిదివే అక్షరం ఆరిపోయిందని తెలిపారు. నిరుపేద వీత్రీజ కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు. సంతాపం వ్యక్తం చేసిన వారిలో కూకట్ల తిరుపతి, అన్నవరం దేవేందర్, డాక్టర్ కాలువ మల్లయ్య, డాక్టర్ సందెవేని తిరుపతి, డాక్టర్ పోతరవేని తిరుపతి, ఉడుత సంపత్, పాక అశోక్, మడల జంపయ్య రామగుండం కరుణాకర్ తదితరులున్నారు.

సంప్రదాయ నేపథ్యం.. శాస్త్రీయ నృత్యం

- సంప్రదాయ నృత్యంపై మక్కువ చూపుతున్న చిన్నారులు
- వేసవి సెలవులు సద్వినియోగం చేసుకుంటున్న విద్యార్థులు



విద్యార్థులకు నాట్యంలో తర్ఫీదు ఇస్తున్న శిక్షకురాలు సుహాసిని

కరీంనగర్ కల్చరల్: చిన్నారులకు శాస్త్రీయ నృత్యాల్లో శిక్షణ ఇప్పించడంతో పాటు సంప్రదాయ విధానాలపై అవగాహన కల్పించే దిశగా తల్లిదండ్రులు అడుగులు వేస్తున్నారు. సెలవుల్లో శాస్త్రీయ నృత్యంలో రాణించేలా ప్రోత్సహిస్తున్నారు. ఉదయం, సాయంత్రం నాట్య శిక్షణకు పంపుతూ వారిపై పాఠ్యాంశాల ఒత్తిడిని కొంతమేర తగ్గించే ప్రయత్నం చేస్తూ వారిలోని సృజనాత్మకతను వెలికితీసేందుకు కృషి చేస్తున్నారు. నగరంలోని బాలభవన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వేసవి శిక్షణ తరగతులకు విద్యార్థుల నుంచి మంచి స్పందన వస్తోంది. విద్యార్థులు సమయాన్ని వృథా చేయకుండా తమలోని కళలకు మరింత పదును పెడుతున్నారు. ఫోక్, వెస్ట్రన్, రకరకాల నృత్యాలు ఉన్న శాస్త్రీయ నృత్యంపై విద్యార్థులు ఆసక్తి కనబరుస్తూ తర్ఫీదు పొందుతున్నారు. ఈ నృత్యం నేర్చుకుంటున్న చిన్నారులను 'సాక్షి' పలకరించగా తమ అభిప్రాయాలను వెల్లడించారు.

మానసిక ప్రశాంతత



తెలుగు సంస్కృతి సంప్రదాయాలు తెలిపేలా ఈ శాస్త్రీయ నృత్యంతో జ్ఞాపక శక్తితో పాటు మానసిక ప్రశాంతత చేకూరుతుంది. విద్యార్థులకు చదువుతో పాటు ఇలాంటి వాటిలో శిక్షణ తీసుకుంటే ఎంతో ఉపయోగం ఉంటుంది. హైదరాబాద్, రాజమండ్రి, విజయవాడ ప్రాంతాల్లో మా విద్యార్థులు ప్రదర్శనలు ఇచ్చి పలు అవార్డులు అందుకున్నారు.

– సుహాసిని, శాస్త్రీయ నృత్య శిక్షకురాలు

సంప్రదాయాలకు గౌరవ సూచిక



నేను 8వ తరగతి చదువుతున్న. మన సంస్కృతి సంప్రదాయాలకు గౌరవ సూచికం ఈ శాస్త్రీయ నృత్యం . ఇది మనకు అర్థమయ్యే తెలుగు భాషలో బోధించడం సౌకర్యంగా ఉంది. నాట్యంలో మంచి శిక్షణ ఇస్తున్నారు.

– లక్ష్మిశరణ్య, మంకమ్మతోట

వ్యాయామం అవుతోంది



నాకు క్లాసికల్ నృత్యం అంటే చాలా ఇష్టం. ఈ నృత్యం నేర్చుకోవడం వల్ల నాలో ఏకాగ్రతతో పాటు శరీరానికి చక్కటి వ్యాయామం అవుతోంది, దీంతో మనసు ప్రశాంతతంగా ఉంటుంది. ఈ నృత్యం నేర్పిస్తున్న మా టీచర్ సుహాసినికి ధన్యవాదాలు.

– నాగశ్రీ, శ్రీనగర్‌కాలనీ

సంతోషం కలిగిస్తోంది



నేను 9వ తరగతి చదువుతున్న. సమ్మర్ హాలీడేస్‌లో ఏదో ఒకటి నేర్చుకోవాలని క్లాసికల్ నృత్యం నేర్చుకుంటున్న. మన సంప్రదాయాలను ప్రతిభించే ఈ నాట్యంలో శిక్షణ తీసుకోవడం ఎంతో సంతోషం కలిగిస్తోంది.

– సంవేద్య, అన్నారం

ప్రభుత్వానికి కృతజ్ఞతలు



శాస్త్రీయ నృత్యమంటే నాకు అభిమానం. సంప్రదాయం ప్రకారం చేసే నృత్యంతో ఆరోగ్యంతో పాటు మానసిక ఉల్లాసం కూడా కలుగుతుంది. బాలభవన్‌లో వేసవిలో ఉచిత తరగతులు నిర్వహించడం ఎంతో ఉపయోగపడుతున్నాయి. ప్రభుత్వాన్ని కృతజ్ఞతలు.

– అక్షర, రేకుర్తి

కుల వృత్తులకు జీవం పోసింది సీఎం కేసీఆర్

- రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి గంగుల కమలాకర్



మంత్రిని సన్మానిస్తున్న ముదిరాజ్ కులస్తులు

కరీంనగర్: రాష్ట్రంలో అన్ని వర్గాల ప్రజలు సంతోషంగా ఉండాలని కులవృత్తులకు జీవం పోసింది సీఎం కేసీఆర్‌యేనని రాష్ట్ర బీసీ సంక్షేమ, పౌరసరఫరాల శాఖ మంత్రి గంగుల కమలాకర్ అన్నారు. ఆదివారం రాంనగర్‌లోని పెద్దమ్మతల్లి ఆలయాన్ని దర్శించుకొని అసంపూర్తిగా ఉన్న కమ్యూనిటీ హాల్ భవన నిర్మాణానికి ముదిరాజ్ కులస్తుల విజ్ఞప్తి మేరకు రూ.30 లక్షల నిధులు మంజూరు చేశారు. దీంతో మంత్రి గంగుల కమలాకర్‌ను భారీ గజమాలతో సన్మానించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ అన్ని వర్గాల ప్రజలకు రాష్ట్ర ప్రభుత్వం అండగా ఉంటుందని అన్నారు. భవన నిర్మాణ పనులు త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కరీంనగర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ రెడ్డవేణి మధు, గ్రంథాలయ చైర్మన్ పొన్నం అనిల్‌గౌడ్, బీఆర్‌ఎస్ నగర అధ్యక్షుడు చల్లా హరిశంకర్, మాజీ కార్పొరేటర్లు పెంట సత్యం, వరాల నారాయణ, నాయకులు కొట్టె మల్లేశం, పలువురు ముదిరాజ్ కులస్తులు పాల్గొన్నారు.

ఎన్నీల ముచ్చట్లు

కరీంనగర్‌కల్చరల్: ఎన్నీల ముచ్చట్లతో కొత్త కవుల నుంచి ఎల్లెడలా కవిత్వ సృజన వస్తున్నదని తెలంగాణ రచయితల వేదిక రాష్ట్ర అధ్యక్షుడు గాగోజు నాగభూషణం అన్నారు. ఆదివారం విద్యానగర్‌లోని సెయింట్ జార్జ్ పాఠశాలలో ఎన్నీల ముచ్చట్లు కార్యక్రమం నిర్వహించారు. ప్రతినెలా ఒక కొత్త క వితతో ఎన్నీల ముచ్చట్ల సాహిత్య సృజన కొనసాగిస్తున్నారని ప్రముఖ కవి అన్నవరం దేవేందర్ అన్నారు. ఇటీవల మరణించిన కరీంనగర్ తెరవే జిల్లా కార్యదర్శి సీవీ కుమార్ తండ్రి చర్లపల్లి రామ స్వామికి, ప్రముఖ కవి వీత్రీజకు నివాళి ఘటించారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ కవులు కూకట్ల తిరుపతి, విలాసాగరం రవీందర్, మమత వేణు, మధుశ్రీ, నసిరుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

నగరంలో వేగంగా అభివృద్ధి పనులు



అభివృద్ధి పనులను ప్రారంభిస్తున్న మేయర్ సునీల్‌రావు

కరీంనగర్‌కార్పొరేషన్: నగరంలో వేగంగా అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయని మేయర్ సునీల్‌రావు అన్నారు. ఆదివారం 4వ డివిజన్ ఖాన్‌పురాలో రూ.38లక్షలతో నిర్మించనున్న సీసీ రోడ్డు పనులకు భూమిపూజ చేశారు. పేద ప్రజలు అధికంగా నివసించే ఖాన్‌పురాలో మౌలిక వసతులు కల్పించామని అన్నారు. ఇరుకు గల్లీలు ఉన్న చోట ఎస్‌డబ్ల్యూజీ పైప్‌లైన్ వేసి సీసీతో రోడ్లను విస్తరిస్తున్నట్లు తెలిపారు. కార్ఖానగడ్డ, కిసాన్‌నగర్, ఉస్సేన్ పుర, నాఖా చౌరస్తా ప్రాంతాల రోడ్లను కూడా అందంగా తీర్చిదిద్దడం జరిగిందన్నారు. నగరపాలక సంస్థద్వారా అందజేస్తున్న అన్నపూర్ణ పథకాన్ని మరికొన్ని ప్రాంతాల్లో ఏర్పాటు చేస్తామని తెలిపారు. వర్షాకాలంలో ప్రజలకు ఎలాంటి ఇబ్బంది లేకుండా ఓపెన్ డ్రెయినేజీలు ఉన్న చోట క్లోజ్ చేసి ప్రొటెక్షన్ వాల్ నిర్మించి రక్షణ చర్యలు చేపడుతున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ సుజహాత్ ఫర్వీన్ అలీ, మాజీ డిప్యూటీ మేయర్ అబ్బాస్ సమీ పాల్గొన్నారు.

అందుబాటులోకి మోడ్రన్ దోభీఘాట్

గోదాంగడ్డలో నిర్మిస్తున్న ఆధునిక దోబీఘాట్‌ను త్వరలో అందుబాటులోకి తీసుకొస్తామని మేయర్ సునీల్‌రావు తెలిపారు. ఆదివారం 34వ డివిజన్ లోని దోబీఘాట్‌ను సందర్శించారు. పక్కనే ఉన్న మడేలయ్యస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్మార్ట్‌సిటీ ప్రాజెక్ట్‌లో రజక కులవృత్తిని ప్రోత్సహించేందుకు మోడ్రన్ దోబీఘాట్‌లు నిర్మిస్తున్నామన్నారు మోడ్రన్ దోబీఘాట్ పనులు 65శాతం పూర్తయ్యాయని, మిగతా పనులు త్వరలో పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు.

సంపర్క్ అభియాన్ కార్యక్రమాలను విజయవంతం చేయండి

కరీంనగర్‌టౌన్: ఈనెల 30 వరకు నిర్వహించే బీజేపీ మహాజన్ సంపర్క్ అభియాన్ కార్యక్రమాలను విజయవంతం చేయాలని బీజేపీ కరీంనగర్ అసెంబ్లీ నియోజకవర్గ కన్వీనర్ శ్రీనివాస్ అన్నారు. ఆదివారం రేకుర్తిలో వివిధ మోర్చాల సంయుక్త కోఆర్డినేటర్ జాడి బాల్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. ముఖ్య కార్యకర్తలతో సమ్మేళనం, మోర్చా సంయుక్త సమ్మేళనం, అసెంబ్లీ బహిరంగ సభ, 21న యోగా దినోత్సవం, 23న బలిదాన్ దివస్, 23 నుంచి 30 వరకు ఇంటింటికీ మోదీ చేసిన అభివృద్ధి, విజయాలను ప్రతి ఇంటిఇంటికీ వెళ్లి వివరించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో కిసాన్ మోర్చా పశ్చిమ జోన్ అధ్యక్షుడు లక్ష్మిరాజం, పార్టీ జిల్లా అధికార ప్రతినిధి ఎడమ సత్యనారాయణరెడ్డి ఎస్టీ మోర్చా పశ్చిమ జోన్ అధ్యక్షుడు రవినాయక్, ఓబీసీ కార్యదర్శి చంద్రగిరి వేణు తదితరులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మికం

నేత్రపర్వంగా శ్రీవేంకటేశ్వరస్వామి కల్యాణం



కరీంనగర్‌కల్చరల్: మంగళవాయిద్యాలు.. వేదమంత్రోచ్చారణలు.. అలంకరణలు.. భక్తుల గోవింద నామ స్మరణలు.. ఆధ్యాత్మిక తన్మయత్వం మధ్య మంకమ్మతోట శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయ 13వ బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం శ్రీభూనీళా సమేత లక్ష్మీ వేంకటేశ్వరస్వామి కల్యాణాన్ని నేత్రపర్వంగా నిర్వహించారు. అర్చకుడు పీచర నరసింహాచార్య బృందం వైదిక నిర్వహణలో జరిగిన కల్యాణాన్ని భక్తులు కనులారా వీక్షించి తరించారు. సాయంత్రం రమణీయంగా రథంపై శ్రీవారు దేవేరులతో విహరిస్తూ భక్తులకు కనువిందు చేశారు. కార్యక్రమంలో ఈవో నాగారపు శ్రీనివాస్, సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

వైభవంగా మల్లికార్జునస్వామి కల్యాణం..



కరీంనగర్‌రూరల్: కరీంనగర్ మండలం బొమ్మకల్‌లోని శ్రీకొచ్చెగుట్ట మల్లికార్జునస్వామి కల్యాణాన్ని ఆదివారం వైభవంగా నిర్వహించారు. ఒగ్గుపూజారులు సాయిల్ల సింగారయ్య,శివయ్యల ఆధ్వర్యంలో పెద్దపట్నం వేసి భ్రమరాంబసహిత కేతమ్మతో మల్లికార్జునస్వామి కల్యాణాన్ని జరిపి జీవిత చరిత్రను వినిపించారు. అనంతరం స్వామి వారిని రాష్ట్ర బీసీ సంక్షేమ, పౌరసరఫరాల శాఖ మంత్రి గంగుల కమలాకర్ దర్శించుకుని మొక్కులు చెల్లించారు. ఈ కార్యక్రమంలో గ్రంధాలయ సంస్థ చైర్మన్ అనిల్‌కుమార్, సర్పంచ్ శ్రీనివాస్, ఆలయ కమిటీ ప్రతినిధులు కాల్వ లింగయ్య, మురళీ, మల్లేశం, శశిధర్, అశోక్, శంకర్, నాయకులు సుధాకర్, మోహన్, కిరణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

కల్యాణరామా.. పట్టాభిరామా..



కరీంనగర్ కల్చరల్: నగర శివారులోని వేదభవనంలో సీతారాముల పట్టాభిషేక నాల్లో వార్షికోత్సవాల్లో భాగంగా ఆదివారం వికాసతరంగిణి, జెట్ ఆధ్వర్యంలో వేదభవనం ప్రిన్సిపాల్ డాక్టర్ కె.వరప్రసాదాచార్యస్వామి బృందం ఆధ్వర్యంలో మహా పూర్ణాహుతి, సీతారామ కల్యాణం, శ్రీరామ పట్టాభిషేకం నిర్వహించారు. కార్యక్రమంలో వికాస తరంగిణి జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు గౌతమరావు. యాద కిషన్, సభ్యులు, భక్తులు, వేద విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

అంజనాద్రి ఆలయ వార్షికోత్సవం



కరీంనగర్ కల్చరల్: నగరంలోని భగత్‌నగర్ అంజనాద్రి ప్రసన్నాంజనేయ స్వామి ఆలయ 30వ వార్షికోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. ప్రత్యేక దమ్మ హవనం అనంతరం స్వామికి శత ఘటాభిషేకాన్ని వేద మంత్రోచ్చారణల మధ్య జరిపారు. దివ్యాలంకారం, నైవేద్యం, హారతి తర్వాత తీర్థ ప్రసాద వితరణ చేశారు. కార్య క్రమంలో ఆలయ కమిటీ బాధ్యులు, భక్తులు పాల్గొన్నారు.

పల్లకి.. ఉయ్యాల సేవలు.. సహస్ర దీపారాధన



విద్యానగర్(కరీంనగర్): ఏరువాక పౌర్ణమి సందర్భంగా ఆదివారం కరీంనగర్ మండలం నగునూర్‌లోని దుర్గాభవానీ ఆలయంలో అమ్మవారికి వేదపండితులు పురాతం మహేశ్వరశర్మ ఆధ్వర్యంలో ప్రధాన అర్చకుడు పవన్‌కృష్ణ శర్మ విశేష హారతి పూజా కార్యక్రమాలు నిర్వహించారు. పల్లకి సేవ, ఉయ్యాల సేవలతో పాటు సహస్రదీపారాధన చేశారు. పూజల్లో భక్తులు పాల్గొన్నారు.

రాహుల్‌గాంధీని కలిసిన నిఖిల్



రాహుల్‌గాంధీతో జువ్వాడి నిఖిల్ చక్రవర్తి

కరీంనగర్‌రూరల్: అమెరికా పర్యటనలో భాగంగా ఆదివారం న్యూయార్క్‌లో ఏర్పాటు చేసిన ఇండియన్ ఓవర్సీస్ కాంగ్రెస్ యుఎస్‌ఏ సమావేశానికి హాజరైన కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీని కరీంనగర్ పార్లమెంట్ మాజీ యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు జువ్వాడి నిఖిల్ చక్రవర్తి కలిసి పుష్పగుచ్ఛం అందించారు. రాహుల్‌తో కలిసి ఫొటో దిగారు. అనంతరం పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి, ఎంపీ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, మధుయాష్కీ, పొన్నాల లక్ష్మయ్య తదితరులను కలిసి రాష్ట్ర, జిల్లా రాజకీయాలను చర్చించారు. దివంగత మాజీ ఎంపీ జువ్వాడి చొక్కారావు మనవడిగా రాబోయే ఎన్నికల్లో కరీంనగర్ జిల్లాలో కాంగ్రెస్ పార్టీ విజయానికి కృషి చేస్తానని నిఖిల్ చక్రవర్తి తెలిపారు.

చెర్లభూత్కూర్ రెడ్డి సంఘం కార్యవర్గం ఎన్నిక



ఎన్నికైన కార్యవర్గసభ్యులు

కరీంనగర్‌రూరల్: కరీంనగర్ మండలం చెర్లభూత్కూర్‌లో ఆదివారం జరిగిన సమావేశంలో రెడ్డి సంఘం నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా నల్ల శ్రీనివాస్‌రెడ్డి, ఉపాధ్యక్షుడిగా కాంతాల తిరుపతిరెడ్డి, ప్రధాన కార్యదర్శిగా దాసరి కృష్ణప్రసాద్‌రెడ్డి, కార్యదర్శిగా గుజ్జుల రమణారెడ్డి, కోశాధికారిగా ముచ్చర్ల అనంతరెడ్డి, కార్యవర్గసభ్యులుగా పెండ్యాల కేశవరెడ్డి, ఇనుగాల దామోదర్ రెడ్డి, కల్వల రమణారెడ్డి, పెండ్యాల రాజేందర్‌రెడ్డి, గుజ్జుల మల్లారెడ్డిలు ఎన్నికయ్యారు.

చిత్ర కథ: రోగులకు తప్పని తిప్పలు



నగరంలోని ప్రభుత్వ ప్రధాన ఆస్పత్రిలో పేరుకే ఐసీయూ కానీ అందులో కనీస సౌకర్యాలు లేక రోగులు ఇబ్బందులు పడుతున్నారు. అసలే వేసవికాలం.. ఎండలు మండుతున్నాయి. ఐసీయూలోని ఏసీలు, ఫ్యాన్లు సరిగా పనిచేయడం లేదు. దీంతో రోగులు ఇలా.. తమ ఇంటి వద్ద నుంచి కూలర్లు, ఫ్యాన్లు తెచ్చి పెట్టుకుంటున్నారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, కరీంనగర్

సర్టిఫికెట్లు ప్రదానం



సర్టిఫికెట్లు అందుకున్న విద్యార్థులు

విద్యానగర్: కరీంనగర్‌లోని మాస్క్ యాక్టింగ్ ఇన్‌స్టిట్యూట్ ఆధ్వర్యంలో నిర్వహించిన సమ్మర్ యాక్టింగ్ క్యాంపులో శిక్షణ పొందిన విద్యార్థులకు ఆదివారం ప్రెస్‌భవన్‌లో సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో కరీంనగర్ సిటీ చాంబర్ ఆఫ్ కామర్స్ ప్రెసిడెంట్ చిట్టుమల్ల శ్రీనివాస్, మాస్క్ ఇనిస్టిట్యూట్ చైర్మన్ భూనాథచారి, కరీంనగర్ బులియన్, జూవెల్లరీ అసోసియేషన్ అధ్యక్షుడు వంగల శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

లక్ష రుణమాఫీ ఏమైంది?

విద్యానగర్(కరీంనగర్): గత ఎన్నికల్లో కేసీఆర్ రైతులకు ఇచ్చిన లక్ష రూపాయల రుణమాఫీ హామీ ఏమైందని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి దామెర సత్యం ఒక ప్రకటనలో ప్రశ్నించారు. తెలంగాణ వచ్చిన తర్వాత కూడా రైతుల ఆత్మహత్యలు ఆగడం లేదన్నారు. తొమ్మిదేళ్ల పాలనలో ఆత్మహత్యలు చేసుకున్న రైతు మరణాలపై శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. యాసంగి వరి ధాన్యం కొనుగోలులో మిల్లర్లు రైతులను మోసం చేస్తే వారి మీద ఎందుకు పీడీ కేసులు పెట్టడం లేదని ప్రశ్నించారు. వెంటనే రైతు రుణమాఫీ చేసి వారిని ఆదుకోవాలని డిమాండ్ చేశారు.

అ'పూర్వ' సమ్మేళనం



కరీంనగర్: కరీంనగర్ హోలీఏంజిల్స్ ఉన్నత పాఠశాల 1997–98 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు ఆదివారం గణేశ్‌నగర్‌లోని ఎస్ఎస్ ఫంక్షన్ హాల్ వేదికగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహించుకున్నారు. ఇంజినీర్లు, టీచర్లు, లెక్చరర్లు, వ్యాపారవేత్తలు.. ఇలా ఒక్కో రంగంలో స్థిరపడ్డ 32 మంది విద్యార్థులు ఒకే చోట కలుసుకుని చిన్న నాటి అనుభవాలను పంచుకున్నారు.తమ జీవితంలో ఎదుగు బొదుగులు.. ఇప్పుడున్న స్థితిగతులను ముచ్చటించుకున్నారు. ఫొటోల రూపంలో శాశ్వత జ్ఞాపకంగా మలుచుకున్నారు. చిన్ననాటి గురువులను శాలువాలతో సత్కరించారు. చిన్ననాటి మిత్రులను, ఉపాధ్యాయ బృందాన్ని ఒకే వేదికపైకి కలుసుకునేలా ఆర్గనైజింగ్ కమిటీ బృందం వేణుగోపాల్, వంశీ, స్వప్న, సరిత, నర్సింహారెడ్డి, దీప్ వర్ధన్, రాజేందర్‌లు చేసిన చొరవను అభినందించారు.

65 దాటితేనే రిటైరే..!

▶ మొదటి పేజీ తరువాయి

అంగన్‌వాడీ కేంద్రాలు, మరో 3,989 మినీ అంగన్‌వాడీ కేంద్రాలుగా కొనసాగుతున్నాయి. మినీ అంగన్‌వాడీ కేంద్రాల్లో కేవలం అంగన్‌వాడీ టీచర్లు మాత్రమే విధులు నిర్వహిస్తుండగా.. ప్రధాన కేంద్రాల్లో టీచర్‌తో పాటు హెల్పర్ కూడా ఉంటారు. ప్రస్తుతం రాష్ట్రవ్యాప్తంగా 55,450 మంది అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్లు విధుల్లో ఉన్నారు. వీరిలో ఐదు శాతం మంది పదవీ విరమణకు దగ్గర్లో ఉండగా.. మరో రెండున్నర వేల మందికి పైగా 65 సంవత్సరాలకు పైబడినవారున్నారు. ప్రస్తుతం కేంద్ర ప్రభుత్వం నిబంధనలకు అనుగుణంగా వీరికి రిటైర్మెంట్ ఇచ్చేందుకు రాష్ట్ర మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ రెండు రకాల ప్రతిపాదనలను ప్రభుత్వం ముందు ఉంచింది. పదవీ విరమణ పొందే టీచర్‌కు రూ.లక్ష ఆర్థిక సాయంతో పాటు ఆసరా పెన్షన్, కారుణ్య నియామకం కింద కుటుంబీకులకు అవకాశం ఇచ్చేలా ఒక ప్యాకేజీ తయారు చేసింది. అదే విధంగా రూ.2 లక్షల ఆర్థిక సాయంతో పాటు ఆసరా పెన్షన్ ఇచ్చే అంశాన్ని కూడా ప్రతిపాదించినట్లు తెలిసింది. ఇందుకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వంపై పడనున్న ఆర్థిక భారం తదితరాలపై ఆర్థిక శాఖ మంత్రి హరీశ్‌రావు వద్ద మంత్రి సత్యవతి రాథోడ్, సంబంధిత అధికారులు ఇప్పటికే సుదీర్ఘంగా చర్చించారు. ఆయన ఈ అంశాన్ని సీఎం కేసీఆర్ దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిసింది. ఈ నేపథ్యంలో ఒకట్రెండు రోజుల్లో పదవీ విరమణపై స్పష్టత ఇస్తూ మార్గదర్శకాలు విడుదల చేసే అవకాశం ఉన్నట్లు సమాచారం.

మినీ అంగన్‌వాడీలు లేనట్లే..

రాష్ట్రంలోని 3,989 మినీ అంగన్‌వాడీ కేంద్రాల్లో ఎక్కువ శాతం పట్టణ ప్రాంతాల్లోనే ఉన్నాయి. కేంద్ర ప్రభుత్వ నిబంధనల్లోమినీ అంగన్‌వాడీ కేంద్రాలను రద్దు చేయాలనేది కూడా ఒకటి. దీంతో వీటన్నింటినీ అప్‌గ్రేడ్ చేస్తూ ప్రధాన అంగన్‌వాడీ కేంద్రాలుగా నిర్వహించాల్సి ఉంటుంది. ఈ క్రమంలో 3,989 మినీ అంగన్‌వాడీ కేంద్రాలు ప్రధాన అంగన్‌వాడీ కేంద్రాలుగా అప్‌గ్రేడ్ అయితే ఆ మేరకు హెల్పర్ పోస్టులు కేటాయించి నియామకాలు చేపట్టాల్సి ఉంది. దీనిపై కూడా శిశు సంక్షేమ శాఖ ప్రతిపాదనలు రూపొందిస్తోందని, అతి త్వరలో ప్రభుత్వ నిర్ణయం కూడా వెలువడే అవకాశం ఉందని తెలుస్తోంది.

మధ్యవర్తిత్వంతో కోర్టులపై భారం తగ్గింపు

- విపరీత ఒత్తిడి ఏ వ్యవస్థకూ మంచిది కాదు
- ఈఎండబ్ల్యూ కార్యక్రమంలో గవర్నర్ తమిళిసై
- మధ్యవర్తిత్వ వ్యవస్థ పటిష్టం కావాలి: హైకోర్టు సీజే ఉజ్జల్ భూయాన్



ఈఎండబ్ల్యూ కార్యక్రమంలో మాట్లాడుతున్న గవర్నర్ తమిళిసై సౌందరరాజన్

సాక్షి, హైదరాబాద్: ఏదైనా వ్యవస్థపై అది భరించే శక్తికి మించి ఒత్తిడి పెంచితే ఆ వ్యవస్థ దెబ్బతింటుందని రాష్ట్ర గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ పేర్కొన్నారు. న్యాయ వ్యవస్థ భారాన్ని తగ్గించడం 'మధ్యవర్తిత్వం'తోనే సాధ్యమని తెలిపారు. ఇంట్లోని చిన్న చిన్న తగాదాలు కూడా కోర్టుకు చేరడంతో పెండింగ్ కేసులు అంతకంతకూ పెరిగిపోతున్నాయన్నారు. ఇలాంటి కేసులన్నీ మధ్యవర్తిత్వంతోనే పరిష్కారం కావాలని ఆమె అభిప్రాయపడ్డారు. ఈ–మీడియేషన్ రైటింగ్స్ (ఈఎండబ్ల్యూ) ఏర్పాటై మూడేళ్లయిన సందర్భంగా హైదరాబాద్‌లోని ఓ హోటల్‌లో ఆదివారం ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. దీనికి ముఖ్యఅతిథిగా గవర్నర్ తమిళిసై హాజరయ్యారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ ఈఎండబ్ల్యూ మూడేళ్లు విజయవంతంగా పూర్తి చేసుకోవడం అభినందనీయమని ప్రశంసించారు. 'అత్తాకోడలు, భార్యాభర్తలు, అన్నదమ్ములు.. ఇలా చిన్నచిన్న వివాదాలను ఇంటి స్థాయిలోనో లేదా గ్రామ స్థాయిలోనో ఎవరో ఒకరు మధ్యవర్తిత్వంతో పరిష్కరించే ఏర్పాట్లు జరగాలి. పేదలకు కోర్టులను ఆశ్రయించి న్యాయం పొందే ఆర్థిక స్తోమత తక్కువ. అలాంటి వారి సమస్యల పరిష్కారం కోసం మధ్యవర్తులు ముందుకురావాలి'అని తమిళిసై పిలుపునిచ్చారు. హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఉజ్జల్ భూయాన్ మాట్లాడుతూ ఈ కార్యక్రమానికి రావడం ఆనందంగా ఉందన్నారు. భరించే శక్తికి మించి న్యాయవ్యవస్థ భారం మోస్తోందని చెప్పారు. గతంలో గ్రామీణ స్థాయిలో, కుటుంబాల్లో ఉన్న మధ్యవర్తిత్వ వ్యవస్థను మరింత పటిష్టం చేయాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. దీని ద్వారా సమయం, డబ్బు ఆదా అవుతుందని, సత్వర న్యాయం అందుతుందన్నారు. కోర్టు తీర్పు తర్వాత సదరు పార్టీల మధ్య బంధం ఉండకపోవచ్చని, అదే మధ్యవర్తిత్వ పరిష్కారంలో వారి అంగీకారంతోపాటు బంధం బలహీనపడదని చెప్పారు. మీడియేటర్ల సంఖ్య కూడా చాలా తక్కువగా ఉందని, అది పెరగాల్సిన అవసరం ఉందన్నారు.

ఇరు పార్టీలకు సమ న్యాయం..

కోర్టుల్లో వివాదాల పరిష్కారంతో పోలిస్తే మధ్యవర్తిత్వ పరిష్కారం అన్నివిధాలా ఉత్తమమైనదని పట్నా హైకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎల్.నరసింహారెడ్డి పేర్కొన్నారు. మధ్యవర్తిత్వంలో పార్టీలు ఇద్దరూ సఫలీకృతం అవుతారని, ఇద్దరికీ సమ న్యాయం అందుతుందని చెప్పారు. ఇంట్లో, ఊరిలో, సమాజంలో మధ్యవర్తులు ఉండి ఎక్కడికక్కడే సమస్యలకు చెక్ పెడితే అది సమాజ పురోభివృద్ధికి దోహదం చేస్తుందని వివరించారు. ప్రపంచమంతా అత్యంత క్లిష్ట పరిస్థితి ఎదుర్కొంటున్న కోవిడ్ సమయంలో ఈఎండబ్ల్యూ ఊపిరిపోసుకుందని తెలంగాణ బార్ కౌన్సిల్ చైర్మన్ ఎ.నరసింహారెడ్డి తెలిపారు. ప్రత్యక్ష కోర్టులు లేని సమయంలో కక్షిదారులకు సేవలందించిందని, ఇలా మూడేళ్లు పూర్తి చేసుకోవడం అభినందనీయమన్నారు. మధ్యవర్తిత్వం కోసం.. మధ్యవర్తిత్వం చేత.. మీడియేటర్లే నిర్వహిస్తున్న కార్యక్రమం ఈఎండబ్ల్యూ అని మీడియేషన్ ట్రైనర్ పుష్ప గుప్తా అన్నారు. అనంతరం మీడియేషన్ ట్రైనర్ ధన్కచన్ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఢిల్లీ సైనిక బలగాల ట్రిబ్యునల్ చైర్‌పర్సన్ జస్టిస్ రాజేంద్ర మీనన్, పలు రాష్ట్రాల న్యాయమూర్తులు, న్యాయవాదులు, ఈఎండబ్ల్యూ తెలంగాణ కో–ఆర్డినేటర్ మంజీరా వెంకటేశ్, కేఎస్ శర్మ, చిత్రా నారాయణ్ తదితరులు పాల్గొన్నారు.

సికింద్రాబాద్‌లో ప్రయాణికుల పాట్లు

సికింద్రాబాద్: ఒడిశాలో జరిగిన భారీ రైలు ప్రమాదం కారణంతో ఆదివారం కూడా సికింద్రాబాద్ రైల్వేస్టేషన్‌లో ప్రయాణికులకు ఇబ్బందులు తప్పలేదు. పలు రైళ్ల దారిమళ్లించడం, మరికొన్ని రైళ్ల రద్దు కావడంతో రైల్వేస్టేషన్‌లో ప్రయాణికులు గంటల తరబడి పడిగాపులు కాయాల్సి వచ్చింది. సికింద్రాబాద్–గౌహతి ఎక్స్‌ప్రెస్ రైలును దారి మళ్లించడంతో ప్రయాణికులు అసౌకర్యానికి గురయ్యారు. ఉదయం రైళ్లన్నీ కొద్దిగంటల తేడాతో బయలుదేరి వెళ్లగా సాయంత్రం సికింద్రాబాద్ నుంచి బయలుదేరి వెళ్లాల్సిన విజయవాడ, భద్రాచలం రైళ్లను రద్దు చేశారు. దీంతో రైల్వేస్టేషన్‌లో ప్రత్యేక సహాయక కౌంటర్‌ను ఏర్పాటు చేసిన అధికారులు ప్రయాణికులకు అసౌకర్యం కలుగకుండా ఉండేందుకు సమాచారం అందించారు.

మీరాకుమార్‌ని కలిసే టైం కేసీఆర్‌కు లేదా?

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ ఆవిర్భావ వేడుకల్లో పాల్గొనేందుకు వచ్చిన లోక్‌సభ మాజీ స్పీకర్ మీరా కుమార్‌ను మర్యాదపూర్వకంగా కూడా కలిసేందుకు సీఎం కేసీఆర్ ప్రయత్నించకపోవడం ఆయన సంకుచిత బుద్ధికి నిదర్శనమని టీపీసీసీ సీనియర్ ఉపాధ్యక్షుడు గోపిశెట్టి నిరంజన్ విమర్శించారు.

553 మంది క్షేమం

- రెండు రైళ్లలో ఏపీ రాష్ట్రానికి చెందినవారు 696
- ప్రయాణాన్ని రద్దు చేసుకున్న వారు 92
- 22 మందికి గాయాలు, ఒకరు మృత్యువాత
- మరో 28 మంది ఆచూకీ కోసం ప్రయత్నాలు
- మంత్రి బొత్స సత్యనారాయణ వెల్లడి

సాక్షి, విశాఖపట్నం: ఒడిశాలో జరిగిన రైళ్ల ప్రమాద ఘటనలో ఏపీకి చెందిన 553 మంది క్షేమంగా ప్రమాదం నుంచి బయటపడ్డారని రాష్ట్ర విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ వెల్లడించారు. ఆదివారం విశాఖ కలెక్టరేట్‌లో పౌరసరఫరాల శాఖ మంత్రి కారుమూరి నాగేశ్వరరావు, టీటీడీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డిలతో కలిసి ఆయన మీడియాతో మాట్లాడారు. రైల్వే జాబితా ప్రకారం ఆంధ్రప్రదేశ్‌కు చెందిన ప్రయాణికులు కోరమండల్ ఎక్స్‌ప్రెస్‌లో 485 మంది, యశ్వంత్‌పూర్–హౌరా ఎక్స్‌ప్రెస్‌లో 211 మంది వెరసి 696 మంది ఉన్నారని తెలిపారు. వీరిలో 92 మంది ప్రయాణించలేదని చెప్పారు. మిగతా వారిలో 553 మంది ప్రయాణికులు క్షేమంగా ఉన్నారని, 21 మంది స్వల్పంగా, ఒకరు తీవ్రంగా గాయపడ్డారని తెలిపారు. శ్రీకాకుళం జిల్లా సంతబొమ్మాళికి చెందిన గురుమూర్తి అనే వ్యక్తి మృత్యువాత పడ్డారన్నారు. మిగతా 28 మంది ప్రయాణికుల ఆచూకీ కోసం ప్రయత్నాలు చేస్తున్నామని చెప్పారు. వారి మొబైల్ నంబర్ల ఆధారంగా చిరునామా తెలుసుకోవడానికి పోలీస్ శాఖ ప్రయత్నిస్తోందని తెలిపారు.


ప్రమాద బాధితుడు సత్యంకు చెక్కును అందిస్తున్న మంత్రులు బొత్స సత్యనారాయణ, కారుమూరి నాగేశ్వరరావు, టీటీడీ చైర్మన్ సుబ్బారెడ్డి, ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు, ఎమ్మెల్సీ కల్యాణి


రైలు ప్రమాదంలో ఏపీ బాధితులకు పరిహారం

మృతుల కుటుంబాలకు రూ.10 లక్షలు

సాక్షి, అమరావతి : ఒడిశా రైలు ప్రమాదంలో ఏపీకి చెందిన బాధితులందరికీ పరిహారం ఇవ్వాల్సిందిగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. ఒడిశాలోని బాలాసోర్ సమీపంలో రైలు ప్రమాద దుర్ఘటన, అధికారులు తీసుకుంటున్న చర్యలపై ముఖ్యమంత్రి ఆదివారం అధికారులతో సమీక్షించారు. రాష్ట్రం నుంచి ఒడిశాకు వెళ్లిన మంత్రి అమర్‌నాథ్ నేతృత్వంలోని ప్రత్యేక బృందం తీసుకుంటున్న చర్యలను, విశాఖపట్నంలో మరో మంత్రి బొత్స సత్యనారాయణ నేతృత్వంలో పర్యవేక్షణ కార్యకలాపాలను అధికారులు ఈ సందర్భంగా ముఖ్యమంత్రికి వివరించారు. ఈ ఘటనలో రాష్ట్రానికి చెందిన వారు ఎవరైనా మరణించి ఉంటే.. వారి కుటుంబానికి రూ.10 లక్షలు, తీవ్రంగా గాయపడ్డ వారికి రూ.5 లక్షలు, స్వల్పంగా గాయపడ్డ వారికి రూ.లక్ష చొప్పున ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలని సీఎం ఆదేశించారు. కేంద్ర ప్రభుత్వం తరఫున అందిస్తున్న సహాయానికి ఇది అదనం అని స్పష్టం చేశారు. బాలాసోర్‌లో నివాసం ఉంటున్న శ్రీకాకుళం జిల్లాకు చెందిన ఒక వ్యక్తి మరణించారని, ఇది తప్ప రాష్ట్రానికి చెందిన వారెవరూ ఈ ఘటనలో మరణించినట్టుగా ఇప్పటి వరకు నిర్ధారణ కాలేదని అధికారులు వెల్లడించారు. గాయపడ్డ వారికి మంచి వైద్య సదుపాయాలు అందేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు.

రేపటి నుంచి అధిక ఉష్ణోగ్రతలు

మహదేవ్‌పూర్‌లో 45.5 డిగ్రీల అధిక ఉష్ణోగ్రత • నేడు కొన్నిచోట్ల తేలికపాటి వర్షాలు



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో మంగళవారం నుంచి వారం రోజులపాటు అధిక ఉష్ణోగ్రతలు నమోదవుతాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. తెలంగాణ అంతటా పగటి ఉష్ణోగ్రతలు 42 డిగ్రీల నుంచి 44 డిగ్రీల సెల్సియస్ వరకు స్థిరంగా నమోదయ్యే అవకాశం ఉందని పేర్కొంది. కాగా, రాష్ట్రంలో ఆదివారం కొన్నిచోట్ల 45 డిగ్రీలకు పైగా ఉష్ణోగ్రతలు నమోదు కావడం గమనార్హం. జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహదేవ్‌పూర్‌లో ఆదివారం అత్యధికంగా 45.5 డిగ్రీల అధిక ఉష్ణోగ్రత నమోదైంది. సోమవారం ఒక్క రోజు మాత్రం రాష్ట్రంలో తేలికపాటి నుండి మోస్తరు వర్షాలు అక్కడక్కడ కురిసే అవకాశం ఉంది. అక్కడక్కడ ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు కురుస్తాయని వెల్లడించింది. కాగా దక్షిణ చత్తీస్‌ఘడ్ పరిసర ప్రాంతాల్లో సగటు సముద్ర మట్టం నుండి 1.5 కిలోమీటర్ల ఎత్తు వరకు కొనసాగుతూ ఉంది.

ఆదివారం రాష్ట్రంలో నమోదైన గరిష్ట ఉష్ణోగ్రతలివీ...

ప్రాంతం	గరిష్ట ఉష్ణోగ్రత		
మహదేవ్‌పూర్ (జయశంకర్)	45.5	ఆదిలాబాద్	41.8
ముత్తారం (పెద్దపల్లి)	45.1	భద్రాచలం	43.0
జంబుగ (కొమురంభీం)	45.0	హన్మకొండ	41.5
బయ్యారం (మహబూబాబాద్)	44.9	హైదరాబాద్	38.1
ఖానాపూర్ (ఖమ్మం)	44.8	ఖమ్మం	43.0
సుజాతనగర్ (భద్రాద్రి కొత్తగూడెం)	44.8	మహబూబ్‌నగర్	36.6
కట్కూరు (సిద్దిపేట)	44.7	మెదక్	41.8
కల్వచెర్ల (పెద్దపల్లి)	44.7	నల్లగొండ	38.5
బాణాపురం (ఖమ్మం)	44.6	నిజామాబాద్	42.4
		రామగుండం	42.4

పులి ఇటు వైపు వచ్చేనా..?

- ఏళ్లు గడుస్తున్నా ఆవాసం ఏర్పాటు చేయని వైనం
- కారిడర్‌లో ఇబ్బందే కారణమా..!


తాడోబా టైగర్‌జోన్‌లో కెమెరాకు చిక్కిన పులి

జన్నారం: కవ్వాల్ పులుల రక్షిత ప్రదేశం(టైగర్ జోన్) సమీపంలోని తాడోబా టైగర్‌జోన్‌లో పులుల సంఖ్య పెరుగుతోంది. అక్కడి నుంచి కవ్వాల్ టైగర్ జోన్‌కు పులులు వచ్చే అవకాశం ఉంది. కానీ టైగర్ జోన్ ఏర్పడిన నాటి నుంచి రాకపోకలు తప్ప ఆవాసం ఏర్పాటు చేసుకోవడం లేదు. ఇందుకు అనేక కారణాలున్నాయని తెలుస్తోంది. తాడోబా నుంచి కవ్వాల్‌కు పులుల కారిడర్ ఉన్నా మధ్యలో అలజడి ఉన్న కారణంగా పులులు రావడం లేదనే అనుమానాలు అధికారులు వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల తాడోబా అడవుల్లో ఓ పులి కెమెరాకు చిక్కింది.

ఆవాసానికి అనుకూలంగా

కవ్వాల్ టైగర్‌జోన్‌లో పులులు ఆవాసం ఏర్పాటు చేసుకోవడం అనువైన ప్రదేశం ఉన్నా అనుకూలంగా ఉన్న పులులు ఇక్కడికి రావడం లేదు. వస్తే ఇక్కడే ఆవాసం ఏర్పాటు చేసుకుంటాయని అధికారులు ఆసక్తిగా ఉన్నారు. కవ్వాల్ టైగర్‌జోన్‌లో విరివిగా గడ్డి క్షేత్రాలను పెంచడతోపాటు పులికి ఆహారం కోసం వన్యప్రాణుల సంఖ్య పెంచడానికి చర్యలు తీసుకుంటున్నారు. వన్యప్రాణులకు ఆవాసం, నీరు, ఆహారం సౌకర్యాలు కల్పిస్తున్నారు. గత మూడేళ్లుగా కవ్వాల్ టైగర్‌జోన్‌లో అధికారులు ఏర్పాట్లు చేయడం వల్ల కవ్వాల్ టైగర్‌జోన్‌లోని జన్నారం అటవీ డివిజన్‌లో వన్యప్రాణుల సంఖ్య విరివిగా పెరిగినట్లు అధికారులు చెబుతున్నారు.

రాకపోకలతోనే సరి

కవ్వాల్ టైగర్‌జోన్‌లో పులులు ఆవాసం ఏర్పాటు చేసుకుంటాయని అధికారులు తగిన ఏర్పాట్లు చేస్తున్నా రాకపోకలతోనే సరిపుచ్చుతున్నాయి. కవ్వాల్ టైగర్‌జోన్‌కు సమీపంలో తాడోబా, ఇంద్రావతి టైగర్‌జోన్‌లు ఉన్నాయి. అక్కడ పులుల సంఖ్య పెరుగుతుండడంతో ఆహారం కోసం కవ్వాల్ టైగర్ జోన్‌కు వచ్చే అవకాశం ఉందని అధికారులు యోచిస్తున్నారు. కారిడర్ అలజడి కారణంగా పులులు ఇక్కడికి రావడం లేదని తెలుస్తోంది. అధికారులు కారిడర్‌లో అలజడి లేకుండా అధికారులు చర్యలు తీసుకుంటున్నా ఫలితం లేకుండా పోతోంది. గత ఆరు నెలలుగా కవ్వాల్‌లోకి పులి అడుగు కూడా పెట్టడం లేదని తెలుస్తోంది. సమీపంలోని తాడోబా టైగర్‌జోన్ నుంచి పులి ఇక్కడికి వస్తుందో.. లేదో వేచి చూడాల్సిందే.

నేటి నుంచి రాష్ట్రస్థాయి బాలికల ఫుట్‌బాల్ పోటీలు

రామకృష్ణాపూర్: మంచిర్యాల జిల్లా రామకృష్ణాపూర్‌లోని ఠాగూర్ స్టేడియంలో సోమవారం నుంచి రాష్ట్రస్థాయి బాలికల ఫుట్‌బాల్ పోటీలు జరుగనున్నాయి. మూడు రోజులపాటు జరిగే పోటీలకు ఏర్పాట్లు చేశారు. జిల్లా ఫుట్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగే ఈ పోటీల్లో 8 ఉమ్మడి జిల్లాల నుంచి జట్లు పాల్గొననున్నాయి. లీగ్ కమ్ నాకౌట్ పద్ధతిలో పోటీలను నిర్వహించనున్నారు. పోటీల్లో ప్రతిభ కనబర్చిన క్రీడాకారులను జాతీయ పోటీలకు ఎంపిక చేస్తారు. ఎనిమిది జిల్లాల జట్లను రెండు పూల్స్‌గా విభజించి లీగ్ మ్యాచ్‌లు నిర్వహించనున్నారు. పోటీల కోసం స్టేడియంలో రెండు ఫుట్‌బాల్ కోర్టులు ఏర్పాటు చేశారు. ఎండల తీవ్రత దృష్ట్యా ఉదయం 6 గంటలకే మ్యాచ్‌లు ప్రారంభించేందుకు ఏర్పాట్లు చేశారు. ఫుట్‌బాల్ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి పిన్నింటి రఘునాథ్‌రెడ్డి, పోటీల చీఫ్ ప్యాట్రన్ శ్రీరాములు, ఈశ్వరాచారీ ఏర్పాట్లను పరిశీలించారు.


ఏర్పాట్లను పరిశీలిస్తున్న నిర్వాహకులు



బాసరలో భక్తుల రద్దీ


ఆలయంలో చిన్నారుల అక్షరాభ్యాసాలు, భక్తులు, మురళీధర్ పూజలు

భైంసా: బాసర జ్ఞాన సరస్వతి అమ్మవారి సన్నిధిలో ఆదివారం భక్తుల రద్దీ నెలకొంది. వేసవి సెలవులు పూర్తి కానుండడం, ఆదివారం శుభముహూర్తం నేపథ్యంలో అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. గోదావరి నదిలో స్నానాలాచరించిన అనంతరం అమ్మవారి ఆలయానికి చేరుకుని ప్రత్యేక పూజలు చేశారు. చిన్నారులతో అక్షరాభ్యాస పూజలు చేయించారు.

అమ్మవారిని దర్శించుకున్న బీజేపీ నాయకులు

బాసర శ్రీజ్ఞాన సరస్వతి అమ్మవారిని బీజేపీ మధ్యప్రదేశ్ రాష్ట్ర ఇన్‌చార్జి కె.మురళీధర్ ఆదివారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ అధికారులు, అర్చకులు ఆయనకు స్వాగతం పలికారు. ప్రత్యేక పూజల అనంతరం అమ్మవారి తీర్థ ప్రసాదాలు అందించి ఆశీర్వదించారు.

నిండుకున్న రక్తం నిల్వలు

- బ్లడ్ సెంటర్లలో కొరత
- పెద్దపల్లి జిల్లాలో రక్తదాన శిబిరాలు కరువు
- వేసవి కావడంతో ముందుకురాని దాతలు
- ఇబ్బంది పడుతున్న క్షతగాత్రులు, గర్భిణులు, తలసేమియా బాధితులు


గోదావరిఖని జీజీహెచ్‌లోని బ్లడ్ సెంటర్



బ్లడ్ సెంటర్‌లో తగ్గిన రక్తం నిల్వలు

కోల్‌సిటీ(రామగుండం): పెద్దపల్లి జిల్లాలోని బ్లడ్ సెంటర్లలో సరిపడా రక్తం నిల్వలు లేవు. రామగుండం జీజీహెచ్‌తోపాటు పెద్దపల్లి, మంథని ప్రభుత్వ ఆస్పత్రుల్లోని ప్రభుత్వ బ్లడ్ సెంటర్లలో రక్తం నిల్వలు నిండుకున్నాయి. ఆపదలో ఆయా కేంద్రాలకు వెళ్లిన వారికి నిరాశే ఎదురవుతోంది. సకాలంలో అవసరమైన బ్లడ్ గ్రూప్ దొరక్క క్షతగాత్రులు, పురిటినొప్పులతో బాధపడుతున్న గర్భిణులు, తలసేమియా బాధితులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. వేసవిలో రక్తదాతలు ముందుకు రాకపోవడం వల్లే సమస్య వస్తోంది. ఏటా ఏప్రిల్, మే నెలల్లో రక్తం కొరత ఏర్పడుతోంది. ఈ క్రమంలో నెల రోజులుగా ప్రభుత్వ, ప్రైవేట్ ఆస్పత్రుల్లో చికిత్స పొందేవారికి అత్యవసర సమయాల్లో రక్తం దొరక్కపోవడంతో బాధితుల కుటుంబసభ్యులు, బంధువులు రక్తదాతల కోసం అన్వేషించాల్సిన పరిస్థితి నెలకొంది.

36, 61, 15 యూనిట్లే..

పెద్దపల్లి ప్రభుత్వ ఆస్పత్రిలోని బ్లడ్ సెంటర్‌లో 500 యూనిట్ల వరకు రక్తం నిల్వ చేసే సామర్థ్యం ఉంది. గురువారం వరకు కేవలం 36 యూనిట్లు మాత్రమే ఉంది. రామగుండం జీజీహెచ్‌లోని బ్లడ్ సెంటర్‌లో 400 యూనిట్లకు గాను 61, మంథని బ్లడ్ సెంటర్‌లో 400 యూనిట్లకు గాను 15 యూనిట్లు మాత్రమే అందుబాటులో ఉంది.

వేసవి సెలవులు, ఎండల తీవ్రతే కారణం

కళాశాలల విద్యార్థులు ఎక్కువగా రక్తదానం చేస్తుంటారు. రక్తదాన శిబిరాలు కూడా కళాశాల ఆధ్వర్యంలో నిర్వహిస్తుంటారు. ఏప్రిల్, మే నెలల్లో వేసవి సెలవులు కావడంతోపాటు ఎండల తీవ్రత ఎక్కువగా ఉండటంతో రక్తదానం చేయడానికి యువత ముందుకు రావడం లేదు. వేసవిలో రక్తదానం చేస్తే నీరసించిపోతామని, ఎండలో తిరిగితే డీహైడ్రేషన్ అవుతుందని ఆందోళనకు గురవుతున్నారు.

పాజిటివ్ గ్రూపులదీ దొరకడం లేదు

సాధారణంగా పాజిటివ్ గ్రూపుల రక్తానికి కొరత ఉండదు. కానీ ప్రస్తుతం నెగిటివ్‌తోపాటు పాజిటివ్ గ్రూపుల రక్తం కూడా అందుబాటులో ఉండటం లేదు. ఇక అరుదైన యూనిట్లు దొరకడమే కష్టమవుతోంది. ఏ–నెగిటివ్, ఏబీ–నెగిటివ్ గ్రూపుల రక్తం అరుదుగా దొరుకుతుంది. అత్యవసర సమయాల్లో స్టాక్ తప్పనిసరిగా ఉండాలి. కానీ ప్రస్తుతం బ్లడ్ సెంటర్లలో రక్త నిల్వలు నిండుకోవడంతో రోగులు, వారి కుటుంబసభ్యులు నానాతంటాలు పడుతున్నారు.

దాతలు ముందుకు రావాలి



బ్లడ్ సెంటర్లలో రక్త నిల్వల కొరత తీవ్రంగా వెంటాడుతోంది. ఆపదలో ఉన్నవారికి అవసరమైన రక్త గ్రూపు లభించడం లేదు. మా ఫౌండేషన్‌ను కొందరు సంప్రదించారు. ప్రభుత్వ బ్లడ్ సెంటర్లలో అవసరమైన బ్లడ్ గ్రూప్ అందుబాటులో లేకపోవడంతో, మంచిర్యాలకు పంపించి, తెప్పించాల్సి వచ్చింది. ఎండాకాలం కావడంతోనే దాతలు ముందుకు రావడం లేదు. ఆపదలో ఉన్నవారి ప్రాణాలను కాపాడటానికి రక్తదానం చేసేందుకు దాతలు ముందుకు రావాలి. – అయిత శివకుమార్, కార్పొరేటర్, ఆలయ ఫౌండేషన్ సీఈవో

అవగాహన సదస్సులు ఏర్పాటు చేయాలి

రక్తదాన శిబిరాలు ఏర్పాటు చేయకపోవడంతో రక్త సేకరణ పూర్తిగా తగ్గిపోయింది. దీంతో నిల్వలు పూర్తిగా తగ్గిపోయాయి. ఉన్నతాధికారులు స్పందించి, అవగాహన సదస్సులు, శిబిరాలు ఏర్పాటు చేసి, రక్తదానం చేసేలా ప్రతిఒక్కరినీ ప్రోత్సహించాల్సిన అవసరం ఉంది. అలాగే ప్రత్యేక క్యాంపులు నిర్వహిస్తే తప్ప రక్త యూనిట్లు దొరకడం కష్టం. యువకులు, స్వచ్ఛంద సంస్థలు కూడా ముందుకురావాలని పలువురు కోరుతున్నారు.

కన్నపేగును కాదంది.. వాగులో వదిలేసింది

- ఎండకు తండ్లాడి శిశువు మృతి
- అయ్యోరిపల్లిలో ఓ కసాయి తల్లి నిర్వాకం


శిశువు మృతదేహాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

వేములవాడరూరల్: కన్నపేగును కాదనుకుంది.. వాగులో వదిలివేసి చేతులు దులుపుకుంది ఓ కసాయి తల్లి. కళ్లు తెరవని ఆ చిన్నారి ఎండకు తండ్లాడి ప్రాణాలు కోల్పోయాడు. ఈ విషాద సంఘటన వేములవాడ మండలంలోని అయ్యోరుపల్లి మూలవాగులో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు.. గుర్తు తెలియని మహిళ రెండు రోజుల క్రితం మగ శిశువుకు జన్మనిచ్చింది. తర్వాత అయ్యోరుపల్లి శివారులోని మూలవాగులో వదిలివేసి, వెళ్లిపోయింది. ఆదివారం అటుగా వెళ్లిన కొందరు బిడ్డ మృతదేహాన్ని గుర్తించి, పోలీసులకు సమాచారం ఇచ్చారు. పట్టణ సీఐ వెంకటేశ్ ఘటనాస్థలికి చేరుకున్నారు. శిశువు మృతదేహాన్ని పరిశీలించారు. ఈ సంఘటనపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. వేములవాడ పట్టణంలోని ప్రైవేటు, ప్రభుత్వ ఆస్పత్రుల్లో రెండు రోజులుగా జరిగిన ప్రసవాలపై విచారణ చేపడుతున్నట్లు ఆయన పేర్కొన్నారు.

సాక్షి ఫ్యామిలీ
కరీంనగర్
సోమవారం ॥ 5-6-2023

మంచి మాట

నిన్న నేడు రేపు



నేడులో ఉన్న మనం నిన్నను దాటుకుని వచ్చాం. నేడునూ దాటుకుని మనం రేపులోకి వెళ్లాల్సి ఉంది. నిన్న, నేడులకన్నా మనకు రేపు ఎంతో ముఖ్యం. నిన్న, నేడుల్లో లాభం, నష్టం, సుఖం, శోకం, ప్రగతి, పతనం మనకు వచ్చి ఉంటాయి. వీటి ప్రాతిపదికన మనం రేపులోకి వెళ్లాల్సి ఉంటుంది. మనం ఏ స్థితిలో ఉన్నా, మన పరిస్థితి ఏదైనా మనం తప్పకుండా రేపు వైపు కదలాలి; కదులుదాం.

నిన్నవైపు కాదు మన చూపు రేపు వైపు ఉండాలి. నేడులో ఉండిపోవడం కాదు మనం రేపువైపు నడవాలి. రేపువైపు చూపు వేసి మనం కదులుతూ ఉండాలి. మన చూపు నిండా, మన కదలిక నిండా చేవను మనం నింపుకోవాలి.

మనలో నీరసం ఉంటుంది. దాన్ని నిన్న మరిచిపోయినా నేడు నేల రాసేసుకోవాలి. మనలో చెడ్డతనం ఉంటుంది. అది నిన్నటి నుంచి నేడులోకి వచ్చేసినా రేపులోకి రాకుండా దాన్ని కూలదోసుకోవాలి. మనలోని మూర్ఖత్వాన్ని నేడు తప్పకుండా విడిచి పెట్టెయ్యాలి. మన జాడ్యాలు మన రేపులోకి రాకుండా నేడు మనమే వాటిని మట్టు పెట్టుకోవాలి. నిన్న మనకు మనమే వేసుకున్న కుత్సితాల సంకెలల్ని నేడైనా తెంచేసుకోవాలి. నిన్న మనలోకి వచ్చి చేరి నిలిచి ఉన్న మత్సరభావాల విషాన్ని నేడు పూర్తిగా ఒంపేసుకోవాలి.

నిన్నకు నేడు కొనసాగింపు కాకూడదు. నిన్నకు నేడు కొనసాగింపు అయి ఉంటే అది తప్పు అని తప్పకుండా తెలుసుకోవాలి. ఆ తప్పు కొనసాగకుండా నేడు మనం జాగ్రత్త పడాలి. జాగరూకతతో మనం రేపును స్పృశించాలి.

నిలిచి ఉండే చెలిమితోనూ, నిజమైన నైజంతోనూ, నిర్మలమైన హృదయంతోనూ, చల్లటి ఆశయాలతోనూ, చక్కని ఆలోచనలతోనూ సత్ప్రవర్తనతోనూ మనం రేపులోకి వెళ్లాలి. మన నిన్నలో, నిన్న మనలో అవి లేకపోయినా రేపు అవి మనకు ఎంతో అవసరం అని నేడైనా గ్రహించి మనం రేపులోకి వెళ్లాలి.

నిన్న మనం ఎలా ఉన్నా, నేడు మనం ఎలా ఉంటున్నా రేపు మాత్రం మనం గొప్పగా ఉండాలి; అధమపక్షం రేపు మనం బావుండాలి. అందుకు నేడు మనం సిద్ధపడాలి. రేపులో మనం మెరుగ్గానూ, మేలుగానూ ఉండేందుకు మనం నేడు తయారుగా ఉండాలి; మనల్ని మనం తయారు చేసుకోవాలి.

అలవాటుపడ్డ సోమరితనానికి, అభిప్రాయాలకూ నేటితో స్వస్తి పలికి, ఉండాల్సిన ఉత్సాహానికి, అవగాహనకూ నేడైనా నాంది పలికి అభ్యున్నతికి ప్రస్తావన కలిగేందుకు, కల్పించుకునేందుకు రేపులోకి వెళ్లాలి మనం. పనిచేస్తూ ప్రయోజనాన్ని పొందే చేతులతో, మెరిసే తలపులు కలిగే మస్తిష్కంతో భేషజాల పరదాలు తొలగించుకుని, వేషాలు పోయే గుణాన్ని మరచిపోయి మనం రేపులోకి చేరాలి.

పరుల బాధను పట్టించుకోవడం పాపం కాదు; తోటి వాడికి మంచి చెయ్యడం నేరం కాదు; సాటివాడికి చేయూతను ఇవ్వడం దోషం కాదు కాబట్టి వాటిని చేపట్టడానికి కూడా మనం రేపును వేదిక చేసుకోవాలి.

> 'బెదురు లేకుండా కదులుతూ ఎదురు వెళ్లి రేపులోకి ప్రవేశిద్దాం; ఏ మాత్రమూ చెదిరిపోకుండా ఎదిగేందుకు విఫలం అవకుండా రేపుకు ప్రయుక్తం అవుదాం'.

రేపైనా మనల్ని మనం నరులం అని నిరూపించుకోవాలి.

మన కోసం, మన రాక కోసం వేచి ఉన్నది సుమా రేపు అన్నది; లేచి వెళ్లి అందుకోవడానికే మనం ఉన్నది. మనంత మనంగా, మనం మనంగా నిజమైన మనుషులంగా జీవం ఉన్నవాళ్లంగా జీవించేందుకుగా మనం రేపును అందుకోవాలి.

మన రాగం, మన యాగం, మన త్యాగాలతో గణనీయమైన మనుగడను సాధించేందుకు, ఆపై మన గానం, మన ధ్యానం, మన జ్ఞానాలతో స్మరణీయమైన మనుషులం అయ్యేందుకు మనం రేపును ఆవాహన చేసుకోవాలి.

– రోచిష్మాన్

సన్నిధి

గురువాణి

అలా చేయవచ్చా... అది అవమానం కదూ !!!



మన దేశం కష్టాల్లో ఉన్నప్పుడు సనాతన ధర్మానికి పూర్వ వైభవం తీసుకురావడంలో ఎనలేని కృషి చేసిన సమర్థ రామదాసు గారు చెప్పిన మరో సూత్రం – జ్ఞాన సముపార్జన, ప్రచారం. ఇంట్లో మంచి మంచి చిత్తరువులు, మంచి పరుపులు, మంచి మంచాలు, కుర్చీలు, ఇతర అలంకార సామాగ్రి ఎలా ఉంచుకుంటామో... ప్రతి ఇంటా కూడా చదవదగిన పుస్తకాలు కొన్ని ఉండి తీరాలి. చదివిన పుస్తకాల మీద చర్చ కూడా జరుగుతుండాలి.

ఇంటి పెద్ద ఒక మంచి పుస్తకం చదివి దానిలో తనకు నచ్చిన అంశాలు ఏ పేజీల్లో ఉన్నాయో ఆ పుస్తకం ముందుండే తెల్లకాగితంపై రాసి ఉంచాలి. పిల్లలు ఆ పుస్తకం తెరిచినప్పుడల్లా వాటిని చదివి పుస్తకంపట్ల ఆసక్తి పెంచుకుంటారు. చదివిన పుస్తకంపై కుటుంబ సభ్యులతో చర్చిస్తూండాలి. అప్పుడు తీరికసమయాల్లో వాటిని చదవడానికి అందరికీ ప్రేరణ కలుగుతుంది. నిజానికి ఇంటి సంపద వృద్ధిలోకి రావాలన్నా, ఇంటి గౌరవం ఆచంద్రార్కం కొనసాగాలన్నా.. ఆ ఇంటి యజమాని ఎన్ని పుస్తకాలు చదివి, ఎన్ని పుస్తకాల గురించి అలా రాసి భద్రపరిచి ఉంచాడన్నది ముఖ్యం. అదే వారికి నిజమైన ఆస్తి. అదే తరువాత తరాల వారిలో స్ఫూర్తి రగిలిస్తుంది, వారినీ ఉత్తములుగా తీర్చిదిద్దుతుంది. పుస్తకాలు కొనడం పెద్ద కష్టమేమీ కాదు, పుస్తకాలు భద్రపరచడం భారం కూడా కాదు. 'మా ఇంట్లో పుస్తకాలు చదివేవారు లేరండీ.. అని ఇచ్చేయడం ఆ కుటుంబానికి చాలా అవమానకరమైన విషయం.

చదివే వాళ్ళు లేకపోవడమేమిటి! చదివేవాళ్ళు ఉండాలి. ప్రతివాళ్లూ పుస్తకాలు ఒక నియమంగా చదవాలి. ప్రతిరోజూ మనం ఎదుర్కొనే ఎన్నో సమస్యల నుంచి బయటపడడానికి అవి ఎంతగానో ఉపయోగపడతాయి. అవి మనకు మనశ్శాంతినిస్తాయి. ఒక్క ఆధ్యాత్మిక పుస్తకాలే కాదు... మన జీవితాలను, మన పిల్లల జీవితాలను ఉద్ధరించడానికి ఇది పనికొస్తుంది–అని అనుకున్న ప్రతి పుస్తకం ఆ ఇంట తప్పనిసరిగా ఉండాలి. పుస్తకాలు లేని జ్ఞానాన్ని ఇస్తాయి, ఉన్న జ్ఞానాన్ని అనేక రెట్లు పెంచుతాయి. ఆ జ్ఞానాన్ని పదిమందితో పంచుకున్నప్పుడు అది మరింత పెరుగుతుందే కానీ తరిగేది కూడా కాదు. అందరూ వేదికలెక్కి ఉపన్యాసాలు ఇవ్వక్కర్లేదు. కానీ కుటుంబ సభ్యులతో, ఇంటికొచ్చిన అతిథులతో, ఆత్మీయులతో జరిపే సమావేశాల్లో, విందులు, వినోదాల్లో కలిసిన సన్నిహితులతో వారు చదివిన మంచి పుస్తకాలపై చర్చ పెట్టాలి. అలాగే పిల్లలున్న ఇంటికి వెళ్ళినప్పుడు, ఇతరత్రా శుభకార్యాల్లో, దూరప్రయాణాలు వెళ్ళేవారికి మంచి మంచి పుస్తకాలు బహూకరించడం అలవాటు చేసుకోవాలి. వీలయితే ఆ పుస్తకాల ప్రాధాన్యతను, వాటిని ఎందుకు బహూకరిస్తున్నది వాటిపై రాసి సంతకం చేసి ఇస్తే... వారితో మీ బంధం మరింత గట్టిపడుతుంది. మీపట్ల వారికి, వారి కుటుంబానికి ఎనలేని గౌరవం ఏర్పడుతుంది.

వారు కూడా వాటిని చదివి ఎంత ప్రభావితమవుతారో, ఎంత శాంతి పొందుతారో మాటల్లో చెప్పలేం. సమర్థ రామదాసుగారిలాగా గురుస్థానాల్లో ఉన్న వారు ఇటువంటి విషయాలను ప్రబోధం చేయాలి, ప్రచారం చేయాలి... సమాజ అభ్యున్నతికి ఇది అవసరం.



బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావు

తాత్త్వికథ

ఎంత చెట్టుకంత గాలి!



ఓ నడి వయస్కుడు పౌర్ణమి రోజున ఆశ్రమానికి వెళ్ళాడు. ఫల పుష్పాదులను గురువుకు సమర్పించాడు. మంచిచెడ్డలు మాట్లాడాక తన మనసులోని విషయం బయటికి చెప్పాడు. తనకు మరింత డబ్బు సంపాదించాలన్న కోరిక బలంగా ఉందని గురువుకు తెలిపాడు.

గురువు అతడి కళ్ళలోకి చూస్తూ "ఇప్పుడున్న డబ్బు నీకు సరిపోలేదా?" అని అడిగాడు. 'నేను ఇప్పటిదాకా సంపాదించిన డబ్బు నా తరానికి సరిపోతుంది. అయితే నా తదనంతరం... నా బిడ్డలకు, వారి బిడ్డలకు సరిపడేంత డబ్బు మాత్రం లేదు. తగినంత డబ్బులేక వారు ఆర్థిక ఇబ్బందులు పడతారేమోనని ఆందోళనగా ఉంది' అని దిగులుగా చెప్పాడు.

గురువు నెమ్మదిగా తల ఆడించి రెండు రోజుల పాటు తన ఆశ్రమంలో నిద్ర చేయమన్నాడు. అందుకు ఆ నడివయస్కుడు అంగీకరించాడు. గురువు అతడికి చక్కటి విశ్రాంతిగదిని ఏర్పాటు చేశాడు. మొదటిరోజు పడుకునేటప్పుడు గురువు అతడి చేతికి చిన్న బెల్లం ముక్క ఇచ్చి దిండు పక్కన పెట్టుకుని పడుకోమన్నాడు. అలాగే చేశాడు ఆ నడివయస్కుడు.

నిద్రలేచాక గురువు అతడిని "రాత్రి మంచి నిద్ర వచ్చిందా?" అని అడిగాడు. బెల్లం చుట్టూ నాలుగు చీమలు చేరాయని, దాంతో రెండుసార్లు మెలకువ వచ్చి నిద్ర సరిగా రాలేదని చెప్పాడు.

"అవునా!" అని ఆశ్చర్యపోయాడు గురువు.

రెండవరోజు కూడా ఆ నడివయస్కుడు నిద్రపోయే ముందు గురువు అతడి వద్దకు వెళ్ళాడు. ఒక పెద్ద బెల్లం ముద్దను చేతికిచ్చి దిండు పక్కన పెట్టుకుని పడుకోమన్నాడు. గురువు చెప్పినట్లే చేశాడు ఆ నడి వయస్కుడు.

మరుసటి రోజు ఉదయాన్నే గురువు లేచి చూసేసరికి అతనికి ముఖం పీక్కుపోయి ఉంది. కళ్ళు ఎర్రబారి కళ్ళవెంబడి నీళ్ళు కారుతున్నాయి. "నిన్నటి కన్నా ఈరోజు నిద్ర బాగా పట్టిందా?" అని అడిగాడు గురువు.

బెల్లం ముద్ద చుట్టూ చేరిన వందలాది చీమలు తనను క్షణం కూడా నిద్ర పోనివ్వలేదని బదులిచ్చాడు అతడు. చీమల బారినుంచి బెల్లాన్ని తప్పించడానికి రాత్రంతా మేలుకోవాల్సి వచ్చిందని బాధగా చెప్పాడు.

గురువు చిన్నవ్వు నవ్వి "ఎంత చెట్టుకంత గాలి ఉంటుందని తెలుసుకో. నీవు సంపదను పోగు చేసే కొద్దీ సమస్యలు కూడా పెద్దవి వస్తాయి. పెద్ద బెల్లం ముద్దంత దండిగా సంపద సమకూర్చి పెడితే నిద్రాహారాలు మాని వాటిని కాపాడుకోవడానికే జీవితకాలం సరిపోతుంది. అంతేకాకుండా ఆ సంపదను చూస్తూ మీ పిల్లలు సోమరులుగా తయారవుతారు. కష్టపడటానికి ఏమాత్రం ఇష్టపడరు. తగినంత సొమ్ము సంపాదించుకోలేనంత అసమర్థులుగా ఉండరు వారు. అతి ఎప్పుడూ అనర్థదాయకమే. కాబట్టి తరతరాలు కూర్చుని తినేంత ఎక్కువ సంపాదించాలన్న అత్యాశ వద్దు. ఉన్నంతలో తృప్తి పడటం నేర్చుకో. ఆశకు అంతు ఎక్కడిది?" అని హితవు చెప్పాడు.

రాత్రంతా చేతిని కుట్టిన చీమల దద్దుర్లు చూసుకుంటూ ఆ నడివయస్కుడు 'అత్యాశ పడిన వాడు సుఖపడింది లేదని పెద్దలు ఊరికే చెప్పలేదు' అని అనుకున్నాడు.

– ఆర్.సి. కృష్ణస్వామి రాజు

సినిమా

భోళా మానియా ఆగయా



చిరంజీవి

'వాల్తేరు వీరయ్య' వంటి హిట్ చిత్రం తర్వాత చిరంజీవి హీరోగా రూపొందుతోన్న చిత్రం 'భోళా శంకర్'. మెహర్ రమేష్ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రంలో తమన్నా కథానాయికగా నటిస్తున్నారు. ఏకే ఎంటర్‌టైన్‌మెంట్స్‌పై రామబ్రహ్మం సుంకర నిర్మిస్తున్న 'భోళా శంకర్' ఆగస్టు 11న విడుదల కానుంది. ప్రమోషన్స్‌లో భాగంగా మ్యూజికల్ జర్నీని ప్రారంభించారు మేకర్స్. మహతి స్వరసాగర్ సంగీతం అందించిన ఈ చిత్రంలోని 'భోళా మానియా..' అంటూ సాగే మొదటి పాట పూర్తి లిరికల్‌ని ఆదివారం విడుదల చేశారు. రామజోగయ్య శాస్త్రి సాహిత్యం అందించిన ఈ పాటను రేవంత్ ఎల్వీ ఆలపించారు. "యాక్షన్, భావోద్వేగాలతో కమర్షియల్ ఎంటర్‌టైనర్‌గా రూపొందుతోన్న చిత్రమిది. 'భోళా మానియా..' పాట మాస్‌ని ఆకట్టుకునే బీట్‌లతో ఎనర్జిటిక్‌గా ఉంటుంది. చిరంజీవి గ్రేస్ ఫుల్ డ్యాన్స్ మూమెంట్స్ ప్రేక్షకులను, మెగా అభిమానులను అలరిస్తాయి" అని చిత్రయూనిట్ పేర్కొంది. ఈ చిత్రంలో చిరంజీవి చెల్లెలు పాత్రలో కీర్తి సురేష్ నటిస్తుండగా, సుశాంత్ కీలక పాత్రలో కనిపించనున్నారు. ఈ చిత్రానికి ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: కిషోర్ గరికిపాటి, కెమెరా: డడ్లీ, లైన్ ప్రొడక్షన్: మెహెర్ మూవీస్.

ధనుష్ సరసన త్రిష...?



త్రిష



ధనుష్

ధనుష్ సరసన త్రిష నటించనున్నారా? అంటే అవుననే టాక్ కోలీవుడ్‌లో వినిపిస్తోంది. ధనుష్ కెరీర్‌లోని 50వ సినిమాను సన్ పిక్చర్స్ నిర్మించనున్న సంగతి తెలిసిందే. గ్యాంగ్‌స్టర్ బ్యాక్‌డ్రాప్‌లో సాగే ఈ సినిమాకు ధనుష్ స్వీయ దర్శకత్వం వహించనున్నారు. ఈ సినిమాలోని హీరోయిన్ పాత్రకే త్రిషను సంప్రదించిందట చిత్రయూనిట్. కథ విన్న త్రిష కూడా ఈ సినిమాలో యాక్ట్ చేసేందుకు సుముఖంగానే ఉన్నారట. ఇదిలా ఉంటే... 2016లో వచ్చిన 'కొడి'(తెలుగులో 'ధర్మయోగి') చిత్రంలో ధనుష్‌కు జోడీగా త్రిష కనిపించారు. అయితే ఈ చిత్రంలో త్రిష పాత్ర కాస్త నెగటివ్ టచ్‌తో ఉంటుంది. మరి..ధనుష్‌తో మరోసారి త్రిష స్క్రీన్ షేర్ చేసుకుంటే ఆమె పాత్ర ఎలా ఉండబోతుంది? అనేది తెలియాలంటే మరికొన్ని రోజులు వెయిట్ చేయక తప్పదు.

బ్యాక్ టు హైదరాబాద్



ఎన్టీఆర్

హీరో ఎన్టీఆర్ వెకేషన్ నుంచి భారత్‌కు తిరిగొచ్చారు. వారంరోజుల క్రితం ఫ్యామిలీతో కలిసి దుబాయ్‌కు వెకేషన్‌కి వెళ్లిన ఆయన, పూర్తి చేసుకుని తిరిగి హైదరాబాద్‌లోని స్వగృహానికి చేరుకున్నారు. కాగా ఎన్టీఆర్ ప్రస్తుతం 'దేవర' అనే సినిమా చేస్తున్నారు. 'జనతా గ్యారేజ్'(2016) వంటి హిట్ చిత్రం తర్వాత ఎన్టీఆర్, దర్శకుడు కొరటాల శివ కాంబినేషన్‌లో రూపొందుతున్న సినిమా ఇది. ఈ చిత్రంలో జాన్వీకపూర్ హీరోయిన్‌గా, నటుడు సైఫ్ అలీ ఖాన్ విలన్‌గా నటిస్తున్నారు. 'దేవర' సినిమా లేటెస్ట్ షెడ్యూల్ ఈ నెల 6 నుంచి ప్రారంభం కానున్నట్లు తెలిసింది. ఎన్టీఆర్, జాన్వీ, సైఫ్.. ఇలా ప్రధాన తారాగణంపై కొన్ని కీలక సన్నివేశాలతో పాటుగా, ఓ భారీ యాక్షన్ సీక్వెన్స్‌ను ప్లాన్ చేశారట చిత్రయూనిట్. కల్యాణ్ రామ్ సమర్పణలో మిక్కిలినేని సుధాకర్, కె.హరికృష్ణ నిర్మిస్తున్న 'దేవర' చిత్రం వచ్చే ఏడాది ఏప్రిల్ 5న రిలీజ్ కానుంది.

కల్యాణం.. కమనీయం



శర్వానంద్, రక్షిత

హీరో శర్వానంద్, రక్షితా రెడ్డి ఏడడుగులేశారు. ఇరు కుటుంబాల పెద్దలు, అత్యంత సన్నిహితుల సమక్షంలో శర్వా, రక్షితల కల్యాణం శనివారం రాత్రి జైపూర్‌లోని లీలా ప్యాలెస్‌లో కమనీయంగా జరిగింది. ముహూర్తానికి శర్వానంద్ క్రీమ్ పింక్ షేర్వానీ, రక్షిత సిల్వర్ క్రీమ్ కలర్ చీరను ధరించారు. వీరి వివాహానికి హీరోలు రామ్‌చరణ్, సిద్ధార్థ్, ఆశిష్, హీరోయిన్ అదితీరావు హైదరీ, నిర్మాతలు వంశీ, విక్రమ్, హర్షిత్, హన్షితలతో పాటు పలువురు సినీ సెలబ్రిటీలు హాజరై, నూతన వధూవరులకు శుభాకాంక్షలు చెప్పారు. శర్వానంద్–రక్షితల పెళ్లి ఫోటోలు నెట్టింట వైరల్‌గా మారాయి. పలువురు నెటిజన్లు సోషల్‌మీడియా వేదికగా ఈ కొత్తజంటకు అభినందనలు తెలుపుతున్నారు. ఈ నెల 9న హైదరాబాద్‌లో శర్వానంద్, రక్షితల పెళ్లి రిసెప్షన్ వేడుక జరగనుంది. కాగా శ్రీరామ్ ఆదిత్య దర్శకత్వంలో శర్వానంద్ హీరోగా ఓ సినిమా రూపొందుతోంది.

పరేషాన్‌తో అలాంటి అనుభూతి కలిగింది – తరుణ్ భాస్కర్



తిరువీర్, తరుణ్ భాస్కర్, రూపక్ రోనాల్డ్, పావని

"కేరాఫ్ కంచరపాలెం, సినిమా బండి, బలగం..' చిత్రాలు చూసినప్పుడు ఎలాంటి ఫీలింగ్ కలిగిందో.. 'పరేషాన్' మూవీ చూసినప్పుడు కూడా అలాంటి అనుభూతి కలిగింది. సినిమా చూస్తున్నప్పుడు మనల్ని మనం మర్చిపోతే అదే మ్యాజిక్. అలాంటి మ్యాజిక్ 'పరేషాన్' లో జరిగింది" అని డైరెక్టర్ తరుణ్ భాస్కర్ అన్నారు. తిరువీర్, పావని కరణం జంటగా రూపక్ రోనాల్డ్‌సన్ దర్శకత్వం వహించిన చిత్రం 'పరేషాన్. రానా దగ్గుబాటి సమర్పణలో సిద్ధార్థ్ రాళ్లపల్లి నిర్మించిన ఈ సినిమా జూన్ 2న విడుదలైంది. ఈ సందర్భంగా నిర్వహించిన 'పరేషాన్' సక్సెస్ మీట్‌కి ముఖ్య అతిథిగా తరుణ్ భాస్కర్ హాజరయ్యారు. "లగాన్' లాంటి టీం కలిసి చేసిన సినిమా ఇది. గెలవాలంటే లాస్ట్ బాల్‌కి సిక్స్ కొట్టాలి.. రానాగారు వచ్చి మాతో సిక్స్ కొట్టించారు" అన్నారు తిరువీర్. "పరేషాన్'ని ఆదరిస్తున్న ప్రేక్షకులకు కృతజ్ఞతలు" అన్నారు పావని కరణం. "పరేషాన్'కి నైజాంలో మరో 75 థియేటర్స్ పెంచుతున్నాం" అన్నారు రూపక్ రోనాల్డ్‌సన్.

ట్రైలర్ చూస్తుంటే కన్నీళ్లొచ్చాయి – కె.రాఘవేంద్రరావు



శివప్రసాద్, ప్రసాద్, రాఘవేంద్రరావు

'విమానం' ట్రైలర్ చూస్తుంటే మంచి భావోద్వేగాలతో సినిమా ఉంటుందని తెలుస్తోంది. తండ్రీ కొడుకుల మధ్య ఉండే ఎమోషన్‌ని దర్శకుడు శివ ప్రసాద్ ట్రైలర్‌లో అద్భుతంగా చూపించాడు. ట్రైలర్ నా మనసును కదిలించింది.. నాకు కన్నీళ్లొచ్చాయి" అని డైరెక్టర్ కె.రాఘవేంద్రరావు అన్నారు. సముద్ర ఖని, అనసూయ భరద్వాజ్, మీరా జాస్మిన్, రాహుల్ రామకృష్ణ, మాస్టర్ ధ్రువన్ కీలక పాత్రల్లో శివ ప్రసాద్ యానాల దర్శకత్వం వహించిన చిత్రం 'విమానం'. జీ స్టూడియోస్, కిరణ్ కొర్రపాటి (కిరణ్ కొర్రపాటి క్రియేటివ్ వర్క్స్) నిర్మించిన ఈ సినిమా ఈ నెల 9న తెలుగు, తమిళ భాషల్లో విడుదలకానుంది. ఈ చిత్రం ట్రైలర్‌ను విడుదల చేసిన కె.రాఘవేంద్రరావు మాట్లాడుతూ–"తల్లిదండ్రులు తమ పిల్లలతో కలిసి 'విమానం' సినిమా చూడాలి.. అప్పుడే పిల్లల కోసం తల్లిదండ్రులు పడే తపన ఎలా ఉంటుందో తెలుస్తుంది" అన్నారు. జీ స్టూడియో సౌత్ వైస్ ప్రెసిడెంట్ నిమ్మకాయల ప్రసాద్, సంగీత దర్శకుడు చరణ్ అర్జున్ పాల్గొన్నారు. ఈ చిత్రానికి కెమెరా: వివేక్ కాలేపు.

ఇప్పుడే పరిచయమే...



శివ కందుకూరి, మేఘా ఆకాష్

శివ కందుకూరి హీరోగా, మేఘా ఆకాష్, ప్రగతి శ్రీవాస్తవ్ హీరోయిన్లుగా నటించిన చిత్రం 'మను చరిత్ర'. ఈ మూవీతో భరత్ పెదగాని దర్శకుడిగా పరిచయమవుతున్నారు. ప్రొద్దుటూరు టాకీస్ పతాకంపై ఎన్.శ్రీనివాస రెడ్డి నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 23న విడుదల కానుంది. గోపీసుందర్ సంగీతం అందించిన ఈ చిత్రంలోని 'ఇప్పుడే పరిచయమే...' పాటని హీరోయిన్ సంయుక్త మీనన్ లాంచ్ చేశారు. ఈ పాటకు చంద్రబోస్ సాహిత్యం అందించగా, అర్మాన్ మాలిక్ పాడారు.

ప్రేమ ఇంత భారమా..?



సదన్, దీపికారెడ్డి

సదన్, దీపికా రెడ్డి, రేఖ నిరోషి ప్రధాన పాత్రల్లో నటించిన చిత్రం 'భారీ తారాగణం'. శేఖర్ ముత్యాల దర్శకత్వంలో బీవీఆర్ పిక్చర్స్‌పై బీవీ రెడ్డి నిర్మించిన ఈ చిత్రం త్వరలో విడుదల కానుంది. ఈ సినిమాలోని 'రెండే రెండు అక్షరాల ప్రేమ ఇంత భారమా..' అనే పాట లిరికల్ వీడియోను విడుదల చేశారు మేకర్స్. ఈ చిత్ర సంగీత దర్శకుడు సుక్కూ రచించిన ఈ పాటను జయశ్రీ పాల్యం ఆలపించారు. "లవ్ అండ్ కామెడీ ఎంటర్‌టైనర్‌గా రూపొందిన చిత్రం 'భారీ తారాగణం'. ఈ సినిమా అన్ని వర్గాల ప్రేక్షకులను అలరిస్తుంది" అని చిత్రయూనిట్ పేర్కొంది. ఈ సినిమాకు సహ నిర్మాత: చంద్రశేఖర్ గౌడ్.వి, నేపథ్య సంగీతం: సాహిత్య సాగర్.

ఓ తండ్రి తీర్పు



రాజేంద్ర రాజు, సురభి శ్రావణి

రాజేందర్ రాజు కాంచనపల్లి, సురభి శ్రావణి జంటగా ఆరిగపూడి విజయ్ కుమార్ సమర్పణలో శ్రీరామ్ దత్తి నిర్మించిన చిత్రం 'ఓ తండ్రి తీర్పు'. ఈ చిత్రం పోస్ట్ ప్రొడక్షన్ పనులు జరుగుతున్నాయి. "ప్రేమ, ఆప్యాయతలు పంచుకోవాల్సిన తల్లిదండ్రులు, పిల్లల స్వార్థపు మత్తులో ఎలా దూరం అవుతున్నారు? ఎంత మానసిక క్షోభకు గురవుతున్నారు? అనేది ఈ చిత్రకథాంశం. ఇందులో రాజేంద్ర రాజు ఆత్మీయత పంచే అల్లుడుగా నటించారు. ఆయన రాసిన 'అమ్మానాన్నలు తెగిన గాలిపటాలు..' టైటిల్ సాంగ్ విన్న ప్రతి ఒక్కరూ కంటతడి పెట్టుకుంటారు. అలాగే క్లైమాక్స్‌లో ఆయన రాసిన డైలాగ్స్ ప్రతి ఒక్కరినీ ఆలోచింపజేసే విధంగా ఉంటాయి" అన్నారు. ఈ చిత్రానికి కెమెరా: సురేష్ చెటిపల్లి, సంగీతం: బాపు శాస్త్రి, రచన–దర్శకత్వ పర్యవేక్షణ: రాజేంద్ర రాజు కాంచనపల్లి.



భారత రెజ్లర్లకు నిరాశ

వరల్డ్ రెజ్లింగ్ ర్యాంకింగ్ సిరీస్ టోర్నీలో చివరిరోజు భారత ఫ్రీస్టయిల్ రెజ్లర్లు పతకాలు సాధించడంలో విఫలమయ్యారు. కిర్గిస్తాన్‌లో ఆదివారం ముగిసిన ఈ టోర్నీలో ములాయం యాదవ్ (70 కేజీలు), పంకజ్ (61 కేజీలు) కాంస్య పతకాల కోసం పోటీపడ్డారు. అయితే పంకజ్ 1–6తో ఎమ్రా ఒర్మానొగ్లు (తుర్కియే) చేతిలో, సెర్వెత్ కొస్కున్ (తుర్కియే) చేతిలో ములాయం ఓడిపోయారు. 61 కేజీల విభాగంలో పోటీపడాల్సిన భారత స్టార్ రెజ్లర్ రవి దహియా మోకాలి గాయంతో చివరి నిమిషంలో వైదొలిగాడు. ఓవరాల్‌గా ఈ టోర్నీలో భారత్‌కు నాలుగు పతకాలు లభించాయి.

డబ్ల్యూటీసీ ఫైనల్‌కు హాజెల్‌వుడ్ దూరం

ప్రపంచ టెస్టు చాంపియన్‌షిప్ (డబ్ల్యూటీసీ) ఫైనల్‌కు ఆస్ట్రేలియా పేస్ బౌలర్ హాజెల్‌వుడ్ దూరమయ్యాడు. ఐపీఎల్‌లో బెంగళూరుకు ఆడిన అతను పక్క టెముకల గాయానికి గురయ్యాడు. ఇంకా కోలుకోకపోవడంతో ఆసీస్ జట్టు నుంచి తప్పించారు. అతని స్థానాన్ని పేసర్ నెసెర్‌తో భర్తీ చేసినట్లు క్రికెట్ ఆస్ట్రేలియా సెలెక్టర్ బెయిలీ తెలిపారు. లండన్‌లో భారత్, ఆస్ట్రేలియా జట్ల మధ్య డబ్ల్యూటీసీ ఫైనల్ బుధవారం మొదలవుతుంది.



భారత అథ్లెట్లకు మూడు పతకాలు



యెచోన్ (కొరియా): ఆసియా అండర్–20 అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్‌లో తొలిరోజు భారత్ ఖాతాలో మూడు పతకాలు చేరాయి. మహిళల 400 మీటర్ల విభాగంలో రెజోనా మలిక్ హీనా, పురుషుల డిస్కస్ త్రోలో భరత్‌ప్రీత్ సింగ్ బంగారు పతకాలు సాధించారు. మహిళల 5000 మీటర్ల విభాగంలో అంతిమా పాల్ కాంస్య పతకాన్ని గెలుచుకుంది. 16 ఏళ్ల రెజోనా 53.31 సెకన్లలో లక్ష్యానికి చేరింది. భరత్‌ప్రీత్ డిస్క్‌ను 55.66 మీటర్ల దూరం విసిరి స్వర్ణం చేజిక్కించుకున్నాడు. ఇక అంతిమ పాల్ 17 నిమిషాల 17.11 సెకన్లతో మూడో స్థానంలో నిలిచింది.

అరువు 'పోల్'తో...

పోల్ వాల్ట్ ఈవెంట్‌లో భారత ఆటగాడు దేవ్ కుమార్ మీనాకు నిరాశ ఎదురైంది. ఎయిరిండియా నిర్వాకంతో అరువుతెచ్చిన 'పోల్' (పొడవాటి కర్ర)తో పోటీపడాల్సి రావడంతో అతను మూడు ప్రయత్నాల్లోనూ 4.50 మీటర్ల ఎత్తును అందుకోలేకపోయాడు. 18 ఏళ్ల దేవ్ రోజూ ప్రాక్టీసు చేసుకునే పోల్‌ను ఎయిరిండియా సిబ్బంది సాంకేతిక కారణాలతో అనుమతించలేదు. దీంతో భారత అథ్లెటిక్స్ సమాఖ్య నిర్వాహకులకు సమాచారమిచ్చి పోల్‌ను సమకూర్చాల్సిందిగా కోరింది.

జొకోవిచ్ రికార్డు

ఫ్రెంచ్ ఓపెన్‌లో 17వసారి క్వార్టర్ ఫైనల్ చేరిన సెర్బియా స్టార్

- నాదల్ పేరిట ఉన్న రికార్డు బద్దలు



పారిస్: కెరీర్‌లో 23వ గ్రాండ్‌స్లామ్ టైటిల్ సాధించాలనే లక్ష్యంతో ఫ్రెంచ్ ఓపెన్‌లో బరిలోకి దిగిన సెర్బియా యోధుడు నొవాక్ జొకోవిచ్ ఆ దిశగా మరో అడుగు వేశాడు. పురుషుల సింగిల్స్ విభాగంలో జొకోవిచ్ రికార్డు సృష్టిస్తూ 17వసారి ఈ మెగా టోర్నీలో క్వార్టర్ ఫైనల్లోకి దూసుకెళ్లాడు. గతంలో రాఫెల్ నాదల్ అత్యధికంగా 16 సార్లు క్వార్టర్ ఫైనల్ చేరగా... నాదల్‌తో సమంగా ఉన్న జొకోవిచ్ తాజా విజయంతో ఈ స్పెయిన్ దిగ్గజాన్ని దాటి ముందుకు వెళ్లాడు. ఆదివారం జరిగిన ప్రిక్వార్టర్ ఫైనల్లో జొకోవిచ్ 6–3, 6–2, 6–2తో యువాన్ పాబ్లో వారిలాస్ (పెరూ)పై గెలుపొందాడు. గంటా 57 నిమిషాల పాటు జరిగిన ఈ మ్యాచ్‌లో జొకోవిచ్ ఏడు ఏస్‌లు సంధించాడు. ప్రత్యర్థి సర్వీస్‌ను ఆరుసార్లు బ్రేక్ చేశాడు. 35 విన్నర్స్ కొట్టిన అతను నెట్ వద్దకు 17 సార్లు దూసుకొచ్చి 15 సార్లు పాయింట్లు గెలిచాడు. ఓవరాల్‌గా గ్రాండ్‌స్లామ్ టోర్నీల్లో అత్యధికసార్లు క్వార్టర్ ఫైనల్ చేరిన రికార్డు ఫెడరర్ (స్విట్జర్లాండ్; 58 సార్లు) పేరిట ఉంది. జొకోవిచ్ (55 సార్లు) రెండో స్థానంలో, నాదల్ (47 సార్లు) మూడో స్థానంలో, జిమ్మీ కానర్స్ (41 సార్లు) నాలుగో స్థానంలో, రాయ్ ఎమర్సన్ (37 సార్లు) ఐదో స్థానంలో ఉన్నారు. క్వార్టర్ ఫైనల్లో 11వ సీడ్ ఖచనోవ్ (రష్యా)తో జొకోవిచ్ ఆడతాడు. ప్రిక్వార్టర్ ఫైనల్లో ఖచనోవ్ 1–6, 6–4, 7–6 (9/7), 6–1తో సొనెగో (ఇటలీ)పై నెగ్గాడు.

అల్కరాజ్ అలవోకగా...

ప్రపంచ నంబర్‌వన్, టాప్ సీడ్ కార్లోస్ అల్కరాజ్ (స్పెయిన్) మరో అలవోక విజయంతో రెండోసారి క్వార్టర్ ఫైనల్లోకి అడుగు పెట్టాడు. అల్కరాజ్ 6–3, 6–2, 6–2తో లొరెంజె ముజెట్టి (ఇటలీ)పై గెలిచాడు. ఆరు ఏస్‌లు సంధించిన అల్కరాజ్, ప్రత్యర్థి సర్వీస్‌ను ఏడుసార్లు బ్రేక్ చేశాడు. ఐదో సీడ్ సిట్సిపాస్ (గ్రీస్), సెబాస్టియన్ ఆఫ్నర్ (ఆస్ట్రియా) మధ్య ప్రిక్వార్టర్ ఫైనల్ విజేతతో క్వార్టర్ ఫైనల్లో అల్కరాజ్ తలపడతాడు.

పావ్లీచెంకోవా ముందంజ...

మహిళల సింగిల్స్ విభాగంలో 2021 రన్నరప్ పావ్లీచెంకోవా (రష్యా), ముకోవా (చెక్ రిపబ్లిక్), స్వితోలినా (ఉక్రెయిన్) క్వార్టర్ ఫైనల్లోకి ప్రవేశించారు. ప్రిక్వార్టర్ ఫైనల్లో పావ్లీచెంకోవా 3 గంటల 9 నిమిషాల్లో 3–6, 7–6 (7/3), 6–3తో ఎలీజ్ మెర్టెన్స్ (బెల్జియం)ను ఓడించగా... ముకోవా 6–4, 6–3తో అవనెస్యాన్ (రష్యా)పై గెలిచింది. స్వితోలినా గంటా 56 నిమిషాల్లో 6–4, 7–6 (7/5)తో తొమ్మిదో సీడ్ కసత్‌కినా (రష్యా)ను బోల్తా కొట్టించింది. కసత్‌కినా ఓటమితో ప్రస్తుతం మహిళల సింగిల్స్‌లో టాప్–10లో నలుగురు మాత్రమే బరిలో మిగిలారు.

44 ఏళ్ల తర్వాత...

బ్రెజిల్‌కు చెందిన 14వ సీడ్ బీట్రిజ్ హదాద్ మాయ మూడో రౌండ్ మ్యాచ్‌లో 5–7, 6–4, 7–5తో ఎకతెరీనా అలెగ్జాండ్రోవా (రష్యా)పై నెగ్గి తన కెరీర్‌లో తొలిసారి ఓ గ్రాండ్‌స్లామ్ టోర్నీలో ప్రిక్వార్టర్ ఫైనల్ చేరింది. అంతేకాకుండా 44 ఏళ్ల తర్వాత ఫ్రెంచ్ ఓపెన్ మహిళల సింగిల్స్ విభాగంలో ప్రిక్వార్టర్ ఫైనల్ చేరిన బ్రెజిల్ క్రీడాకారిణిగా ఆమె గుర్తింపు పొందింది. బ్రెజిల్ తరఫున చివరిసారి 1979లో పాట్రిసియా మెద్రాడో ఈ ఘనత సాధించింది.

అర్జున్‌కు మూడో స్థానం

టైటిల్ నిలబెట్టుకున్న అరవింద్ చిదంబరం





దుబాయ్: దుబాయ్ ఓపెన్ అంతర్జాతీయ చెస్ టోర్నీలో భారత గ్రాండ్‌మాస్టర్లు అరవింద్ చిదంబరం, ఇరిగేశి అర్జున్ మెరిశారు. ఆదివారం ముగిసిన ఈ టోర్నీలో తమిళనాడుకు చెందిన 24 ఏళ్ల అరవింద్ వరుసగా రెండో ఏడాది చాంపియన్‌గా నిలువగా... తెలంగాణకు చెందిన 19 ఏళ్ల అర్జున్ మూడో స్థానాన్ని దక్కించుకున్నాడు. తొమ్మిది రౌండ్లపాటు జరిగిన ఈ టోర్నీలో అరవింద్, జవోఖిర్ సిందరోవ్ (ఉజ్బెకిస్తాన్), అర్జున్, మాక్సిమ్ మత్లకోవ్ (రష్యా) 6.5 పాయింట్లతో సంయుక్తంగా అగ్రస్థానంలో నిలిచారు. అయితే మెరుగైన టైబ్రేక్ స్కోరు ఆధారంగా ర్యాంకింగ్‌ను వర్గీకరించగా... అరవింద్‌కు టైటిల్ ఖరారు అయింది. సిందరోవ్ తొలి రన్నరప్‌గా, అర్జున్ రెండో రన్నరప్‌గా నిలిచారు. ఈ టోర్నీలో అరవింద్, అర్జున్ అజేయంగా నిలిచారు. ఒక్క గేమ్‌లోనూ ఓడిపోలేదు. అరవింద్, అర్జున్‌లిద్దరు చెరో నాలుగు గేముల్లో గెలిచి, మిగతా ఐదు గేమ్‌లను 'డ్రా' చేసుకున్నారు. చాంపియన్ అరవింద్‌కు 12 వేల డాలర్లు (రూ. 9 లక్షల 88 వేలు), సిందరోవ్‌కు 8 వేల డాలర్లు, అర్జున్‌కు 6 వేల డాలర్లు (రూ. 4 లక్షల 94 వేలు) ప్రైజ్‌మనీగా లభించాయి. ఇదే టోర్నీలో ఆడిన ఆంధ్రప్రదేశ్ గ్రాండ్‌మాస్టర్లు కార్తీక్ వెంకటరామన్ 12వ ర్యాంక్‌లో, లలిత్ బాబు 18వ ర్యాంక్‌లో... తెలంగాణ గ్రాండ్‌మాస్టర్లు రాజా రిత్విక్ 58వ ర్యాంక్‌లో, హర్ష భరతకోటి 61వ ర్యాంక్‌లో నిలిచారు.

అనిరుధ్–విజయ్ జోడీకి డబుల్స్ టైటిల్



విన్నర్స్ ట్రోఫీతో అనిరుధ్, విజయ్ సుందర్ ప్రశాంత్

సాక్షి, హైదరాబాద్: ఈ ఏడాది తమ నిలకడైన ప్రదర్శనను కొనసాగిస్తూ హైదరాబాద్ టెన్నిస్ యువ తార అనిరుధ్ చంద్రశేఖర్ సీజన్‌లో మూడో ఏటీపీ చాలెంజర్ డబుల్స్ టైటిల్‌ను సొంతం చేసుకున్నాడు. విజయ్ సుందర్ ప్రశాంత్ (తమిళనాడు)తో కలిసి అనిరుధ్ ఆదివారం ఇటలీలో ముగిసిన విసెంజా ఓపెన్ చాలెంజర్–75 టోర్నీలో డబుల్స్ టైటిల్‌ను సాధించాడు. 74 నిమిషాలపాటు జరిగిన ఫైనల్లో అనిరుధ్–విజయ్ ద్వయం 6–3, 6–2తో ఫెర్నాండో రొంబోలి–మార్సెలో జొర్మాన్ (బ్రెజిల్) జోడీపై గెలిచింది. టైటిల్ గెలిచే క్రమంలో అనిరుధ్–విజయ్ జోడీ ఒక్క సెట్ కూడా కోల్పోకపోవడం విశేషం. అనిరుధ్–విజయ్‌లకు 4,250 యూరోల (రూ. 3 లక్షల 75 వేలు) ప్రైజ్‌మనీతోపాటు 75 ర్యాంకింగ్ పాయింట్లు లభించాయి. ఈ ఏడాది అనిరుధ్–విజయ్ ద్వయం పుణే, స్పెయిన్ చాలెంజర్ టోర్నీల్లో డబుల్స్ టైటిల్ గెలిచి, స్ప్లిట్ ఓపెన్ టోర్నీలో రన్నరప్‌గా నిలిచింది. అనిరుధ్‌కు అతని సోదరుడు విఘ్నేశ్ పెరణమల్లూర్ కోచ్‌గా వ్యవహరిస్తున్నాడు.

గౌతమి–అభినవ్ జోడీకి స్వర్ణం



సుల్ (జర్మనీ): జూనియర్ ప్రపంచకప్ షూటింగ్ టోర్నీలో భారత్‌కు రెండో స్వర్ణ పతకం లభించింది. ఆదివారం జరిగిన 10 మీటర్ల ఎయిర్ రైఫిల్ మిక్స్‌డ్ టీమ్ ఈవెంట్‌లో గౌతమి భానోత్–అభినవ్ షా జోడీ విజేతగా నిలిచింది. ఫైనల్లో గౌతమి–అభినవ్ ద్వయం 17–7తో ఓషిన్ ముల్లర్–రొమైన్ అఫ్రె (ఫ్రాన్స్) జోడీపై గెలిచింది. 10 మీటర్ల ఎయిర్ పిస్టల్ మిక్స్‌డ్ ఈవెంట్‌లో సంయమ్–అభినవ్ చౌధరీ (భారత్) జంట రజత పతకం సాధించింది.

వెర్‌స్టాపెన్ 'హ్యాట్రిక్'

సీజన్‌లో వరుసగా మూడో విజయం



మోంట్‌మెలో (స్పెయిన్): ఫార్ములావన్ తాజా సీజన్‌లో రెడ్‌బుల్ జట్టు డ్రైవర్ మాక్స్ వెర్‌స్టాపెన్ తన జోరు కొనసాగిస్తున్నాడు. ఆదివారం జరిగిన స్పానిష్ గ్రాండ్‌ప్రిలో డిఫెండింగ్ చాంపియన్‌గా బరిలోకి దిగి టైటిల్ నిలబెట్టుకున్నాడు. 66 ల్యాప్‌ల రేసును 'పోల్ పొజిషన్'తో ప్రారంభించిన వెర్‌స్టాపెన్ అందరికంటే వేగంగా ఒక గంటా 27 నిమిషాల 57.940 సెకన్లలో ముగించి విజేతగా నిలిచాడు. హామిల్టన్ (మెర్సిడెస్) రెండో స్థానంలో, రసెల్ (మెర్సిడెస్) మూడో స్థానంలో, పెరెజ్ (రెడ్‌బుల్) నాలుగో స్థానంలో నిలిచారు. ఈ సీజన్‌లో వెర్‌స్టాపెన్‌కిది వరుసగా మూడో విజయంకాగా, ఓవరాల్‌గా ఐదో టైటిల్ కావడం విశేషం. ఈ సీజన్‌లో మొత్తం ఏడు రేసులు జరగ్గా... ఏడింటిలోనూ రెడ్‌బుల్ జట్టు డ్రైవర్లే విజేతగా నిలువడం గమనార్హం. వెర్‌స్టాపెన్ బహ్రెయిన్, ఆస్ట్రేలియా, మయామి, మొనాకో, స్పానిష్ రేసుల్లో నెగ్గగా... పెరెజ్ సౌదీ అరేబియా, అజర్‌బైజాన్ రేసుల్లో అగ్రస్థానాన్ని దక్కించుకున్నాడు. సీజన్‌లోని ఎనిమిదో రేసు కెనడియన్ గ్రాండ్‌ప్రి ఈనెల 18న జరుగుతుంది.

శ్రీలంక భారీ విజయం

రెండో వన్డేలో అఫ్గానిస్తాన్ ఓటమి



సమరవిక్రమ, కుశాల్

హంబన్‌తొట: అఫ్గానిస్తాన్‌తో సిరీస్‌లో నిలవాలంటే తప్పక గెలవాల్సిన మ్యాచ్‌లో శ్రీలంక సమష్టి ప్రదర్శన కనబరిచింది. ఆదివారం జరిగిన రెండో వన్డేలో లంక 132 పరుగుల తేడాతో నెగ్గింది. మూడు వన్డేల సిరీస్‌లో షనక బృందం 1–1తో సమంగా నిలిచింది. తొలుత లంక 50 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 323 పరుగుల భారీస్కోరు చేసింది. కుశాల్ మెండిస్ (75 బంతుల్లో 78; 7 ఫోర్లు, 1 సిక్స్), కరుణరత్నే (62 బంతుల్లో 52; 7 ఫోర్లు) ధాటిగా ఆడారు. సమరవిక్రమ (46 బంతుల్లో 44; 5 ఫోర్లు), ధనంజయ (29 నాటౌట్; 1 ఫోర్, 1 సిక్స్), హసరంగ (29 నాటౌట్; 4 ఫోర్లు,1 సిక్స్) మెరుగ్గా ఆడారు. తర్వాత అఫ్గానిస్తాన్ 42.1 ఓవర్లలో 191 పరుగులకే కుప్పకూలింది. ఓపెనర్ జద్రాన్ (54; 2 ఫోర్లు, 2 సిక్స్‌లు), కెప్టెన్ హష్మతుల్లా (57; 6 ఫోర్లు) అర్ధ శతకాలు సాధించారు. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' ధనంజయ డిసిల్వా (3/39), హసరంగ (3/42), చమీరా (2/18) అఫ్గాన్ బ్యాటర్ల పని పట్టారు. నిర్ణాయక ఆఖరి వన్డే కూడా ఇదే వేదికపై 7న జరుగుతుంది.

హారిక శుభారంభం



సెయింట్ లూయిస్ (అమెరికా): కెయిన్స్ కప్ అంతర్జాతీయ మహిళల చెస్ టోర్నీలో భారత గ్రాండ్‌మాస్టర్లు ద్రోణవల్లి హారిక, కోనేరు హంపిలకు మిశ్రమ ఫలితాలు ఎదురయ్యాయి. తొలి రౌండ్‌లో హారిక 80 ఎత్తుల్లో ఎలిజబెత్ పాట్జ్ (జర్మనీ)పై గెలుపొందగా... 2020 చాంపియన్ హంపి 41 ఎత్తుల్లో అలెగ్జాండ్రా కొస్టెనిక్ (స్విట్జర్లాండ్) చేతిలో ఓడిపోయింది. మొత్తం పది మంది మేటి మహిళా క్రీడాకారిణుల మధ్య తొమ్మిది రౌండ్లపాటు ఈ టోర్నీ జరుగుతోంది. మొత్తం 1,80,000 డాలర్ల (రూ. కోటీ 48 లక్షలు) ప్రైజ్‌మనీతో ఈ టోర్నీని నిర్వహిస్తున్నారు. మొత్తం 10 మంది క్రీడాకారిణులకు ప్రైజ్‌మనీ ఇవ్వనున్నారు. విజేతకు 45 వేల డాలర్లు (రూ. 37 లక్షలు)... రన్నరప్ ప్లేయర్‌కు 35 వేల డాలర్లు (రూ. 28 లక్షల 84 వేలు)... మూడో స్థానంలో నిలిచిన ప్లేయర్‌కు 25 వేల డాలర్లు (రూ. 20 లక్షల 60 వేలు) ప్రైజ్‌మనీగా లభిస్తాయి.

భవిత

టీఎస్‌పీఎస్సీ గ్రూప్–1 స్టడీమెటీరియల్, సిలబస్, ప్రీవియస్ పేపర్స్, మోడల్ పేపర్స్, గైడెన్స్, బిట్‌బ్యాంక్, కరెంట్ అఫైర్స్, ఆన్‌లైన్ టెస్టులు మొదలైన వాటి కోసం www.sakshieducation.com చూడొచ్చు.

- గ్రూప్1, గ్రూప్2 ప్రత్యేకం- కరెంట్ అఫైర్స్ కోసం

ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి

కెరీర్ కౌన్సెలింగ్
మీ సందేహాలు, సలహాలు పంపించాల్సిన ఈ- మెయిల్ sakshieducation@gmail.com

విద్య, ఉద్యోగ సమాచారం

ఐబీపీఎస్–ఆర్‌ఆర్‌బీల్లో 8612 పోస్టులు

ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ బ్యాంకింగ్ పర్సనల్ సెలక్షన్(ఐబీపీఎస్).. రీజనల్ రూరల్ బ్యాంక్(ఆర్‌ఆర్‌బీ)ల్లో కామన్ రిక్రూట్‌మెంట్ ప్రాసెస్–XII(సీఆర్‌పీ) ద్వారా వివిధ ఉద్యోగాల భర్తీకి సంబంధించి ప్రకటనను విడుదలచేసింది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 8612
» **పోస్టుల వివరాలు:** ఆఫీస్ అసిస్టెంట్(మల్టీపర్పస్)–5538, ఆఫీసర్ స్కేల్–1 (ఏఎం)–2485, జనరల్ బ్యాంకింగ్ ఆఫీసర్(మేనేజర్)స్కేల్–2–332, ఐటీ ఆఫీసర్ స్కేల్2–68, సీఏ ఆఫీసర్ స్కేల్2–21, లా ఆఫీసర్ స్కేల్2–24, ట్రెజరీ మేనేజర్ స్కేల్2–08, మార్కెటింగ్ ఆఫీసర్ స్కేల్2–03, అగ్రికల్చర్ ఆఫీసర్ స్కేల్2–60, ఆఫీసర్ స్కేల్3(సీనియర్ మేనేజర్)–73.
» **అర్హత:** పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో బ్యాచిలర్స్ డిగ్రీ, సీఏ, ఎంబీఏ ఉత్తీర్ణులై ఉండాలి.
» **వయసు:** 01.06.2023 నాటికి ఆఫీసర్ స్కేల్3 (సీనియర్ మేనేజర్) పోస్టులకు 21 నుంచి 40 ఏళ్లు, ఆఫీసర్ స్కేల్2(మేనేజర్) పోస్టులకు 21 నుంచి 32 ఏళ్లు, ఆఫీసర్ స్కేల్1(అసిస్టెంట్ మేనేజర్) పోస్టులకు 18 నుంచి 30 ఏళ్లు, ఆఫీస్ అసిస్టెంట్ (మల్టీపర్పస్) పోస్టులకు 18 నుంచి 28 ఏళ్ల మధ్య ఉండాలి.
» **ఎంపిక విధానం:** పోస్టును అనుసరించి ప్రిలిమ్స్ రాతపరీక్ష, మెయిన్స్ రాతపరీక్ష, ఇంటర్వ్యూ, డాక్యుమెంట్ వెరిఫికేషన్, మెడికల్ ఎగ్జామినేషన్ ఆధారంగా ఎంపికచేస్తారు.
» **ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ తేదీలు:** 01.06.2023 నుంచి 21.06.2023 వరకు
» **ఆన్‌లైన్ ప్రిలిమినరీ పరీక్ష తేది:** ఆగస్టు 2023.
» **ఆన్‌లైన్ మెయిన్స్ పరీక్షతేది:** సెప్టెంబర్ 2023.
» **వెబ్‌సైట్:** www.ibps.in

ఇఫ్లూ, హైదరాబాద్‌లో 97 నాన్ టీచింగ్ పోస్టులు

హైదరాబాద్‌లోని ఇంగ్లిష్ అండ్ ఫారిన్ లాంగ్వేజెస్ యూనివర్సిటీ(ఇఫ్లూ).. డైరెక్ట్ రిక్రూట్‌మెంట్ ప్రాతిపదికన హైదరాబాద్, షిల్లాంగ్‌లోని ఇఫ్లూ క్యాంపస్‌లలో నాన్ టీచింగ్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 97
» **పోస్టుల వివరాలు:** గ్రూప్–ఎ పోస్టులు: డిప్యూటీ రిజిస్ట్రార్–01, అసిస్టెంట్ రిజిస్ట్రార్–04, హిందీ ఆఫీసర్–01, డిప్యూటీ లైబ్రేరియన్–02, అసిస్టెంట్ లైబ్రేరియన్–05, పబ్లిక్ రిలేషన్స్ ఆఫీసర్–01.
» **గ్రూప్–బి పోస్టులు:** సెక్షన్ ఆఫీసర్–01, అసిస్టెంట్–07, పర్సనల్ అసిస్టెంట్–06, ప్రొఫెషనల్ అసిస్టెంట్–01, అసిస్టెంట్ ఇంజనీర్(సివిల్)–01, జూనియర్ ఇంజనీర్(ఎలక్ట్రికల్)–01, సెక్యూరిటీ ఆఫీసర్–01, ప్రైవేట్ సెక్రటరీ(ప్రో–వీసీ)–01, హిందీ ట్రాన్స్‌లేటర్–01, స్టాటిస్టికల్ అసిస్టెంట్–01.
» **గ్రూప్–సి పోస్టులు:** అప్పర్ డివిజన్ క్లర్క్–07, సెమీ ప్రొఫెషనల్ అసిస్టెంట్–02, లోయర్ డివిజన క్లర్క్–56, హిందీ టైపిస్ట్–01, డ్రైవర్(షిల్లాంగ్ క్యాంపస్)–01, కుక్–01, ఎంటీఎస్–29.
» **అర్హత:** పోస్టును అనుసరించి పదో తరగతి, ఇంటర్, డిగ్రీ, పీజీ తదితర కోర్సులు ఉత్తీర్ణులై ఉండాలి.
» **దరఖాస్తులకు చివరితేది:** 26.06.2023.
» **వెబ్‌సైట్:** www.efluniversity.ac.in

బీడీఎల్, హైదరాబాద్‌లో 12 మేనేజర్ పోస్టులు

హైదరాబాద్‌లోని భారత్ డైనమిక్స్ లిమిటెడ్(బీడీఎల్).. డిప్యూటీ మేనేజర్, అసిస్టెంట్ మేనేజర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 12
» **విభాగాలు:** వీఎస్‌ఎస్‌ఐ డిజైనర్/ఎంబెడెడ్ డిజైనర్, మైక్రోవేవ్ డిజైనర్, కంప్యూటర్ విజన్ సాఫ్ట్‌వేర్ డిజైనర్, సీఏఈ/ఎఫ్ఈఏ ఇంజనీర్, క్యూసీ మెకానికల్, ఎలక్ట్రానిక్స్ తదితరాలు.
» **వేతనం:** నెలకు రూ.40,000 నుంచి రూ.1.6 లక్షలు చెల్లిస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
» **ఆన్‌లైన్ దరఖాస్తు ప్రారంభతేది:** 17.06.2023.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 16.07.2023.
» **వెబ్‌సైట్:** www.bdl-india.in

ఏపీ మత్స్య విశ్వవిద్యాలయం, విజయవాడలో డిప్లొమాలో ప్రవేశాలు

విజయవాడలోని ఆంధ్రప్రదేశ్ ఫిషరీస్ యూనివర్శిటీ, క్యాంప్ ఆఫీస్.. 2023–24 విద్యా సంవత్సరానికి సంబంధించి డిప్లొమా(ఫిషరీస్ సైన్స్)లో ప్రవేశాలకు దరఖాస్తులు కోరుతోంది.

» **కోర్సు వ్యవధి:** రెండేళ్లు. బోధనా మాధ్యమం: ఇంగ్లిష్.
» **సీట్ల సంఖ్య:** ప్రభుత్వ కళాశాలల్లో 55, అనుబంధ కళాశాలల్లో 440.
» **అర్హత:** పదో తరగతి ఉత్తీర్ణులై ఉండాలి. వయసు: 15 నుంచి 22 ఏళ్ల మధ్య ఉండాలి.
» **ఎంపిక విధానం:** పదో తరగతిలో సాధించిన మార్కులు, స్థానికత, రూల్ ఆఫ్ రిజర్వేషన్ ఆధారంగా సీటు కేటాయిస్తారు.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 12.06.2023.
» **అలస్య రుసుముతో దరఖాస్తులకు చివరితేది:** 15.06.2023.
» **వెబ్ ఆప్షన్ తేది:** 19.06.2023.
» **వెబ్‌సైట్:** www.apfu.ap.gov.in

గ్రూప్–1 ప్రిలిమ్స్.. ఎగ్జామ్ డే టిప్స్

టీఎస్‌పీఎస్సీ గతేడాది మొత్తం 503 పోస్టులతో నోటిఫికేషన్ విడుదల చేసింది. అక్టోబర్‌లో జరిగిన ప్రిలిమినరీ పరీక్ష.. పేపర్ లీకేజీ కారణంగా రద్దయిన విషయం తెలిసిందే! జూన్ 11న ప్రిలిమ్స్‌ను మళ్లీ నిర్వహించనున్నారు. అంటే..పరీక్షకు అందుబాటులో ఉన్న సమయం.. వారం రోజులు మాత్రమే!! దీంతో..అభ్యర్థులు అందుబాటులో ఉన్న ఈ విలువైన సమయంలో..అనుసరించే వ్యూహాలే విజయంలో కీలకంగా నిలుస్తాయి. ఈ నేపథ్యంలో.. టీఎస్‌పీఎస్సీ గ్రూప్–1 ప్రిలిమ్స్ అభ్యర్థుల కోసం సక్సెస్ టిప్స్..

» జూన్ 11న టీఎస్‌పీఎస్సీ గ్రూప్–1 ప్రిలిమ్స్ రీ–ఎగ్జామ్
» ఈ నెల 4 తేదీ నుంచి అందుబాటులోకి వచ్చిన హాల్ టికెట్ డౌన్‌లోడ్ సదుపాయం
» గత ఏడాది అక్టోబర్‌లో జరిగిన ప్రిలిమ్స్‌కు 2,86,051 మంది హాజరు
» అభ్యర్థులు ఒత్తిడిని దూరం పెట్టాలంటున్న నిపుణులు



ఎన్ని సంవత్సరాలు కష్ట పడినా.. ఎన్ని పుస్తకాలు చదివినా..పరీక్షకు ముందు చేసే రివిజన్ విజయంలో కీలకంగా నిలుస్తుందని నిపుణులు పేర్కొంటున్నారు. కాబట్టి అన్ని టాపిక్స్ చదివేశాం కదా అనే ఆలోచనను వీడాలి. అందుబాటులో ఉన్న ప్రస్తుత సమయంలో ప్రతి క్షణాన్ని సద్వినియోగం చేసుకుంటూ.. మళ్లీ మళ్లీ చదివే ప్రయత్నం చేయాలి.

రివిజన్ ప్రధానంగా

ప్రిలిమ్స్‌కు ప్రస్తుతం అందుబాటులో ఉన్న ఈ వారం రోజుల సమయంలో అభ్యర్థులు ప్రధానంగా రివిజన్‌కే ప్రాధాన్యం ఇవ్వాలి. శాస్త్రీయ దృక్పథంతో పునశ్చరణ సాగించాలి. ఇప్పటివరకు ఆయా సబ్జెక్ట్‌లకు సంబంధించి సొంతంగా రూపొందించుకున్న షార్ట్ నోట్స్, సినాప్సిస్‌లపై ఎక్కువ దృష్టిపెట్టాలి. ఒక టాపిక్‌కు సంబంధించిన సినాప్సిస్‌ను చదివితే..ఆ అంశానికి సంబంధించిన పూర్తి సమాచారం మదిలో మెదిలే విధంగా ఉండాలి. ఇప్పటివరకు చదివిన పుస్తకాలు, నోట్స్‌లోని ముఖ్యాంశాలను, సబ్ హెడ్డింగ్స్‌ను చూసుకోవాలి.

ప్రాక్టీస్ టెస్ట్స్

ప్రస్తుత సమయంలో ప్రిలిమ్స్ అభ్యర్థులు రివిజన్‌తోపాటు ప్రాక్టీస్ టెస్ట్స్‌కు హాజరు కావడం కూడా మేలు చేస్తుంది. ప్రతిరోజు ప్రాక్టీస్ టెస్ట్‌లు రాయడం ద్వారా టైమ్ మేనేజ్‌మెంట్ అలవడుతుంది. ఇది పరీక్ష హాల్లో ఎలా వ్యవహరించాలో నేర్పుతుంది. ఫలితంగా ఎగ్జామ్ డే టెన్షన్ నుంచి ఉపశమనం కలుగుతుంది.

క్లిష్టతను తట్టుకునేలా

గత అక్టోబర్‌లో నిర్వహించిన ప్రిలిమ్స్ పరీక్షలో ప్రశ్నల క్లిష్టత స్థాయి ఎక్కువగా ఉందనే అభిప్రాయం వ్యక్తమైంది. కొన్ని ప్రశ్నలు అభ్యర్థులను తికమకకు గురి చేసే విధంగా కనిపించాయి. దీంతో అభ్యర్థులు పరీక్ష హాల్లో కొంత ఒత్తిడికి లోనయ్యారు. ఇలాంటి సందర్భాలను దృష్టిలో పెట్టుకుని ప్రశ్నలు ఎలా అడిగినా.. టెన్షన్‌కు గురికాకుండా ముందుగానే మానసికంగా సంసిద్ధత పొందాలి.

ఆరోగ్యం జాగ్రత్తగా

ప్రిలిమ్స్‌కు హాజరయ్యే అభ్యర్థులు..రేయింబవళ్లు శ్రమిస్తేనే మంచి మార్కులు వస్తాయని భావిస్తుంటారు. ఫలితంగా ఆరోగ్యాన్ని నిర్లక్ష్యం చేస్తారు. పరీక్షకు ముందు రోజు కూడా అర్ధరాత్రి వరకూ చదవుతూ ఉంటారు. ఇది మరుసటి రోజు పరీక్ష హాల్లో ప్రదర్శన తీరుపై ప్రతికూల ప్రభావం చూపుతుంది. కాబట్టి పరీక్షకు ముందు రోజు అతిగా చదవకుండా ప్రశాంతంగా ఉండే ప్రయత్నం చేయాలి.

పరీక్షకు ముందు రోజు

పరీక్షకు ఒకరోజు ముందు అభ్యర్థులు సబ్జెక్ట్ ప్రిపరేషన్ కంటే..మరుసటి రోజు పరీక్షకు హాజరయ్యేందుకు అవసరమైన వాటిని(హాల్ టికెట్, పెన్నులు, గుర్తింపు కార్డులు వంటివి) సిద్ధం చేసుకోవాలి. ముందుగానే పరీక్ష కేంద్రాన్ని చూసుకోవడం, హాల్ టికెట్ డౌన్‌లోడ్ వంటి పూర్తిచేసుకోవాలి. పోటీ నేపథ్యంలో చివరి నిమిషం వరకు చదవాలనే తపన ఉండటం సహజం. దీనివల్ల మానసిక ఒత్తిడి, శారీరక అలసటకు గురయ్యే ప్రమాదం ఉందని గమనించాలి.

పరీక్ష హాల్లో ప్రత్యేకంగా

అభ్యర్థులు పరీక్ష హాల్లో ప్రత్యేక వ్యూహాలను అనుసరించాలి. ప్రతి ప్రశ్నకు సమాధానం ఇవ్వాలనే తొందరపాటును వీడాలి. ముందుగా ప్రశ్న పత్రాన్ని చదివేందుకు కొంత సమయం కేటాయించాలి. కనీసం పది నిమిషాలపాటు ప్రశ్న పత్రం పరిశీలించాలి. ఫలితంగా ప్రశ్న పత్రం క్లిష్టత స్థాయిపై ప్రాథమిక అవగాహన ఏర్పడుతుంది. తొలుత సులభంగా భావించిన ప్రశ్నలకు సమాధానాలు ఇవ్వాలి. తర్వాతి దశలో ఓ మోస్తరు క్లిష్టత ఉన్న ప్రశ్నలకు సమాధానాలు గుర్తించాలి. చివరగా తాము అత్యంత క్లిష్టంగా భావించిన ప్రశ్నలపై దృష్టి పెట్టాలి.

ఎలిమినేషన్.. చివరగా

ఆబ్జెక్టివ్ విధానంలో ఉండే ప్రిలిమ్స్ పరీక్షలో చాలామంది అభ్యర్థులు చేసే పని.. ఎలిమినేషన్ టెక్నిక్‌ను అనుసరించడం. అంటే..నాలుగు సమాధానాల్లో.. ప్రశ్నకు సరితూగని సమాధానాలను ఒక్కొక్కటిగా తొలగించి.. చివరగా మిగిలిన ఆప్షన్‌ను సమాధానంగా భావించడం. ఈ టెక్నిక్‌ను కూడా పరీక్ష చివరి దశలోనే అమలు చేయాలి. అప్పటికే తమకు సమాధానాలు తెలిసిన అన్ని ప్రశ్నలను పూర్తి చేసుకున్నామని భావించాకే..ఎలిమినేషన్ లేదా గెస్సింగ్‌పై దృష్టి పెట్టాలి.

ఓఎంఆర్ షీట్–అప్రమత్తం

ఎంతోమంది అభ్యర్థులు ఓఎంఆర్ షీట్‌లో వివరాలు పొందుపరచడంలో పొరపాట్లు చేస్తున్నారు. దీంతో పరీక్షలో మంచి మార్కులు సాధించినా.. విజయాన్ని చేజార్చుకుంటున్నారు. ఇలాంటి పరిస్థితి ఎదురుకాకుండా.. ఓఎంఆర్ షీట్ నింపడంలో అభ్యర్థులు అత్యంత అప్రమత్తంగా ఉండాలి. ఓఎంఆర్ షీట్‌ను తప్పులు లేకుండా నింపడంతోపాటు సమాధానాలు బబ్లింగ్ చేసేటప్పుడు ప్రశ్న సంఖ్య, ఆప్షన్‌ను క్షుణ్నంగా గుర్తించాలి.

హాల్ టికెట్ డౌన్‌లోడ్

ప్రిలిమ్స్ అభ్యర్థులు హాల్ టికెట్ డౌన్‌లోడ్ సదుపాయం అందుబాటులోకి వచ్చిన వెంటనే ఆ ప్రక్రియ పూర్తి చేసుకోవాలి. సమయం ఉంది కదా.. అని చివరి రోజు వరకు వేచి చూడకుండా.. హాల్ టికెట్‌ను వీలైనంత ముందుగా డౌన్‌లోడ్ చేసుకోవడం మేలు. దీనివల్ల హాల్‌టికెట్‌లో ఏమైనా పొరపాట్లు ఉంటే..పరీక్ష కేంద్రంలోని అధీకృత అధికారుల దృష్టికి తీసుకెళ్లి మార్పులు చేయించుకునే అవకాశం ఉంటుంది. ఇలా మార్పులు చేయించుకోవాల్సిన అవసరం ఏర్పడిన అభ్యర్థులు..తప్పనిసరిగా తమ గుర్తింపును రుజువు చేసే విధంగా ఏదైనా ఇతర అధికారిక గుర్తింపు కార్డును తీసుకెళ్లాలి.

పరీక్ష కేంద్రంలో ఇలా..

- పరీక్ష సమయానికి కనీసం గంట ముందుగా పరీక్ష కేంద్రానికి చేరుకోవాలి.
- ప్రశ్న పత్రాన్ని చదివేందుకు కొంత సమయం కేటాయించాలి.
- సులభంగా భావించిన ప్రశ్నలకు ముందుగా, తర్వాత ఓ మోస్తరు క్లిష్టత ప్రశ్నలకు సమాధానం ఇవ్వాలి.
- ఎలిమినేషన్ టెక్నిక్‌ను చివరిగా అనుసరించడం మేలు.
- ఓఎంఆర్ షీట్ నింపడంలో అప్రమత్తంగా వ్యవహరించాలి.

ప్రవేశాలు

తెలంగాణ గిరిజన సంక్షేమ గురుకులాల్లో ఇంటర్‌లో ప్రవేశాలు

తెలంగాణ గిరిజన సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థ(టీటీడబ్ల్యూఆర్ యూఆర్‌జేసీ).. 2023–24 విద్యా సంవత్సరానికి సంబంధించి రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 103 గిరిజన గురుకుల జూనియర్ కళాశాలల్లో ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరంలో ప్రవేశాలకు నోటిఫికేషన్ విడుదలచేసింది. ఎంపికైన విద్యార్థులకు ఇంటర్ ఉచిత విద్య వసతితోపాటు ఐఐటీ, నీట్ తదితర జాతీయ స్థాయి పోటీ పరీక్షలకు శిక్షణ ఇస్తారు.

» **గ్రూపులు:** ఎంపీసీ, బైపీసీ, ఎంఈసీ, సీఈసీ, హెచ్‌ఈసీ, వృత్తి విద్యా కోర్సులు.
» **బోధనా మాధ్యమం:** ఇంగ్లిష్.
» **అర్హత:** మార్చి–2023లో పదో తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థులు అర్హులు. విద్యార్థి తల్లిదండ్రుల వార్షిక ఆదాయం రూ.2,00,000(పట్టణ ప్రాంతం), రూ.1,50,000(గ్రామీణ ప్రాంతం) మించకూడదు. ఇంగ్లిష్/తెలుగు మాధ్యమం విద్యార్థులు దరఖాస్తు చేసుకోవచ్చు.
» **వయసు:** విద్యార్థుల వయస్సు 31.08.2023 నాటికి 17 ఏళ్లు మించకూడదు.
» **ఎంపిక ప్రక్రియ:** పదో తరగతిలో సాధించిన మార్కుల ఆధారంగా సీటు కేటాయిస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:**15.06.2023
» **వెబ్‌సైట్:** tgtwgurukulam.telangana.gov.in

తెలంగాణలో లేటరల్ ఎంట్రీ పాలిటెక్నిక్ కోర్సుల్లో ప్రవేశాలు

తెలంగాణ ప్రభుత్వం, సాంకేతిక విద్యా శాఖ.. 2023–24 విద్యా సంవత్సరానికి లేటరల్ ఎంట్రీకి సంబంధించి పాలిటెక్నిక్ కోర్సుల్లో ప్రవేశాలకు దరఖాస్తులు కోరుతోంది. దీనిద్వారా ప్రభుత్వ/ఎయిడెడ్/ప్రైవేట్ పాలిటెక్నిక్‌లలో అందించే మూడేళ్ల డిప్లొమా (ఇంజనీరింగ్, నాన్ ఇంజనీరింగ్) కోర్సుల్లో రెండో ఏడాదిలో ప్రవేశాలు కల్పిస్తారు.

» **డిప్లొమా కోర్సులు:** ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ ఇంజనీరింగ్, సివిల్ ఇంజనీరింగ్, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్, డిప్లొమా ఇన్ మెకానికల్ ఇంజనీరింగ్ / ఆటోమొబైల్ ఇంజనీరింగ్, కంప్యూటర్ ఇంజనీరింగ్, కమర్షియల్ అండ్ కంప్యూటర్ ప్రాక్టీస్, ప్రింటింగ్ టెక్నాలజీ.
» **అర్హత:** ఇంటర్మీడియట్(వృత్తి విద్య)తోపాటు బోర్డ్ ఆఫ్ ఇంటర్మీడియట్ ఎడ్యుకేషన్ నిర్వహించే సంబంధిత బ్రిడ్జ్ కోర్సు(మ్యాథ్స్, ఫిజిక్స్, కెమిస్ట్రీ సబ్జెక్టులు) ఉత్తీర్ణులై ఉండాలి.
» **ప్రవేశాల షెడ్యూల్:** 19.06.2023, 20.06.2023
» **స్థలం:** జె.ఎన్.ప్రభుత్వ పాలిటెక్నిక్, రామాంత్‌పూర్, హైదరాబాద్.
» **దరఖాస్తులకు చివరితేది:** 09.06.2023.
» **వెబ్‌సైట్:** www.sbtet.telangana.gov.in

స్టాక్ మార్కెట్లు (శుక్రవారం ముగింపు)

దేశీ సూచీలు		
సెన్సెక్స్ ▲	119	62,547
నిఫ్టీ ▲	46	18,534

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ప్లస్' చూడండి

విదేశీ సూచీలు			
నాస్డాక్	13,241	▲	140
డోజోన్స్	33,763	▲	701
ఎఫ్టీఎస్ఈ 100	7,607	▲	117
డాక్స్	16,051	▲	198
షాంఘై	3,230	▲	25
నికాయ్	31,524	▲	376

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్



స్కోర్ కొట్టు... లోన్ పట్టు!

అనుకోకుండా ఖర్చు వచ్చి పడితే ఏం చేయాలో తోచదు. వైద్యం, ఇంటి మరమ్మతులు, వేతనంలో కోత, ఉద్యోగం కోల్పోవడం, స్కూల్ ఫీజు.. అవసరం ఏదైనా వెంటనే డబ్బు కావాల్సి వస్తే.. క్రెడిట్ కార్డు నుంచి పరిమితి మేరకు డ్రా చేసుకుని గట్టెక్కేస్తుంటారు. ఇది కాకుండా అందుబాటులో ఉన్న మరో మార్గం వ్యక్తిగత రుణం (పర్సనల్ లోన్). హామీతో పని లేకుండా ఆదాయ వనరు ఉన్న ప్రతి ఒక్కరూ సులభంగా పొందగలిగే రుణం ఇది. దాదాపు అన్ని బ్యాంకులు మెరుగైన క్రెడిట్ స్కోరు ఉన్న కస్టమర్లకు పర్సనల్ లోన్ ఇచ్చేందుకు ఉత్సాహం చూపిస్తుంటాయి. వేగంగా ఒకటి రెండు రోజుల్లోనే రుణం మొత్తం చేతికి అందుతుంది. ప్రక్రియ ఎంతో సులభం, అందుకే నేటి రోజుల్లో పర్సనల్ లోన్ సాధనాన్ని ఎక్కువ మంది ఉపయోగించుకుంటున్నారు. అయితే, వ్యక్తిగత రుణం అయినా, గృహ రుణం అయినా వడ్డీ రేటు విషయంలో కొంచెం శ్రద్ధ అవసరం. దీనివల్ల పెద్ద మొత్తంలో ఆదా చేసుకోవచ్చు. కనీసం ఐదారేళ్ల కాలానికి వ్యక్తిగత రుణాలను బ్యాంకులు మంజూరు చేస్తుంటాయి. అన్నేళ్లలో వడ్డీ రూపేణా పెద్ద మొత్తంలో చెల్లింపులు చేయాల్సి వస్తుంది. అందుకని వీలైనంత తక్కువ వడ్డీ రేటుకు వ్యక్తిగత రుణాన్ని పొందే మార్గాలను అన్వేషించాలి. వీటిపై అవగాహన కల్పించే కథనమే ఇది.


వ్యక్తిగత రుణం తీసుకునే వారు ముందు పరిశీలించాల్సిన అంశాలు కొన్ని ఉన్నాయి. ప్రాసెసింగ్ ఫీజును పరిగణనలోకి తీసుకోవాలి. అలాగే, వడ్డీ రేటు ఆధారంగా బ్యాంక్‌ను ఖరారు చేసుకోవాలి. ఖాతా ఉన్న బ్యాంకులోనే వ్యక్తిగత రుణం పొందాలనేమీ లేదు. తక్కువ రేటుకు వస్తుంటే ఇతర బ్యాంకుల ఆఫర్లను అయినా పరిశీలించొచ్చు. అయితే తక్కువ రేటుకు వ్యక్తిగత రుణం పొందేందుకు కొన్ని చిట్కాలున్నాయి. ఇందులో ముందుగా వ్యక్తిగత క్రెడిట్ స్కోరును పెంచుకోవడంపై దృష్టి పెట్టాలి. ఒకవైపు మన వ్యక్తిగత రుణ చరిత్ర బలంగా ఉండేలా (మెరుగైన స్కోర్) చూసుకోవాలి. మరోవైపు తక్కువ రేటుకు వ్యక్తిగత రుణాన్ని ఆఫర్ చేసే బ్యాంక్‌లను గుర్తించాలి.

•••

మెరుగైన క్రెడిట్ స్కోర్ ఉన్న వారికి బ్యాంకులు కొంచెం తక్కువ రేటుకు రుణాన్నిచ్చేందుకు ఆసక్తి చూపిస్తాయి. ఎందుకంటే ఆ రుణం నమ్మకంగా తిరిగి వస్తుంది. డిఫాల్ట్ అవకాశాలు ఉండవు. రిస్క్ దాదాపుగా ఉండదు కనుక తక్కువ రేటుకు ఇస్తాయి. ''వ్యక్తిగత రుణాన్ని ఎలాంటి తనఖా లేదా హామీ లేకుండా బ్యాంకులు ఇస్తాయి. కనుక బ్యాంకులు ఎంత రుణం ఇవ్వాలి, ఎంత కాలానికి ఇవ్వాలి, ఎంత వడ్డీ రేటుకు ఇవ్వాలనే అంశాలను నిర్ణయించే విషయంలో రుణ గ్రహీత క్రెడిట్ స్కోరు కీలక పాత్ర పోషిస్తుంది. అధిక క్రెడిట్ స్కోరు ఉన్న వారు వడ్డీ రేటు తగ్గించా



లంటూ బ్యాంకులను డిమాండ్ చేయవచ్చు''అని సెబీ నమోదిత ఇన్వెస్ట్‌మెంట్ అడ్వైజర్, సహజ్‌మనీ వ్యవస్థాపకుడు అభిషేక్ కుమార్ సూచించారు. క్రెడిట్ కార్డు బ్యాలెన్స్‌ను ఉపయోగించుకునే వారు సకాలంలో బిల్లులను చెల్లించాలి. ఎట్టి పరిస్థితుల్లోనూ డిఫాల్ట్ కాకూడదు. అలాగే, రుణం ఏదైనా కానీయండి ఈఎంఐల చెల్లింపుల విషయంలో బాధ్యతగా, క్రమశిక్షణగా వ్యవహరించాలి. వీలుంటే ఆటోమేటిక్‌గా చెల్లింపులు జరిగే ఆప్షన్ నమోదు చేసుకోవాలి. వ్యక్తిగత రుణం తీసుకోవాలని భావిస్తుంటే, అప్పటికే ఉన్న ఇతర రుణాలను తీర్చివేయడం వల్ల కూడా క్రెడిట్ స్కోర్ మెరుగుపడుతుంది. ''మీ క్రెడిట్ కార్డ్ వినియోగ చరిత్ర చాలా సాఫీగా ఉండాలి. క్రెడిట్ కార్డ్ బిల్లు చెల్లింపులను కొన్ని రోజులు కూడా ఆలస్యం చేయొద్దు. ఒకటి రెండు సార్లు సకాలంలో చెల్లింపులు చేయకపోయినా, అది క్రెడిట్ చరిత్రలో మచ్చగా చేరొచ్చు. అప్పుడు రుణాలిచ్చే సంస్థలు దీన్ని రిస్క్‌గా భావిస్తాయి. రుణ వడ్డీ రేటును ప్రభావితం చేస్తుంది'' అని ఇన్‌క్రెడ్ రిస్క్ అండ్ అనలైటిక్స్ ప్రెసిడెంట్ పృథ్వీ చంద్రశేఖర్ తెలిపారు. అవగాహన లేక క్రెడిట్ కార్డ్, వాహన, ఇతర రుణ వాయిదాల చెల్లింపుల్లో వైఫల్యం చోటుచేసుకుంటే అది భవిష్యత్తులో వారు తీసుకోబోయే రుణాలపై అధిక రేట్లకు దారితీస్తుందని గమనించాలి. అందుకే బ్యాంక్‌లు రుణ చరిత్రలో మచ్చలు ఉండి, రిస్క్ ఖాతాలుగా భావిస్తే అటువంటి వారికి సాధారణం కంటే అధిక వడ్డీ రేటుకే రుణాలు మంజూరు చేస్తాయి. అదే సమయంలో చెల్లింపుల్లో ఎలాంటి వైఫల్యం లేని, మెరుగైన రుణ చరిత్ర ఉన్న వారికి తక్కువ రేటుకు ఆఫర్ చేస్తాయి.



మార్గాలు..

రుణ చెల్లింపులు సకాలంలో చేయడం వల్ల క్రెడిట్ స్కోరుపై సానుకూల ప్రభావం చూపిస్తుంది. రుణ వినియోగ రేషియో కూడా క్రెడిట్ స్కోరులో ముఖ్య పాత్ర పోషిస్తుంది. అంటే మీకు అందుబాటులో ఉన్న రుణం పరిమితిలో ఎంత వినియోగించుకున్నారనేది. రుణంపై మీరు ఏ మేరకు ఆధారపడుతున్నారో ఇది తెలియజేస్తుంది. నిపుణుల సూచన ప్రకారం.. క్రెడిట్ యూసేజ్ రేషియో 30 శాతం లోపు కొనసాగించాలి. ఉదాహరణకు క్రెడిట్ కార్డుపై రూ.1 లక్ష క్రెడిట్ లిమిట్ ఉందని అనుకుందాం. అప్పుడు మీ వినియోగం రూ.30 వేల వరకు ఉండాలి. ఒకటికి మించి క్రెడిట్ కార్డులు వాడుతున్న వారికి కూడా ఇదే వర్తిస్తుంది. ఒకే సమయంలో ఎక్కువ రుణాలకు దరఖాస్తు చేస్తుండడం కూడా క్రెడిట్ స్కోరుపై ప్రతికూల ప్రభా వం చూపిస్తుంది. అందుకే ఒకేసారి వెంటవెంట ఒక టికి మించిన క్రెడిట్ కార్డ్ కోసం దరఖాస్తు చేసుకోవద్దు. అంతేకాదు ఒకటికి మించిన బ్యాంకులు, ఎన్‌బీఎఫ్‌సీల వద్ద వ్యక్తిగత రుణానికి అభ్యర్థనలు ఇవ్వొద్దు. దీనివల్ల ఏకకాలంలో ఒకటికి మించిన క్రెడిట్ అభ్యర్థనల సమాచారం క్రెడిట్ బ్యూరోలకు చేరుతుంది. అది క్రెడిట్ స్కోరుపై ప్రభావం చూపిస్తుంది.

వేతన ఖాతా..

ఉద్యోగులకు పర్సనల్ లోన్ విషయంలో బ్యాంకుల నుంచి మంచి ఆఫర్లు లభిస్తుంటాయి. వేతన ఖాతా ఉన్న బ్యాంకు నుంచి తీసుకోవడం అనుకూలమనే చెప్పుకోవచ్చు. ఎందుకంటే మీ నెలవారీ వేతన జమ, మీ ఖర్చులు, ఉపసంహరణ వివరాలు ఖాతాలో నమోదై ఉంటాయి. కనుక రుణానికి ముందు బ్యాంక్ అధికారి వాటిని చూసి ఓ అంచనాకు రాగలరు. అందుకే వేతన ఖాతాలున్న వారికి ఇన్‌స్టంట్ పర్సనల్ లోన్‌ను చాలా బ్యాంకులు డిజిటల్‌గా ఆఫర్ చేస్తుంటాయి. బ్యాంకు సిబ్బందితో మాట్లాడి తక్కువ రేటుకు రుణం పొందొచ్చు. ''బ్యాంకులు సాధారణంగా తమ ఖాతాదారులకు సంబంధించి నియమ నిబంధనలు, షరతుల విషయంలో కొంచెం అనుకూలంగానే వ్యవహరిస్తుంటాయి. అంటే వడ్డీ రేటు, ప్రాసెసింగ్ ఫీజు తగ్గించడం, వేగంగా మంజూరు చేస్తాయి. సంబంధిత ఖాతాదారుకు సంబంధించి వేతనం, ఇతర వ్యయాల సమాచారం అందుబాటులో ఉండడం వల్ల ఆర్థిక స్థిరత్వం, సామర్థ్యాన్ని బ్యాంకులు అంచనా వేయగలవు''అని అప్నా పైసా ఎగ్జిక్యూటివ్ చైర్మన్ వీ స్వామినాథన్ పేర్కొన్నారు.

ఇతర చార్జీలనూ చూడాలి..

వ్యక్తిగత రుణంలో ప్రాసెసింగ్ ఫీజు, జీఎస్టీ, ఇతర చార్జీలను పరిగణనలోకి తీసుకోవాలి. రుణంపై వడ్డీ రేటు, ప్రాసెసింగ్ ఫీజు, ముందుగా తీర్చేస్తే పడే చార్జీలు తెలుసుకుని నిర్ణయానికి రావాలి. కొన్ని బ్యాంకులు ఫ్లాట్ ప్రాసెసింగ్ ఫీజును వసూలు చేస్తున్నాయి. ఇతర బ్యాంకులు రుణం మొత్తంపై 1–3 శాతం మధ్య ప్రాసెసింగ్ ఫీజు విధిస్తున్నాయి. రుణం ముందుగా చెల్లిస్తే విధించే చార్జీలు కూడా బ్యాంకుల మధ్య వేర్వేరుగా ఉంటాయి. అందుకే భవిష్యత్తులో ముందుగా తీర్చివేసే ఉద్దేశం ఉందా అని చూడాలి.

ఆఫర్లు..

వ్యక్తిగత రుణం తీసుకునే ముందు వివిధ బ్యాంకుల ఆఫర్లను, రుణ రేట్లు, నియమ, నిబంధనలు, షరతులు అన్నీ చూడాలి. ఆ తర్వాతే ఆకర్షణీయమైన ఆఫర్‌ను వినియోగించుకోవాలి. ముందుగా వేతన ఖాతా, డిపాజిట్లు ఉన్న బ్యాంకును అడిగి చూడాలి. ఆ తర్వాత వివిధ బ్యాంకుల రుణ రేట్లు, ఇతర ఆఫర్ల సమాచారం పొందొచ్చు. సాధారణంగా బ్యాంకుల వెబ్‌సైట్లో వ్యక్తిగత రుణాలపై ఫిక్స్‌డ్ రేటు ప్రదర్శించరు. కనిష్టం నుంచి గరిష్టం రేటును ప్రదర్శిస్తాయి. మెరుగైన క్రెడిట్ స్కోరు ఉన్న వారికి అందులో కనిష్ఠ రేటుకే రుణం లభించే అవకాశాలున్నట్టు అర్థం చేసుకోవచ్చు. ''రుణ గ్రహీత క్రెడిట్ స్కోరు ఒక్కటే కాకుండా, కోరుకుంటున్న రుణం మొత్తం, లోన్ టు వ్యాల్యూ రేషియో, నెలవారీ ఆదాయం, ఉద్యోగ స్వరూపం, ఇతర అంశాలను బ్యాంకులు పరిగణనలోకి తీసుకుంటాయి'' అని పైసా బజార్ సీనియర్ డైరెక్టర్ సని అరోరా తెలిపారు. కొన్ని బ్యాంకులు పండుగలు, ఇతర సమయాల్లో ప్రత్యేక రుణ మేళాలను నిర్వహిస్తుంటాయి. ఆ సమయంలో ప్రాసెసింగ్ ఫీజు మాఫీ, వడ్డీ రేటుపై రాయితీలు ఇస్తుంటాయి. కనుక వాటిని పరిశీలించొచ్చు. వీలైనన్ని రుణ సంస్థల మధ్య వ్యక్తిగత రుణ ఆఫర్లను పోల్చుకోవాలని అరోరా సూచించారు. ప్రముఖ సంస్థల ఉద్యోగులకు కొన్ని బ్యాంకులు కార్పొరేట్ డిస్కౌంట్లు ఇస్తుంటాయి. అలాంటివి ఏవైనా ఉన్నాయేమో చూడాలి.



వడ్డీ రేటుపై అవగాహన...

తక్కువ రేటుపై వ్యక్తిగత రుణాన్ని తీసుకున్నా.. రుణం కాల వ్యవధిలో వడ్డీ రూపంలో పెద్ద మొత్తమే చెల్లిస్తుంటారు. ముందుగా బ్యాంకులు రుణంపై వడ్డీ రేటును ఎలా లెక్కిస్తాయన్నది తెలుసుకోవాలి. ఫ్లాట్ రేటు, లేదా తగ్గింపు రేటును బ్యాంకులు ఆఫర్ చేయొచ్చు. ఫ్లాట్ వడ్డీ రేటు అయితే రుణం కాల వ్యవధి అంతటా అసలు మొత్తం (ప్రిన్సిపల్)పైనే వడ్డీ రేటు అమలవుతుంది. ఉదాహరణకు రూ.5 లక్షల రుణాన్ని 12 శాతం రేటుపై మూడేళ్లకు తీసుకున్నారనుకోండి. మొత్తం మీద రూ.1,80,000ను వడ్డీ కింద చెల్లించాలి. నెలవారీ ఈఎంఐ రూ.18,889 అవుతుంది. అదే తగ్గింపు వడ్డీ రేటు విధానంలో.. ప్రతీ వాయిదాకు ముందు మిగిలిన ఉన్న బకాయిపైనే వడ్డీ రేటును బ్యాంకులు లెక్కిస్తాయి. రూ. 5 లక్షల రుణాన్ని తగ్గింపు రేటు విధానంలో 12 శాతం రేటుపై మూడేళ్లకు తీసుకున్నారని అనుకుందాం. అప్పుడు మూడేళ్లలో వడ్డీ రూపేణా రూ.97,858 చెల్లించాల్సి వస్తుంది. నెలవారీ ఈఎంఐ రూ.16,607 అవుతుంది. దీంతో మొత్తం మీద ఈ విధానం వల్ల రూ.82,142 ఆదా అవుతుంది. అందుకే రెడ్యూసింగ్ ఇంటరెస్ట్ రేట్ విధానంలోనే వ్యక్తిగత రుణాన్ని తీసుకోవాలి. పర్సనల్ లోన్‌పై తక్కువ రేటుకు ఇస్తామంటే బుట్టలో పడిపోకుండా.. రుణంపై వడ్డీ రేటును నెలవారీ ఎలా లెక్కిస్తారో అడిగి స్పష్టత తెచ్చుకోవాలి.

ఐటీఐ ఫోకస్డ్ ఈక్విటీ ఫండ్



హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: ఐటీఐ మ్యూచువల్ ఫండ్ తాజాగా ఐటీఐ ఫోకస్డ్ ఈక్విటీ ఫండ్‌ను పరిచయం చేసింది. ఈ కొత్త ఫండ్ ఆఫర్ జూన్ 12న ముగియనుంది. 30 కంపెనీల్లో ఈక్విటీ, ఈక్విటీ ఆధారిత సెక్యూరిటీల్లో ఈ ఫండ్ పెట్టుబడి చేయనుంది. అప్లికేషన్ కనీస ధర రూ.5,000. ధీమంత్ షా, రోహన్ కొర్డే ఈ ఫండ్‌ను నిర్వహిస్తారని కంపెనీ తెలిపింది. ఐటీఐ మ్యూచువల్ ఫండ్ నిర్వహణలో రూ.4,011 కోట్ల ఆస్తులు ఉన్నాయి.

పతంజలి ఫుడ్స్ డివిడెండ్ రూ. 6



హైదరాబాద్: ఎఫ్ఎంసీజీ దిగ్గజం పతంజలి ఫుడ్స్ మార్చితో ముగిసిన గత ఆర్థిక సంవత్సరానికి(2022–23) డివిడెండును ప్రకటించింది. గత నెలాఖరున సమావేశమైన కంపెనీ బోర్డు వాటాదారులకు ఒక్కో షేరుకి 300 శాతం డివిడెండును ప్రకటించింది. వెరసి రూ. 2 ముఖ విలువగల ప్రతీ షేరుకీ రూ. 6 చొప్పున చెల్లించనుంది. కాగా.. గతేడాది చివరి త్రైమాసికం(జనవరి–మార్చి)లో పతంజలి ఫుడ్స్ నికర లాభం 12 శాతం బలపడి రూ. 264 కోట్లకు చేరగా.. మొత్తం ఆదాయం రూ. 6,676 కోట్ల నుంచి రూ. 7,963 కోట్లకు జంప్‌చేసిన సంగతి తెలిసిందే.

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)	
05-6-2023	
విశాఖ	515-00
చిత్తూరు	573-00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	515-00
విజయవాడ	515-00
రిటైల్ ధర (డజను)	72.00
4-6-2023 ఫామ్ ధర...	
హైదరాబాద్	500-00
వరంగల్	502-00
రిటైల్ ధర	5.60

ఎన్‌టీపీసీ | జేఎం ఫైనాన్షియల్ | కొనొచ్చు

స్టాక్ స్కోప్

ప్రస్తుత ధర: రూ. 174

టార్గెట్: రూ. 205

ఎందుకంటే: గతేడాది(2022–23) జనవరి–మార్చి(క్యూ4)లో పీఎస్‌యూ దిగ్గజం ఎన్‌టీపీసీ ఆదాయం వార్షిక ప్రాతిపదికన 19 శాతం ఎగసింది. రూ. 44,200 కోట్లకు చేరింది. ఇందుకు అధిక విద్యుదుత్పత్తి, ఉత్తమ సగటు సామర్థ్య వినియోగం (పీఎల్ఎఫ్) దోహదపడ్డాయి. ఈ కాలంలో నిర్వహణ లాభం(ఇబిటా) వార్షికంగా 5 శాతం మెరుగుపడి రూ. 11,900 కోట్లను తాకింది. అయితే ఆదాయం, ఇబిటా మా అంచనాలకంటే దిగువనే నమోదయ్యాయి. ఇందుకు ప్రధానంగా విద్యుత్‌కు లభించిన తక్కువ ధరలు(లోయర్ టారిఫ్), అంచనాలకు మించి పెరిగిన ఇంధన వ్యయాలు ప్రభావం చూపాయి. బొగ్గు దిగుమతులు పెరగడం ఇంధన వ్యయాలను పెంచివేసింది. గతేడాదిలో కంపెనీ మొత్తం అవసరాలలో బొగ్గు దిగుమతుల వాటా 6.5 శాతానికి పెరిగింది. అంతక్రితం ఏడాది(2021–22)లో ఈ వాటా కేవలం 1.2 శాతమే. దీంతో క్యూ4లో సర్దుబాటు తదుపరి నికర లాభం వార్షికంగా 6 శాతం క్షీణించి రూ. 4,870 కోట్లకు పరిమితమైంది. ఇది కూడా అంచనాలకంటే తగ్గింది. కాగా.. గతేడాది 3.9 గిగావాట్ల సామర్థ్య విస్తరణ జత కలవడంతో స్టాండెలోన్ నియంత్రిత ఈక్విటీ 9.5 శాతం పెరిగి రూ. 77,600 కోట్లయ్యింది. ప్రస్తుతం కంపెనీ పునరుత్పాదక ఇంధన(ఆర్ఈ) సామర్థ్యం 3.2 గిగావాట్లకు చేరింది. వెరసి బ్యాలెన్స్‌డ్ పోర్ట్‌ఫోలియో బాటలో ఎన్‌టీపీసీ పయనిస్తోంది. దీంతో 2032కల్లా సామర్థ్యంలో 47 శాతం బొగ్గు ఆధారితం, 45 శాతం పునరుత్పాదక, 8 శాతం ఇతర విభాగాలు ఆక్రమించనున్నాయి.



జొమాటో | ఐసీఐసీఐ సెక్యూరిటీస్ | కొనొచ్చు

ప్రస్తుత ధర: రూ. 71

టార్గెట్: రూ. 83

ఎందుకంటే: ఫుడ్ డెలివరీ బిజినెస్ దిగ్గజం జొమాటో ఇటీవల లాభదాయకతను మెరుగుపరచుకోవడంలో నిలకడను చూపుతోంది. హైపర్‌ప్యూర్, క్విక్ కామర్స్ విభాగాలలో నష్టాలను చెప్పుకోదగ్గ స్థాయిలో తగ్గించుకోవడంతోపాటు.. ఫుడ్ డెలివరీ బిజినెస్ లాభదాయకతను మెరుగుపరచుకుంటోంది. వెరసి సమీప భవిష్యత్‌లో లాభదాయకత మరింత మెరుగుపడే అవకాశాలు కనిపిస్తున్నాయి. దీంతో కంపెనీ ఆదాయం, నిర్వహణ లాభం(ఇబిటా), నికర లాభ అంచనాలను పెంచేందుకు వీలు చిక్కింది. రానున్న రెండేళ్లలో కంపెనీ ఆదాయం 21 శాతం, ఇబిటా 139 శాతం, నికర లాభం 100 శాతం చొప్పున వృద్ధి చెందవచ్చని తాజాగా అంచనా వేస్తున్నాం. బ్లింకిట్‌సహా జొమాటో కన్సాలిడేటెడ్ ఫలితాలు నష్టాలను వీడి లాభాల్లోకి ప్రవేశించే అవకాశముంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం(2023–24) తొలినాళ్లలోనే సర్దుబాటు తదుపరి ఇబిటా రూ. 18 కోట్లకు చేరవచ్చని భావిస్తున్నాం. ఫలితంగా డిస్కౌంటెడ్ క్యాష్ ఫ్లో(డీసీఎఫ్) ఆధారిత టార్గెట్ ధరను తొలుత ప్రకటించిన రూ. 65 నుంచి రూ. 83కు హెచ్చించేందుకు తాజాగా నిర్ణయించాం. గతేడాది(జనవరి–మార్చి) క్యూ4లో త్రైమాసికవారీగా చూస్తే స్థూల ఆర్డర్ విలువ(జీవోవీ) తగ్గింది. ఇందుకు సీజనల్ అంశాలు, డిమాండు క్షీణించడం కారణమయ్యాయి. అయితే యాజమాన్య వివరాల ప్రకారం ఏప్రిల్, మే నెలల్లో ఫుడ్ డెలివరీ బిజినెస్ జీవోవీ తిరిగి జోరందుకుంది. ఇది రికవరీపై అంచనాలను పెంచుతోంది. అత్యుత్తమ వ్యయ నియంత్రణలు కంపెనీ వేగవంత టర్న్‌అరౌండ్‌కు దారి చూపుతున్నాయి.




గమనిక: ఈ కాలమ్‌లో షేర్లపై ఇచ్చిన సలహాలు, సూచనలు, వివిధ బ్రోకరేజ్ సంస్థలు వ్యక్తం చేసిన అభిప్రాయాలు మాత్రమే

ఫ్యూచర్ జనరాలీ నుంచి డీఐవై హెల్త్ ప్లాన్



హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: బీమా రంగ సంస్థ ఫ్యూచర్ జనరాలీ ఇండియా ఇన్సూరెన్స్ (ఎఫ్‌జీఐఐ) కొత్తగా డీ.ఐ.వై. హెల్త్ ప్లాన్ పేరిట ఆరోగ్య బీమా పాలసీని ప్రవేశపెట్టింది. ఇందులో కస్టమర్లు తమ అవసరాలకు తగిన కవరేజీలను ఎంచుకునేందుకు వీలుంటుందని సంస్థ ఎండీ అనూప్ రావు తెలిపారు. దీని కింద మొత్తం 20 ఆప్షనల్ కవర్‌లను ఆఫర్ చేస్తున్నట్లు వివరించారు. మెటర్నిటీ కవర్, క్రిటికల్ ఇల్‌నెస్ బూస్టర్, ఎయిర్ అంబులెన్స్, యాక్సిడెంటల్ డెత్ కవరేజీ లాంటి వాటిని తప్పనిసరి ఫీచర్లుగా కాకుండా జీవితకాలంలో వివిధ దశల్లో వివిధ అవసరాలకు అనుగుణంగా తీసుకోవచ్చని అనూప్ రావు చెప్పారు. బీమా పాలసీల విషయంలో కస్టమర్లు ఏం కోరుకుంటున్నారనే అంశంపై యునోమర్ సంస్థతో కలిసి నిర్వహించిన సర్వేలో తేలిన అంశాల ఆధారంగా ఈ పాలసీని రూపొందించినట్లు అనూప్ వివరించారు. మరోవైపు, కంపెనీని స్టాక్ ఎక్స్ఛేంజీల్లో లిస్ట్ చేసే విషయంపై వాటాదారులదే తుది నిర్ణయమని అనూప్ చెప్పారు.

Q & A



ధీరేంద్ర కుమార్
సీఈవో, వ్యాల్యూ రీసెర్చ్

ఇండెక్స్ ఫండ్ ఎంపిక ఎలా?

మల్టీక్యాప్ పేరుతో కొత్తగా వస్తున్న మ్యూచువల్ ఫండ్ పథకాల్లో ఇన్వెస్ట్ చేసుకోవచ్చా?

– ఆశిష్

ఈ తరహా పథకాల నుంచి సరైన రాబడులు అందుకోగలమా? అన్నది ఎవరికి వారు ప్రశ్నించుకోవాలి. మల్టీక్యాప్, ఫ్లెక్సీక్యాప్ ఫండ్స్ మధ్య వ్యత్యాసం ఉంది. నేడు ఫ్లెక్సీక్యాప్ ఫండ్స్ అనుసరిస్తున్న పెట్టుబడుల విధానాన్ని గతంలో మల్టీక్యాప్ ఫండ్స్ పాటించాయి. వాటిపై ఎటువంటి నియంత్రణలు లేవు. కనుక మార్కెట్ క్యాప్ పరిమితితో సంబంధం లేకుండా ఫండ్ మేనేజర్లు తమ స్వేచ్ఛ కొద్దీ అన్ని రకాల మార్కెట్ క్యాప్ ఆధారిత స్టాక్స్‌లో ఇన్వెస్ట్ చేసుకునేవారు. దీంతో వాటి విధానం మార్చే దిశగా సెబీ మార్గదర్శకాలను తీసుకొచ్చింది. ఇప్పుడు మల్టీక్యాప్ ఫండ్స్ కచ్చితంగా కనీసం 25 శాతం లార్జ్‌క్యాప్, 25% మిడ్‌క్యాప్, 25% స్మాల్‌క్యాప్ ఫండ్స్‌లో ఇన్వెస్ట్ చేయాలి. చాలా వరకు మల్టీక్యాప్ ఫండ్స్ నిర్వహణ ఆస్తుల పెరంగా పెద్దగా మారిపోయాయి. దీంతో 25% చొప్పున ప్రతీ విభాగంలో పెట్టుబడులు కచ్చితంగా ఇన్వెస్ట్ చేయాలన్నది వాటికి ప్రతిబంధకంగా మారింది. ఎందుకంటే భారీ పెట్టుబడులకు తగ్గ అవకాశాలు స్మాల్‌క్యాప్, మిడ్‌క్యాప్ విభాగంలో అన్ని వేళలా ఉండాలని లేదు. పరిశ్రమ అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకున్న సెబీ మార్కెట్‌కు ఇది ప్రతికూలంగా మారుతుందని గుర్తించి.. ఫ్లెక్సీక్యాప్ పేరుతో కొత్త విభాగాన్ని ప్రవేశపెట్టింది. 25 శాతం చొప్పున కచ్చితంగా ప్రతీ విభాగంలో ఇన్వెస్ట్ చేయడం వీలు కాకపోతే మల్టీక్యాప్ పథకాలు ఫ్లెక్సీక్యాప్ విభాగంలోకి మారిపోవచ్చంటూ వెసులుబాటునిచ్చింది. దీంతో చాలా మల్టీక్యాప్ పథకాలు ఫ్లెక్సీక్యాప్ కిందకు మారిపోయాయి. కొత్త పథకం ఆవిష్కరించడం ద్వారా మరింత మంది ఇన్వెస్టర్లను ఆకర్షించొచ్చని మ్యూచువల్ ఫండ్ సంస్థలు భావించాయి. ఒక్కో విభాగంలో ఒక్క పథకమే ఉండాలన్నది సెబీ నిబంధన. దీంతో మల్టీక్యాప్ నుంచి ఫ్లెక్సీక్యాప్ కిందకు మారిపోయిన ఫండ్స్ సంస్థలు.. మల్టీక్యాప్ విభాగంలో కొత్త పథకాలను (ఎన్ఎఫ్‌వోలు) తీసుకొస్తున్నాయి. కనుక అవి తమకు అనుకూలమా? కాదా? అన్నది ఇన్వెస్టర్లు తమ పెట్టుబడుల కాల వ్యవధి, రాబడుల అంచనాల ఆధారంగా నిర్ణయించుకోవాలి.

మంచి ఇండెక్స్ ఫండ్‌ను ఎంపిక చేసుకునేందుకు ఎటువంటి అంశాలను పరిగణనలోకి తీసుకోవాలి?

– శశాంక్

ముందుగా పథకం ఎక్స్‌పెన్స్ రేషియో చూడాలి. ఇండెక్స్‌తో పోలిస్తే పథకం రాబడుల తీరు ఎలా ఉందన్నది పరిశీలించాలి. వ్యాల్యూ రీసెర్చ్ పోర్టల్‌లో అన్ని పథకాలకు సంబంధించి పనితీరు ప్యారామీటర్లను పరిశీలించుకోవచ్చు. ఇండెక్స్‌తో పోలిస్తే పథకం పనితీరు ఎలా ఉందన్న సమాచారం కూడా లభిస్తుంది. కొంత ట్రాకింగ్ లోపం ఉండే అవకాశం లేకపోలేదు. అంటే ఇండెక్స్ 2 శాతం పెరిగితే.. ఫండ్ పెట్టుబడుల విలువ అదే కాలంలో 2.01%, 1.99%గా చూపించొచ్చు. ముఖ్యంగా ఎక్స్‌పెన్స్ రేషియో ఇక్కడ కీలకం అవుతుంది. రెండు ఇండెక్స్ పథకాల్లో ఒకటి 10 బేసిస్ పాయింట్లు చార్జ్ చేస్తుంటే, మరో పథకం 25 బేసిస్ పాయింట్లు చార్జ్ తీసుకుంటుంటే.. అప్పుడు 10 బేసిస్ పాయింట్ల పథకంలో ఇన్వెస్ట్ చేసుకోవడమే సరైనది.


మ్యాథ్స్ కఠినం.. ఫిజిక్స్ మధ్యస్థం

- జేఈఈ అడ్వాన్స్‌డ్ ప్రశ్నపత్రం కఠినంగా ఉందన్న విద్యార్థులు..
- సుదీర్ఘ ప్రశ్నలకు సమాధానాలు రాబట్టేందుకు ఎక్కువ టైమ్
- కాస్త తేలికగా కెమిస్ట్రీ పేపర్
- ఈసారి కటాఫ్ 86–91 మధ్య ఉండొచ్చని అంచనా
- 18న ఫైనల్ ఆన్సర్ కీ

సాక్షి, హైదరాబాద్: ప్రతిష్టాత్మక ఐఐటీల్లో ప్రవేశానికి ఉమ్మడి ప్రవేశ పరీక్ష (జేఈఈ అడ్వాన్స్‌డ్) ఆదివారం దేశవ్యాప్తంగా జరిగింది. జేఈఈ మెయిన్స్‌లో అర్హత పొందిన వారిలో దాదాపు 2 లక్షల మంది పరీక్ష రాసినట్టు సమాచారం. రాష్ట్రంలో దాదాపు 40 వేల మంది వరకూ రాశారు. ఐఐటీ గౌహతి ఈసారి జేఈఈ అడ్వాన్స్‌డ్ పరీక్ష నిర్వహణ బాధ్యతలు చేపట్టిన సంగతి తెలిసిందే. పేపర్–1లో మొత్తం 180 మార్కులకు 51 ప్రశ్నలు అడిగారు. ఫిజిక్స్, కెమిస్ట్రీ, మేథమెటిక్స్‌లో 17 చొప్పున ప్రశ్నలు ఇచ్చారు. ఒక్కో విభాగంలో 60 మార్కులు చొప్పున ప్రశ్నలిచ్చారు. ఐఐటీల్లో కేవలం 16 వేల సీట్లే ఉంటాయి. దీంతో పోటీ తీవ్రతను దృష్టిలో ఉంచుకుని ప్రశ్నపత్రాలే కాస్త కఠినంగానే రూపొందించినట్టు విద్యార్థులు చెబుతున్నారు. ముఖ్యంగా గణితంలో సుదీర్ఘ ప్రశ్నలు ఇచ్చారు. వీటికి సమాధానాలు రాబట్టేందుకు చాలా సమయం పట్టిందని తెలిపారు. ఫంక్షన్స్, మేట్రిక్స్, ఎల్లిప్స్, స్టాటిస్టిక్స్, ప్రాబబులిటీల నుంచి ప్రశ్నలు వచ్చాయని చెప్పారు. ప్రాబబులిటీ, కాంప్లెక్సు నంబర్స్, త్రీడీ, జామెట్రీల నుంచి కొంచెం మంచి ప్రశ్నలు వచ్చాయని మరికొందరు పేర్కొన్నారు. ఆరేళ్ల ప్రశ్నపత్రాల్లోని ప్రశ్నలు కొన్ని వచ్చినట్టు తెలిపారు. ఫిజిక్స్ పేపర్ కాస్త మధ్యస్తంగా ఉందని, నెగెటివ్ మార్కింగ్ ఉండటం వల్ల ఫిజిక్స్‌లో కొన్ని చాప్టర్ల నుంచి వచ్చిన ప్రశ్నలను ఎక్కువ మంది విద్యార్థులు వదిలేసినట్టు సబ్జెక్టు నిపుణులు తెలిపారు. ఈ విభాగంలో కైనమేటిక్స్, థర్మో డైనమిక్స్, మోడరన్ ఫిజిక్సు, కరెంట్ ఎలక్ట్రిసిటీ, కెపాసిటర్, గ్రావిటేషన్, ఆప్టిక్స్, ఎలక్ట్రో స్టాటిస్టిక్స్ అంశాలకు ఎక్కువ ప్రాధాన్యతనిస్తూ ప్రశ్నలు వచ్చినట్లు విద్యార్థులు చెప్పారు. అన్నింటికన్నా కెమిస్ట్రీ పేపర్ కాస్త తేలికగా ఉందని వివరించారు. ఫిజికల్ కెమిస్ట్రీకి సంబంధించి కెమికల్ కైనటిక్స్, లోనిక్, కెమికల్ ఈక్విలిబ్రియమ్, ఎలక్ట్రో కెమిస్ట్రీ, ఆటమిక్ స్ట్రక్చర్ అంశాల నుంచి ప్రశ్నలు రాగా.. ఆర్గానిక్ కెమిస్ట్రీలో ఆమినీస్, పాలిమర్స్, బయోమాలిక్యులస్, ఆక్సిజన్ కంటైనింగ్ కాంపౌండ్స్ వంటి అంశాల్లో ప్రశ్నలు అడిగారు. విద్యార్థులు కూడా ఈ ఒక్క పేపర్ నుంచి ఎక్కువ మార్కులు ఆశిస్తున్నట్టు తెలిపారు.

జూన్ 11న ప్రిలిమినరీ కీ..

జేఈఈ అడ్వాన్స్‌డ్ పరీక్షల ప్రాథమిక కీని జూన్ 11న విడుదల కానుంది. పరీక్ష రాసిన అభ్యర్థుల రెస్పాన్స్ షీట్లు జూన్ 9 నుంచి వారికి అందుబాటులో ఉంచనున్నట్లు ఐఐటీ గౌహతి ప్రకటించింది. జూన్ 18న ఫైనల్ ఆన్సర్ కీని విడుదల చేస్తామని తెలిపింది. ర్యాంకు లిస్టుకు సంబంధించి కటాఫ్ మార్కులు ఈసారి జనరల్ కేటగిరీలో 86–91 మధ్య ఉండొచ్చని అంచనా వేస్తున్నారు. ఓబీసీ కేటగిరీలో 71–76, ఈడబ్ల్యూఎస్ 77–82, ఎస్సీ 51–55, ఎస్టీ కేటగిరీలో 39–44 మధ్య ఉండొచ్చని నిపుణులు అంచనా వేస్తున్నారు.



కొమ్మలకు ఊడలు వేస్తూ విస్తరించే భారీ మర్రి చెట్లు మనకు తెలుసు. నాలుగు ఎకరాల్లో విస్తరించిన పిల్లలమర్రిచెట్టు తెలుసు. కానీ వందకుపైగా ఎకరాల్లో, 47 వేలకుపైగా కాండాలతో విస్తరించి, వేల ఏళ్లుగా బతికేస్తున్న ఓ అతి పెద్ద చెట్టు ఉంది తెలుసా? సోమవారం ప్రపంచ పర్యావరణ దినం సందర్భంగా.. ఆ చెట్టు విశేషాలు ఏమిటో తెలుసుకుందామా..

‘పండో’.. వంద ఎకరాల చెట్టు..

- సాక్షి సెంట్రల్ డెస్క్

అది ఒక చెట్టు అడవి..

అమెరికా దక్షిణ ఉటా ప్రాంతంలో ఒకేచోట 47 వేలకుపైగా ఆస్పెన్ చెట్లు (పొడవుగా పెరిగే అశోకా చెట్ల వంటివి) పక్కపక్కనే ఉన్నాయి. వాటిపై ఇటీవల పరిశోధన చేసిన శాస్త్రవేత్తలు అవన్నీ ఒకే చెట్టు శాఖలని.. అన్నింటి వేర్లు పూర్తిగా అనుసంధానమై ఉన్నాయని గుర్తించారు. ఒక ప్రధాన చెట్టు వేర్లు భూమిలో విస్తరిస్తున్న కొద్దీ.. వాటి నుంచి కాండం ఉద్భవిస్తూ మరోచెట్టులా ఏర్పడినట్టు తేల్చారు. ఈ చెట్టును ‘పండో’ అని పిలుస్తున్నారు. లాటిన్ పదమైన దీనికి అర్థం ‘నేను విస్తరిస్తా’ అని అర్థం.

అతి పెద్ద జీవి ఇదే..

- మొత్తం 100 ఎకరాలకుపైగా విస్తరించి ఉన్న ఈ చెట్టు వయసు 9 వేల ఏళ్లకుపైగా ఉండవచ్చని, బరువు 6 వేల టన్నులు ఉంటుందని శాస్త్రవేత్తలు చెప్తున్నారు. భూమ్మీద బరువు, పరిమాణం పరంగా అతి పెద్ద జీవి ఇదేనని అంటున్నారు.
- ‘పండో’ చెట్టు వేలాది కాండాలకు ఉన్న ఆకులు కదిలిన శబ్దం.. వాటి వేళ్ల నెట్‌వర్క్ ద్వారా వ్యాపిస్తున్నట్టు శాస్త్రవేత్తలు గుర్తించారు. తాజాగా జెఫ్ రైస్ అనే సౌండ్ ఆర్టిస్ట్.. ఈ వేర్లపై దూరం దూరంగా పలుచోట్ల మైక్రోఫోన్లు, హైడ్రోఫోన్లు (నీటిలో, భూమి లోపల ధ్వనులను రికార్డు చేసేవి) అమర్చి శబ్దాలను రికార్డు చేశారు. ఎక్కడో ఒక ఆస్పెన్ కాండంపై మెల్లగా తడితే.. వందల అడుగుల దూరంలోని వేర్ల వద్ద ఆ ధ్వని వినిపిస్తున్నట్టు గుర్తించారు.
- ‘పండో’ చెట్టు, దాని చిత్రమైన వేర్ల వ్యవస్థపై శాస్త్రవేత్తలు విస్తృతంగా పరిశోధనలు చేస్తున్నారు. వేల ఏళ్ల కిందటి పరిస్థితులు, వాతావరణ మార్పుల ప్రభావం, మొక్కలు/చెట్ల మధ్య అనుసంధానం వంటి అంశాలను దీని నుంచి గుర్తించవచ్చని భావిస్తున్నారు.



తెలంగాణ ఆవిర్భావ దశాబ్ది ఉత్సవాలను పురస్కరించుకుని హైదరాబాద్ నగర పోలీసులు ఆదివారం ఉదయం ట్యాంక్‌బండ్‌పై సురక్ష దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పోలీసులు తమ వాహనాలతో భారీ ర్యాలీ నిర్వహించారు. మంత్రులు మహమూద్ అలీ, తలసాని శ్రీనివాస్‌యాదవ్, డీజీపీ అంజన్‌కుమార్, మేయర్ గద్వాల విజయలక్ష్మి, జెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు.

Published and Printed by V. Murali, on behalf of Jagati Publications Limited, Published at Jagati Publications Limited, Survey No 300/E, Timmapur Village&Mandal, Karimnagar Dist–505527, T.G., and Printed at Jagati Publications Limited Survey No 300/E, Timmapur Village&Mandal, Karimnagar Dist–505527 T.G., Editor: V. Murali(Responsible for selection of News under the PRB Act), Phone No. 0878 - 2223017, Fax No. 0878 – 2223019. RNI Regn No. TELTEL/2008/23800. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.